# తెలుగు సినిమాల్లో డబ్బింగ్ పాటలు

(పరిశోధన గ్రంథం)



-డా. పైడిపాల

# తెలుగు సినిమాల్లో డబ్బింగ్ పాటలు

-డా॥ పైడిపాల

SUNAYANA CREATIONS

**సునయన క్రియేషన్స్**

40, జె.సి. ఇండస్ట్రియల్ ఏరియా

కనకపుర రోడ్, బెంగుళూరు - 560062

# తెలుగు సినిమాల్లో డబ్బింగ్ పాటలు

డా॥ పైడిపాల

ప్రచురణ :
సునయన క్రియేషన్స్, బెంగుళూరు
డిసెంబరు 2015

ముఖచిత్రం : బాలు
కవర్ డిజైన్ : శ్రీవల్లి
డి.టి.పి. : యం.వి.జి. శ్రీనివాస్

ముద్రణ :
చైతన్య ఆఫ్‌సెట్ ప్రింటర్స్
విజయవాడ-2

ప్రతులకు :
డా॥ పి.యస్.రెడ్డి
11-20, కొంకాపల్లి, అమలాపురం-533201
ఫోన్ : 99891 06162

ఇంకా అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

వెల : రూ. **175/-**
విదేశాల్లో : 10 డాలర్లు.

హెచ్చరిక : సర్వహక్కులు రచయితవి. ఈ పుస్తకంలోని ఏ భాగాన్ని ఎవరు వినియోగించ దలచుకున్నా రచయిత అనుమతి అవసరం!

# సమర్పణ

తెలుగులో ఏ పట్టాలూ లేని పండితుడు
నిత్య సాహిత్యామృతపాన మధువ్రతుడు
నా పరిశోధనయజ్ఞానికి ఋత్విజుడు
మనసు ఫౌండేషన్ సారథి
**శ్రీ మన్నం వెంకట రాయుడు**
ఆ రాయని భాస్కరునికి కృతజ్ఞతాపూర్వకంగా–

**–పైడిపాల**



'తెలుగు సినిమాపాట' ఆవిష్కరణ సందర్భంగా
లతామంగేష్కర్ రచయితను సత్కరిస్తున్న దృశ్యం. 14.2.93



'తెలుగు సినీగేయకవుల చరిత్ర' ఆవిష్కరణ సందర్భంగా
డా.సి.నారాయణరెడ్డి రచయితను సత్కరిస్తున్న దృశ్యం. 15.12.10



'అభినందన' సంస్థ ఆధ్వర్యవంలో జరిగిన సభలో
'తెలుగు సినిమాపాట చరిత్ర'ను (ద్వితీయ ముద్రణ) ఆవిష్కరిస్తున్న
డా.సి. నారాయణరెడ్డి. **25.9.2005**




'అభినందన' నిర్వహించిన 'తెలుగు సినిమాపాట చరిత్ర' ఆవిష్కరణ సభలో
**(25.9.2005)** వేదిక మీద ప్రముఖులు




**కిన్నెర ఆర్ట్స్ నిర్వహణలో 'తెలుగు సినీగేయకవుల చరిత్ర'**
**గ్రంథావిష్కరణ సభలో వేదికమీద ప్రముఖులు. 15.12.2010**



**'తెలుగు సినీగేయకవుల చరిత్ర' తెలుగు సినిమాసాహిత్యంపై**
**ఉత్తమ గ్రంథంగా (2010) ఎంపికైన సందర్భంగా– రాష్ట్ర సాంస్కృతిక**
**సమాచార శాఖామాత్యులు శ్రీమతి డి.కె. అరుణ నుండి రచయిత పైడిపాల**
**నంది పురస్కారాన్ని అందుకొంటున్న దృశ్యం. 23.3.2012**

## తెలుగు సినిమాల్లో డబ్బింగ్ పాటలు

## మనసా, వాచా...

శ్రీయుతులు–

యం.వి. రాయుడు (మనసు ఫౌండేషన్, బెంగుళూరు)

వి.ఎ.కె. రంగారావు (విమర్శలో మేలుమడేలు, చెన్నై)

యస్.పి. బాలసుబ్రహ్మణ్యం

(శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిగారి అబ్బాయి, చెన్నై)

రావి కొండలరావు (నటులు, రచయిత, హైదరాబాద్)

సిరివెన్నెల సీతారామ శాస్త్రి (సినీ గేయకవి, హైదరాబాద్)

వెన్నెలకంటి (సినీ గేయకవి, చెన్నై)

భువనచంద్ర (సినీ గేయకవి, చెన్నై)

ఫిల్మ్‌న్యూస్ ఆనందన్ (సినీసాహిత్య సమాచారనిధి, చెన్నై)

కీ॥శే॥ భూపతిరాజు అచ్యుతరామరాజు (విశాఖపట్నం)

వనమాలి (సినీ గేయకవి, హైదరాబాద్)

డా॥ పి.యస్. గోపాలకృష్ణ (హైదరాబాద్)

సుధాకర్ రాజశ్రీ (చెన్నై)

అనిసెట్టి చైతన్యస్వామి (చెన్నై)

వేటూరి రవిప్రకాష్ ('వేటూరి' గారి అబ్బాయి, హైదరాబాద్)

శివగణేష్ (సినీ గేయకవి, చెన్నై)

చంద్రబోస్ (సినీ గేయకవి, హైదరాబాద్)

డి. రామజోగయ్య శాస్త్రి (సినీ గేయకవి, హైదరాబాద్)

గురుచరణ్ (సినీ గేయకవి, హైదరాబాద్)

భారతీబాబు (సినీ గేయకవి, హైదారాబాద్)

కందికొండ (సినీ గేయకవి, హైదారాబాద్)

వక్కలంక కిషోర్ (ఎ.బి.ఎన్. ఆంధ్రజ్యోతి, హైదరాబాద్)

వక్కలంక రమణ (ఆంధ్రజ్యోతి, హైదరాబాద్)

తోటపల్లి మధు (సినీ నటులు, రచయిత, హైదరాబాద్)

యం.వి.ఆర్.శాస్త్రి (సంపాదకులు, ఆంధ్రభూమి)
పులగం చిన్నారాయణ (సాక్షి, హైదరాబాద్)
రెంటాల జయదేవ (సాక్షి, హైదరాబద్)
బి. జీవన్ రెడ్డి (సాక్షి, హైదరాబాద్)
మహమ్మద్ ఖదీర్ బాబు (సాక్షి, హైదరాబాద్)
గోలి సాయిబాబు (సినీసాహిత్య పరిశోధకులు, రాజమండ్రి)
ఘంటసాల రత్నకుమార్ (చెన్నై)
కె. స్వర్ణకుమార్ (భీమవరం)
యం. సారథి (రెల్లివలస)
గుమ్మడి రామలక్ష్మి (పరిశోధక విద్యార్థిని, చెన్నై)
చావ సుధారాణీ జగన్ (హైదరాబాద్)
గొల్లకోట నాగకమల (అమలాపురం)
పారుపూడి విశ్వేశ్వరరావు (అమలాపురం)
డా॥ కంపెల్ల రవిచంద్రన్ (తిరుపతి)
టి. రాజగోపాల్ (తిరుపతి)
గరిమెళ్ల సోమయాజులు శర్మ (విజయవాడ)
ఎస్. వెంకటనారాయణ (పల్లవి పబ్లికేషన్స్)
టి. శ్యామ్ నారాయణ్ (మనసు ఫౌండేషన్)
పి. శశికాంత్ రెడ్డి (మా అబ్బాయి, హైదరాబాద్)
యం.వి.జి. శ్రీనివాస్ (అమలాపురం)
తమ్మా సూర్యనారాయణ (అమలాపురం)
యు.జి.సి. (న్యూఢిల్లీ)
యస్.కె.బి.ఆర్.కళాశాల పాలకవర్గం (అమలాపురం)

గార్లకు నా శ్రమలో పాలుపంచుకొని నా కలానికి బలాన్నిచ్చినందుకు-

నా పరిశోధన వ్యాసాలను ప్రచురించిన సాక్షి దినపత్రిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆంధ్రభూమి దినపత్రిక (వెన్నెల) సంపాదకులకు నా కృతజ్ఞతలు.

**-పైడిపాల**

# దీపమాలిక


**1. డబ్బింగ్ అంటే... (1-14)**

**2. ప్రపంచీకరణం - సినిమా ప్రబలోదాహరణం (15-26)**

**3. తొలితెలుగు డబ్బింగ్ చిత్రాలు (27-42)**

**4. పరభాషా చిత్ర వారధులు (43-54)**

**5. ఆరు దశకాలూ - మూడు దశలూ (55-65)**

**6. గుర్తొచ్చే కెరటాలు కొందరు... (66-171)**

1. ఈ రంగంలో తొలి తరంగం శ్రీరంగం (67-78)
2. అనువాదంలో అభినవ తిక్కన ఆరుద్ర (79-88)
3. అయ్యప్పస్వామిని తెలుగునేలకు తెచ్చిన అనిసెట్టి (89-104)
4. వెలలేని కవి వీటూరి (105-114)
5. మహారాజరాజశ్రీ రాజశ్రీ (115-128)
6. సుందర సినీగేయలహరి వేటూరి (129-140)
7. నిన్నకూ రేపుకూ నేడంటి వెన్నెలకంటి (141-153)
8. సినీ 'భువన విజయ'చంద్ర (154-164)

● అన్నట్టు ఈ జంటనూ విస్మరించడానికి వీల్లేదు (165-171)

**7. మరికొందరు... (172-198)**

బలిజేపల్లి లక్ష్మీకాంతం, ఆచార్య ఆత్రేయ, బైరాగి, సముద్రాల ద్వయం, వడ్డాది, డా॥ సి.నారాయణ రెడ్డి, గోపి, గోనె విజయరత్నం, సిరివెన్నెల సీతారామ శాస్త్రి, భారతీబాబు, పొందూరి, గురుచరణ్, డి. నారాయణవర్మ, చంద్రబోస్, వనమాలి, రామజోగయ్య శాస్త్రి, కందికొండ.

**8. తెలుగు పాటకు పేరంటం** **(199–214)**

1. హిందీ మెహందీ (200–204)
2. తమిళ తళుకులు (204–209)
3. కన్నడ కస్తూరి (209–211)
4. మలయా(ళ)నిలం (211–214)

**9. ఎందుకోయీ పాటమాలీ, ఇంత యాతన?** **(215–217)**

అనుబంధం – 1 – తెలుగులో డబ్బింగ్ సినిమాలు (218–301)

అనుబంధం – 2 – తెలుగు డబ్బింగ్ కవులు (302–308)

❖

# డబ్బింగ్ అంటే...?

డబ్బింగ్ సినీమా(య)కు సంబంధించిన అద్భుతమైన అనుసంధాన కళ. వెండితెర మీద పాత్రధారుల పెదవుల కదలికకు అనుగుణంగా గాత్రధారులు వాళ్ల గొంతులను వినిపించడాన్ని డబ్బింగ్ అంటున్నాం. ఈ ప్రక్రియలో నటీనటుల భాష, మాటలు, పాటలూ–ఏవీ వారి సొంతం కాకపోయినా, ప్రేక్షకుల కళ్లకూ చెవులకూ ఆ భేదం కనిపించని అనుభూతీ, భ్రాంతీ కలుగుతున్నాయి. ఈ విద్యకు ప్రధాన సూత్రధారి రచయిత. ఏ భాషలో నైనా నేరుగా తీసిన చిత్రాలను 'డైరెక్ట్ టేక్' చిత్రాలనీ, భాషాంతరీకరించిన చిత్రాలను డబ్బింగ్ చిత్రాలనీ సాధారణంగా వ్యవహరిస్తుంటాం. అయితే 'డబ్బింగ్' అనే పదాన్ని నేరుగా తీసిన చిత్రాల్లో కూడా అనేక సందర్భాలలో వుపయోగిస్తుంటారు. 'డబ్బింగ్'కు తెలుగులో సమానార్థకమైన మరోపదం లేక 'అనువాదం' అనే పదాన్ని వినియోగిస్తున్నారు. వివిధదశల్లో 'డబ్బింగ్' అంటే యేమిటో, డబ్బింగ్‌కి అనువాదం అర్థవంతమైన తెలుగు మాటేనా–అనే అంశాలను పరిశీలిద్దాం.

తెలుగులో 'టాకీ' ప్రారంభమైనప్పుడే 'డబ్బింగ్' అనే పదం కూడా వాడుకలోకి వచ్చింది. టాకీల తొలిదశలో చిత్ర నిర్మాణ సమయంలో రికార్డు చేసిన నటీనటుల సంభాషణలు లోపాలతో సంతృప్తికరంగా లేనప్పుడు గాని, బయట నుండి అనవసరమైన శబ్దాలు చొరబడినప్పుడు గాని స్టూడియోలో ఆ సంభాషణలను తిరిగి చెప్పించే శబ్దసంస్కరణను తొలుత డబ్బింగ్ అన్నారు. ఆ తర్వాత పాత్రధారులకు శరీర సౌష్టవం, నటన తప్ప గాత్రశుద్ధి లేనప్పుడు వారి సంభాషణలను అదే భాషలో వేరే కళాకారుల చేత చెప్పించి ధ్వనిముద్రణ చెయ్యడాన్ని కూడా డబ్బింగ్ గానే పేర్కొన్నారు. నేటికీ నేరుగా తీసిన చిత్రాల్లో కూడా పరభాషలకు చెందిన నాయికానాయకులకు, కొందరు ఉపపాత్రధారులకు కూడా వుచ్చారణ దక్షులైన కళాకారుల చేత డబ్బింగ్ చెప్పించడం అందరికీ తెలిసిన విషయమే. ఇంకా టి. చలపతిరావు వంటి సంగీత దర్శకుల కృషివల్ల

'సింగిల్ ట్రాక్' నాలుగింతలై ధ్వనిముద్రణ సరళతరమైన తర్వాత కూడా స్థాయిల సవరణతో ఆ 'ట్రాక్'ను అనుసంధానం చేసే 'మిక్సింగ్' ప్రక్రియను కూడా డబ్బింగ్ పేరుతోనే వ్యవహరించారు. క్రమంగా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది 'ఇంటర్నేషనల్ ట్రాక్ సిస్టమ్' అమలులోకి వచ్చి, గాయనీగాయకులకు గాత్రధారులకు సౌలభ్యం పెరిగి సమయం ఆదా కావడం ఆరంభమైన తర్వాత కూడా 'డబ్బింగ్' అనే పదం చెరిగిపోలేదు. ఇలా నేరుగా తీసిన చిత్రాల్లో కూడా వివిధదశల్లో, సందర్భాలలో మాటలనూ పాటలనూ 'రికార్డు' చెయ్యడానికి 'డబ్బింగ్' అనే పరిభాషనే వుపయోగించారు. అయితే క్రమంగా పరభాషాచిత్రాల తర్జుమా మాత్రమే డబ్బింగ్ అనే రూఢ్యర్థంలో ఆ పదం స్థిరపడింది. ఒక భాషలో వున్న చిత్రంలోని దృశ్యాన్ని మార్చకుండా మరోభాషలో ప్రత్యామ్నాయ శబ్దాలను సమకూర్చుకోవడమే డబ్బింగ్ అనే నిర్వచనం యేర్పడింది. అందువల్ల డబ్బింగ్ అనే పదాన్ని యెవరెలా ప్రయోగించినా జనానికి మాత్రం ఆపేరు వినగానే పరభాషల నుండి యథాతథంగా తెలుగు చెయ్యబడిన చిత్రాలే స్ఫురిస్తాయి. అలాగే డబ్బింగ్‌కి సమానార్థకంగా తెలుగులో అనువాదమనే పదమే ప్రచారం పొందింది.

అనువాదం అనే పదానికి సంస్కృతంలో తిరిగి చెప్పడం అని అర్థం. అది 'వద్' అనే ధాతువుకి 'అను' అనే ఉపసర్గ చేరగా యేర్పడిన రూపం. అలా అదే భావాన్ని మళ్లీ అలాగే చెప్పడం, వ్యాఖ్యానించడం అనే అర్థాలతో ప్రారంభమైన అనువాదం క్రమంగా ఒక భాషలో యెవరో చెప్పిన లేదా రాసిన విషయాన్ని మరొక భాషలో చెప్పడం లేదా రాయడం అనే అర్థంలో స్థిరపడింది. పూర్వం సినిమాహాళ్లలోనూ, యిప్పుడు కూడా రాజకీయ, మత సభల్లోనూ అప్పటికప్పుడు చేసే మౌఖికానువాదం యిలాంటిదే. కాగా మౌఖికానువాదం కంటె లిఖిత రూపంలో వుండే అనువాదం ప్రామాణికం. రెండు భాషల్లో మొదటి భాషను మూల భాష అనీ, రెండో భాషను లక్ష్యభాష అనీ అంటారు. అనువాదం అంటే అంత తేలికైన వ్యవహారం కాదు. అనువాదకునికి రెండు భాషల్లోనూ అపారమైన పరిజ్ఞానం వుండాలి. అతను రెండు భాషల స్వరూప స్వభావాలనూ నుడికారాలనూ ఆకళింపు చేసుకొని లక్ష్యభాషలో సహజమైన వాక్యనిర్మాణం రచన చెయ్యగలగాలి. అనువాదం యథాతథమైనా స్వేచ్ఛాపథమైనా భావాన్ని మాత్రం స్పష్టంగా చెప్పగలగాలి. తెలుగులో ఆదికావ్యమైన మహాభారతం మొదలుకొని అనేక పద్యకావ్యాలు, నవలలు, నాటకాలు, కథలు, కవితలు, వ్యాసాలు అనువదింపడ్డాయి. ఇంకా ఆప్రక్రియ కొనసాగుతూ తెలుగునాట ఆదరణను పొందుతోంది. తెలుగు సినిమాకు నోరొచ్చిన పద్దెనిమిదేళ్ల తర్వాత

అది యితర భాషల వైపు చూడ్డంతో చిత్రరంగంలో కూడా ఈ రకమైన పరివర్తన ప్రారంభమైంది. 1946లో ఆర్.యస్. జున్నార్కర్ హిందీలో నిర్మించిన 'నీరా ఔర్ నందా' చిత్రాన్ని నవీనా ఫిలిమ్స్‌వారు 1950లో తెలుగులో 'ఆహుతి' పేరుతో 'డబ్' చేశారు. అప్పటి నుంచి ఆ కోవకు చెందిన చిత్రాలను అనువాద చిత్రాలనీ, వాటిలోని పాటలను అనువాద గీతాలనీ వ్యవహరిస్తున్నారు. అయితే పరిమితమైన అర్థంలో వినియోగిస్తున్న అనువాదం 'డబ్బింగ్' ప్రక్రియ స్వరూపాన్ని ఆవిష్కరిస్తూ సమానార్థకం కాగలదా అనేది ప్రశ్న.

డబ్బింగ్ అంటే కేవలం భావానువాదం మాత్రమే కాదు.[1] "డబ్బింగ్ అంటే అనువాదం కాదు. ఒక చిత్రాన్ని మరో భాషలోకి మార్చాలంటే కేవలం మాటలను అనువదిస్తే సరిపోదు. కథాగమనం దెబ్బతినకుండా నటీనటుల పెదవుల కదలికలు, హావభావాలను కూడా దృష్టిలో వుంచుకొని, అంతే నిడివిలో తెలుగుదనం ధ్వనించే మాటలు జత చేయాలి" అని ప్రముఖ డబ్బింగ్ రచయిత ముక్కామల శ్రీరామకృష్ణ అభిప్రాయపడగా, "పాటలో పెదవుల కదలికలకు అనుగుణంగా పదాలను మార్చడమే కాదు. అవి అభినయంతోనూ జతకలిసేలా వుండాలి"[2] అని డబ్బింగ్‌లో పెదవుల కదలికలతో పాటు, నటన, వాతావారణాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని భువనచంద్ర భావించారు. "శబ్దసంస్కారం భాషాసంపద వున్న రచయితలు అయిదక్షరాలతో ఆడుకొనే ఆట డబ్బింగ్"[3] అని భూసారపు వేంకటేశ్వరరావు డబ్బింగ్‌ను అభివర్ణించారు. తెలుగులో ఈ అయిదక్షరాలు 'ప ఫ బ భ మ' అనే ఉభయోష్ఠ్యాలు. అంటే రెండు పెదవులు కలిపి వుచ్చరించే అక్షరాలు. ఈ రకమైన పెదవుల కలయికను 'ఫుల్‌లిప్' అని 'ఉ, ఊ, ఒ, ఓ, ఔ, వ' అనే అక్షరాలను వుచ్చరించేటప్పుడు పెదవులు సగం మాత్రమే కలుస్తాయి కనుక దానిని 'హాఫ్ లిప్' అని అంటారు. పరిశ్రమలో యీ నియమాన్ని పాటించడాన్ని స్థూలంగా 'లిప్'కి రాయడం అంటారు. తక్కిన అక్షరాల వుచ్చారణలో పెదవుల పాత్ర వుండదు గనుక దానిని 'ఓపెన్ లిప్' అంటారు. 'క్లోజ్ షాట్స్'లో 'లిప్ సింక్' తప్పనిసరయినా మిగతా దృశ్యాలలోనూ, నేపథ్యగీతాల్లోనూ ఈ ప్రతిబంధకం వుండదు. ఛందస్సులో యతి ప్రాసల నియమంలా, అవధానంలో 'నిషిద్ధాక్షరి' లా ఈ 'లిప్ సింక్' రచయిత భాషాపటిమకు పరీక్షలాంటిది.

---

**1, 2. 'మాటల మాంత్రికులు' వ్యాసం, 10-9-2002 ఇండియా టుడే.**

**3. భూసారపుతో పైడిపాల ముఖాముఖి. 21-3-2014.**

డబ్బింగ్ చిత్రాల చారిత్రక వికాసంలో మొదటి మూడు దశాబ్దాల్లో రచయితలకు 'లిప్ సింక్' నియమం తప్పని సరయినా క్రమంగా కొంత సడలింపు లభించింది. మణిరత్నం వంటి దర్శకులు 'సింక్' కంటె కృత్రిమత్వం లేని భాషాభివ్యక్తికి, భావానికి ప్రాధాన్యమివ్వమని సూచించడంతో రచయితలకు కొంత వెసులుబాటు లభించింది. ఈ మార్పు యాభైలలోనూ, మరో ముప్పయ్యేళ్ల తర్వాత వచ్చిన ఆత్రేయ పాటలను తులనాత్మక దృష్టితో పరిశీలిస్తే అర్థమవుతుంది.

**1.** అపాయ కనువిప్పు అయ్యావాదు కాదయ్యా
నే మెల్లాగ చెప్పునది పొల్లాని ఎన్నాక (అ)

ఆటకని ఆమె ఆడవస్తే అమ్మ
సరసాల కనే అనుకున్నదా
కాలం తెలియామి అల్లాడిపడి విను
కన్నెల్ని రెంటిని అదచి పట్టే (అ)

జాడ కాయవే మాధవి మల్లిక
చిట్టాపిల్ల వలలో పడతారే
తూకుమేడలో చేరి ఊయలాడగా
శుక్కర దశయు దరిసినది (అ)

(మిగిలిన రెండు చరణాలను అవసరం లేక యివ్వడం లేదు)

– అంతా యింతే (1955), సంగీతం : జి. రామనాథన్

మూలం : తూక్కు తూక్కి (తమిళం)

**2.** ఆమె : పట్టి తెచ్చానులే.. పండు వెన్నెల్ని నేనే
అహ.. నా మావ కోసం
అతడు : ఏది ఏది చూడనీవే దాన్ని
ఆమె : కళ్లు ముయ్యి చూపుతాను అన్నీ
అతడు : పట్టి తెచ్చానులే పండు వెన్నెల్ని నేను
అహ.. నా మల్లి కోసం.

చరణం–1

ఆమె : మనసున సెగలెగసె.. ఏం మాయో వెలుపల చలి కరిచే

అతడు : వయసుకు అది వరస.. వరసైన పిల్లదాని కది తెలుసా?

ఆమె : మాపటికి చలిమంటేస్తా.. కాచుకో కాసంతా

అతడు : ఎందుకే నను ఎగదోస్తా.. అందుకే పడి చస్తా

ఆమె : చింతపూలా చీరగట్టీ.. పూచిందీ పూదోటా

అతడు : కన్నెపూవూ కన్నుగొడితే.. తుమ్మెదకు దొంగాటా

ఆమె : దోబూచి నీ ఆటా.. అహ.. ॥పల్లవి॥

చరణం-2

అతడు : పొద్దువుంది ముద్దులివ్వనా..
ఇచ్చాక ముద్దులన్నీ మూటగట్టనా

ఆమె : మాటలన్ని విప్పిచూడనా?..
చూశాక మూటకట్టి లెక్కచెప్పనా?..

అతడు : నూటికి నూరైతేనే కోటికి కొరతేనా?

ఆమె : కోటికి కోటైతేనే.. కోరికలు కొసరేనా

అతడు : నోరున్నదీ మాటున్నదీ.. అడిగేస్తే ఏం తప్పూ?

ఆమె : రాతిరయ్యిందీ.. రాజుకుందీ.. చిటపటగా చిరునిప్పు

అతడు : అరె పోవే పిల్లా అంతా డూపు ॥పల్లవి॥

– ఆత్మబంధువు (1986), సంగీతం : ఇళయరాజా

మూలం : ముదల్ మరియాదై (తమిళం)

పై రెండు చిత్రాల్లోనూ కథానాయకుడు శివాజీ గణేశనే కావడం విశేషం. 'అంతా యింతే' ఆత్రేయ రచన చేసిన రెండవ డబ్బింగ్ చిత్రం. అప్పటి కింకా డబ్బింగ్ చట్రం నుంచి బయటపడని ఆత్రేయ ఆ పరిధులకు లోబడి అపశబ్దాలతో కృతకశైలితో ఆ పాటలను రాసినట్టు పై వుదహరణం తెలియజేస్తుంది. 'ఆత్మబంధువు'లోని పాటలు రాసే నాటికి ఆత్రేయకు డబ్బింగ్ పట్ల అవగాహన పెరిగి స్వేచ్ఛగా తన సహజశైలిలో రాసినట్టు పై పాటలను బట్టి అవగతమౌతోంది. నిజానికి 'అంతా యింతే'లోని పాటలు శైలిని బట్టి ఆత్రేయ రచించినవిలా అనిపించవు. కాని 'అంతా యింతే' పాటల పుస్తకంలో రచయితగా ఆత్రేయ పేరు వుండడం వల్ల ఆ పాటలు ఆయనవే అని భావింపవలసి వస్తోంది.

'మ్యూజిక్ ట్రాక్స్' లేని కాలంలో పెదవుల కదలిక నిబంధనను కచ్చితంగా పాటించవలసి వస్తే పాటల వరకు సంగీతం విషయంలో తప్ప సాహిత్యపరంగా రెండు

భాషలకు అంతగా పొంతన వుండేది కాదు. 'లిప్ సింక్' తో పాటు ముందుగా చిత్రీకరించిన సన్నివేశాన్ని, నటీనటుల అభినయాన్ని, మూలచిత్రానికి సంబంధించిన ప్రాదేశికమైన ఆచారాలను, సంప్రదాయాలను.. ఇలా అనేక విషయాలను దృష్టిలో పెట్టుకొని డబ్బింగ్ రచన చెయ్యవలసి వుంటుంది. పాటల రచనకు సంబంధించినంత వరకు మాతృకలోని పాటల బాణీల కనుగుణంగా రాయమని సి.డి.ల నివ్వడం తప్ప నిర్మాతలు సమయాభావం వల్ల చాలాసార్లు రచయితలకు మూలచిత్రాన్ని చూసే అవకాశాన్ని కూడా కల్పించరట! అలాగే డబ్బింగ్ పాటల రచనలో నాయక, దర్శకుల ఆంక్షలు కూడా రచయితలపై అంతగా వుండవు గనుక వాటిలో బాణీల కున్న ప్రాధాన్యం భావాల కుండదు. డబ్బింగ్ రంగం రచయితల రాజ్యం అని ఆ రంగానికి సంబంధించిన అనేక ప్రముఖరచయితలు అభిప్రాయపడినా, విస్తృతమైన క్లిష్టమైన డబ్బింగ్ ప్రక్రియలో అనువాదం అనే పదం కొంత భాగానికే వర్తిస్తుంది తప్ప, డబ్బింగ్‌కి సమానార్థకం కాజాలదు.

తెలుగులో డబ్బింగ్ చిత్రాలను ద్వితీయ శ్రేణిగా చిన్నచూపు చూస్తున్నప్పటికీ వాటికి గణనీయమైన చరిత్ర వుంది. ఈ 60 సంవత్సరాలలో తెలుగులో సుమారు 2300 డబ్బింగ్ చిత్రాలు వచ్చాయి. వీటిలో తెలుగులో నేరుగా తీసిన చిత్రాలకు గట్టి పోటీ నిచ్చి శతదినోత్సవాలు, రజతోత్సవాలు జరుపుకొన్న చిత్రాలు కూడా కొన్ని వున్నాయి. అలాగే చాలా డబ్బింగ్ పాటలు మిగతా పాటలతో సమంగా చిత్రసంగీతాభిమానుల ఆదరణకు నోచుకొని కాలానికి నిలుస్తున్నాయి. తెలుగులో మొదటి డబ్బింగ్ చిత్రాన్ని అందించిన ఖ్యాతి హిందీ దయినా, అధిక శాతం తమిళం నుంచి డబ్‌చేసిన చిత్రాలే! ఇంకా కన్నడ, మలయాళ, ఒరియా భాషల నుంచి, యిటీవల ఆంగ్ల చిత్రాల నుంచి ('జురాసిక్ పార్క్'తో ప్రారంభం) తెలుగులో డబ్బింగ్ చిత్రాలు రూపొందుతున్నాయి. వీటిలో తెలుగులో నేరుగా తీసిన చిత్రాలకు దీటుగా విజయాల్ని సాధించిన 'జింబో', 'శ్రీరామభక్త హనుమాన్', 'సంపూర్ణ రామాయణం', 'మురిపించే మువ్వలు', 'కొండవీటి దొంగ', 'ప్రేమసాగరం', 'ప్రేమపావురాలు', 'ప్రేమదేశం', 'భారతీయుడు', 'ప్రేమలోకం', 'వైశాలి', 'స్వామి అయ్యప్ప', 'బొంబాయి', 'రోజా', 'బాషా' 'ప్రేమాలయం', 'ప్రేమించి పెళ్లాడుతా' వంటి చిత్రాలు యెన్నో వున్నాయి. తెలుగులో డబ్బింగ్ రంగాన్ని శ్రీశ్రీ, ఆరుద్ర, అనిసెట్టి, వీటూరి, రాజశ్రీ, వేటూరి, వెన్నెలకంటి, భువనచంద్ర వంటి ప్రతిభావంతులైన రచయిత లెందరో సుసంపన్నం చేశారు. తెలుగులో డబ్బింగ్‌కు శ్రీకారం చుట్టిన శ్రీశ్రీ– 'సినిమాకు పాటలు రాయడం చాలమంది అజ్ఞానులను కొనేటంత సులభం

కాదు; డబ్బింగ్‌కి రాయడమనేది మరీ కష్టంతో కూడుకున్న పని' అని కూడా వ్యాఖ్యానించారు.

దక్షిణ భారతదేశంలో డబ్బింగ్ ప్రక్రియ ఎ.వి.యం.వారి 'హరిశ్చంద్ర'ను కన్నడం నుంచి తమిళంలో 'డబ్' చెయ్యడంతో ప్రారంభమైంది. ఈ విధానానికి ఆద్యులు ఎ.వి. మొయ్యప్ప చెట్టియార్. 1948లో తమిళంలో విజయ విహారం చేసిన 'చంద్రలేఖ'ను నిర్మాత యస్.యస్.వాసన్ హిందీలో భాషాంతరీకరించడంతో (పాక్షికమైన డబ్బింగ్, కొంత భాగం షూటింగ్) కూడా దేశవ్యాప్తంగా డబ్బింగ్ పట్ల ఆసక్తి పెరిగింది. టి.ఆర్.రాజకుమారి, ఎం.కె. రాధా నాయికా నాయకులుగా నటించిన యీచిత్రం ఆంధ్రలో కూడా శతదినోత్సవం చేసుకోవడం విశేషం. తెలుగులో మొదటి డబ్బింగ్ చిత్రంగా పరిగణిపంబడుడుతున్న 'ఆహుతి'కి సంగీతాన్ని సమకూర్చిన యస్.రాజేశ్వరరావు హిందీ బాణీలను యథాతథంగా వినియోగించకుండా వాటి లయను మాత్రం అనుసరించి తెలుగులో స్వతంత్రమైన బాణీలను కట్టారు. అందువల్ల 'ఆహుతి'లోని శ్రీశ్రీ పాటలను పూర్తిగా అనువాదగీతాలు అనడానికి అవకాశం లేదు. ఇక తెలుగు నుంచి యితర భాషల్లోకి అనువదించబడిన మొదటి చిత్రం 'కీలుగుఱ్ఱం'. అది తమిళంలో 'మాయాక్కుదిరై' పేరుతో డబ్ చెయ్యబడింది. డబ్బింగ్ చిత్రాలు రెండు రకాలుగా రూపొందేవి. సినిమా ఒక భాషలో విజయం సాధిస్తే దానిని తిరిగి అదే సంస్థగాని, హక్కులు కొని మరొకరుగాని భాషాంతరీకరించేవి కొన్నయితే, ఒక భాషలో నిర్మించిన తరువాత ఎడిటింగ్ పూర్తికాగానే ఆ సంస్థవారే మరోభాషలో డబ్ చేసినవి మరికొన్ని. తెలుగులో డబ్ చేసిన మొదటి చిత్రం 'ఆహుతి'కి మాతృక అయిన 'నీరా ఔర్ నందా' హిందీలో అంతగా విజయవంతం కాలేదట!

ఈ సందర్భంగా చాలమంది సినీపండితులు కూడా డబ్బింగ్ చిత్రాలుగా భ్రమపడే 'ట్రాక్ ఛేంజ్' చిత్రాల గురించి కూడా వివరణ యివ్వడం అవసరం. దృశ్యచిత్రీకరణ జరిగేటప్పుడు ఆయా నటీనటుల కంఠాలతోనే వేరు వేరు భాషల్లో సంభాషణలు ధ్వనిముద్రణ చేసి, ఆ తరువాత సక్రమంగా తెలుగు వుచ్చరించగలిగిన వారిచేత అవే మాటలు డబ్బింగ్ చెప్పిస్తారు. ఈ మార్పిడి సినిమా పొడవునా వుంటుంది. చిత్రాల పాటలు మాత్రం రెండో భాషలో రాయించి తిరిగి చిత్రీకరిస్తారు. ప్రేమలేఖలు, మనోహర, ఆకలి, తండ్రి మొదలైన చిత్రాలన్నీ ట్రాక్ ఛేంజ్ చేసినవే తప్ప, డబ్బింగ్ కాదంటే చాలమందికి నమ్మకం చాలదు. ప్రేమలేఖలు హిందీ (ఆహ్), తమిళం (ఆవన్), తెలుగు

భాషలలో ఒకేసారి తీశారు. నర్గీస్, రాజకపూర్ నాయికా నాయకులుగా నటించిన 'ప్రేమలేఖలు' చిత్రంలో ఆరుద్ర రాసిన పాటలు ఆ కాలంలో యింటింటా మారుమ్రోగాయి. వాటిలో–

**ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లు గజ్జెల సంగీతం**
**మువ్వల చిందు హుషారు పసందు వినే చెవి విందు'**

అనే జిక్కి బృందం పాడిన బృందగానాన్ని మాత్రం 'లాంగ్ షాట్స్'లో వుంది గనుక తిరిగి చిత్రీకరించలేదు. ఆలీబాబా నలభై దొంగలు (భానుమతి, ఎం.జి.ఆర్) పాటల్ని మాత్రం విడిగా రాయించి చిత్రీకరించారు. ఆరుద్ర 'లిప్ సింక్'ను దృష్టిలో పెట్టుకోకుండా పాటల్ని రాయడం వల్ల నాయికానాయకుల మీద చిత్రీకరించిన పాటల వరకు తిరిగి తియ్యవలసి వచ్చింది. అయినా అది డబ్బింగ్ చిత్రంగానే పరిగణింపబడింది. 'సర్వాధికారి' చిత్రంలో ఎం.జి.ఆర్, నంబియార్ మొదలైన తమిళనటులు యాస తెలుగులో మాట్లాడినా తెలుగు ప్రేక్షకులు ఆ సంభాషణలను తృణీకరించలేదు. సర్వాధికారి, జీవితం మొదలైన చిత్రాలు నేరుగా తీసిన తెలుగు చిత్రాల కోవకే చెందుతాయి.

అప్పట్లో విజయ, అన్నపూర్ణ, ఎ.వి.యం. మొదలైన సంస్థలు నిర్మాణవ్యయం కలిసొచ్చేలా ద్విభాషాచిత్రాలను, బహుభాషాచిత్రాలను నిర్మించారు. ఏకకాలంలో రెండు భాషల్లో ఒకే కథావస్తువును అవే దృశ్యాలతో అవే పాటల బాణీలతో భిన్న తారాగణంతో నిర్మించిన సినిమాలను ద్విభాషాచిత్రాలు అన్నారు. విజయ, అన్నపూర్ణ, ఎ.వి.యం. సంస్థలు తెలుగు తమిళాలతో ఎక్కువగా ద్విభాషాచిత్రాలను నిర్మించారు. బీదలపాట్లు, దీక్ష, పాతాళభైరవి, మాయాబజార్, దేవాంతకుడు, పరదేశి, మిస్సమ్మ, వెలుగు నీడలు మొదలైనవి ద్విభాషా చిత్రాల కుదాహరణలు. తెలుగు తమిళ చిత్రాలను ఒకేసారి నిర్మించడం వల్ల రెండు భాషలకు సంబంధించిన కవులను పక్కపక్కన కూర్చోబెట్టి నిర్మాతలు వారికి భావ వినిమయానికి ఆస్కారాన్ని కలిగించేవారు. తెలుగులో వెంటనే స్ఫురించకపోతే ముందుగా తమిళకవి రాయగా దానిని తెలుగుకవి అనుసరించడానికి, అలాగే ముందుగా తెలుగుకవికి ఆలోచన వస్తే దానిని తమిళకవి అనుసరించడానికి – వాళ్లు కలిసి కూర్చుండడం వల్ల వీలుండేది కనుక ద్విభాషాచిత్రాల్లోని పాటల్లో భావసాదృశ్యం కూడా వుండి డబ్బింగ్ పాటల్లా అనిపించేవి. మచ్చుకి 'మిస్సమ్మ'లోని 'రావోయి చందమామ' పాటను, తమిళ చిత్రం 'మిస్సియమ్మ' లోని 'వారాయో వెణ్ణిలావే' పాటను – పరిశీలిద్దాం. తెలుగు పాటను, పింగళి, తమిళపాటను తంజై రామయ్యదాస్ రాశారు.

1. అతడు : రావోయి చందమామా, మా వింతగాథ వినుమా
సామంతము గల సతికి ధీమంతుడగు పతినోయ్
సతి పతి పోరే బలమై సతమత మాయెను బతుకే
॥రావోయి॥

ఆమె : రావోయి చందమామా మా వింతగాథ వినుమా
ప్రతినలు పలికిన పతితో బ్రతుకగ వచ్చిన సతినోయ్
మాటలు బూటకమాయె నటనలు నేర్చెను చాలా
॥రావోయి॥

అతడు : రావోయి చందమామా మా వింతగాథ వినుమా
తన మతమేదో తనదీ మన మత మసలే పడదోయ్
మనమూ మనదను మాటే అననీయదు, తాననదోయ్
॥రావోయి॥

ఆమె : రావోయి చందమామా మా వింతగాథ వినుమా
నాతో తగవులు పడుటే అతనికి ముచ్చట లేమో
ఈ విధి కాపురమెటులో నీవొక కంటను కనుమా
॥రావోయి॥
(మిస్సమ్మ)

2. అతడు : వారాయో వెణ్ణిలావే కేళాయో ఎంగళ్ కదైయే
అహంబావం కొండ సదియాల్ అరివాల్ ఉయర్న్దిడుం పదినాన్
సది పది విరోద మిగవే సిదైందదు యిదం తరుం వాళ్వే
ఆమె : వారాయో వెణ్ణిలావే కేళాయో ఎంగళ్ కదైయే
వాక్కురియై తంద పదియాల్ వాళ్న్దిడవే వంద సదినాన్
నంబిడ సెయ్యార్ నేశం నడిప్పదెల్లాం వెళివేషం
(మిస్సియమ్మ)

(మిగిలిన రెండు చరణాలు యివ్వడం లేదు.)

నాయికానాయకుల మధ్య ఒప్పందం తాలూకు తగవులాటకు సంబంధించిన యీ పాటలో తెలుగులో వున్న చమత్కారం, చిలిపిదనం తమిళంలో కనిపించవు. తమిళగీతంలో కొన్ని తెలుగు పదాలకు సమానార్థకాలైన పదాలు లేక పోవడం వల్ల

రెండింటికీ స్వల్పభేదం కనిపించింది. ఈ రెండింటిలో ముందుగా తెలుగుపాట రాయగా, తమిళకవి దాని ననుసరించినట్టు తెల్లమవుతోంది. 'మిస్సమ్మ'ను హిందీలో 'మిస్ మేరీ' గా నిర్మించినపుడు కూడా యిదే సంగీత బాణీని వినియోగించారట. తెలుగు తమిళాల్లో ఈ సినిమా సంగీత దర్శకుడు యస్. రాజేశ్వరరావే!

ఏకకాలంలో రెండుకు మించిన భాషలలో ఒకేకథా వస్తువుతో, ఆయా భాషలకు సంబంధించిన వేర్వేరు నటీ నటులతో సినిమాలు నిర్మిస్తే వాటిని బహుభాషా చిత్రాలు అన్నారు. ఒక్కోసారి మొదట రెండు మూడుభాషలలో యిలాంటి చిత్రనిర్మాణం చేసి అనంతరం యితర భాషలలో కూడా అదే కథావస్తువుతో సినిమాలు తీస్తే-వాటిని కూడా బహుభాషా చిత్రాలుగా పరిగణించవచ్చు. తెలుగులో 'ప్రపంచం' (ఉళగం) చిత్రాన్ని నిర్మించిన సింహళీయుడు మూనాస్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, సింహళ భాషలలో ఒకేసారి విడుదల చేశారు. 'ప్రపంచం' (1953) తీసిన పదేళ్ల తర్వాత మునాస్ 'దేవసుందరి' (1963) చిత్రాన్ని కూడా అయిదు భాషలలోనూ నిర్మించాలనుకున్నారు కాని అది తెలుగు తమిళాలలో తప్ప యితర భాషలలో విడుదలైనదీ లేనిదీ తెలియదు. ఇంకా అగ్గిరాముడు (మలైకల్లన్), నా చెల్లెలు (ఎన్ తంగై), కాంచన, చండీరాణి మొదలైనవి బహుభాషా చిత్రాలే. భానుమతి, ఎన్.టి.ఆర్. తెలుగులోనూ, భానుమతి, ఎం.జి.ఆర్. తమిళంలోనూ నాయికా నాయకులుగా నటించిన అగ్గిరాముడు తర్వాత మరో నాలుగు భాషలలో నిర్మింపబడింది. 'నా చెల్లెలు' చిత్రాన్ని తెలుగు తమిళాలతో పాటు హిందీ ఒరియాలలో కూడా వేరువేరుగా తీశారు. ద్విభాషా చిత్రాల్లో లాగే బహుభాషా చిత్రాలలో కూడా చాల వరకు అవే బాణీలకు పాటలను రాయించారు.

ఒక భాషలో ఒక చిత్రాన్ని నిర్మించిన తర్వాత అది విజయవంతమైన కొంతకాలానికి అదే సంస్థగాని, ఆ హక్కులను కొని మరో సంస్థగాని రెండో భాషలో వేరే తారాగణంతో, కథను యథాతథంగా గాని, చేర్పులు మార్పులుతో గాని తిరిగి నిర్మిస్తే -అటువంటి చిత్రాలను పునర్నిర్మాణ చిత్రాలు (రీమేక్) అన్నారు. హక్కులు కొనకుండా ప్రధానేతి వృత్తాన్ని సంగ్రహించి వేరే భాషలో నిర్మించిన సందర్భాలు కూడా వున్నాయి. వాటిని 'ఫ్రీమేక్ పిక్చర్స్' అందాం. తెలుగులో అన్న దమ్ముల అనుబంధం, (యాదోంకి బారాత్), నిప్పులాంటి మనిషి (జంజీర్), మగాడు (దీవార్), కన్నవారి కలలు (ఆరాధన), గంగ-మంగ (సీతా ఔర్ గీతా), యుగంధర్ (డాన్), గబ్బర్‌సింగ్ (దబాంగ్) మొదలైనవి హిందీ నుంచి పునర్నిర్మించిన విజయవంతమైన చిత్రాల కుదాహరణలు కాగా – మనసే

మందిరం (నెంజిర్ ఓర్ ఆలయమ్), గుడి గంటలు (ఆలయ మణి), సుమంగళి (శారద), ప్రేమించి చూడు (కాదలిక్క నేరమిల్లై), సీతాకోక చిలుక (అలైగళ్ ఓయు వదిల్లై) పదహారేళ్ల వయసు (పదినారు వయదినిలే), రక్తసంబంధం (పాసమలర్), అంతులేని కథ (అవళ్ ఒరు తొడర్ కదై), పెదరాయుడు (నాట్టామై) మొదలైనవి తమిళం నుంచి పునర్నిర్మించిన విజయవంతమైన చిత్రాలకు ఉదాహరణలు. కృష్ణవేణి (శరపంజర), కల్యాణ మండపం (గజ్జెపూజ), అన్నదమ్ముల సవాల్ (సహోదర సవాల్), పెళ్లిపందిరి (అనురాగ సంగమ), పుట్టింటికి రా చెల్లీ (తవరిన బా తంగే), గుండమ్మ కథ (విఠలాచార్య తీసిన 'మనే తుంబిద హెణ్ణు'), మనుషులు మారాలి (తులాభారం), శుభమస్తు (అనియన్ బావా–చేతన్ బావా), హిట్లర్ (చిరంజీవి), హిట్లర్ (మమ్ముట్టి), హనుమాన్ జంక్షన్ (టెంకాసి పట్టణం), ఉలవచారు బిర్యాని (పెప్పర్ సాల్ట్) కన్నడ, మలయాళ భాషల నుంచి పునర్నిర్మితమైన కొన్ని విజయవంతమైన చిత్రాలు.

పునర్నిర్మిత చిత్రాలలో పాటల విషయంలో సంగీత దర్శకుడు ఒకరే అయితే మాతృక లోని బాణీలనే రెండో చిత్రంలోనూ వుపయోగించారు. రెండో చిత్రానికి సంగీత దర్శకుడు వేరయినప్పుడు మాతృకలోని బాణీలను అనుసరించిన సందర్భాలూ, సొంతబాణీలను యిచ్చిన సందర్భాలూ రెండూ వున్నాయి. ఉదాహరణకు భారతీ రాజా దర్శకత్వంలో వచ్చిన 'పదినారు వయదినిలే' చిత్రానికి ఇళయరాజా సంగీత దర్శకుడు కాగా దాని తెలుగుసేత 'పదహారేళ్ల వయసు'కు (దర్శకుడు కె. రాఘవేంద్రరావు) సంగీత దర్శకుడు చక్రవర్తి. మాతృకలోని 'సెందూర పూవే సెందూర పూవే' అనే గీతాన్ని ఇళయరాజా సోదరుడు గంగై అమరన్ రచించగా ఆ పాట ననుసరిస్తూ తెలుగులో వేటూరి సుందరరామ మూర్తి 'సిరి మల్లె పువ్వా... సిరిమల్లెపువ్వా' పాటను రాశారు. తెలుగు చిత్రంలో పాటలకు చక్రవర్తి సొంత బాణీలు చేసినా, పై పాటను మాత్రం చిన్న చిన్న మార్పులతో ఇళయరాజా బాటనే అనుసరించారు.

**సెందూర పూవే... సెందూర పూవే... సిల్లెంద్ర కాట్రే**
**ఎన్ మణ్ణన్ ఎంగే... ఎన్ మణ్ణన్ ఎంగే**
**నా కొంజెమ్ సొల్వాయె..'**

అంటూ ఓ కన్నెపిల్ల రాబోయే వరుణ్ని గురించి కలలు కంటూ ప్రకృతిలోని చిరుగాలినీ, మందార పువ్వునూ, పక్షులనూ ప్రశ్నించే భావపరిమళం గల ఈ పాటకు దగ్గరగానే వేటూరి తెలుగుపాటను రాశారు.

**సిరిమల్లె పువ్వా... సిరిమల్లెపువ్వా - చిన్నారి చిలకమ్మా**
**నీవాడు ఎవరే... నాతోడు ఎవరే - ఎన్నాళ్లకొస్తాడే**

**1. తెల్లారబోతుంటే నాకల్లోకి వస్తాడే**
**కళ్లారా చూద్దామంటే నా కళ్లు మూస్తాడే**
**ఆ అందగాడూ.. నా ఈడూజోడూ ఏడే**
**ఈ సందెకాడ నా చందమామ రాడే**
**చుక్కల్లారా దిక్కులు దాటి - వాడెన్నాళ్లకొస్తాడో ॥సిరి॥**

**2. కొండల్లో కోనల్లో 'కో'యన్న ఓ కోయిలా**
**ఈ పూలవానల్లో ఝుమ్మన్న ఓ తుమ్మెదా**
**వయసంతా వలపై వలపే మైమరుపై ఊగెనే**
**చుక్కల్లారా దిక్కులు దాటి వాడెన్నాళ్ల కొస్తాడో**

వేటూరి తెలుగుపాటలో కన్నెవయసు వూహలకు రెక్కలు తొడిగి శబ్దసౌందర్యంతో మూలానికి మెరుగులు పెట్టారు. రెండు భాషల్లోనూ నటి శ్రీదేవిపై చిత్రీకరించిన ఈ పాటను యస్.జానకి ఆలపించగా తమిళచిత్రంలో ఆమె పాటకు జాతీయబహుమతి కూడా లభించింది.

ఏతావతా చెప్పొచ్చిందేమిటంటే - ఇతివృత్తం, సంగీత స్వరాలు మొదలైన అంశాలను బట్టి మాతృకలతో సారూప్యం కనిపించినా ట్రాక్ ఛేంజ్ చిత్రాలు, ద్విభాషా, బహుభాషా చిత్రాలు, పునర్నిర్మాణ చిత్రాలు  డబ్బింగ్ చిత్రాలు కావని! అవి డైరక్ట్ టేక్ చిత్రాలు జాబితాలోనే చేరతాయని! అలాగే తెలుగులో 'అనువాదం' అనే పదం డబ్బింగ్ విస్తృత రూపాన్ని ఆవిష్కరించ లేదు గనుక అది డబ్బింగ్‌కు సమానార్థకం కాదని! అయినా ఆంగ్లంలో 'ట్రాన్స్‌లేషన్' అనే పదానికి సమానార్థకమైన అనువాదం తప్ప తెలుగులో మరో పదం లేదు గనుక, చిరకాలంగా వాడుకలో వుండి నోళ్లలో నానిన ఆ పదాన్ని తప్ప యిప్పుడు మీడియా కాని పరిశోధకులు కాని ప్రత్యామ్నాయాన్ని సూచించినా జనం స్వీకరించరు గనుక మాతృభాషాభిమానులకు ఆ పదం తప్ప గత్యంతరం లేదు. తమిళంలో కూడా అనువాదం అనే అర్థంలోనే 'మొళి పెయర్పు' అనే పదాన్ని వాడతారట! అంత చాదస్తం లేకపోతే తెలుగులో ప్రత్యామ్నాయాలు లేక వ్యవహారభాషలో కలిసి పోయిన రోడ్డు, రైలు, బస్, టికెట్, కార్డ్, కాఫీ, ఓటు మొదలైన ఆంగ్లపదాల జాబితాలో 'డబ్బింగ్'ను

కూడా చేర్చి డబ్బింగ్ సినిమాలు, డబ్బింగ్ పాటలు అనడమే మేలు! ఇప్పటికే చాలమంది అలాగే అంటున్నారు కూడా!

ఈమధ్య యితర భారతీయ భాషలలో విజయవంతమైన బుల్లితెర ధారావాహికలను యెక్కువగా తెలుగు చెయ్యడం వల్ల డబ్బింగ్ కళాకారులు, డబ్బింగ్ స్టూడియోల ఆవశ్యకత పెరిగింది. ఇంటింటా బుల్లితెర కార్యక్రమాలకు అతుక్కుపోతున్న వీక్షకులు, ముఖ్యంగా గృహిణులు యితర భాషలకు సంబంధించిన ధారావాహికల్లో డబ్బింగ్ సక్రమంగా లేకపోయినా ఆ తేడాను పట్టించుకోకుండా వాటికి బ్రహ్మరథం పడుతున్నారు. ఇలా సినిమాల నుండి యీ అనుసంధానకళ క్రమంగా  బుల్లితెరకు కూడా విస్తరించి యెందరో కళాకారులకు వృత్తిగాను, జనసామాన్యానికి ప్రధాన వినోదసాధనంలో భాగం గానూ వర్ధిల్లుతోంది.

❖

ఈ అధ్యాయంలో

సమాచార సేకరణకు ఉపయోగపడిన రచనలు, ప్రసంగాలు:

1. డబ్బింగ్ అంటే అనువాదమా? - పైడిపాల
   30-1-15 ఆంధ్రభూమి వెన్నెల-వ్యాసం.
2. మాటల మాంత్రికులు
   10-9-2002, 'ఇండియా టుడే' లో వ్యాసం.
3. తెలుగు సినిమా సాహిత్యం - అనువాదం - వెన్నెలకంటి
   'తెలుగు సినిమాభాష - వ్యాసావళి' పుస్తకంలో వ్యాసం
   పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, హైదరాబాద్
4. 'సిరిమల్లెపువ్వా... సిరిమల్లెపువ్వా' - డా. మణిగోపాల్
   15-12-2008 'సూర్య' 'తననాలు - తర్జుమాలు'లో వ్యాసం.
5. 'అర్థం చేసుకుందాం - ఆస్వాదిద్దాం' - పి.యస్. గోపాలకృష్ణ
   16-31 జూలై 2004 హాసంలో వ్యాసం.
6. మరో ఆలాపన - వి.ఎ.కె.రంగారావు
   ప్రచురణ : ప్రగతి ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్, 17, రెడ్‌హిల్స్, హైదరాబాద్.
7. అనువాద సమస్యలు - రాచమల్లు రామచంద్రారెడ్డి
   విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
8. అనువాద పాఠాలు - బూదరాజు రాధాకృష్ణ
   మీడియా హౌస్ పబ్లికేషన్స్, హైదరాబాద్ - 13
9. ఆత్రేయ సాహితి, మనస్విని ప్రచురణ
10. యస్.పి. బాలసుబ్రహ్మణ్యంతో ముఖాముఖి - 23-2-14
11. రావి కొండలరావుతో ముఖాముఖి 10-5-13
12. ఫిల్మ్ న్యూస్ ఆనందన్‌తో ముఖాముఖి - 22-6-15
13. సినీరచయిత తోటపల్లి మధు ఫోన్‌లో చెప్పిన జ్ఞాపకాలు.

# ప్రపంచీకరణం - సినిమా ప్రబలోదాహరణం

'ఎంత చిన్నదైపోయిందీ భూలోకం
ఎంత చేరువైపోయిందీ ఆకాశం[1]

అన్నారు శ్రీశ్రీ. అప్పటికింకా యింత వైజ్ఞానికప్రగతి, ఆధునిక సౌకర్యాలు లేవు. సెల్‌ఫోన్స్, యస్.యమ్.యస్.లూ, సి.డి.లు, స్కైప్స్, వాట్సాప్‌లూ, ఇంటర్నెట్, ఈమెయిల్స్, యుట్యూబ్స్, గ్రాఫిక్స్, శాటిలైట్స్, ఫిల్మ్‌బాక్స్‌లు అవసరం లేని సినిమా ప్రదర్శనలూ... ఇంత అద్భుతమైన ఎలక్ట్రానిక్ మీడియా విశ్వరూపాన్ని చూసి వుంటే ఆ మహాకవి యింకెలా స్పందించేవారో!

ఇటీవల ప్రపంచీకరణం అనే పదం తరచుగా వినిపిస్తోంది. అవగాహన వున్నవాళ్లూ, లేనివాళ్లూ రాజకీయ సాహిత్య రంగాలలో 'ప్రపంచీకరణ నేపథ్యంలో...' అనడం సర్వసామాన్యమైపోయింది. ప్రపంచంలో యెక్కడ ఏ అద్భుతం జరిగినా, ఏ దేశంలో వైజ్ఞానిక పరిశోధనలు సత్ఫలితాలనిచ్చినా, ఏ రంగంలో యెలాంటి సాంకేతిక విప్లవం వచ్చినా.. అన్నీ ప్రపంచంలోని అన్నిదేశాల వారికీ అందుబాటులోకి రావడానికి యెంతో కాలం పట్టడం లేదు. నేడు సినిమా రంగాన్ని డిజిటల్ టెక్నాలజీ యేలుతోంది. చిత్రీకరణ నుంచి ప్రదర్శన వరకు అనూహ్యమైన సాంకేతికపరిజ్ఞానం చోటు చేసుకొని సినిమా నిర్మాణం కొత్త పుంతలు తొక్కుతోంది. చిత్రరంగానికి సంబంధించిన ఇరవైనాలుగు కళలు వున్నా, ఈ పరిణామం సంగీత సాహిత్యాల మీద మరింత బలంగా వుంది. ఆధునిక విజ్ఞానం పుణ్యమా అని – సినిమా రంగానికి సంబంధించిన జిజ్ఞాసువులకు ప్రపంచంలో యెక్కడ ఏ సంచలనాత్మకమైన సినిమా వచ్చినా వెంటనే చూడగలిగే అదృష్టావకాశాలు లభిస్తున్నాయి. ఆ పైన అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు దేశాల మధ్య, భాషల మధ్య సరిహద్దులను చెరిపి వుత్తమచిత్రాల ప్రభావం విశ్వవ్యాప్తంగా

---

1. ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, దీపావళి సంచిక – నవంబరు, 1982

ప్రస్తరించడానికి దోహదం చేస్తున్నాయి. ఈ కోణం నుంచి హాలివుడ్ బాలివుడ్ చిత్రాలు తెలుగు సినిమాను యెలా ప్రభావితం చేశాయో, చేస్తున్నాయో పరిశీలిద్దాం.

తెలుగులో టాకీల ప్రారంభదశలోనే సంగీత సాహిత్యాల మీద పాశ్చాత్యప్రభావం ప్రసరించింది. 'మాయాబజార్' చిత్రంలో 'వివాహ భోజనంబు...' బాణీ పడమటి పోకడే అనేది సర్వజన విదితం. రాజంరెడ్డి రామిరెడ్డి ఘటోత్కచునిగా నటించిన శశిరేఖా పరిణయము లేక మాయాబజార్ (1936) పాటల పుస్తకంలో ఈ పాటపైన 'ఇంగ్లీషునోట్' అని స్పష్టంగా పేర్కొన్నారు కూడా. 'ఇల్లాలు' (1940)లో యస్. వరలక్ష్మి పాడిన 'కోయిలొకసారొచ్చి కూసిపోయింది', 'చెంచులక్ష్మి' (1943) చిత్రంలో 'టైటిల్ మ్యూజిక్', కోయగూడెంలోని నృత్యసంగీతాలపై లాటిన్ అమెరికన్ సంగీత ప్రభావం స్పష్టంగా వుంది. 'మంగళసూత్రం' / 'ఇది మా కథ' (1946) చిత్రంలో జిక్కి, పిఠాపురం నాగేశ్వరరావు పాడిన 'మామయ్యొచ్చాడే..' పాటపై కార్మన్ మిరాండా పాడిన 'మామా యూకెరో...' పాట ప్రభావం వుంది. ఇంకా 'గుణసుందరి కథ' 'పుట్టిల్లు' చిత్రాల్లో ఇంగ్లీషు ట్యూన్స్ అని భ్రమింపచేసే పాటలున్నాయి. సంగీత దర్శకులు పెండ్యాల వి.ఎ.కె. రంగారావుతో రాక్షస ప్రవేశాన్ని సూచించే సందర్భాలలో శంకరాభరణ రాగస్వరాలకు సరిపడే మేజర్ సి. స్కేల్ అనే పాశ్చాత్య సంగీతంలో వినిపించే బాణీని వుపయోగిస్తామని చెప్పారట! 'శ్రీకృష్ణలీలలు' (1935)లో 'ధిక్కారమున్ సైతునా..' అని వేమూరి గగ్గయ్య పాడిన పాట బాణీ ఈ కోవకు చెందిందే![2]

స్వర్గసీమ (1945) లో భానుమతి పాడిన 'ఓ ఒహోహో ఒహోహో హోహోహో పావురమా' అనే పాట బాణీకి 'బ్లడ్ అండ్ శాండ్' సినిమాలో హీరోయిన్ పాడిన స్పానిష్ బాణీ మూలమట![3] ఆ పాశ్చాత్యచిత్రం చూసిన బి.యన్.రెడ్డి కోరిక మేరకు బాలాంత్రపు రజనీకాంతరావు దాని ననుసరిస్తూ స్వరరచన చేయగా భానుమతి ఆలపించిన పావురమా పాట అప్పట్లో ఓ సంచలనమే! అన్నపూర్ణా వారి 'ఇద్దరు మిత్రులు' (1961) చిత్రంలో బహుళ జనాదరణ పొందిన ఆరుద్ర రచన 'హలో హలో ఓ అమ్మాయి, పాత రోజులు మారాయి' పాట బాణీకి మూలం ఈజిప్టు దేశస్థుడైన 'బాబ్ అజామ్' పాడిన 'ముస్తాఫా యా ముస్తాఫా' అనే గీతమట! గ్రీకు బాణీని అనుసరించిన బాబ్ అజామ్ పాట 'ఇద్దరు

---

2. 23-7-15న ఫోన్‌లో వి.ఎ.కె. సమాచారం.

3. అది అరేబియన్ ట్యూన్ పద్ధతిలో పాడినదని వి.ఎ.కె. రంగారావు అభిప్రాయం.

మిత్రులు' సంగీత దర్శకుడు ఎస్.రాజేశ్వరరావుకు తెగ నచ్చి పైపాటకు వాడుకొన్నారట.[4] 'చిట్టి చెల్లెలు' (1970) చిత్రంలో యస్. రాజేశ్వరరావు స్వరకల్పనలో సి. నారాయణరెడ్డి రాసిన 'ఈ రేయి తీయనిది ఈ చిరుగాలి మనసైనది' అనే హిట్‌సాంగ్‌కు కూడా ఆధారం పాశ్చాత్య బాణీయేనట! 'ర్యాప్ మ్యూజిక్' అనే సంగీతప్రక్రియ బందీలుగా వుండి మాట్లాడ్డానికి అవకాశం లేని నీగ్రోలు చేసే నృత్య సంకేతాల నుంచి వచ్చిందట! తొలినాటి తెలుగు సినిమాల్లోని పాటలపైనే యింతగా పాశ్చాత్య ప్రభావం వుంటే, 'బీట్' ప్రధానంగా వస్తున్న యిప్పటి తెలుగు సినిమాల్లోని పాటల గురించి చెప్పాలా?

ఇక తెలుగు సినిమాకథల మీద విదేశీచిత్రాల నవలల, నాటకాల ప్రభావాన్ని గమనిద్దాం. విదేశీ కథలను, పూర్తిగా కాని, పాక్షికంగా కాని, చిత్రాలయితే వాటిలో కొన్ని దృశ్యాలను గాని (సం)గ్రహించి, లేదా వాటిని స్ఫూర్తిగా తీసుకొని తెలుగు, ఇతర భారతీయ భాషలలో నిర్మించగా విజయవంతమైన చిత్రాలు అనేకం. కె.వి.రెడ్డి దర్శకత్వంలో వచ్చిన 'గుణసుందరి కథ' (1949)కు షేక్స్‌పియర్ రచించిన 'కింగ్ లియర్' నాటకం ఆధారం. ఇది పాశ్చాత్య కథ ఆధారంగా నిర్మింపబడిన మొదటి తెలుగు సినిమా.

పక్షిరాజావారి 'బీదలపాట్లు', 'ఏళై పడుం పాడు' తమిళ చిత్రం - రెండూ విక్టర్ హ్యూగో ఫ్రెంచి నవల 'లే మిజ రబుల్స్' ఆధారంగా 1950లో నిర్మింపబడిన ద్విభాషా చిత్రాలు. రెండింటిలోనూ నాగయ్య, బాలయ్య ప్రధాన పాత్రధారులు. 'బీదలపాట్లు' తిరిగి 1972లో అక్కినేని నాగేశ్వరరావు, గుమ్మడి ప్రధాన పాత్రధారులుగా విఠలాచార్య దర్శకత్వంలో నిర్మితమై పరాజయం పాలయ్యింది. 1950లోని 'బీదలపాట్లు'లో ప్రధానపాత్రధారి అయిన చిత్తూరు నాగయ్య ఈ చిత్రంలో చర్చిఫాదర్‌గా చిన్న పాత్రలో నటించడం విశేషం. కాగా 'ఏళం పడుం పాడు' చేర్పులు మార్పులతో మేజర్ సౌందర్ రాజన్, శివాజీ గణేశన్ ప్రధాన నటులుగా తమిళంలో 'జ్ఞానఒళి' పేరుతో విడుదలై అఖండ విజయం సాధిస్తే- తెలుగులో అది ఆధారంగా చిరంజీవి, మోహన్ బాబు కాంబినేషన్‌లో 'చక్రవర్తి' (1987) చిత్రాన్ని తీశారు.

మార్క్‌ట్వేన్ రచించిన 'ప్రిన్స్ అండ్ ది పాపర్' నవల ఆంగ్లంలో సినిమాగా వస్తే - అది ఆధారంగా బి.ఏ. సుబ్బారావు దర్శకనిర్మాతగా తెలుగులో 'రాజు-పేద' (1954) చిత్రం వచ్చింది. ఇంగ్లీషు నవలలో 'మైల్స్ హెండన్' పాత్ర ఈ చిత్రంలో చేర్పులు

**4. డా॥ కంపెల్ల రవిచంద్రన్ వ్యాసం, ఆంధ్రజ్యోతి ఆదివారం సంచిక. 16-8-15.**

మార్పులుతో జేబులో బొమ్మతో హడావిడి చేసే సుధీర్ పాత్రగా రూపొందితే – ఆపాత్రలో రాణించిన రేలంగికి వెనుదిరిగి చూడాల్సిన అవసరం లేకపోయింది. 'రాజు–పేద' తెలుగులో 'ప్రతాపరుద్రీయం' నాటక కథను పోలి వుండడం యాదృచ్ఛికం. పేదకుర్రాడికి యువరాజుకి వున్న పోలికలు (మాష్టర్ సుధాకర్ యీ పాత్రలను ధరించారు) ఆధారంగా వాళ్లు ఒకరి స్థానంలోకి మరొకరు వెళ్లడమనే కథలోని ప్రధాన సూత్రం ఆ తర్వాత తెలుగులోను. యితర భారతీయ భాషలలోను అనేక ద్విపాత్రాభినయ చిత్రాలు రావడానికి దారి చూపింది. 'మేరియన్ ఇవాన్స్' (జార్జి ఎలియట్) అనే బ్రిటిష్ రచయిత్రి రాసిన 'సైలాస్ మార్నర్' అనే ప్రసిద్ధ నవలలోని యితివృత్తాన్ని పాశ్చాత్య వాసన లేకుండా తెలుగు వాతావరణం పుట్టిపడేలా పాలగుమ్మి పద్మరాజు మలిచిన కథ ఆధారంగా వాహినీవారు 'బంగారుపాప' (1955) చిత్రాన్ని తీశారు. అందులోని ప్రధానపాత్ర కోటయ్యగా నటించిన యస్.వి. రంగారావు అభినయానికి ప్రేక్షకులు జేజేలు పలికారు. ఈ చిత్రానికి జాతీయస్థాయిలో రజతపతకం లభించింది. తెలుగులో ఎన్.టి.ఆర్. మొదటి సారిగా ద్విపాత్రాభినయం చేసిన సురేష్ ప్రొడక్షన్స్ వారి 'రాముడు–భీముడు' (1964) చిత్రానికి స్ఫూర్తి 'ప్రిజనర్ ఆఫ్ జెండా' అనే ఆంగ్లనవల, ఆ నవల ఆధారంగా ముప్పైలలోను, నలభైలలోనూ తీసిన రెండు ఆంగ్లచిత్రాలని దానికి కథ సమకూర్చిన డి.వి. నరసరాజు తన 'తెరవెనుక కథలు' లో రాశారు. అలాగే డి.వి. నరసరాజే 'హెవెన్ కెనాట్ వెయిట్' (1943), 'ఎ మేటర్ ఆఫ్ లైఫ్ అండ్ డెత్' (1946) సినిమాలు ప్రేరణగా 'దేవాంతకుడు' చిత్రానికి కథను అల్లారు. (దేవాంతకుడు చిత్రానికి స్ఫూర్తి బెంగాలీ సినిమా అని భరాగో అభిప్రాయం) దేవాంతకుడు విజయవంతమైన తర్వాత యముడు –యమలోకం చుట్టూ తిరిగిన సినిమాలు తెలుగులో అనేకం వచ్చాయి. వాటిలో 'యమ గోల' 'యమలీల' 'యమదొంగ' మొదలైనవి చెప్పుకోదగిన చిత్రాలు. కె.ఎస్.ప్రకాశరావు తీసిన ప్రకాష్ ప్రొడక్షన్స్ వారి 'మొదటి రాత్రి' (1950) చిత్రానికి 'గోల్డెన్ ఇయర్ రింగ్స్' ఆంగ్ల చిత్రం ఆధారం. కె.వి.రెడ్డి దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లినాటి ప్రమాణాలు'కు స్ఫూర్తి మెర్లిన్ మన్రో నటించిన హాలివుడ్ చిత్రం 'సెవెన్ యియర్స్ యిచ్'!

అలెగ్జాండర్ డ్యూమా అనే ఫ్రెంచి రచయిత రాసిన 'ది కార్సికన్ బ్రదర్స్' నవల ఆధారంగా అన్ని ప్రపంచ భాషల లోనూ కలిపి సుమారు 200 చిత్రాలు వచ్చి వుంటాయి. అచ్చు గుద్దినట్టు పోలికలు గల కవలలకు సంబంధించిన తిక మకలు ఈ నవలలోని ప్రధానాంశం. తమిళంలో తీసి తెలుగులో పాక్షికంగా తర్జుమా చేసి మరికొంత తిరిగి

చిత్రీకరించి రూపొందించిన జెమినివారి 'అపూర్వ సహోదరులు' యీ తరహా చిత్రమే. తెలుగులో తిరిగి యిదే ఫార్ములాతో 'చండీరాణి' (1953) తీశారు. తెలుగుతో పాటు హిందీ తమిళాలలో కూడా ఒకే రోజు (ఆగష్టు 28, 1953) విడుదలయిన బహుభాషా చిత్రం చండీరాణి!

అమెరికన్ రచయిత మెక్‌కుచ్చన్ 1902లో రాసిన 'బ్రూస్టర్ మిలియన్స్' ఆధారంగా హాలివుడ్ లో ఆరు సినిమాలు వచ్చాయి. 'బ్రూస్టర్ మిలియన్స్' స్ఫూర్తితో వచ్చిన తెలుగు చిత్రాల్లో ఎన్.టి.ఆర్. హీరోగా హెచ్.యమ్.రెడ్డి దర్శకత్వంలో వచ్చిన 'వద్దంటే డబ్బు' (1954) ఒకటి. ముప్పై కోట్ల రూపాయల్ని ముప్పైరోజుల్లో కొన్ని నిబంధనలకు లోబడి ఖర్చు చేస్తేనే తన మూడు వేల కోట్ల ఆస్తి కొడుక్కి దక్కుతుందని కోటీశ్వరుడైన తండ్రి వీలునామా రాయడం యిందులోని ప్రధానేతివృత్తం. ఇదే సూత్రంతో బాలకృష్ణ కథానాయకుడుగా 'బాబాయ్ అబ్బాయ్', రజనీకాంత్ హీరోగా అరుణాచలం తమిళచిత్రం (తెలుగులో కూడా డబ్ చేయబడింది) వచ్చాయి. ఇలా తెలుగులో పాత తరానికి సంబంధించిన చిత్రాల మీదే యింతగా పడమటి గాలి ప్రసరిస్తే కొత్త చిత్రాల మూలాలు తవ్వితే ఆ జాబితాకు అంతుండదు. అందువల్ల కొన్ని సంచలన విజయాలు సాధించిన తెలుగు చిత్రాల గురించి మాత్రం తెలుసుకొందాం.

తెలుగువారికి గర్వకారణమైన ప్రతిష్ఠాత్మక చిత్రం 'శంకరాభరణం' కూడా చార్లీచాప్లిన్ 'లైమ్‌లైట్' స్ఫూర్తిగా తీసిందేనని సినిమా రచయిత కె.యల్. ప్రసాద్ అభిప్రాయపడ్డారు.[5] నాట్యం మీద అమితాసక్తి వున్న ఒక యువకళాకారిణి తనను ప్రోత్సహించిన వృద్ధ కళాకారుణ్ణి ఆదుకొని చరమాంకంలో అతని ప్రతిభాపాటవాల్ని రంగస్థలం పైకి యెక్కించగా అతను అదే వేదికమీద తనువు చాలించడం – ఈ రెండింటిలోని యితివృత్తం. జి.వి.అయ్యర్ 'హంస గీతే' కన్నడ చిత్రం, ఆదుర్తి సుబ్బారావు 'అమరసందేశం' తెలుగు చిత్రం కూడా యిలాంటి యితివృత్తాలతోనే నడిచి 'శంకరాభరణం' చిత్రానికి దారి చూపాయి. శంకరాభరణం మలయాళంలోకి డబ్‌చేసినప్పుడు కూడా విపరీతమైన ప్రాచుర్యాన్ని పొందిన వేటూరి కృతమైన తెలుగుపాటల్నే యథాతథంగా వినియోగించారు. హిందీలోనూ, కిందటేడు విడుదలైన తమిళ డబ్బింగ్‌లోను మాత్రమే 'శంకరాభరణం' పరాజయం పాలైంది.

---

**5. తెలుగు సినిమా కథ-విదేశీచిత్రాల ప్రభావం వ్యాసం-'తెలుగు సినిమా-భాష- వ్యాసావళిలో 57వ పుట.**

చిరంజీవి సినీజీవితాన్ని మలుపు తిప్పిన 'ఖైదీ' చిత్రానికి, భానుచందర్ 'యముడు' చిత్రానికి స్ఫూర్తి నిచ్చిన ఆంగ్ల చిత్రం 'ఫస్ట్ బ్లడ్'. అయితే ఆంగ్ల చిత్రాన్ని చిరంజీవికి అనుగుణంగా మలిచిన ఘనత మాత్రం పరుచూరి బ్రదర్స్‌కు దక్కుతుంది. ఆ సోదరుల కథనచాతుర్యంతో రూపుదిద్దుకొన్న హిట్ పిక్చర్ 'బొబ్బిలి రాజా' కు కూడా 'గాడ్స్ మస్ట్ బి క్రేజీ' అనే హాలివుడ్ చిత్రమే మూలమట! హాలివుడ్ దర్శకుడు 'ఫ్రాన్సిస్ ఫోర్డ్ కొప్పోలా' అందించిన అద్భుత చిత్రం 'గాడ్ ఫాదర్' ఆధారంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రతిభాషలోనూ చిత్రాలు వచ్చాయి. రామ్‌గోపాల వర్మ 'గాయం', కమలహాసన్ 'నాయకుడు' కూడా 'గాడ్ ఫాదర్' స్ఫూర్తితో సాకారమైనవే.

ఇటీవల తెలుగులో వచ్చిన కొన్ని హిట్ సినిమాలు పాశ్చాత్య చిత్రాలలోని ఒకటి రెండు సంఘటనల్ని తీసుకొని లేదా రెండు సినిమాల్లోని సన్నివేశాలను ముడివేసి రూపొందించినవి వున్నాయి. ఈ కోవకు చెందిన చిత్రాలకు అరుంధతి, మర్యాదరామన్న, జులాయి మొదలైన వాటిని వుదాహరణలుగా చెప్పవచ్చు. 'బస్టర్ కీటన్' స్వీయ దర్శకత్వంలో వచ్చిన హాలివుడ్ మూకీ 'అవర్ హాస్పిటాలిటీ' యిటీవల సునీల్ హీరోగా యస్.యస్. రాజమౌళి తీసిన 'మర్యాదరామన్న'కు ప్రేరణ. నాయిక తండ్రి తెలియకుండా నాయకునికి ఆశ్రయమిచ్చి, ఆ తర్వాత విషయం తెలుసుకొని గడపదాటితే అతణ్ని చంపేయాలని నిర్ణయించుకోవడం, నాయకుడు గడపదాటకుండా యింట్లోనే వుండి అనేక యెత్తులు వేసి ప్రాణాలు దక్కించుకోవడం... ఈ ప్రధాన సూత్రం మూలకథలోనిదే. తెలుగులో విజయవంతమైన ఈ సినిమా కన్నడ, తమిళ, మలయాళ, హిందీ, బెంగాల్ భాషల్లో 'రీమేక్' అయింది. హిందీలో తప్ప అన్ని భాషల్లోనూ హిట్టయింది. కోడి రామకృష్ణ అద్భుతసృష్టి 'అరుంధతి' లో పాశ్చాత్య సినిమాల నుంచి దిగుమతి చేసుకొన్న సన్నివేశాలున్నాయి. 'మార్షల్ ఆర్ట్స్' నేపథ్యంగా రూపొందిన 'హౌస్ ఆఫ్ ఫ్లయింగ్ డాగర్స్' (2004) అనే చైనా సినిమా నుంచి అరుంధతిలో 'డ్రమ్స్ డాన్స్' దృశ్యాన్ని తీసుకోగా, హాలివుడ్ హారర్ సినిమా 'ఫైనల్ డెస్టినేషన్' (2000) నుంచి అనుష్క కారులో పారిపోతూ రైల్వేలైన్ వద్ద యిరుక్కుపోయే సన్నివేశాన్ని వాడుకొన్నారు. అప్పటి కప్పుడు అన్ని విషయాలను మర్చిపోయే 'అంటెరోగ్రేడ్ ఆమ్నేసియా' అనే అరుదైన జబ్బుతో బాధపడే హీరో జరిగిన సంఘటలను తన శరీరంపై పచ్చబొట్టుగా పొడిపించు కొని భార్యపై అత్యాచారం చేసిన వారిపై పగ తీర్చుకోవడం అనే విలక్షణమైన కథాంశం గల 'క్రిష్టోఫర్ నోలన్' దర్శకత్వంలో విడుదలైన 'మెమెంటో' (2000) తమిళ, తెలుగు, హిందీ భాషల్లో

విజయవంతమైన 'గజిని' చిత్రానికి స్ఫూర్తిఅట! క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వంలోనే వచ్చిన 'డార్క్‌నైట్' (2008) చిత్రంలోని ప్రధాన సన్నివేశమైన బ్యాంక్ దోపిడీ (దోపిడీకి వచ్చిన పదిమందిలో ఒక్కడే మిగతా వాళ్లను తుదముట్టించి దోచుకున్న మొత్తాన్ని సొంతం చేసుకోవడం) ఆధారంగానే తెలుగులో త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా వచ్చిన 'జులాయి' చిత్రం రూపొందిందట! తమిళ దర్శకుడు ఎ.ఆర్. మురుగదాస్ చిరంజీవి, త్రిష హీరో హీరోయిన్స్‌గా తీసిన 'స్టాలిన్' చిత్రంలోని సహాయం చేసిన వ్యక్తి స్ఫూర్తితో ముగ్గురికి సహాయం చెయ్యడం ఆ ముగ్గురూ ఒక్కొక్కరూ మరో ముగ్గురికి సహాయం చెయ్యడమనే ప్రధాన సూత్రం'పేయిట్ ఫార్వర్డ్' అనే హాలీవుడ్ చిత్రంలో 'ట్రెవర్' అనే 7వ తరగతి విద్యార్థి ఆలోచన నుంచి తీసుకొన్నదేనట! హాలివుడ్ చిత్రం 'ఇండీసెంట్ ప్రపోజల్' ఆధారంగానే తెలుగులో యస్.వి. కృష్ణారెడ్డి 'శుభలగ్నం', గుణశేఖర్ 'సొగసు చూడతరమా' చిత్రాలు వచ్చినట్టు చాల మందికి తెలుసు. ఇలా చెప్పుకుంటూ పోతే యింకా యెన్నో యెన్నెన్నో! పైన చెప్పినవి కొన్ని మచ్చుతునకలు మాత్రమే!

జేమ్స్ కామరూన్ 'అవతార్' 'టైటానిక్', స్టీవెన్ స్పీల్‌బర్గ్ 'జురాసిక్ పార్క్' జపనీస్ దర్శకుడు 'అకిరా కురుసోవా' ఫైవ్‌మెన్ ఆర్మీ. డర్టీడజన్, సెవెన్ సమురాయ్ ('షోలే'కు స్ఫూర్తి నిచ్చినది) రషోమన్ మొదలైన దిగ్గంతులైన దర్శకుల అద్భుతచిత్రాలు ప్రపంచ వ్యాప్తంగా రికార్డులు నెలకొల్పి సినిమాకు యెల్లలు లేవని నిరూపించాయి. అలాగే జేమ్స్ బాండ్ సీరీస్, జాకీచాన్ సీరీస్, బ్రూస్‌లీ (ఎంటర్ ది డ్రాగన్ ఫేమ్) చిత్రాలు, గుప్తనిధుల అన్వేషణ గాథలు, కౌబాయ్ చిత్రాలు, హారర్ చిత్రాలు, చార్లీ చాప్లిన్ కళాఖండాలు సినిమా ప్రపంచమంతా ఒకటేనని రుజువు చేశాయి. అలాగే 'మాఫియా' అనే మాట సిసిలీ దేశం నుంచి వచ్చింది. మాఫియా సంస్కృతి నుంచే 'డాన్' అనే పదం కూడా పుట్టింది. క్రమంగా ఈ సంస్కృతి సకలభాషల చిత్రకథలకు వ్యాపించింది. ప్రపంచవ్యాప్తంగా మాఫియా సంస్కృతి మీద సినిమా తీయని భాషలేదు. నిర్మాత దర్శకుడు విశాల్ భరద్వాజ్ హిందీలో తీసిన షేక్సిపియర్ నాటకాలు మాక్బెత్ (మక్‌బూల్) ఒథెల్లో (ఓంకార), హేమ్‌లెట్ (హైదర్) విఠలాచార్య తెలుగులో తీసిన 'టేమింగ్ ఆఫ్ ది ష్రూ' (నిన్నే పెళ్లాడుతా) మొదలైనవి షేక్స్పియర్ నాటకాలు అన్ని భాషల్లోనూ సినిమాలుగా వచ్చాయనడానికి నిదర్శనాలు.

తెలుగు సినిమాలపై హిందీ బెంగాలీ చిత్రాల, బెంగాలీ నవలల ప్రభావం కూడా మొదటి నుంచీ వుంది. కుటుంబ కథాచిత్రాలు రాజ్యమేలిన కాలంలో శరత్ నవలల,

ఇతర బెంగాలీ నవలల అనువాదాలు (మద్దిపట్ల సూరి, చక్రపాణి మొదలైనవారివి) ఆధారంగా నిర్మించిన చిత్రాలు విజయవిహారం చేశాయనడానికి దాదాపు అన్ని భారతీయ భాషలలోను నిర్మించిన 'దేవదాసు' సినిమాయే నిదర్శనం. 'మనదేశం' (విప్రదాసు), 'వాగ్దానం' (వాగ్దత్త) 'దీక్ష' (రామేర్ సుమతి) మొదలైనవి శరత్ నవలలు ఆధారంగా వచ్చిన విజయవంతమైన తెలుగు చిత్రాలు కాగా – 'అర్ధాంగి' (మణిక్ లాల్ బందోపాధ్యాయ 'స్వయంసిద్ధ' నవల) 'మాంగల్యబలం' (ఆశాపూర్ణాదేవి 'అగ్ని పరీక్ష') వంటివి యితర బెంగాలీనవలల ననుసరించి తీసిన తెలుగు చిత్రాల కుదాహరణలు. తెలుగు చిత్రం 'ఇద్దరు మిత్రులు' బెంగాలీ చిత్రం 'తాషేర్ ఘర్' హక్కులు కొని తీసిందే. ఇంకా ఆరాధన, పక్కింటి అమ్మాయి వంటి బెంగాలీ రీమేక్‌లు కూడా ఆ కాలంలో ప్రేక్షకాదరణ పొందాయి. చక్రపాణి రాసిన మిస్సమ్మ (1955) కథకు కూడా రవీంద్రనాథ్ మైత్రా 'ఉదర నిమిత్తం' శరదిందు బెనర్జీ 'డిటెక్టివ్' నాటకాలను ముడిపెట్టి అల్లిన 'మన్మోయీ గర్ల్స్ స్కూల్' ఆధారమట.[6]

తెలుగులో దక్షిణభారత భాషల నుంచి వచ్చిన వాటిలో డబ్బింగ్ చిత్రాలు ఎక్కువ కాగా–హిందీ నుంచి స్ఫూర్తి నిచ్చినవి, పునర్నిర్మాణచిత్రాలు అధికం. బాలివుడ్ చిత్రాలు కొన్ని హిట్ ఫార్ములాలకు సంబంధించిన కథలతో యితర భారతీయ భాషాచిత్రాలకు మార్గదర్శకాలుగా నిలిచాయి. ఉదాహరణకు 'లాస్ట్ అండ్ ఫౌండ్' (మూలం హాలీవుడ్ చిత్రమే!) ఫార్ములా ఆధారంగా నిర్మించిన 'వక్త్', 'యాదోంకి బారాత్' 'అమర్ అక్బర్ అంథోనీ' మొదలైన వాటి అడుగుజాడల్లో తెలుగులో అనేక చిత్రాలు వచ్చాయి. చిన్నప్పుడు తప్పిపోయిన రక్తసంబంధీకులు పెద్దయిన తర్వాత విచిత్రమైన సన్నివేశంలో కలుసుకోవడమనే ఈ సూత్రం తోనే తెలుగులో 'అన్నదమ్ముల అనుబంధం' 'రామ్ రాబర్ట్ రహీం' వంటి చిత్రాలను నిర్మించారు. అలాగే 'జంజీర్' 'దీవార్' వంటి అమితాబచన్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రాలు తెలుగులో పగ ప్రతీకారాలతో రగిలే వీరావేశం గల నాయకపాత్రలు (ఎక్కువగా ఎన్.టి.ఆర్) వున్న సినిమాలు రావడానికి దోహదం చేశాయి. తెలుగులో శోభన్ బాబు హీరోగా వచ్చిన 'కక్ష' కూడా (1980) షోలే స్ఫూర్తితో నిర్మించిందే. మోహమూద్ నిర్మించిన 'బోంబే టు గోవా' (మాతృక 'మద్రాసు టు పాండిచ్చేరీ' తమిళ చిత్రం) తెలుగులో 'మద్రాసు టు హైదరాబాద్', 'బంగారు పిచిక', 'మీ శ్రేయోభిలాషి', 'గమ్యం', 'జర్నీ' వంటి రోడ్ మీద కథలకు దారి చూపింది. ఇంకా 'బాబీ' వంటి కుర్రకారును

6. భరాగో 'మరో నూట పదహార్లు'–పుటలు 98, 99.

వెర్రెక్కించిన చిత్రాలు తెలుగులో 'నువ్వే కావాలి' (2000) తో ప్రారంభమైన నేటి వరకు విశృంఖల విహారం చేస్తున్న 'టీనేజ్ లవ్' కథలకు ప్రేరణ నిచ్చాయి. ముఖ్యంగా హిందీలో వచ్చిన 'బైజు బావరా' తదితర సంగీత ప్రధానమైన చిత్రాలు తెలుగులో 'అమరసందేశం' (1954) నుంచి నేటివరకు అనేక సంగీత నృత్య ప్రధానమైన చిత్రాలు రావడానికి దోహదం చేశాయి.

తెలుగులో డబ్బింగ్ చిత్రాలు తొలిదశలో హిందీ నుంచే యెక్కువగా పరివర్తిత మయ్యాయి. అలాగే అప్పటి నుంచి యిప్పటి వరకు తెలుగుచిత్రాలు కూడా హిందీలోకి తర్జుమా అవుతున్నాయి. తెలుగు తమిళాలలో తీసిన ద్విభాషాచిత్రాలను ఆ తర్వాత హిందీలో తీసిన సందర్భాలు కూడా అనేకం. తెలుగు హిందీ భాషలలో అటు యిటు మారిన విచిత్ర చిత్ర విశేషాలు కూడా వున్నాయి. ఉదాహరణకు 'బ్రతుకు తెరువు' (1953) ఆధారంగా హందీలో 'జీన్ కి రాహే' తీస్తే మళ్లీ దాన్ని ఆధారం చేసుకొని తెలుగులో 'భార్యాబిడ్డలు' తీశారు. 'పడోసన్' హిందీ చిత్రానికి మాతృక వంగ నవల. అది బెంగాలీలో సినిమాగా వచ్చిన తర్వాత తెలుగు ('పక్క యింటి అమ్మాయి' –1953) తమిళాలలో పునర్నిర్మించారు. తమిళచిత్రం హక్కులు కొని సునీల్ దత్, సైరాబాను, కిషోర్ కుమార్, మహమూద్ తారాగణంగా హిందీలో మెహమూద్ 'పడోసన్'ను తీశాడు. అది తిరిగి తెలుగులో చంద్రమోహన్, జయసుధ, బాలసుబ్రహ్మణ్యం నటించిన 'పక్కింటి అమ్మాయి' (1981) గా వచ్చింది. హిందీలో కిషోర్ కుమార్ పాత్రను తెలుగులో యస్.పి. బాలసుబ్రహ్మణ్యం సమర్థంగా పోషించారు. 'రాముడు–భీముడు' సినిమా మలుపులు కూడా యిలా చిత్రమైనవే. సురేష్ ప్రొడక్షన్స్ వారి మొదటి చిత్రం 'రాముడు–భీముడు' హక్కులు ఆ కథారచయిత అయిన డి.వి. నరసరాజు దగ్గర వాహినీఅధినేత నాగిరెడ్డి కొని హిందీలో దిలీప్ కుమార్ హీరోగా 'రామ్ ఔర్ శ్యామ్' తీశారు. ఆయన అంతకు ముందు తమిళంలో అదే కథను యం.జి.ఆర్. హీరోగా 'ఎంగవీట్టు పిళ్లై' గా తీశారు. 'రామ్ ఔర్ శ్యామ్' విడుదలయిన మూడు నాలుగేళ్లకు ఆ చిత్రం స్ఫూర్తితో హీరో డ్యూయల్ రోల్‌ను హీరోయిన్ (హేమమాలిని) డ్యూయల్ రోల్‌గా మార్చి జి.పి. సిప్పి 'సీతా ఔర్ గీతా'ను హిందీలోనే తీశారు. అది పెద్ద హిట్ కావడంతో అది ఆధారంగా నాగిరెడ్డి తిరిగి వాణిశ్రీ ద్విపాత్రాభినయంతో తెలుగులో 'గంగ–మంగ' పేరుతోను తమిళంలో 'వాణి–రాణి' పేరుతోను తీశారు.[7]

**7. తెర వెనుక కథలు – పుటలు 43, 44.**

ఇలాంటి వినియోగాలకు సంగీతం కూడా మినహాయింపు కాదు. సంగీతానికి భాష అడ్డుగోడ కానే కాదు. సుందర్‌లాల్ నహతా వంటి నిర్మాతలు, సత్యం వంటి సంగీత దర్శకులు హిందీ బాణీల మీద మక్కువతో తెలుగులో వాటిని కోకొల్లలుగా దించేశారు. ఇలాంటి అనుసరణకు కొన్ని ఉదాహరణలు–

**1. హమ్ తుమ్ ఏక్ కమరే మె బంద్ హో... (బాబీ)**
**మంగమ్మా, నువ్వు ఉతికెతె అందం... (జమీదారుగారి అమ్మాయి)**

**2. హమ్ కాలేహైతో క్యాహువా దిల్ వాలేహై... (గుమ్‌నామ్)**
**నా షోలాపూరు చెప్పులు పోయాయి... (ముద్ద మందారం)**

**3. లేకే పహలా పహలా ప్యార్... (సి.ఐ.డి.)**
**ఓహో బస్తీ దొరసాని, బాగా ముస్తాబయ్యిందీ... (అభిమానం)**

**4. మేరే సప్‌నోంకి రాణీ కబ్ ఆయేగీ తూ... (ఆరాధన)**
**నిన్ను రోడ్డు మీద చూసినది లగాయతు... (అల్లరి అల్లుడు)**

**5. కహీదీప్ జలే, కహీదిల్... (బీస్ సాల్ బాద్)**
**నిను వీడని నీడను నేను... (అంతస్తులు)**

ఇలా వరసలకే పరిమితం కాకుండా భావాలను కూడా అనుసరించినవి యెన్నో! తెలుగు బాణీలను హిందీ చిత్రాల్లో అనుసరించిన, యిప్పటికీ అనుసరిస్తున్న సందర్భాలు కూడా అనేకం. ఉదాహరణకు 'రోజులు మారాయి' చిత్రంలోని 'ఏరువాక సాగరో రన్నో చిన్నన్నా' అనే సుప్రసిద్ధ గీతం బాణీలో 'బొంబై కా బాబూ'లో[8] యస్.డి. బర్మన్–

**'దేఖనే మే భోలా హై దిల్ కా సలోనా,**
**బొంబయ్ సే ఆయాహై బాబూ చిన్నన్నా'**

అనే పాటను స్వరపర్చారు. అలాగే ధనుష్ రచించి స్వరకల్పన చేసిన – 'త్రి' చిత్రంలోని 'కొలవరి కొలవరి కొలవరి డి' అనే పాట దేశవ్యాప్తంగానే గాక ప్రపంచ వ్యాప్తంగా సినీప్రియులను సమ్మోహితులను చేసింది.

దక్షిణభారత భాషల్లో ఒక భాషలో వచ్చిన చిత్రాన్ని మరో భాషలో వినియోగించు కొనేటప్పుడు యెక్కువగా తర్జుమాలకు, పునర్నిర్మాణాలకు ప్రాధాన్యమిచ్చారు. స్ఫూర్తులూ, చౌర్యాలూ తక్కువ.

---

8. వి.ఎ.కె. రంగారావు సమాచారం.

ఒక రకంగా పైన ప్రస్తావించిన స్ఫూర్తుల, పరావర్తనల, కొండొకచో చౌర్యాల... వివరణ శాఖాచంక్రమణంలా అనిపించినా దానికి ప్రయోజనం వుంది. నేడు వైజ్ఞానిక ఫలితాలు లాగే మంచి సినిమాలు కూడా అందరి సంపదగా పరిగణింపబడుతున్నాయి. ప్రపంచంలో ఏ భాషలో ఏ మంచి చిత్రం వచ్చినా, ఏ పాటబాణీ పండినా వాటిని మిగతా భాషలు అనుసరిస్తున్నట్టే తెలుగు చిత్రపరిశ్రమ కూడా ఆ బాటలోనే పయనిస్తోంది. యిలా హాలివుడ్ బాలివుడ్, యితర భారతీయ భాషాచిత్రాల్లోని మంచి విషయాలను మెరుపులనూ సొంతం చేసుకొని తెలుగువాళ్లకు అందించడానికి టాలివుడ్ అనుసరిస్తున్న మార్గాల్లో 'డబ్బింగ్' అనేది ఒకటనీ, ఆ మాటకొస్తే అది యెటువంటి అభియోగాలకూ ఆక్షేపణలకూ ఆస్కారం లేని బహుచక్కని రాజమార్గమనీ, ప్రపంచీకరణ సాధనాల్లో అత్యంత ప్రజాదరణ కలిగిన సినిమా శక్తిమంతమైన వుపకరణమనీ – చెప్పడానికి పై విషయాలనన్నిటినీ ఏకరువు పెట్టవలసి వచ్చింది!

❖

ఈ అధ్యాయంలో

సమాచార సేకరణకు వుపయోగపబడిన రచనలు, ప్రసంగాలు-

1. 116 గొప్ప తెలుగు సినిమాపాటలు - భ.రా.గో.
2. మరో నూట పదహార్లు (1940-85) - భ.రా.గో.
3. తెర వెనుక కథలు - డి.వి. నరసరాజు.
4. బాలివుడ్ క్లాసిక్స్ - మహమ్మద్ ఖదీర్ బాబు.
5. తెలుగు సినిమాపాట చరిత్ర - పైడిపాల.
6. తెలుగు సినిమా కథ - విదేశీ చిత్రాల ప్రభావం - కె.ఎల్. ప్రసాద్ వ్యాసం.
   తెలుగు సినిమా - భాష - వ్యాసావళి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
7. 'ఆ సీన్-ఈ సీన్' శీర్షిక - బి. జీవన్‌రెడ్డి-సాక్షి ఫన్‌డే (మే 2015 నుండి)
8. ఫోన్‌లో వి.ఎ.కె. రంగారావు సమాచారం.
9. ఫోన్‌లో టి. రాజగోపాల్, మేనేజర్, యస్.బి.ఐ (రి) - తిరుపతి సమాచారం.

# తొలితెలుగు డబ్బింగ్‌చిత్రాలు

తొలితెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద' విడుదల తేదీ (6-02-32) యిటీవల సోపపత్తికంగా నిరూపించబడినా, చిత్ర పరిశ్రమ మాత్రం పుట్టినతేదీ మార్పును ఓ పట్టాన అంగీకరించలేక యింకా ఆ తేదీని సెప్టెంబరు 15, 1931 గానే పరిగణించి, తత్సంబంధమైన వుత్సవాలను దాని కనుగుణంగానే నిర్వహిస్తోంది. అదృష్టవశాత్తూ తెలుగులో తొలి డబ్బింగ్ చిత్రం ఆహుతి విడుదల తేదీ (22-6-50) గురించి మాత్రం యిలాంటి వివాదాలు లేవు. ఆ మాటకొస్తే తెలుగులో డబ్బింగ్ చిత్రాల ఆవిర్భావ వికాసాల గురించి యెవరికీ అంతగా అవగాహనా, ఆసక్తీ వున్నట్టు కనిపించదు. నిజానికి తెలుగు చలనచిత్ర వికాసంలో డబ్బింగ్‌చిత్రాల పాత్ర కూడా తక్కువేం కాదు. సంఖ్యాపరంగా కూడా 2010 నాటికి తెలుగులో నేరుగా విడుదలయిన చిత్రాలు సుమారు 5500 అయితే డబ్బింగ్‌చిత్రాల సంఖ్య 2300. ఇతర భాషల్లో డబ్బింగ్ చిత్రాల నిర్మాణం ఆరే ళ్ళు ముందుగానే ప్రారంభమైనా తెలుగులో తొలి టాకీ వచ్చిన పద్దెనిమిదేళ్ళ తర్వాత గాని డబ్బింగ్ చిత్రం పురుడు పోసుకోలేదు.

హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల నుంచి ప్రధానంగా తెలుగులో డబ్బింగ్ చిత్రాలు వచ్చాయి. ఒరియా నుంచి కూడా తెలుగులో డబ్బింగ్ ప్రారంభమైన మొదటి అయిదేళ్ళలోనే తొలిచిత్రం వచ్చినా, ఆ తర్వాత ఆ భాషాచిత్రాల మీద తెలుగు నిర్మాతలు మక్కువ చూపించలేదు. తెలుగులో మరాఠీ చిత్రాలు కూడా 'డబ్' చేశారని, వాటిలో జ్ఞానేశ్వర్ (1963) మొదటిదని కొందరు సినీ పండితులు అభిప్రాయపడ్డారు. కాని జ్ఞానేశ్వర్‌ను 1940 ప్రాంతంలో హిందీలో ప్రభాత్‌వారు నిర్మించగా దానిని 1963లో వి.యస్.యస్.ఫిలిమ్స్, విజయవాడవారు (నిర్మాత వి.యస్.యస్. చెట్టియార్) తెలుగులోకి డబ్ చేసి విడుదల చేసినట్టు ఆంధ్రప్రభ (21-7-63) రూపవాణిలో వచ్చిన జ్ఞానేశ్వర్ సమీక్ష నుంచి స్పష్టమైన ఆధారం లభించింది. 'ఫత్తేలాల్', 'థామ్‌లే'ల దర్శకత్వంలో నిర్మించిన హిందీ చిత్రానికి సంగీత దర్శకుడు 'భోలే'. ఇది మహారాష్ట్రకు చెందిన గొప్ప

సంస్కర్త, భక్తుడు అయిన జ్ఞానేశ్వర్ కథ గనుక, చిత్రంలో మహారాష్ట్ర గ్రామవాతావరణం చక్కగా చిత్రీకరింపబడడం వల్ల తెలుగులో జ్ఞానేశ్వర్‌కు మాతృక మరాఠీ చిత్రమని కొందరు పొరబడ్డారు. పై అయిదు భాషల నుంచి పరివర్తితమైన చిత్రాల్లో మాటలతో పాటు పాటలు కూడా చోటు చేసుకోగా 'జురాసిక్ పార్క్' (1995)లో పాటలు లేని ఆంగ్లచిత్రాల తర్జుమా కూడా తెలుగులో ఆరంభమైంది. ఇంగ్లీషు డబ్బింగ్ చిత్రాలకు ఆద్యుడైన వెన్నెలకంటి యిటీవల చైనా భాష నుంచి కూడా 'నింగీ నేలా నాదే' (విడుదల 3-7-2009) అనే చిత్రాన్ని కూడా తెలుగు చేశారు. దానిలో వున్న ఒకే ఒక పాటను మూలంలోని బాణీతో సంబంధం లేకుండా చంద్రబోస్ రాశారు. తెలుగులో వివిధభాషల నుంచి పరివర్తితమైన పాటలున్న తొలి డబ్బింగ్‌చిత్రాల వివరాలను, వాటిలోని కొన్ని పాటల విశేషాలను తెలుసుకొందాం.

**ఆరంభచిత్రం ఆహుతి :**

ఆర్.యస్.జున్నార్కర్ నిర్మించిన 'నీరా ఔర్ నందా' హిందీ చిత్రం 1-1-1946 మంగళవారం నాడు విడుదలయింది. రూప్ బసంత్, శశి, జయసింహ, జి.షాహుకార్, నిశి బరణ్, చంద్రకాంత్ దేశాయ్, బేబీ నసీమ్ మొదలైన వారు ఇందలి పాత్రధారులు. యస్. జగన్నాథ్ పర్యవేక్షణలో నిర్మింపబడిన ఆహుతి తెలుగు చిత్రానికి యస్. రాజేశ్వరరావు సంగీతాన్ని సమకూర్చారు. హిందీ బాణీలను యథాతథంగా వినియోగించకుండా వాటిలోని లయను[1] మాత్రం ఆధారం చేసుకొని రాజేశ్వరరావు తెలుగులో స్వతంత్రమైన బాణీలను కట్టగా- వాటికి శ్రీశ్రీ సాహిత్యాన్ని సృజించారు. అందువల్ల ఈ పాటలు పూర్తిగా డబ్బింగ్ కోవకి చెందినవని చెప్పలేం. ఆర్. బాలసరస్వతీ దేవి, ఘంటసాల, టి. కనకం ఈ చిత్రంలోని పాటలను గానం చేయగా పి. సుందరమ్మ, టి.కనకం, మాధవపెద్ది సత్యం, కె. నరసింహారావు, కె. బలరాం పాత్రధారులకు గాత్రదానం చేశారు. ఆర్కెస్ట్రా సుబ్బరామన్ పార్టీది.

సంఘ సంక్షేమానికి బలైన ప్రేమికుల కథ అనే వుపశీర్షికతో తెలుగులో విడుదలయిన 'ఆహుతి' కథాసంగ్రహాన్ని చూద్దాం. ఇదొక బెస్తపల్లెకు సంబంధించిన కథ. ఆ వూరిపెద్దయిన చలపతి నాయకత్వంలో ఒక పద్ధతిలో నడుస్తున్న ఆ వూళ్లో అతని బావమరిది దానయ్యకు గ్రామసమీపంలో వుండే సముద్రంలోని ముత్యాల మీద

1. తాళమని వి.ఎ.కె. అభిప్రాయం.

ఆశ పుట్టింది. వాటి కోసం సముద్రంలోకి వెళ్లి సొరచేపలకు చిక్కి, ఎలాగో తప్పించుకొని తిరిగి వచ్చాడు. ముత్యాల విషయం బట్టబయలైతే ఆ గ్రామస్థుల్లో స్వార్థం పెరిగి కట్టు తప్పుతారని భయపడి చలపతి ఆ రహస్యం యెవరికీ చెప్పనని బావమరిది చేత ప్రమాణం చేయించుకొని ప్రాణం విడుస్తాడు. కాని ఆ రహస్యాన్ని తలుపు చాటు నుంచి విన్న కథానాయకుడు నందాయ్ తన ప్రేయసి, దానయ్య పెద్దకూతురు అయిన నీరాను సంతోషపెట్టడం కోసం సముద్రమంతా గాలించి ముత్యాలను సాధించి తెస్తాడు. వాటిలో ఒక ముత్యం చలపతి కొడుకు సన్నాసి కంట పడుతుంది. దుర్మార్గుడైన సన్నాసి దానయ్య రెండో కూతురు బుచ్చిని మోసం చేసి తన వల్ల నెల తప్పిన ఆమెను ముత్యాల స్థావరం తెలుసుకొని రాకపోతే పెళ్లాడనని బెదిరిస్తాడు. బుచ్చి అవివాహితగా గర్భవతయి తన కుటుంబం పరువు తీసిందని దానయ్య నిందిస్తాడు. అప్పుడు నందాయ్ అడ్డుపడి ఆ యింటిపరువు కాపాడ్డం కోసం నీరామీద వున్న ప్రేమను త్యాగం చేసి బుచ్చిని పెళ్లి చేసుకొంటాడు. ప్రియునికి దూరమైన నీరా సన్నాసి బారినుంచి తన తండ్రిని కాపాడ్డానికి ఆ దుర్మార్గుడితో పెళ్లికి సిద్ధపడుతుంది. కాని పెళ్లయినా మనసు మార్చుకోలేని నీరా సన్నాసి నుంచి తన శీలాన్ని రక్షించుకోడానికి ఆత్మహత్య చేసుకోగా, నందాయ్ ఆమె జ్ఞాపకాలతో పిచ్చివాడవుతాడు.

ఇలా వూరి కట్టుబాటు కోసం ఆహుతయిన ప్రేమికుల త్యాగమయ విషాదాంతకథ, చిత్రంలోని వినసొంపైన పాటలు ఆనాటి ప్రేక్షకులను ఆకట్టుకొన్నాయి. మొత్తం సినిమాను ఔట్‌డోర్‌లో చిత్రీకరించడం యీ చిత్రం ప్రత్యేకత!

ఈ చిత్రంలో గ్రామఫోను పాటతో సహా మొత్తం తొమ్మిది పాటలున్నాయి. పాటలన్నిటినీ శ్రీశ్రీయే రాశారు. 1940లో విడుదలైన 'కాలచక్రం' తెలుగుచిత్రంలో 'మహాప్రస్థానం' లోని కవిత నొకదానిని వినియోగించినా సినీరచయితగా తన పేరును తెరకెక్కించిన తొలి చిత్రం 'ఆహుతి' యేనని శ్రీశ్రీ స్వయంగా రాశారు. ఈ చిత్రంలో ఏడు పాటలను ఆర్. బాలసరస్వతి, ఘంటసాల ఆలపించగా – ఒక పాటను 'బుచ్చి' పాత్ర కోసం టి. కనకం పాడారు. కథాక్రమంలో మొదటి రెండుపాటలు ఆనాటి ప్రేక్షకులను వుర్రూతలూగించాయి–

**మొదటి పాట:**

**హంసవలె ఓ పడవా ఊగుచురావే ఊగుచురావే**

**అలల మీద మైమరచీ హంసవలె ఓ పడవా ఊగుచురావే**

1. వయ్యారి నడలదాన అందాచందాల దాన
నెరవెన్నెల లొలికించే రూపురేఖ లలరుదాన
ఆటలకీ పాటలకీ పెట్టిన పేరైన దాన.. ॥హంస॥

2. పర్వతాల గాలులివే నింపెను తెరచాపలా
సాగరాల దారుల్లో స్వారి చేసినావటే
రేయి గడచిపోయెగదా, రేవున కిక రావటే ॥హంస॥

3. ఆ...ఆ...ఆ... హంసంటే హంసనీరా హైలేస హైలే హైలే
దాని మీద మనసుపోయె హైలేస హైలే
ప్రేమ నేరని వాడవురా నాపై వగలూనకురా
చక్కని ఈ లోకమున చల్లని ఈ తీరానా
జీవనమే హాయి సఖీ, ఆశయ మొకటాయె చెలీ ॥హంస॥

4. ఎల్లరి యెడ ఎల్లయెదల స్నేహం కలిసీ
ప్రేమ సూత్రమే మనల ఒకటిగ నిలిపే
ప్రాణమునకు ప్రాణముగా భావించెద నిన్నె సదా ॥హంస॥

బాల సరస్వతి ఘంటసాల బృందం ఆలపించిన ఈ బృందగీతం మొదటి భాగం పడవ అందచందాలకు సంబంధిం చినది కాగా – రెండవ భాగం నీరానందాయ్‌ల ప్రణయసంబంధి. శ్రీశ్రీ స్వేచ్ఛగా రాసిన ఈ గీతశైలి సరళంగా వుండడం వల్ల పాట ప్రాచుర్యాన్ని పొందింది. ఈ పాట విషాదచ్ఛాయ చివరిలో నాయికకు బాల సరస్వతి పాడిన – 'ఊగిసలాడే నయ్యా, పడవా ఊగిసలాడే నయ్యా' పాటలో కనిపిస్తుంది.

రెండవ పాట:

ప్రేమయే జనన మరణ లీలా
మృత్యుపాశమే అమర బంధమా
యువ ప్రాణుల మ్రోలా... ॥ప్రేమయే॥

1. ఆకాశమే చేరువయై తోచే
అలలే పొంగి హాయిగ వీచే
జీవితమంతా ఒకే పాటగా
ఎప్పటికీ మనమే పాడుచూ

ఎప్పటికీ మనమే ॥ప్రేమయే॥

2. మధుర మధురతరమైన వాంఛలే
హృదయ సదనమును పరిపాలించే
సుకృత జన్మము మాది సఫలం
సుకృత జన్మము మాదే సఫలం
సుఖమే ఏ వేళా, సఫలం సుఖమే ఏ వేళా ॥ప్రేమయే॥

ఇది నీరానందాయ్‌ల అచంచల ప్రేమకూ, ప్రణయతత్త్వానికీ అద్దం పట్టిన యుగళగీతం. ఇది తిరిగి చివరిలో విషాద యుగళగీతంగా వినిపిస్తుంది. ఈ రెండింటితో పాటు యీ చిత్రంలోని మిగతా పాటలు కూడా ప్రజాదరణను పొందాయి. 'ఆహుతి' చిత్రంలోని పాటలు ప్రజాదరణ పొందడానికి సాలూరి వారి బాణీలు దోహదం చేశాయని శ్రీశ్రీ వినయంగా తెలియజేశారు.

ఈ చిత్రం యితర భాషల నుంచి తెలుగులో చిత్రాలను 'డబ్' చేసే సాహసానికి మార్గదర్శకమైంది. మొదటి మూడేళ్లలో తెలుగులో డబ్బింగ్ చిత్రాలు రెండు మూడు చొప్పున విడుదలయినా, ఆ తర్వాత ఆర్థికసౌలభ్యం దృష్ట్యా వీటి జోరు పెరిగింది. డబ్బింగ్ రచనలో ప్రాచార్యుడిగా శ్రీశ్రీ ఆ రంగంలో చిరస్మరణీయులయ్యారు.

## మొదటి డబ్బింగ్ తమిళచిత్రం?

ఆహుతి విడుదలయిన సంవత్సరమే తమిళ కన్నడ భాషలలో ఏకకాలంలో నిర్మింపబడిన చారిత్రాత్మక చిత్రం 'రాజా విక్రమ' తెనిగింపబడిన మొదటి తమిళచిత్రమని కొందరి అభిప్రాయం. తమిళచిత్రం 'రాజా విక్రమ' పేరుతోను, కన్నడచిత్రం 'శనీశ్వర మహాత్మే' పేరుతోనూ నిర్మింపబడి 29-11-50న సెన్సారయి, అదే రోజున విడుదలయ్యాయి. తెలుగులో 'రాజా విక్రమ్' పేరుతో 'డబ్' చేసినట్టు కొందరు అభిప్రాయపడ్డం వల్ల, అది 'రాజా విక్రమ'కు దగ్గరగా వుండడం వల్ల తెలుగులో తమిళమాతృక నుంచి డబ్ చేసి వుంటారని వారి వూహాగానం. అయితే ఈ చిత్రం తమిళ కన్నడ భాషలలోనే సరిగా ఆడలేదు గనుక, దీనిని తిరిగి తెలుగులో డబ్ చేసే అవకాశం లేదని ఫిల్మ్‌న్యూస్ ఆనందన్ అభిప్రాయం[2]. తెలుగు చిత్రానికి సంబంధించిన ఎలాంటి సమాచారమూ, పాటల పుస్తకమూ లభించకపోవడం ఈ వాదాన్ని బలపరుస్తోంది.

1. 22-6-15న ఫిల్మ్‌న్యూస్ ఆనందన్‌తో ముఖాముఖి.

కన్నడ నిర్మాత దర్శకుడు కెంపరాజ్ ఈ చిత్రంలో ప్రధానపాత్రను ధరించగా రాజమ్మ, జయమ్మ, పండరీబాయి నాయికలుగా నటించారు. తమిళ చిత్రానికి ఎ.యం. నటరాజ కవి పాటలను సమకూర్చారు.

ఆనందన్‌తో పాటు చలనచిత్ర చారిత్రకవికాసం తెలిసిన యితరులు కూడా 'రాజావిక్రమ్' తెలుగులో తర్జుమా అయిన దాఖలాలు లేవని తమ జ్ఞాపకాలను వెల్లడించడం వల్ల 1952లో తెలుగులో 'డబ్' చేసిన నేషనల్ ప్రొడక్షన్ వారి 'సింగారి'యే తెలుగులో తొలి తమిళ డబ్బింగ్ చిత్రంగా భావింపవలసి వస్తోంది. ఇది నేషనల్ ప్రొడక్షన్ వారు తమిళంలో 'సింగారి' పేరుతో నిర్మించి 19-10-51న విడుదల చేసిన వినోదాత్మక చిత్రం. తంగవేలుకి ఈ చిత్రంలోని 'నాట్యాచార్య' పాత్ర ద్వారానే హాస్యనటుడిగా గుర్తింపు వచ్చింది.

తమిళంలో 'సింగారి'కి వి.యస్. సంబంధం కథ, మాటలు రాయగా, తంజై రామయ్యదాస్, కణ్ణదాసన్, కె.పి. కామాక్షి పాటలను సమకూర్చారు. సంగీత దర్శకుడు యస్.వి. వెంకట్రామన్. లలిత, పద్మిని, రాగిణి, టి.ఆర్. రామచంద్రన్, యస్.వి. సహస్రనామం, డి.బాలసుబ్రహ్మణ్యం, తంగవేలు తదితరులు ప్రధాన తారాగణం. తెలుగులో మాటలు, పాటలు బలిజేపల్లి లక్ష్మీకాంతకవి, గిడుతూరి సూర్యం సమకూర్చగా ఎ.యం. రాజా, కె.హెచ్.రెడ్డి, పి.లీల, ఎ.పి.కోమల, రాణి, సరళ నేపథ్యగీతాలను ఆలపించారు.

'సింగారి' నాట్యం ప్రధానాంశంగా గల రెండు జంటల ప్రేమకథ. శివప్రకాశం అభ్యుదయభావాలు గల విద్యా వంతుడైన యువకుడు. పూర్వాచార పరాయణుడైన తండ్రి నారాయణమూర్తిని కాదని వున్నత విద్యాభ్యాసం కోసం విదేశాలకు వెళ్తాడు. అతణ్ని ఆపడానికి వేగంగా వెళ్తున్న నారాయణమూర్తి కారు కింద రంగమ్మ అనే పేదపిల్ల పడుతుంది. నారాయణమూర్తి ఆ పిల్లను యింటికి తీసుకెళ్లి పద్మిని అనే పేరుపెట్టి పెంచుతుంటాడు. బడిలో పద్మినికి చెల్లం అనే స్నేహితురాలుంటుంది. నారాయణమూర్తి కొడుకు మీద బెంగతో యిల్లువిడిచి తీర్థయాత్రలకు వెళ్తాడు. ఏడు సంవత్సరాలు గడిచాయి. కళాశాల వార్షికోత్సవంలో చెల్లం, పద్మిని నాట్య ప్రదర్శనలో పాల్గొంటారు. ఆ సందర్భంగా చెల్లం ప్రదర్శన చూసి ముగ్ధుడైన నాటకసభ యజమాని నిత్యానందం ఆమెను తన కంపెనీలో చేర్చుకుని 'సింగారి' అనే పేరుపెట్టి, నాట్యంలో శిక్షణ యిప్పించి ఆ కళలో ప్రవీణురాల్ని చేస్తాడు. సింగారి పెద్దపెద్ద నగరాల్లో నాట్య ప్రదర్శన లిచ్చి ప్రసిద్ధురాలవుతుంది.

విదేశాల నుంచి తిరిగి వచ్చిన శివప్రకాశం తన తండ్రి ఆశ్రయమిచ్చిన పద్మినిని చూసి మనసు పడతాడు. పద్మిని కూడా శివప్రకాశాన్ని ప్రేమిస్తుంది. సింగారి కూడా శివప్రకాశాన్ని ప్రేమించి నాట్య ప్రదర్శన లివ్వడం మానుకొంటుంది. ఒకరోజు సింగారి స్థానంలో పద్మిని నాట్యానికి వెళ్లడం చూసి శివప్రకాశం ఆమెను దుర్భాషలాడ్డంతో ఆమె అలిగి యిల్లు విడిచి వెళ్లిపోతుంది. ఆ తర్వాత అపార్థాలూ అపోహలతో కథ మలుపులు తిరిగి చివరకు శివప్రకాశం–పద్మిని, నిత్యానందం–సింగారి పెళ్లిళ్లతో సుఖాంతమవుతుంది. బడిలో చదువుకొనేటప్పటి నుంచి అక్కచెల్లెళ్లుగా ఆప్యాయంగా మెలగిన పద్మిని, సింగారి నిజంగా అన్నదమ్ముల పిల్లలని చివరిలో తెలుస్తుంది.

అ కథలో అనేక వుపపాత్రలతో హాస్యరసాన్ని మేళవించిన దర్శకుడు చిత్రాన్ని వినోదభరితంగా తీర్చి దిద్దాడు. ఈ చిత్రంలో ఒకటి రెండు పాటలు మినహా మిగిలినవి వాచ్యంగా డబ్బింగ్ మూసలో వున్నట్టనిపిస్తాయి. ఉదాహరణకు కాక, జిమికి అనే హాస్యపాత్రల మధ్య నడిచిన మొదటి పాటను చూద్దాం –

**కాక : ఆవో మహరాజ్ పైనే భగవాన్**
**క్రిందే మనుషులండోయ్**
**జిమికి : ఆ మనుషులు పదిమాసాల్లో పుడుతుంటారోయ్**
**కా : ఉప్పర్‌కి షావుకార్ వసిస్తారండోయ్**
**జి : వట్టినేలనే మనం పడుండాలోయ్**
**కా : ఆళ్లు ఓవల్ వింటోలు మింగుతారోయ్**
**జి : ఈళ్లకే ఒక కవళం బువ్వాకు**
**కా : తదిగిణతోం అయిపోయిందోయ్**
**జి : ఒకజాన్, ఒకజాన్**

**కా : ఒకజాన్ కడుపే లేదంటే**
**ఈ లోకాన లేదు గలాటే**
**కూటికి కరువే లేదంటే మన**
**ఉసురు లాగునా పరోట**

**జి : పచ్చతొండ వోలె ధనంపోయి మరుంగున దాగె**
**పటాటోపం లేదంటే ఒక పైసా వశమయ్యేనా...**

ఎంత హాస్యగీతమైనా పదప్రయోగాన్ని బట్టి పాటనడక కుంటుపడినట్టు గమనిస్తాం. మిగతా పాటల్లో కూడా చాల వరకు యిటువంటి కృతకశైలియే కనిపిస్తుంది. మొత్తం 14 పాటల్లో పద్మినీశివప్రకాశాల మీద చిత్రీకరించిన యుగళగీతం మాత్రం వీటికి భిన్నంగా తెలుగుదనంతో కొంత మేలుగా వుంది.

**శివ : ఇరు మనుసులు మాటాడే విరాళి**
**మౌనమె పేరే ప్రేమయా?**
**ప : విరి కమ్మని తేనియకై తుమ్మెద**
**ఝుమ్మను పాటే ప్రేమయా?**
**శివ : కనుసన్నల భావాలే తమంత**
**కలిసే మమతే ప్రేమయా**
**ప : ఎలకోయిల వసంతుని**
**మంగళరుతి పాడేదెందులకో**
**మయూరి మొయిలు గని రమించి**
**ఆడే ఆటే ప్రేమయా**
**శి : నెలతేని వెలుంగున చెంగలువ**
**గిలిగింతలు వారే దెందులకో**
**ప : స్వరరాగ సుధాగీతి విధాన**
**లీనంబగుటే ప్రేమయా?**

మరో పాటలో 'తెలుగుల నుడి చవుల్ విలసిల్లు సుకవిత' 'తెలంగాణ విజ్ఞాన మింపారు' వంటి పంక్తుల వల్ల కవి వీలయిన చోట్ల తెలుగుదనాన్ని, ప్రాంతీయభావాల్ని తీసుకురావడానికి ప్రయత్నించినట్లు అవగతమవుతోంది.

## మలయాళచిత్రం జీవితనౌక:

1951లో కె.కె. ప్రొడక్షన్స్ & తిరుమలై పిక్చర్స్ వారు సమర్పించిన 'జీవితనౌక' మలయాళం నుంచి తెలుగు చేసిన మొదటి చిత్రం. మలయాళంలో యీ చిత్రదర్శకుడు కె.వెంబు కాగా సంగీత దర్శకుడు యస్.వేదాచలం. తెలుగులో ఈ చిత్రనిర్వాహకుడు వరహాలరాజు. సింగారి రచయిత బలిజేపల్లి లక్ష్మీకాంతమే యీ చిత్రానికి కూడా మాటలూ పాటలూ రాశారు. మొత్తం 16 పాటలున్న యీ చిత్రంలో 'హరిశ్చంద్ర' అంతర్నాటకంలో

చంద్రమతీహరిశ్చంద్రుల సంవాదం పద్యాలలో నడుస్తుంది. 'హరిశ్చంద్ర' నాటకరచయితగా సుప్రసిద్ధులైన బలిజేపల్లికి యీ అంతర్నాటక రచన నల్లేరు మీద నడకే. ఇందులోని పాటల్ని పి.లీల, జిక్కి, కె.వి.జానకి, పిఠాపురం నాగేశ్వరరావు, మాధవపెద్ది సత్యం పాడారు. తిక్కురుసి సుకుమారన్ నాయర్, కుంజుకుంజు భాగవతార్, బి.యస్.సరోజ, పంకజవల్లి, ఆదిమూలం మొదలైనవారు ముఖ్య తారాగణం కాగా – తెలుగులో వరహాలరాజు, కాటూరి మోహన్, ఎ.కమలాదేవి, రేడియో భానుమతి, వి.వి.టి. చారి ప్రభృతులు గాత్రధారులు.

'జీవితనౌక' ఒడిదుడుకులకు గురయినా సన్మార్గుల విషయంలో అది తప్పక తీరం చేరుతుందనే సందేశాత్మకమైన యితివృత్తంగల ప్రేమగాథ. కథానాయకుడు సోమ తన అన్న రాజు యింటి దగ్గర నాట్యం చేస్తున్న లక్ష్మిని చూసి చిన్నప్పుడే మనసు పడతాడు. పెద్దయేసరికి వాళ్ల ప్రేమ చిగురిస్తుంది. పట్నంలో చదువుతున్న సోమ లక్ష్మికి కానుకలు పంపిస్తుంటాడు. చదువు పూర్తయి యింటికొచ్చిన సోమ అన్నను ముఖ్యంగా వదినను యెదిరించి లక్ష్మిని పెళ్లి చేసుకోవడంతో వాళ్లకు కష్టాలు యెదురవుతాయి.

సోమ వుద్యోగాన్వేషణలో ఒక జమీందారిణి కారుకింద పడి, ఆ తర్వాత ఆమె ఆదరణకు పాత్రుడై ఎస్టేట్ మేనేజర్గా నియమింపబడతాడు. పట్నం నుంచి అతను పంపుతున్న డబ్బును లక్ష్మికి కాకుండా ఆమె వదిన, అన్న కాజేస్తుంటారు. పసిపిల్లాడితో పొట్ట చేతపట్టుకొని వూరువిడిచిన లక్ష్మి రైల్వేస్టేషన్లో సోమను జమీందారిణి కూతురితో చూస్తుంది. ఆత్మహత్యకు సిద్ధపడి, ఆనక పసికూనకోసం ఆ ప్రయత్నాన్ని విరమించి పట్నం చేరి ఒక నాటక కంపెనీలో కుదురుకుంటుంది.

హరిశ్చంద్ర మొదలైన నాటకాల్లో నటిస్తున్న లక్ష్మి ఆ రోజున 'అంతిప్పాశ' నాటకంలో నటిస్తూ యెదురుగా వుండి నాటకాన్ని చూస్తున్న సోమనూ, జమీందారిణి కూతురునూ గమనించి ఆవేశంతో కుప్పకూలి పోతుంది. నాటకంలో అంతిప్పాశుని మాటలకు చలించిన సోమ జమీందారిణి దగ్గర సెలవు తీసుకొని స్వగ్రామానికి వెళతాడు.

చివరకు ఆ ప్రేమజీవుల్ని విడదీసిన వాళ్లు పాప ఫలితాన్ని అనుభవిస్తారు. సోమ భార్యాపుత్రుల్ని కలుసుకోవడంతో కథ సుఖాంతమవుతుంది. ఇలాంటి యితివృత్తాలు గల చిత్రాలు ఆ కాలంలోనే అనేకం వచ్చినా, జీవితనౌక విజయాన్ని సాధించింది.

పాటల్లో ఒకటి రెండింటిని మినహాయిస్తే –అనువాద గీతాల్లా అనిపించవు.

1. పాహిదేవీ! పార్వతీ! పరమేశ్వరీ! లలితే
నాయికే! జగన్నాయికే! సుఖదాయికే! వరదే

2. నీవేగా మహేశా! తుది నీవేగా మహేశా!
రాదో సుఖం యిక మీద దయాళో!

వంటి భక్తిగీతాలు –

1. జగాన సాయమెవరయా! నీకు నీవే సహాయం
తెగించి నడచిపోవయా! నీకు నీవే సహాయం
నిరాశ కూలనేలరా! సుఖాశ తేలిపోరా...

2. పాపమే యిది బాలా – బాలా ఆత్మహత్య పాపమే
జీవమున్ విడరాదె–
పావనమైన దైవ మొసంగిన జీవమున్ విడరాదె.

3. ఆకటితో అల్లాడు మీ సోదరులన్ చెయ్ విడకండి
వేదనతో వేడుకునే మీ మానవులన్ చెయ్ విడకండి

4. మురియ వలదే మధురమని ఈ
జీవితమే ఒక యాతన – అనుదిన మారని వేదన
వెతల సుడికి జడియకు మబలా

వంటి ప్రబోధ గీతాలూ – వున్న యీ చిత్రం భరతవాక్యం లాంటి సందేశాత్మక గీతంలో ముగుస్తుంది.

అపకారికి ఉపకారం చేసే
కృపామతుల కిల జయం, జయం
పరోపకారం చేసే వారికి
ఇహమూ పరమూ జయం జయం –
పాపకర్మలకు పశ్చాత్తాపమె
పరిహారంబిది నిజం, నిజం–
సంతత మీశ్వర చింతన చేసే
సాధుల కెందును శుభం శుభం.

ఇటువంటి ప్రయోజనాత్మక గీతాలతో పాటు ప్రసన్నశైలిలో సాగిన యిందులోని ప్రణయగీతాలూ ప్రేక్షకులను రంజింపచేశాయి.

వాటిలో తరళరత్నం లాంటి యీ యుగళగీతం.

**సోమ :** **వనగాయనీ! రావే - మరునాయకీ**
**రావే - మరునాయకీ!**

**లక్ష్మి :** **సురతాణివే! ఈ నే నెనయౌదునా?**
**నీతో నెనయౌదునా?**

**సోమ :** **వాడెదవోయీ ఈ పూరికుటీరాన**
**రావే, మరునాయకీ!**

**లక్ష్మి :** **నీ జయగానం భావజీవం - నా సుఖసారంబేగా**
**ఎనయౌదునా? - నీతో నెనయౌదునా?**

**సోమ :** **వనగాయనీ! రావే-మరునాయకీ!**
**రావే-మరునాయకీ**

**లక్ష్మి :** **నేనొక దీన - జాతికి నో హీన**
**ఈ నే నెనయౌదునా? నీతో నెనయౌదునా!**

**సోమ :** **ప్రేమ జగాన దీన, హీన**
**జాతి మతాదుల గాన** **॥వన॥**

**లక్ష్మి :** **సురతాణివే! ఈ నే నెనయౌదునా?**
**నీతో నెనయౌదునా?**

ఇలాంటి మధురగీతాలతో పాటు 'హరిశ్చంద్ర' అంతర్నాటకంలో చంద్రమతీ హరిశ్చంద్రుల సంవాదాన్ని కూడా తెలుగువారికి మాత్రమే సొంతమైన పద్యాలలో డబ్బింగ్‌చిత్రంలో కూడా రాయడం బలిజేపల్లి వారి పాండిత్య ప్రకర్షను, భాషాభిమానాన్ని తెలియజేస్తుంది. మచ్చుకి 'వసంత తిలక' వృత్తాలలో ప్రసన్నమైన నాటకశైలిలో సాగిన ఆ సంవాదం నుంచి రెండు పద్యాలను గమనిద్దాం.

**హరిశ్చంద్రుడు:**

**అన్నాతురుండ తనువమ్మిన దాసుడన్ నీ**
**కన్నీటి కింక ఫలమెయ్యది దీనురాలా!**

పన్నీయకున్న అతివా! శవమున్ దహించన్
మన్నీని యాన యిది నన్నలయించ నౌనే?

**చంద్రమతి:**

నా జీవితాశ యిదు అంతిమ వాయువూర్చి
రాజేసినాను చితి తనయున్ దహించన్
యోజింపుమా కరుణచే ఒక వస్తువేనిన్
నా జాడ లేదు, గతిమాలిన పేదరాలిన్

వెరసి ఈ చిత్రవిజయానికి బలిజేపల్లి వారి రచన దోహదం చేసిందనడం నిర్వివాదాంశం. బలిజేపల్లి లక్ష్మీకాంతం డబ్బింగ్ చిత్రాల తొలి దశలో జీవితనౌక (మలయాళం), సింగారి (తమిళం) చిత్రాలకు తప్ప మరే డబ్బింగ్‌చిత్రానికీ పనిచేయలేదు!

## కన్నడచిత్రం జగన్మోహిని :

కన్నడం నుంచి తెలుగు తెరకెక్కిన మొదటి డబ్బింగ్‌చిత్రం మహాత్మా పిక్చర్స్ వారి 'జగన్మోహిని' (1953). డి.శంకర్ సింగ్ దర్శక నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రానికి సంగీత దర్శకులు పి. శామన్న. 'ఆహుతి' తర్వాత శ్రీశ్రీ కలం పెట్టిన రెండవ డబ్బింగ్ చిత్రమిది. పి. లీల, జిక్కి, రాజా – గాయనీగాయకులు. హరిణి, ప్రతిమ, రాధ, ఎ.కె. శ్రీనివాసరావు, మహాబలరావు, వీరభద్రప్ప మొదలైన వారు ముఖ్య తారాగణం.

ఈ జానపద చిత్రంలోని యితివృత్తం రెండు జన్మలకు సంబంధించిన ప్రేమకథ. ప్రారంభంలో యిది శకుంతలా దుష్యంతుల ప్రణయగాథను పోలివుంటుంది. రత్నపురి రాజకుమారుడు వేటకై వెళ్లి ఒక గ్రామీణ బాలికను చూసి ప్రేమించి గాంధర్వవిధిని వివాహం చేసుకొంటాడు. ఆమెను పట్టపురాణిగా స్వీకరిస్తానని, సముచిత రాచమర్యాదలతో తన నగరానికి రప్పిస్తానని మాట యిచ్చిన రాజు ఆమెను మర్చిపోతాడు. శకుంతల లాగే కొన్నాళ్లకు తనంత తానుగా రాజసన్నిధికి వెళ్లిన ఆ బాలిక నిరాదరణకు గురవుతుంది. మనసు గాయపడిన ఆమె రాజును శపించి ఆత్మహత్య చేసుకొంటుంది.

శాపగ్రస్తుడైన రాజకుమారుడు మరుజన్మలో ఒక రైతు కొడుకుగా జన్మిస్తాడు. అతని పేరు రాజా. అతని ప్రేయసి ఈ జన్మలో మోహినీరూపాన్ని ధరించి రాజాను తన వాణ్ని చేసుకోడానికి ప్రయత్నిస్తుంది. కాని తల్లిదండ్రులు అతనికి గౌరి అనే యువతితో వివాహం చేయడంతో మోహిని రాజా నొక పువ్వుగా మార్చి తనలోకానికి తీసుకు పోతుంది.

గౌరి నదిలో పడి ప్రాణత్యాగం చెయ్యబోతే ఆశ్రయమిచ్చిన గురువు తర్వాత ఆమెకు మానహాని తలపెడతాడు. అతని నుంచి తప్పించుకొని అరణ్యమార్గం పట్టిన గౌరికి పార్వతీదేవి కొరవంజి రూపంలో ప్రత్యక్షమై భర్తజాడ తెలుసుకొనే మార్గాన్ని చెప్తుంది. మోహినీలోకంలో మోహిని పెట్టే హింసలను భరించిన గౌరిని మెచ్చి పార్వతీదేవి ఆమెకు భర్తను, మోహినికి మోక్షాన్ని అనుగ్రహిస్తుంది. ఈ జానపదచిత్రమే విఠలాచార్య చిత్రల్లోని మాయలకూ మంత్రాలకూ స్ఫూర్తి!

ఈ చిత్రంలోని 12 పాటలలో ఒకటి కొరవంజి పాత్రపై చిత్రించిన సోది పాట. మిగతా వాటిలో మూడు గౌరిపై చిత్రించిన పాటలు కాగా – అందులో రెండు సర్వమంగళకు మొరపెట్టుకొని ఆదుకోమంటూ ఆలపించిన ప్రార్థనా గీతాలు, మరొకటి వియోగగీతం. తక్కిన గీతాలన్నీ మోహిని, మోహినీ – రాజాలకు సంబంధించిన ప్రణయగీతాలే. వాటి నుంచి మచ్చుకి ఒకటి –

**రాజా : ఏమిది రమణీ కలయో నిజమో**
**ఏమో తెలుపవె నీవే!**
**మో : ఏటికి నీ కనుమానము రాజా**
**ముద్దుల మోహిని నేనే!**
**రాజా : చక్కని కన్గవ చల్లని వెలుగు**
**నెమ్మది కిచ్చీ మోదం!**
**మో : కాముని గేరెడి మోమును గానగ ఈ తరినే**
**కాముని గేరెడి మోమును గానక**
**రేగెను నామది మోహం!**
**రాజా : మించువె కాంతా, చంచల నయనా**
**కొంచెము జాలియె లేదే!**
**మో : పంచబాణుని హసించెడి చక్కని నాయకుడా**
**పంచబాణుని హసించెడి రాజా**
**నన్నిటు లడుగా నేలో?**
**రాజా : మిసమిసలాడే తనులత యెంతో**
**వణకు నదేమో కాంతా!**
**మో : వసంతమాసం వచ్చెగదాయని వణకినదో**

వసంత మాసం వచ్చెగదా యని
సంతస మందిన దింతే!

పాటలు సాదాసీదాగా వున్నా, సరళమైన భాషతో ఆనాటి ప్రేక్షకులను రంజింప చేశాయి.

## ఒరియాచిత్రం 'శ్రీజగన్నాథ మహాత్త్యము'

ఒరియానుంచి తెలుగులోకి డబ్ చేయబడిన మొదటి చిత్రం యూనియన్ పిక్చర్స్‌వారి శ్రీ జగన్నాథ మాహాత్త్యము (1955). అప్పట్లో యేటేటా సాహిత్య సమీక్షలు చేసే సుప్రసిద్ధ రచయిత, ఆకాశవాణి వుద్యోగి అయిన శ్రీ వాత్సవ (యండమూరి సత్యనారాయణ రావు) దీనికి మాటలు పాటలు రాయగా రఘునాథ పాణిగ్రాహి సహాయకునిగా పనిచేశారు. కాటూరి మోహనరావు దర్శకునిగా (నిర్వాహకులు) వ్యవహరించిన ఈ చిత్రానికి సంగీత దర్శకులు మల్లిక్, బి.గోపాలం. బాల సరస్వతి, ఎ.పి.కోమల, వి.లక్ష్మి, బి.రేణుక, ఘంటసాల, ఎ.యం.రాజా. మాధవపెద్ది సత్యం, మల్లిక్ మొదలైనవారు నేపథ్య గాయనీగాయకులు.

ఇది పూరీజగన్నాథక్షేత్రంలో వెలసిన విగ్రహాలకు సంబంధించిన ప్రసిద్ధ పౌరాణిక గాథ. అవంతీక్షేత్రాన్ని పాలించిన ఇంద్రద్యుమ్నుడనే రాజు, అతని భార్య ఒక బ్రాహ్మణ బాలకుణ్ణి చేరదీసి పెద్దవాణ్ని చేసి అవంతీ సేనానాయకుణ్ని చేశారు. అతని పేరు విద్యాపతి. స్వప్నంలో కనిపించిన నీల మాధవస్వామి మాట ప్రకారం ఉత్కళదేశంలో వున్న స్వామి వారిని అవంతికి తీసుకురావలసిందిగా రాణి విద్యాపతిని ఆదేశించింది. విద్యాపతి ఆ విగ్రహాలను సంగ్రహించి అవంతికి తరలించినా, వాటి నన్వేషిస్తూ వచ్చిన శబరరాజు భక్తిపారవశ్యానికి స్వామి విగ్రహాలు అంతర్ధానమయ్యాయి. అనంతరం ఆ విగ్రహాల కోసం అవంతీ వుత్కళ దేశాల మధ్య వైరం యేర్పడిన నేపథ్యంలో స్వామివారు అవంతీరాజుకు కలలో కనిపించి తాను బంకీమోహనం వద్ద సముద్రంలో దారురూపంలో ప్రత్యక్షమౌతానని చెప్పారు.

ఆ దారువులతో విగ్రహాలు మలచడానికి రాజుచేత నియమింపబడిన ఓవృద్ధశిల్పి ఆ పని పూర్తి చేయడానికి ఇరవై యొక్క రోజులు గడువుకోరతాడు. అంతవరకు ఆలయంలో ద్వారాలు బిగించుకొని ఆ పని చేస్తాననే వృద్ధశిల్పి నిబంధనను అతిక్రమించి, అత్యుత్సాహంతో రాణి సగంలోనే తలుపులు తెరిపించింది. ఆ శిల్పి అదృశ్యమై మొండి

చేతులతో వున్న మూడు దారు విగ్రహాలు మాత్రం దక్కాయి. వాటినే ప్రతిష్ఠించమని స్వామి ఆనతివ్వడంతో సుభద్ర, బలభద్ర, జగన్నాథుల అసంపూర్ణ దారువిగ్రహాలను పూరీక్షేత్రంలో ప్రతిష్ఠించడం జరిగింది. ప్రతిసంవత్సరం ఈ విగ్రహాలను రథాలలో వుంచి అత్యంత వైభవంగా రథయాత్ర నిర్వహించడం సర్వజన విదితం.

'జయ జగదీశ హరే...' అనే అష్టపదితో ప్రారంభమయ్యే ఈ చిత్రంలో పాటలతో పాటు మూడు సీస పద్యాలు, రెండు శ్లోకాలు, రెండు నాటక గీతాలు వున్నాయి. అన్ని ప్రక్రియల్లోను శ్రీ వాత్సవ అవలీలగా కవిత్వాన్ని పండించారనడానికి స్థాలీపులాకంగా ఘంటసాల భూపాలరాగంలో పాడిన మేలుకొలుపు పాటను పరికిద్దాం.

**పల్లవి: తెల్లతెల్ల వారెనయ్య, పల్లెపల్లె కళ్లు విప్పె**
**నల్లనయ్య మేలుకో, చల్లన మమ్మేలుకో**

**1. చల్లచేయు గొల్లభామ అల్లనల్ల వెనుక వచ్చి**
**కళ్లుమూసి కౌగలింత ఒళ్లు ఝుల్లుమనిపించగ ॥నల్ల॥**

**2. పులులకు కాపురములయిన పొలిమేరల కొండగుహల**
**మొలిచిన చీకటుల తరిమి, వెలుతురు నింపెదవు గాని ॥నల్ల॥**

**3. నీలసముద్ర తీరమున నీలాచలధామమందు**
**మూల శబరపల్లె లోన పాలించగ వెలసిన దొర**
**నీలమాధవా, ప్రభూ, జాలమేల లేవరా**
**నీలమాధవా, ప్రభూ, నీలమాధవా ప్రభూ!**

శ్రీ వాత్సవ ఈ ఒక్క డబ్బింగ్ చిత్రానికి మాత్రమే రచన నందించడం విశేషం.

## చైనాచిత్రం 'నింగి నేల నాదే'

ఈ చిత్రంలో చంద్రబోస్ స్వతంత్రంగా రాసిన ఏకైక గీతాన్ని చూద్దాం-

**ఆరాటం ముందు ఆటంకం ఎంత!**
**సంకల్పం ముందు వైకల్యం ఎంత!**
**దృఢచిత్తం ముందు దురదృష్టం ఎంత!**
**ఎదురీత ముందు విధి రాత ఎంత!**
**నమ్మకమూ పట్టుదల నా రెండు రెక్కలుగా**
**ఎగిరేస్తా ఏలేస్తా నా ఆశల ఆకాశాన్నంతా ॥ఆరాటం॥**

చేజారెను చేతులు చెదిరేను గీతలు
బెదిరించిన బాధలే వివరించెను బోధలు
పాదాలను పిడికెలుగా నా గుండెను గుప్పిటగా
మలిచేస్తా గెలిచేస్తా సంతోషపు సామ్రాజ్యాన్నంతా ॥ఆరాటం॥

పడిలేస్తూ ఉంటే పెరిగింది ధైర్యం
అడుగేస్తూ ఉంటే తరిగింది దూరం
చిరునవ్వేస్తుంటే సెలవంది శోకం
సహనంతో ఉంటే దొరికింది సైన్యం
చెమటోడుస్తుంటే పిలిచింది గమ్యం ॥పడిలేస్తూ॥

శ్రీమతి చావ సుధారాణి నిర్మించిన ఈ చిత్రంలో వందేమాతరం శ్రీనివాస్ సంగీత దర్శకత్వంలో చిత్ర ఈ పాటను ఆలపించారు.

ఇలా తెలుగులోకి వివిధభాషల నుండి వచ్చిన డబ్బింగ్ చిత్రాలు ఆ కాలంలో ఆదరింపబడిన డైరెక్ట్‌టేక్ చిత్రాల్లాగే పౌరాణిక, జానపద, సాంఘికాలనే మూడు విభాగాలకూ ప్రాతినిధ్యం వహించాయి. ఈ చిత్రాలకు అప్పటికే సాహిత్య రంగంలో లబ్ధప్రతిష్ఠులైన శ్రీశ్రీ, బలిజేపల్లి, శ్రీవాత్సవ రచయితలుగా పనిచెయ్యడం డబ్బింగ్ చిత్రాలకు గౌరవాన్ని కలిగించాయి. అయితే 'ఆహుతి'లో పాటలు తప్ప మిగతా చిత్రాల్లోని పాటలు యిప్పుడెవరికీ గుర్తులేవు. ఆ మాట కొస్తే నాటి నుంచి నేటివరకు డబ్బింగ్‌చిత్రాల పట్ల పరిశ్రమలో చిన్నచూపు వుంది. కారణాలేమైనా డబ్బింగ్ చిత్రాల రచయితలు కూడా రచనను జీవిక కోసమో, చిత్ర పరిశ్రమలో నిలబడ్డానికో తప్ప అంత ప్రతిష్ఠాత్మకంగా భావించినట్టు కనిపించదు. అయినా తెలుగులో నేరుగా తీసిన చిత్రాలకు దీటుగా నిల్చిన ఆణిముత్యాల్లాంటి డబ్బింగ్ చిత్రాలు, డబ్బింగ్ పాటలు యెన్నో! అందుకే ఆ చరిత్ర పట్ల వుదాసీనత తగదు!

ఈ అధ్యాయంలో సమాచార సేకరణకు వుపయోగపడిన వ్యాసాలు, పుస్తకాలు.

1. తెలుగులో అనువాద చిత్రాలు – పైడిపాల.
   11-10-13 ఆంధ్రభూమి వెన్నెలలో వ్యాసం.
2. మనసు ఫౌండేషన్ వారి సౌజన్యంతో లభించిన పై చిత్రాల పాటలపుస్తకాలు.
3. ఫిల్మ్‌న్యూస్ ఆనందన్ నుండి సమాచారం.
4. శ్రీమతి చావ సుధారాణీజగన్ నుండి 'నింగి నేలా నాదే'లో పాట.

# పరభాషాచిత్ర వారధులు!

సినిమా వ్యాపారాత్మక కళగా ప్రారంభమై క్రమంగా కళాత్మక వ్యాపారంగా మారింది. ఈ పరిణామ క్రమంలో యిటీవల కళ అనే పదం పూర్తిగా లుప్తమై సినిమా భారీస్థాయి వ్యాపారంగా, జూదంగా మిలిగింది. వేలనుంచి లక్షలకూ లక్షల నుండి కోట్లకూ విస్తరించిన ఈ వ్యాపారంలో ప్రయోగాలు చేసి చేతులు కాల్చుకోడానికి యిష్టపడనివాళ్లు, స్వీయ సృజనాత్మక శక్తి మీద తగినంత ఆత్మవిశ్వాసం లేనివాళ్లు పరాయి చిత్రాల మీద ఆధారపడ్డం ప్రారంభించారు. ఇలా గెలుపు గుఱ్ఱాల మీద పందెం కాసే మనస్తత్వంతో ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన చిత్రాల నుండి కథావస్తువులను, కొన్ని దృశ్యాలను కొల్లగొట్టడం, పరభాషాచిత్రాల నిర్మాణ హక్కులను కొనడం, కొన్ని సందర్భాలలో ధైర్యంగా చౌర్యానికి పూనుకోవడం, ఇతర భాషాచిత్రాలను 'డబ్' చెయ్యడం... ఇలా నిర్మాతలు అనేక మార్గాలను ఆశ్రయించారు. వాటిల్లో తక్కువ పెట్టుబడితో ఫలితమిచ్చేవి డబ్బింగ్‌చిత్రాలు కనుక-వాటి విజయం ఆధారంగా 'రీమేక్' (పునర్నిర్మాణ చిత్రాలు) చిత్రాలను, 'ఫ్రీమేక్' (హక్కులు తీసుకోకుండా తేరగా తీసినవి) చిత్రాలను నిర్మించిన సందర్భాలు యెన్నో! ఇలా అనువాద చిత్రాలు పరభాషాచిత్రాలకు వారధులుగా నిలిచి యెందరో నిర్మాతలను చిత్ర పరిశ్రమలో నిలదొక్కుకొనేలా చేశాయి.

తెలుగు చలనచిత్ర చరిత్రలో 1950వ సంవత్సరం ఒక గొప్ప మలుపు. ఒక కుదుపు. అంత వరకు తెలుగు టాకీలతో పాటు హిందీ తమిళ టాకీలు కూడా ఆంధ్రదేశంలోని ప్రధాన కేంద్రాలలో విడుదలై తెలుగువారి ఆదరణకు పాత్రమయ్యేవి. బాంబే టాకీస్, న్యూ థియేటర్స్, ప్రభాత్ మొదలైన సంస్థలు నిర్మించిన కిస్మత్, దేవదాస్, సంత్ తుకారాం వంటి హిందీ చిత్రాలు, జెమినీ, జూపిటర్ యిత్యాది సంస్థలు నిర్మించిన చంద్రలేఖ, నందనార్, కన్నియన్ కాదలి, హరిదాసు, కణ్ణకి వంటి అరవ చిత్రాలు భాషా భేదంతో నిమిత్తం లేకుండా తెలుగునాట విజయవిహారం చేశాయి. టి.ఆర్.రాజకుమారి,

ఎమ్.కె. రాధా, రంజన్, సుందరీబాయ్, టి.ఎ. మధురం, ఎస్.ఎస్. కృష్ణన్ మొదలైన నటీనటులతో నిర్మించిన 'చంద్రలేఖ' (1949) విజయవాడ కేంద్రంలో శతదినోత్సవం కూడా జరుపుకొంది. జెమినీ స్టూడియో మనుగడకు కారణమైన ఈ చిత్రంలో డ్రమ్స్ డాన్స్, సర్కస్ ప్రత్యేకార్షణలు కాగా – సూర్యకాంతం ఓ నృత్యగీతంలో కనిపించడం విశేషం! అప్పట్లో ఈ పరభాషాచిత్రాలకు సంబంధించిన సినిమా పాటల పుస్తకాలను తెలుగులిపిలో ముద్రించే వారు. కొన్ని సందర్భాలలో 'టైటిల్'ను మాత్రం తెలుగులో అనువదించి (ఉదాహరణకు–వేలైక్కారి– దాసీ కన్య, కన్నియన్ కాదలి–తప్పుల తమాషా) ప్రచారం చేసే వారు. పరభాషాచిత్రాలకు ముఖ్యంగా ఆంగ్ల చిత్రాలకు ఏమాత్రం సంబంధం లేని యువతను రెచ్చగొట్టే తెలుగు పేర్లతో ప్రచారం చేసి, సినిమాహాళ్లలో అంతంత మాత్రమైన భాషాపరిజ్ఞానం గల వ్యాఖ్యాతల చేత 'రన్నింగ్ కామెంటరీ' లను చెప్పించేవారు. యీ దశకు తెరవేస్తూ తెలుగులో డబ్బింగ్ చిత్రాల శకం ప్రారంభమైంది.

ఆర్థికపరమైన వెసులుబాటు, మాతృభాషలో ముందుగా విజయాన్ని నమోదు చేసుకోవడం వల్ల అపజయం పాలవుతుందనే ఆందోళన లేకపోవడం, తెలుగునేలలో అప్పటికి థియేటర్స్‌కి సరిపడినన్ని 'డైరక్ట్ టేక్' చిత్రాలు లేక పోవడం... ప్రధాన కారణాలుగా తెలుగు చిత్రరంగంలో నిర్మాతలకు డబ్బింగ్ చిత్రాలపట్ల ఆసక్తి పెరిగింది. మొదటి దశకంలోనే 'ఆలీబాబా–40 దొంగలు' 'రత్నగిరి రహస్యం' 'కొండవీటి దొంగ' 'శ్రీరామభక్త హనుమాన్' 'జింబో' వంటి డబ్బింగ్ చిత్రాలు విజయవంతం కావడం, ఆనాటి వుద్దండులైన కవులు రాసిన డబ్బింగ్ పాటలు నేరుగా తీసిన చిత్రాల్లోని పాటలతో సమంగా ప్రాచుర్యాన్ని పొందడం ఆ తరువాతి దశకాల్లో డబ్బింగ్ చిత్రాల సంఖ్య పెరగడానికి దోహదం చేశాయి. హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల నుండి తెలుగులోకి 'డబ్' చేసిన చిత్రాల 'సక్సెస్'ను గమనించి వాటిని అనుసరిస్తూ తెలుగులో పునర్నిర్మాణ చిత్రాలు, వాటిని చేర్పులూ మార్పులతో తీసిన చిత్రాలు పుంఖాను పుంఖాలుగా వచ్చాయి. కథ, పాత్రలు, సన్నివేశాలు, పాటల బాణీలు... ఇలా అనేకాంశాలలో యివి డబ్బింగ్ చిత్రాలనే పోలివుండడం విచిత్రం. కొన్ని డబ్బింగ్ చిత్రాలకు పునర్నిర్మాణాలనూ, అనుసరణలనూ, అనుసృజనలనూ, కథాచౌర్యాలను పరిశీలిద్దాం–

1. 'అముదై పొళియుమ్ నిలవే, నీ అరుగిల్ వరాద దేనో...' (అమృతాన్ని కురిపించే చందమామా, నువ్వు దగ్గరకు రావెందుకో) అనే సుప్రసిద్ధ గీతం గల 'తంగమలై రగస్యం' తమిళచిత్రం (1957) 'రత్నగిరి రహస్యం' గా తెలుగులో అనువదింపబడింది.

జమున, శివాజీ గణేశన్ నాయికానాయకులుగా నటించిన ఈ చిత్రం తిరిగి జయప్రద, ఎన్.టి. రామారావు నాయికానాయకులుగా 'రాజపుత్ర రహస్యము' (1978) పేరుతో తెలుగులో 'డైరక్ట్ టేక్' చిత్రంగా వచ్చింది. పద్మిని పిక్చర్స్ వారి 'రత్నగిరి రహస్యము' చిత్రానికి బి.ఆర్.పంతులు దర్శకుడు కాగా – శ్రీశ్రీ మాటలు పాటలు రాశారు. 'రాజపుత్ర రహస్యము' దర్శకుడు యస్.డి.లాల్ కాగా – వేటూరి సుందరరామమూర్తి, సి. నారాయణరెడ్డి పాటలను రాశారు. 'రత్నగిరి రహస్యము'లో టి. ఆర్. రాజకుమారి ధరించిన పాత్రను 'రాజపుత్ర రహస్యము'లో జమున పోషించడం విశేషం. 'రత్నగిరి రహస్యము' లో 11 పాటలు, ఒక పద్యం వుంటే – 'రాజపుత్ర రహస్యము'లో ఆ సంఖ్య అయిదుకు పరిమితమైంది. కథాసూత్రంలో మాత్రం చెప్పుకోదగిన మార్పులు లేవు.

2. బి.ఆర్. పంతులు దర్శకత్వంలో వచ్చిన 'స్కూల్ మాష్టర్' అనే కన్నడ చిత్రం తెలుగులో 'బడిపంతులు' (1958)గా డబ్ చేయబడింది. యం.వి. రాజమ్మ, షావుకారు జానకి, బి.సరోజా దేవి, బి.ఆర్. పంతులు, మాధవరావు, ఉదయకుమార్ మొ॥ తారాబలం వున్న ఈ చిత్రం తిరిగి 1972లో పి.చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో 'బడిపంతులు' పేరుతోనే నిర్మితమై అద్భుతవిజయాన్ని సాధించింది. డబ్బింగ్ చిత్రంలోని పాటల్ని రావూరి సత్యనారాయణరావు రాయగా – డైరెక్ట్ టేక్ చిత్రంగా వచ్చిన 'బడిపంతులు'లో పాటల్ని ఆత్రేయ, ఆరుద్ర, సి.నారాయణరెడ్డి, దాశరథి రాశారు. రెండింటిలో కొన్ని అవే సన్నివేశాలకు రాసిన పాటలు కాగా – పద్మిని పిక్చర్స్ వారి 'బడిపంతులు'లో వున్న బాలల రామాయణ అంతర్నాటకం, తత్సంబంధమైన గీతం త్రివేణి ప్రొడక్షన్స్‌వారి బడిపంతులు (1972)లో లేవు. దీనిలో ఆత్రేయ రాయగా బాల శ్రీదేవి మీద చిత్రీకరించిన –

**బూచాడమ్మా బూచాడు, బుల్లిపెట్టెలో వున్నాడు**
**కళ్లకెపుడూ కనపడడూ, కబురు లెన్నో చెపుతాడు**

మొదటి బడి పంతులు (డబ్బింగ్) లో లేని సన్నివేశానికి రాసిన ప్రాచుర్యం పొందిన పాట.

రెండు చిత్రాల్లోనూ ఒకే సన్నివేశానికి రాసిన బడిపిల్లల పాటను గమనిస్తే – డబ్బింగ్, డైరక్ట్ టేక్ చిత్రాలకు గల వ్యత్యాసమూ, గీతరచనలో కాలానుగుణంగా వచ్చిన మార్పూ అర్థమవుతాయి.

1. పదండోయ్... పదండోయ్... పదండోయ్

గురుసేవయే సుమా సర్వోదయం

గురుపీఠం మా పల్లె దేవాలయం -

ఇంటింటి కొకరాయి తేవాలయా

గురుభవనం కట్టేము పిల్లలెల్లా

దేశద్రోహుల దుర్వ్యాధి వూరునుంచి తొలగించి

నీతితో ప్రీతితో జ్యోతిరీతి మెఱయగా

సరిదారి నడువగా వీరరక్త ముడుకగా

సాటిలేని శక్తితో ముందడుగు వేయగా

విద్యలెల్ల ఎన్నలేని భాగ్యరేఖగా

బాలురెల్ల మనసులోని తారలట్లుగా

వెలుగు చిందు చందమామ మాదు గురువేగా

గురుర్విష్ణు, గురుర్బ్రహ్మ, గురువే శివా-

బడిపంతులు - **1958** (రావూరి)

2. పిల్లలము బడి పిల్లలము

నడుములు కట్టి కలిసాము

పిడికిలి బిగించి కదిలాము

చరణం -1

పలకా బలపము పట్టిన చేతులు

పలుగూపారా ఎత్తినవి

ఓనమాలను దిద్దిన వేళ్లు

ఒకటై మట్టిని కలిపినవి॥పిల్ల॥

చరణం-2

ప్రతి అణువూ మా భక్తికి గుర్తు

ప్రతి రాయీ మా శక్తికి పద్దు

చేతులు కలిపి చెమటతో తడిపి

కోవెల కడతాం గురుదేవునికి ॥పిల్ల॥

**చరణం-3**

**తెలియని వాళ్లకు తెలివిగలవాళ్లకు**
**తెరిచుంటవి ఈ యింటి తలుపులు**
**వెలుగును తెచ్చే ఈ కిటికీలు**
**పంతులు గారి చల్లని కళ్లు**

**బడిపంతులు - 1972 (ఆత్రేయ)**

రెండు చిత్రాల్లో కథ, స్క్రీన్‌ప్లే, సన్నివేశాల్లో చెప్పుకోదగిన తేడాలు లేవు!

3. 'అన్బు ఎంగె' అనే తమిళచిత్రాన్ని నల్లపరెడ్డి గోపాలరెడ్డి నిర్మాతగా 'పెద్దకోడలు' (1959) పేరుతో డబ్ చేశారు. ఈ చిత్రంలో యస్.వి. రంగారావు, దేవిక, సూర్యకళ, పండరీబాయి ముఖ్య తారాగణం. ఈ చిత్రాన్ని తిరిగి ఎన్.టి.ఆర్. ఎస్టేట్ ప్రొడక్షన్ యూనిట్ వారు 'కోడలు దిద్దిన కాపురం' (1970) పేరుతో తెలుగులో పునర్నిర్మించారు. కోడలు దిద్దిన కాపురం చిత్రానికి నిర్మాత దర్శకులు – ఎన్. త్రివిక్రమరావు, డి.యోగానంద్. ఎన్.టి.రామారావు. జగ్గయ్య, సావిత్రి, వాణిశ్రీ, రేలంగి ముఖ్యతారాగణం. పెద్దకోడలు చిత్రానికి మాటలు పాటలు నారపరెడ్డి రాయగా కోడలు దిద్దిన కాపురం చిత్రానికి డి.వి. నరసరాజు మాటలను, సి.నారాయణరెడ్డి, కొసరాజు పాటలను రాశారు. అదుపు తప్పిన కుటుంబ సభ్యులను యింటి పెద్దకోడలు ఓర్పుతో నేర్పుతో సంస్కరించి కుటుంబాన్ని ఒక కొలిక్కి తీసుకొని రావడం ప్రధానేతివృత్తమైన ఈ రెండు చిత్రాల్లో సన్నివేశాల్లో, పాటల సందర్భాల్లో మార్పులేవు. ఉదాహరణకు రెండు చిత్రాల్లోనూ నాయిక పాడిన ప్రబోధగీతాలను పరిశీలిద్దాం.

**1.** **అంతా లేవండి ఎన్నో చేయండి**
**ఒకటై వుండండి కీర్తిని గాంచండి**
**అంతా లేవండి అందరు కొలిచెడు**
**పేరేదీ? పలుకూ – 'దేవుడు'**
**ఎన్నో చేయండి... దేశం కోరెడు**
**పలుకేది?– పలుకూ – 'త్యాగం'**
**ఒకటై వుండండి... లోకోత్తముని పేరేదీ?**
**పలుకూ–గాంధితాత కీర్తిని గాంచండి**
**నరులకు గురువే ఇలలో జ్ఞానం** **॥అంతా॥**

ఆ ఆ ఆ రమ్మని పిలుచూ కొమ్ముల నూచూ
అంబాయనుచూ అది ఏదీ? - 'గోవు'
గూటిలొ వుండును, కాయలు తినును, తోటల వాలును
అది ఏదీ- 'చిలుక'
నలుపే దేహం కోరిన గానం మింటను పోయే
దది ఏదీ?- 'కాకి' కాదు 'కోకిల'
ధర్మం, అడకువ, శీలము, పరువును
ప్రేమల వెలయున్ మహిళ
త్యాగం సలిపెదు వైరము నిలిపెదు
మగవారే కద వీరుల్ ॥అంతా॥

-పెద్ద కోడలు (1959), (నారపరెడ్డి)

2. నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవద్దు
జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే మరవొద్దు
సత్యం కోసం సతినే అమ్మిన దెవరు? - హరిశ్చంద్రుడు!
తండ్రిమాటకై కానల కేగిన దెవరు? - శ్రీరామచంద్రుడు!
అన్న సేవకే అంకితమైనది యెవరన్నా?- లక్ష్మన్న!
పతియె దైవమని తపించి పోయిన దెవరమ్మా? - సీతమ్మ!
ఆ పుణ్యమూర్తులు చూపిన మార్గం అనుసరించుటే ధర్మం
అనుసరించుటే నీ ధర్మం నీ ధర్మం మరవొద్దు ॥జాతిని॥
చాపకూడుతో సమతను నేర్పెను నాటి పలనాటి బ్రహ్మన్న
మేడిపండులా మెరిసే సంఘం గుట్టువిప్పెను వేమన్న
వితంతువుల విధివ్రాతలు మార్చి బ్రతుకులు పండించె కందుకూరి
తెలుగుభారతిని ప్రజల భాషలో తీరిచి దిద్దెను గురజాడ
ఆ సంస్కర్తల ఆశయరంగం నీవు నిలిచిన సంఘం
నీవు నిలిచిన ఈ సంఘం, నీ సంఘం మరవొద్దు ॥జాతిని॥
స్వతంత్ర భారత రథసారథియై సమరాన దూకె నేతాజీ!
సత్యాగ్రహమే సాధనమ్ముగా స్వరాజ్యమె తెచ్చె బాపూజీ!
గుండు కెదురుగా గుండెను నిలిపెను ఆంధ్రకేసరి టంగుటూరి!

**తెలుగు వారి కొక రాష్ట్రం కోరి ఆహుతి యాయెను అమరజీవి!**
**ఆ దేశ భక్తులు వెలసిన దేశం నీవు పుట్టిన భారతదేశం!!**
**నీవు పుట్టిన ఈ దేశం. ॥నీ ధర్మం॥**

**– కోడలు దిద్దిన కాపురం (1970), (సి.నారాయణరెడ్డి)**

మొదటి పాటలో కొంత మేర పక్షుల ద్వారా యిచ్చిన పరోక్ష సందేశాన్ని రెండవ పాటలో సంస్కర్తల, దేశనాయకుల త్యాగాలను స్మరిస్తూ – ధర్మాన్ని, సంఘాన్ని, దేశాన్ని మరవొద్దని ప్రత్యక్షంగా చెప్పడం మనం గమనిస్తాం. కోడలు దిద్దిన కాపురంలో వుద్బోధగీతం నేటికీ వివిధ సందర్భాలలో వినిపిస్తూనే వుంది!

4. ప్రభాత్ వారి హిందీ పౌరాణిక చిత్రం 'గజగౌరీ' తెలుగులో యర్రా అప్పారావు నిర్మాతగా గాంధారి గర్వభంగం' (1950) పేరుతో డబ్ చేయబడింది. ఈ చిత్రానికి శ్రీశ్రీ మాటలు పాటలు సమకూర్చగా ఆర్. బాలసరస్వతి, రాణి, వైదేహి, ఘంటసాల నేపథ్య గాయనీగాయకులు. బాల నటీనటులతో తీసిన ఈ చిత్రాన్ని అనుసరించి అదే తరహాలో 1972లో తెలుగులో నేరుగా 'బాలభారతం' చిత్రాన్ని తీశారు. పౌరాణికేతి వృత్తాలతో తీసిన చిత్రాలకు హక్కులు అవసరం లేదు కాని బాలనటీనటులు, సన్నివేశాలు, పాటలు మొ॥ విషయాల్లో ఈ రెండింటికి పోలికలున్నాయి. 'గాంధారి గర్వభంగం'లో అర్జునుడు అమ్ములతో నిర్మించిన మెట్ల మీదుగా భీముడు స్వర్గారోహణం చేసే సన్నివేశంలో శ్రీశ్రీ ఒక నేపథ్య గీతం రాశారు–

**పదునాలుగు లోకముల ఎదురేలేదే**
**పదునాలుగు లోకముల ఎదురన్నది లేదుగా ...**

మానవుడు సర్వశక్తి సంపన్నుడని ప్రశంసిస్తూరాసిన పైపాటను అనుసరిస్తూ 'బాలభారతం' లో 'మానవుడే మహనీయుడు..' అనే పాట వచ్చింది. 'హిట్ సాంగ్' గా పేరు తెచ్చుకొన్న బాలభారతంలోని పై పాట గురించి అది తన పాటకు నకలు అనే భావం ధ్వనించేలా శ్రీశ్రీ వ్యంగోక్తులు సంధించేవారు!

5. యం.జి.రామచంద్రన్ యం.జి.ఆర్. ప్రొడక్షన్స్‌ను స్థాపించి తను నిర్మాతగా, దర్శకునిగా, హీరోగా తీసిన ప్రతిష్ఠాత్మక తమిళచిత్రం 'నానోడి మన్నన్'. దీనిని తెలుగులో 'అనగా అనగా ఒకరాజు' (1959) పేరుతో 'డబ్' చేశారు. భానుమతి, బి. సరోజాదేవి, యం.జి.ఆర్. ఈ చిత్రంలో ప్రధాన తారాగణం. మాతృకలో పాటల్ని కల్యాణ సుందరం,

లక్ష్మణదాసు, సురద, ముత్తుకోటన్, అనంతరామన్ రాయగా తెలుగులో మాటల్ని పాటల్ని శ్రీశ్రీ రాశారు. 'అనగా అనగా ఒకరాజు' లో శ్రీశ్రీ రాసిన 10 పాటలతో పాటు కన్నడ, మలయాళ, తమిళభాషలలో వున్న 3 పాటలు కలిపి మొత్తం 13 పాటలున్నాయి. నాలుగు ద్రావిడ భాషలలో సంగీతపు పోటీ నిర్వహించిన సన్నివేశం సందర్భంగా ఆంధ్రేతర భాషలలో పాటలు వుంచాల్సిన అక్కర కలిగింది. వీటిలో 'నమ్మ ద్రావిడ..' అనే కన్నడ పాటను విజయ నరసింహ, 'ద్రావిడ మామ్ అమ్మ...' అనే మలయాళగీతాన్ని పి. భాస్కరన్, 'వరుగ వరుగ వేందే' అనే తమిళ గీతాన్ని సురద రచించారు. మాతృకలో తెలుగు పాటను నారాయణబాబు రాయగా దానిని 'చూడ కనులసొంపు...' అంటూ శ్రీశ్రీ డబ్బింగ్‌లో మార్చారు.

'అనగా అనగా ఒకరాజు' విజయాన్ని పురస్కరించుకొని పదేళ్ల తరవాత తెలుగులో 'గండికోట రహస్యం' (1969) డైరెక్ట్ టేక్ చిత్రాన్ని నిర్మించారు. దీనిలో నాయికానాయకులు దేవిక, యన్.టి.రామారావు.

6. కమలహాసన్ బాలనటుడిగా తెరమీద కనిపించిన మొదటి చిత్రం 'కళత్తూర్ కణ్ణమ్మ' చాలమందికి గుర్తుండే వుంటుంది. అది 'మావూరి అమ్మాయి' (1960) పేరుతో తెలుగులో పరివర్తితమైతే, తిరిగి దానిని 'మూగనోము' (1969) పేరుతో తెలుగులో తీశారు. ఎం.ఆర్.ఎం. ప్రొడక్షన్స్ వారి 'మావూరి అమ్మాయి'లో జెమిని గణేశన్, టి.యస్. బాలయ్య, యస్.వి. సుబ్బయ్య, సావిత్రి, దేవిక, ఎల్. విజయలక్ష్మి ముఖ్య తారాబలం కాగా డి. యోగానంద్ దర్శకత్వంలో వచ్చిన ఎ.వి.యమ్. ప్రొడక్షన్స్ వారి 'మూగనోము'లో అక్కినేని నాగేశ్వరరావు, యస్.వి. రంగారావు, వి. నాగయ్య, జమున, గీతాంజలి, విజయలలిత ముఖ్యతారాగణం. మాతృకలో కమలహాసన్ పోషించిన బాలపాత్రను 'మూగనోము'లో బేబీ బ్రహ్మాజీ పోషించింది.

'మావూరి అమ్మాయి'కి మాటలు పాటలు అనిసెట్టి రాయగా 'మూగనోము' చిత్రానికి మాటలు డి.వి.నరసరాజు, పాటలు ఆరుద్ర, కొసరాజు, సి.నా.రె., దాశరథి రాశారు. పాటల సంఖ్యతో సహా కథ, సన్నివేశాలతో రెండు చిత్రాలకు యెలాంటి తేడాలు లేవు. 'మావూరి అమ్మాయి'లో జంతువులు పాత్రలుగా కలిగిన సుదీర్ఘమైన అంతర్నాటక గీతం (7వ పాట) 'మూగనోము'లో కూడా అదే ధోరణిలో వుండడం యిందుకు ప్రత్యక్షనిదర్శనం. 'మూగనోము'లో ఈ చివరి పాటను కొసరాజు రాశారు. డైరెక్ట్ టేక్ చిత్రాని కుండే సౌలభ్యం, గీతరచనలో కాలానుగుణంగా వచ్చిన మార్పు కారణాలుగా 'మూగనోము'లో

పాటలు అధిక ప్రాచుర్యాన్ని పొందాయి. ఈ చిత్రానికి సంగీత దర్శకులు ఆర్. గోవర్ధనం.

**1. పగడాల జాబిలి చూడు – అందిన ఈ రోజు**
**వేయి అందాల నారాజు – అందిన ఈ రోజు**
**ఎందుకులే నెలతేడు?... –సి.నా.రె.**

**2. ఊరు మారినా వునికి మారునా**
**మనిషి దాగినా మమత దాగునా... –ఆరుద్ర**

**3. తల్లివి నీవే తండ్రివి నీవే**
**చల్లగ కరుణించే దైవమునీవే –ఆరుద్ర**

**4. నిజమైనా కలయైనా – నిరాశలో ఒకటేలే ఒకటేలే**
**పగలైనా రేయైనా ఎడారిలో ఒకటేలే –దాశరథి**

– ఇప్పటికీ వినిపిస్తున్న ఈ పాటలు 'మూగనోము' చిత్రం లోనివే!

7. 'పావమన్నిప్పు' (1961) తమిళ చిత్రాన్ని అదే సంవత్సరం 'పాప పరిహారం' పేరుతో తెలుగు చేశారు. ఎ. భీంసింగ్ దర్శకత్వంలో విడుదలయిన 'పావమన్నిప్పు' లో శివాజీ గణేశన్, జెమిని గణేశన్, ఎం.ఆర్. రాధా, వి. నాగయ్య, సావిత్రి, ఎం.వి. రాజమ్మ, దేవిక మొదలైన హేమాహేమీలు తారాబలం. సంగీత దర్శకత్వం విశ్వనాథన్ రామ్మూర్తి. 'పావమన్నిప్పు' చిత్రంలోని పాటలన్నీ ప్రాచుర్యాన్ని, ప్రజాదరణనూ పొందాయి. ఆ పాటలను గురించి విశ్లేషణాత్మక వ్యాసాలకు బహుమతులిస్తామని నిర్మాతలు పోటీని కూడా ప్రకటించారట. ప్రేమే దైవం, సౌభ్రాత్రానికి మించిన సంపద లేదు అనేవి ఈ చిత్రంలోని ప్రధాన సందేశాలు.

తెలుగులో జి.వి. నాగేశ్వరరావు నిర్వహణలో 'పాపపరిహారం' (1961) పేరుతో వచ్చిన ఈ చిత్రానికి అనిసెట్టి మాటలూ పాటలూ సమకూర్చారు. పి.సుశీల, పి.బి. శ్రీనివాస్, మాధవపెద్ది సత్యం, పి.రామచంద్రరావు నేపథ్య గాయనీ గాయకులు.
ఈ చిత్రాన్ని అనుసరించి 1970లో 'ఒకే కుటుంబం' చిత్రాన్ని తీశారు. ఎన్.టి.రామారావు, కాంతారావు, నాగభూషణం మొ॥ నటించిన ఈ చిత్రంలో కథ, పాత్రలు, సన్నివేశాలూ ఒకేలా వున్నా, హక్కులు తీసుకొన్న దాఖలా లేదు.

8. ప్రముఖనిర్మాత అల్లు అరవింద్ చిత్రపరిశ్రమలో నిలదొక్కుకోడానికి కారణం ఆయన నిర్వహణలో వచ్చిన తొలి చిత్రం 'బంగారు పతకం' (1976) అనీ, పి. మాధవన్

దర్శకత్వంలో కె.ఆర్. విజయ, శివాజీ గణేశన్ నాయికా నాయకులుగా నటించిన తంగపతకం దానికి మూలమనీ అనీ చాలమందికి తెలుసు. ఆ చిత్రానికి సంగీతం యం.యస్.విశ్వనాథన్. 'బంగారు పతకం' చిత్రానికి రాజశ్రీ మాటలూ పాటలూ రాశారు.

'బంగారు పతకం' డబ్బింగ్ చిత్రం ఆధారంగా తెలుగులో రోజా మూవీస్ వారు 'కొండవీటి సింహం' (1981) చిత్రాన్ని పునర్నిర్మించారు. కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో ఎన్.టి.రామారావు, సత్యనారాయణ, మోహన్ బాబు, రావు గోపాలరావు, శ్రీదేవి, జయంతి ముఖ్య తారాగణం. సత్యానంద్ మాటలను రాయగా చక్రవర్తి సంగీత దర్శకత్వంలో వేటూరి పాటలను రాశారు.

సుశీల, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం పాడిన – ఈ చిత్రంలోని –

**1.** **ఈ మధుమాసంలో ఈ దరహాసంలో**
**మదిలో... కదిలీ. పలికే కోయిలా**

**2.** **అత్తమడుగు వాగులోన అత్తకొడకో**
**అందమంతా తడిసింది అత్తకొడకో**

**3.** **బంగిన పల్లి మామిడిపండు రంగుమీదుంది**
**చిలకే ముట్టని జాంపండు సిగ్గుపడుతుంది**
**అది ఏ తోటదో– ఏ పేటదో**

**4.** **వానొచ్చే వరదొచ్చే వలపల్లే వయసొచ్చే – నీలో గోదారి పొంగే**
**నీ పొంగులలో మునిగి నీ కౌగిలిలో కరిగి**
**అలలెన్నో నాలోన ఉయ్యాలలూగే...**

**5.** **మా యింటిలోన మహలక్ష్మి నీవే**
**మా కంటవెలిగే గృహలక్ష్మి నీవే**
**సిరులెన్నో వున్న చిరునవ్వు నీవే**
**నీ కంటతడిని నే చూడలేను..**

మొదలైన పాటలన్నీ జనాన్ని వుర్రూతలూగించి, సినిమాకు అసాధారణ విజయాన్ని చేకూర్చాయి.

9. ఆర్.వి. ఉదయకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'కిళక్కు వాసల్' తెలుగులో

‘తూర్పు సిందూరం’ (1990)గా రూపొందింది. రేవతి, ఖుష్బూ, కార్తీక్, విజయకుమార్ నటించిన ఈ చిత్రానికి సంగీతదర్శకుడు ఇళయరాజా. ‘తూర్పు సిందూరం’ చిత్రానికి సీతారామశాస్త్రి రాసిన ‘తలవాకిట ముగ్గులు వేకువకే అందం..’ ‘పొద్దువాలిపోయే నిద్దరొచ్చే వేళాయెనే...’ మొదలైన పాటలు బహుళ ప్రచారాన్ని పొందాయి.

పై చిత్రానికి దగ్గరగా జగపతిబాబు, సౌందర్య, మీనా ప్రధాన తారాగణంగా కోడిరామకృష్ణ దర్శకత్వంలో ‘చిలక పచ్చ కాపురం’ (1995) డైరెక్ట్ టేక్ చిత్రం తెలుగులో వచ్చింది. కథ, సన్నివేశాలు అవే. అయితే దర్శకుడు కోనసీమలో జరిగిన ఒక యథార్థ సంఘటన ఆధారంగా ఈ సినిమాను తీశానన్నారు.

10. బి. సరోజాదేవి, శివాజీ గణేశన్ నాయికా నాయకులుగా నటించిన ‘పుదియపరవై’ను ‘సింగపూర్ సి.ఐ.డి’ (1965) పేరుతో తెలుగు చేశారు. దీనికి యం.యస్.విశ్వనాథన్ సంగీత దర్శకుడుకాగా, కణ్ణదాసన్ తమిళంలో పాటలను రాశారు. తెలుగులో ఆరుద్ర మాటలు, పాటలూ సమకూర్చారు. దీనిని సుజాత, సుమన్ నాయికానాయకులుగా ‘మాయదారి అల్లుడు, (1981) పేరుతో – తెలుగులో డైరెక్ట్ టేక్ చిత్రంగా తీశారు.

ఇవి మచ్చుకి మాత్రమే. సినీపండితులను కదిలిస్తే ఈ జాబితాకు కొనసాగింపుగా చాలా చెపుతారు. పై వివరాలను రంధ్రాన్వేషకులు చూస్తే రాయవలసినవి చాలా మిగిలిపోయాయంటారు.

ఇక్కడ చెప్పదలచిన సమాచారం డబ్బింగ్ చిత్రాలను అనుసరించి, సంగ్రహించి తెలుగులో యెన్నో విజయవంతమైన డైరక్ట్ టేక్ చిత్రాలు వచ్చాయనీ, వాటికి డబ్బింగ్ చిత్రాలు విజయసోపానాలుగా వుపయోగపడ్డాయనీ మాత్రమే. దీనికి అపవాదాలుగా పరభాషాచిత్రాలను అనుసరించి తెలుగులో తీసిన చిత్రాలు ముందుగాను, డబ్బింగ్‌చిత్రాలు తరవాత వచ్చిన సందర్భాలు కూడా లేకపోలేదు. అలాగే ఎ.వి.యం. వారు తమిళంలో తీసిన తమ చిత్రాలను ‘డబ్’ చెయ్యకుండా అవే యితివృత్తాలతో ‘నాదీ ఆడజన్మే’ (నానుం ఒరుపెణ్) లేత మనసులు (కులందైయుం దైవముం) మొదలైన చిత్రాలను తీశారు. పాటల బాణీలు, భావాలు చాల వరకు అవే!

పై సమాచారాన్ని బట్టి నాటి నుంచి నేటి వరకు ‘డైరెక్ట్ టేక్’ సినిమాల మీద వస్తున్న ఆరోపణలూ, అభియోగాలూ – అసత్యాలు కావనీ, అనేక సందర్భాలలో వాటి

విజయాలకు డబ్బింగ్‌చిత్రాలు సాధనాలయ్యాయనీ, వాటిని తక్కువగా అంచనా వెయ్యడం తగదనీ - విజ్ఞులూ విమర్శకులూ గ్రహిస్తారని ఆశిద్దాం.

❖

ఈ అధ్యాయంలో
సమాచార సేకరణకు వుపయోగపడిన వ్యాసాలు, సంభాషణలు:

1. పరభాషాచిత్రాల అనువాదాలూ-అనుసరణలూ! - పైడిపాల
   23-5-14న ఆంధ్రభూమి దినపత్రిక 'వెన్నెల'లో వ్యాసం.
2. కీ.శే. భూపతిరాజు అచ్యుతరామరాజుతో (విశాఖపట్నం) 5-4-14న ముఖాముఖి.
3. వి.ఎ.కె. రంగారావు సూచనలూ, సవరణలూ.
4. సినీ రచయిత తోటపల్లి మధు జ్ఞాపకాల నుంచి సమాచారం.
5. పారుపూడి విశ్వేశ్వరరావు, అమలాపురం - జ్ఞాపకాలు.
6. 'రాగబంధం' ఇళయరాజా తెలుగు సినీగీతమాలిక - గోలి సాయిబాబు

# ఆరు దశకాలూ - మూడు దశలూ!

భారతాంధ్రీకరణంతో నన్నయ తెలుగు సాహిత్యానికి 'ఆదికవి' గా పరిగణింప బడినట్లే, 'ఆహుతి'డబ్బింగ్ చిత్రంతో శ్రీశ్రీ తెలుగులో అనువాద సినీసాహిత్యానికి ఆద్యులయ్యారు. తెలుగు డబ్బింగ్ సినిమాకి 2010 నాటికి అరవయ్యేళ్ళు. ఈ ఆరుపదుల కాలంలో డబ్బింగ్ సినిమాలకు మాటలు పాటలు రాసిన వారి సంఖ్య 250 కి పైగా వుండొచ్చని అంచనా. కేవలం మాటల రచనకు పరిమితమైన వారిని మినహాయిస్తే - అవీయివీ రాసిన వారు, పాటలు మాత్రమే రాసిన వారు కలిసి 200 పైగా వున్నారు. తొలి దశలో అంటే మొదటి ఇరవయ్యేళ్లలో (1950 –69) పాటలు రాసిన వారి సంఖ్య 40 మాత్రమే. అయితే వీరిలో అధికశాతం సినిమా రచనతో కవులైన వాళ్లు కాదు. కవులుగా, నాటక రచయితలుగా లబ్ధప్రతిష్ఠులైన తర్వాత సినిమారచన చేపట్టిన వాళ్లు. ఎందరో విద్వత్కవులు తమ కలాలతో డబ్బింగ్ రంగాన్ని సుసంపన్నం చేసిన ఈ కాలాన్ని శ్రీశ్రీ శకం అనడం సమంజసం.

బలిజేపల్లి లక్ష్మీకాంతం, ముద్దుకృష్ణ, ఆరుద్ర, ఆత్రేయ, శ్రీ వాత్సవ, బైరాగి, మల్లాది రామకృష్ణశాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, అనిశెట్టి, దాశరథి, నారాయణ రెడ్డి మొదలైన మహామహులంతా ఈ మొదటి తరం డబ్బింగ్ కవుల జాబితా లో వుండడం డబ్బింగ్ రంగం చేసుకొన్న అదృష్టమనే చెప్పాలి. వీరిలో శ్రీ వాత్సవ, నారాయణరెడ్డి, దాశరథి, ఉషశ్రీ ప్రభృతులు ఈ రంగంలో యాదృచ్ఛికంగా అడుగు పెట్టి పరిమితంగా రచనలు చేసినవారే. 'మహారథి కర్ణ' (1960) లో జాషువా, కరుణశ్రీల పద్యాలు వినియోగించటం వల్ల వారిని ఈ జాబితాలో చేర్చవలసి వచ్చింది కాని వారు యితర డబ్బింగ్ చిత్రాలకు రాయలేదు. ఆ పద్యాలను ఫ్రీజ్ చేసిన సన్నివేశాలపై చిత్రీకరించారు. అలాగే సి. నారాయణరెడ్డి కూడా 'కర్ణ' (1964) డబ్బింగ్ చిత్రానికి మాత్రమే పాటలు రాశారు. మిగిలిన భాషలలో లేని తెలుగు వారి ఆస్తి అయిన పద్యాలను కూడా ఈ తరం డబ్బింగ్చిత్రాలలో వినియోగించడం విశేషం.

ఈ శకంలో వచ్చిన సుప్రసిద్ధ చిత్రాలు - ఆలీబాబా - 40 దొంగలు, కొండవీటి దొంగ, గాంధారి గర్వభంగం, జింబో, జింబో నగరప్రవేశం, పాప పరిహారం, సంపూర్ణ రామాయణం, ప్రాయశ్చిత్తం, శివరాత్రి మహత్యం, సర్వర్ సుందరం, వీరపాండ్య కట్టబ్రహ్మన, శ్రీ రామభక్తహనుమాన్ మొదలైనవి. సంఖ్యాపరంగా ఈ తరంలో యెక్కువ చిత్రాలకు రచన చేసిన వారు అనిసెట్టి (65), శ్రీశ్రీ (55). శ్రీశ్రీ 'లిప్‌సింక్' ను పాటిస్తూ, భావానికి కూడా ప్రాముఖ్యమివ్వగా, పెదవుల కదలికకు అధిక ప్రాధాన్యమిచ్చిన కవి అనిసెట్టి, ఆరుద్ర ఈ రెండిటి కంటె తెలుగుదనానికి యెక్కువ ప్రాముఖ్యమిస్తూ డబ్బింగ్‌కు కంటి కంటే చెవి ముఖ్యమని అభిప్రాయ పడ్డారు. మొత్తం మీద ఈ తరంలోని కవులంతా డబ్బింగ్ నిబంధనలకు కట్టుబడి, కష్టపడి మూలవిధేయంగా డబ్బింగ్‌రచన చేసిన వారని చెప్పాలి. 'లిప్ సింక్' కనిపించని 'లాంగ్‌షాట్స్' కు సంబంధించిన చిత్రీకరణ, నేపథ్యగీతాలు వంటి అవకాశాలు వచ్చినపుడు మాత్రం ఈ తరం కవులు స్వతంత్ర భావాలను వెలువరించడానికి, తెలుగు వాతావరణాన్ని తీసుకు రావడానికి ప్రయత్నించారు. మూలవిధేయత వుట్టిపడే అనిసెట్టి, శ్రీశ్రీ ల పాటల నుంచి ఒక్కొక్క ఉదాహరణను గమనిద్దాం-

**1.** **పోతే పోనీ పోరా - ఈ**
**పాపపు జగతీ శాశ్వత మెవడురా**
**వచ్చుట యేలో, పోవుట యెటకో**
**వాస్తవం ఎవరూ కనలేరో!**
**మానవులందరు జీవిస్తే - ఇల**
**పాదం నిల్పగ తరమౌనా**
**జీవితమే ఒక స్వప్నమొహో - మన**
**జననం కమ్మని నిద్దురహో - ఇక**
**మరణం ఆత్మకు వేకువహో! ॥పోతే॥**
**అనురాగాల నిలయం కాదురా**
**అనుక్షణ ప్రళయం ఇదియేరా**
**ఆశలు, ప్రేమలు అగ్నిజ్వాలకే**
**ఆహుతియౌ నిది నిజమేరా! - ॥పోతే॥**
**పుట్టిననాడే ఏడ్చేవు - బ్రతు**

కంతా బాధలో నలిగేవు - ఆ
వేదనతో వెళిపోయేవు! - ॥పోతే॥

'పాలుం పళముం' అనే తమిళ చిత్రానికి తెలుగు సేత అయిన ' ప్రాయశ్చిత్తం' లో అనిసెట్టి రాసిన ఈ తాత్త్విక గీతం ఆనాటి సినీప్రియులను అమితంగా ఆకట్టుకుని నేటికీ వినిపిస్తోంది.

2. జయ రఘునందన జయజయరాం
జానకి వల్లభ సీతారాం
సంసారజలధీ దాటించగలదీ
రెండక్షరముల నామమే జయ
శ్రీరామచంద్రుని నామమే!

ఓ రెండక్షరముల శక్తి యిదేగా
రామ్‌రామ్ జయ రామ్ రామ్
భవసాగరమే దాటించు కదా
రామ్ రామ్ జయ రామ్ రామ్

ప్రభుడు తలిస్తే ఈ లోకమంతా
తలక్రిందులుగా మారును కాదా
సీతారాముని కరుణాప్రభావము
నిలిచెను తోడు - నీడగా ॥జయ॥

పాషాణమైనా నాలించు కాదా
రామ్ రామ్ జయ రామ్ రామ్
రాముని నామమ్ము రాముని శక్తి
సాగరమంటే భయమేల నయ్యా
రాముడే మా చెంత లేడా
వానరదళమే నడిపించు కాదా
పవనపుత్ర హనుమానుడే ॥జయ॥

భేదించలేమా బంగారులంక
రావణునికి మూడిన దింక

ధాటిని చూసి ధరణీతలంలో
రామనామమే మ్రోగించుధంకా
ఆనందముతో కలియంగ లేరా
రామచంద్రుడు, జానకి... ॥జయ॥

**- శ్రీరామభక్త హనుమాన్ (1958)**

'పవనపుత్ర హనుమాన్' అనే హిందీ చిత్రానికి తెలుగు రూపమైన 'శ్రీరామభక్త హనుమాన్' చిత్రం లో శ్రీశ్రీ రాయగా ఘంటసాల ఆలపించిన ఈ పాట ఆ నాడు బహుళ ప్రాచుర్యాన్ని పొందింది. డబ్బింగ్ సామ్రాజ్యాన్ని యాభైలలో శ్రీశ్రీ, అరవైలలో అనిసెట్టి యేలారు. శ్రీశ్రీ తెలుగులో డబ్బింగ్‌కి ప్రాచార్యుడైనా, ఆయన 'డైరక్ట్ టేక్' సినిమాలలోని పాటల కంటే సంఖ్యా పరంగా డబ్బింగ్ పాటలే ఎక్కువగా రాసినా - ఆయనపై 'డబ్బింగ్ రైటర్' అనే ముద్ర పడలేదు. అనిసెట్టి తెలుగులో నేరుగా తీసిన చిత్రాలలో కూడా గొప్ప పాటలు రాసినా, యెక్కువ డబ్బింగ్ చిత్రాలకు రాయడం వల్ల ఆయనకు అనువాదకవిగా ముద్రపడింది. అనిసెట్టి లాగే అనువాద ముద్రపడిన వీటూరి కూడా డబ్బైలలో అనేక డబ్బింగ్ చిత్రాలకు మాటలూ, పాటలూ అందించిన శ్రీశ్రీ శకానికి చెందిన మరో ప్రసిద్ధకవి. 'మనోహర' (1954) ట్రాక్ ఛేంజ్ చిత్రం లో శివాజీ గణేశన్ కి కళావాచస్పతి జగ్గయ్య చెప్పిన ఆవేశపూరితమైన డబ్బింగ్ సంభాషణలు (రచన బలిజేపల్లి, ఆత్రేయ) గ్రామ ఫోన్ రికార్డుగా వచ్చి పాటల స్థాయిని మించి అమ్ముడు కావడం డబ్బింగ్ ప్రక్రియకే గర్వకారణం! డబ్బింగ్ చిత్రనిర్మాణాన్ని వ్యాపారంగా మార్చుకొని డబ్బింగ్ కవులనూ, కళాకారులనూ దోచుకొన్న 'కండక్టర్లు' 'కాంట్రాక్టర్లు' వ్యవస్థ కూడా ఈ శకంలోనే ప్రారంభమైంది.

రెండు శ్రీలు ధరించిన శ్రీశ్రీ మహారాజు డబ్బింగ్ సామ్రాజ్యాన్ని స్థాపిస్తే దానిని విస్తరించి వైభవోపేతంగా యేలిన యువరాజు ఒక శ్రీ ని ధరించిన రాజశ్రీ. రాజశ్రీ 'మూఢనమ్మకాలు' (1963) డబ్బింగ్‌చిత్రం తోనే రంగప్రవేశం చేసినా, విజృంభించి తన విశ్వరూపాన్ని ప్రదర్శించిన కాలం 1970 తరవాతే. 1970 నుంచి రెండున్నర దశాబ్దాల పాటు డబ్బింగ్ రంగాన్ని 'ఏక కలాధిపత్యంగా' యేలి 600 కు పైగా డబ్బింగ్ చిత్రాలకు రచన చేసి ఆ రంగంలో శిఖరాగ్రాన నిలిచిన అద్భుత ప్రతిభాశాలి రాజశ్రీ. అందువల్ల 70 - 94 మధ్య కాలాన్ని రాజశ్రీ శకం అనడం సముచితం.

ఈ తరంలో రాజశ్రీతో పాటు వేటూరి, సిరివెన్నెల సీతారామశాస్త్రి, మైలవరపు గోపి, గోన విజయరత్నం, వెన్నెలకంటి, గురుచరణ్ మొదలైన వారు కూడా డబ్బింగ్ పాటలు రాసినా, అగ్రతాంబూలం మాత్రం రాజశ్రీదే. వీరిలో వేటూరి, సీతారామశాస్త్రి వంటి ప్రసిద్ధులు తప్పనిసరి అయితే తప్ప డబ్బింగ్‌రంగం మీద దృష్టి సారించ లేదు. ఈ పాతికేళ్ల ప్రస్థానం లో మరో నలభైమంది వరకు డబ్బింగ్‌కవుల జాబితాలో చోటు చేసుకొన్నారు. ఈ కాలంలో డబ్బింగ్ చిత్రాల సంఖ్య గణనీయంగా పెరిగింది. సుమారు 900 చిత్రాలు విడుదలయిన ఈ కాలంలో ఒక్క 1990 లోనే డబ్బింగ్ చిత్రాల సంఖ్య 107 కు చేరి డైరక్ట్ టేక్ చిత్రాలకు (83) సవాల్ విసిరింది. ఆ యేడు రాజశ్రీ 50 డబ్బింగ్ చిత్రాలకు పైగా రాసి తన ఆధిపత్యాన్ని, సత్తాను రుజువు చేసుకొన్నారు.

ఈ దశలో వివిధ భాషల నుండి తెలుగు చేసిన శ్రీకృష్ణ దేవరాయలు, గౌరవం, మహావీర మయూర, మౌనగీతం, ప్రేమసాగరం, రాగమాలిక, ఆత్మబంధువు, సింధుభైరవి, నాయకుడు, ఘర్షణ, వైశాలి, ప్రేమ పావురాలు, రోజా, కంకణం, విచిత్ర సోదరులు, సిందూర పువ్వు వంటి చిత్రాలు డైరెక్ట్ టేక్ చిత్రాలతో పోటీపడి ప్రేక్షకాదరణను పొందాయి. వీటిలో చాలా చిత్రాలు శతదినోత్సవాలు, రజతోత్సవాలు జరుపుకోగా కొన్ని బంగారు డిస్కులు, ప్లాటినమ్ డిస్కులు అందుకోవడం విశేషం.

రాజశ్రీ హయాంలో డబ్బింగ్ పాటల చరిత్రలో ప్రధానంగా వచ్చిన మార్పు పాట ప్రవాహగతితో పరుగుతీయడం. నాటకరంగం నుంచి సంగీతదర్శకుడ వుదామని సినీరంగంలో అడుగిడిన రాజశ్రీ అనూహ్యంగా రచయితగా స్థిరపడ్డంతో తనకు గల సంగీతానుభవ పరిజ్ఞానాలతో పాటను సరళతరం చేసి దాని వేగం పెంచారు. మణిరత్నం వంటి దర్శకుల ప్రోత్సాహంతో గతతరం కవులు పాటించిన నిబంధనల నుంచి బయట పడి వినసొంపైన పాటల్ని రాశారు. అవసరమైన మేరకే 'లిప్ సింక్' ను పాటిస్తూ మాతృక ననుసరించారు. ఇలా తెలుగులో నేరుగా తీసిన చిత్రాల్లోని పాటలకు దీటుగా డబ్బింగ్ పాటలు రాయాల్సిన అవసరం యేర్పడ్డంతో రాజశ్రీ సమకాలికులు, ఆయన అనుయాయులు అనువాద గేయ స్వరూపం లో వచ్చిన మార్పును స్వాగతించారు.

ఈ దశలో వచ్చిన డబ్బింగ్ పాటల పరిణామాన్ని సూచించే రెండు వుదాహరణల్ని పరిశీలిద్దాం –

**1. సాగరతీర సమీపాన**

**తరగని కావ్యసుధామధురం**

కాలచరిత్రకు సంకేతం
కరుణకు చెరగని ప్రతిరూపం

చరణం-1

పచ్చని వృక్షము లలరారు
బంగరు పైరులు తనరారు ॥2॥
మాయని సిరులే సమకూరు
వేలాంగణ్ణి అను వూరు ॥సాగర॥

చరణం-2

విరితావులను వెదజల్లి
వీచే చల్లని చిరుగాలి (2)
ఆవుదూడల ప్రేమగని
పాడెను మమతల చిహ్నమని ॥సాగర॥

చరణం-3

మట్టిని నమ్మిన కర్షకులు
మాణిక్యాలు పొందేరు (2)
కడలిని నమ్మిన జాలరులు
ఘనఫలితాలు చెందేరు (2) ॥సాగర॥

చరణం-4

పాలు తేనై కలిశారు
అనురాగములో దంపతులు (2)
తోడునీడై మెలిగారు
చవిచూశారు స్వర్గాలు ॥సాగర॥

- మేరీమాత (1971), మాతృక : అన్నై వేలాంగణ్ణి

రాజశ్రీ రాసిన ఈ గీతాన్ని జి. దేవరాజన్ సంగీత దర్శకత్వం లో కె.జె. ఏసుదాస్ బృందం ఆలపించారు. కర్ణ పేయమైన బాణీని, కమ్మని భావాన్ని అలాగే అంత మధురంగానూ రాజశ్రీ తెలుగులో అందించారు.

2. పొద్దు వాలిపోయే... నిద్దరొచ్చే వేళయ్యేనే
ఊరువాడలోన... సడి లేనే లేదయ్యేనే (2)

అలసిన బొండుమల్లి సరిగా బజ్జోమరి
కలలే కంటూ నువ్వు ఉయ్యాలూగే.. హోయ్ ||పొద్దు||

చరణం-1

చిరుగాలి పరదాలే... గలగలలాడీ
చెవిలోన లోలాకూ... జతగా పాడీ
బంగరు దేహం సోలుతుంది పాపం
చల్లని పూటా కోరుకుంది రాగం
నీవే అన్నావే నే పాడాలంటూ
ఊగీ తూగాలీ నా పాటే వింటూ.. హొూయ్ ||పొద్దు||

చరణం-2

ముత్యాలవాడల్లో వెన్నెలే సాగే
రేరాణి తాపంలో వెల్లువై పొంగే (2)
చింతలన్ని తీర్చే మంచుపువ్వు నీవే
మెత్తగా లాలీ నే పాడుతాలే
విరిసే హరివిల్లే వూరించే వేళా
మనసే మరిపించీ కరిగించే వేళా.. హొూయ్ ||పొద్దు||

సిరివెన్నెల సీతారామశాస్త్రి రాసిన ఈ జోల పాటను చెపితే తప్ప డబ్బింగ్‌పాట అనుకోరు. చిరుగాలి పరదాలు, మంచుపువ్వు వంటి మనసును మరిపించి, కరిగించే లలితపదజాలంతో మెత్తగా రాసిన ఈ లాలిపాట బాణీ మాత్రం మాతృకానుసారంగానే సాగింది. సీతారామశాస్త్రి లాగే వేటూరి కూడా డబ్బింగ్ పాటల్ని సైతం తన స్వీయముద్ర తోనే స్వేచ్ఛగా రాశారు. వెన్నెలకంటి 'నాయకుడు', 'సుందరాంగుడు', 'సంగ్రామం' వంటి చిత్రాలకు పాటలు రాసి తన ప్రతిభను నిరూపించుకొన్నా, డబ్బింగ్ రంగంలో అప్పటికింకా రెండుకాళ్లూ పెట్టలేదు. 'వసంతకోకిల', 'శ్రీ మంత్రాలయ రాఘవేంద్రస్వామి మహత్యం', 'అనురాగ సంగమం' వంటి చిత్రాల్లో మంచిపాటలు రాసి తన వునికిని నిరూపించుకొన్న మైలవరపు గోపి స్వల్పకాలమే డబ్బింగ్‌చిత్రాలకు పనిచేసి అస్వస్థులు కావడం వల్ల, రాసిన వాటిలో యెక్కువ వ్యాపారచిత్రాలు కావడం వల్ల డబ్బింగ్ రంగంలో ఆయన సామర్థ్యానికి తగిన గుర్తింపు రాలేదు.

ఈ దశలో వచ్చిన సినిమాల పేర్లను గమనిస్తే – అవి డబ్బింగ్‌చిత్రాలని స్పష్టంగా తెలుస్తుంది. కేవలం వ్యాపారదృష్టితో తీసిన ఈ డబ్బింగ్‌చిత్రాల్లో యాంత్రికంగా రాయడంతప్ప రచయితలకు ప్రతిభాపాటవాలను ప్రదర్శించే అవకాశాలు సన్నగిల్లాయి. తొలిదశలో డబ్బింగ్‌రంగంలో వున్న పెద్ద సంస్థలు, ప్రముఖనిర్మాతలు ఆ రంగం నుంచి వైదొలగడంతో యెవరు పడితే వారు డబ్బింగ్ చిత్రనిర్మాణానికి పూనుకోవడంతో – అది కూరగాయల వ్యాపారంలా మారింది. రచయితలూ, డబ్బింగ్ కళాకారులూ అభిరుచులతో ప్రమేయం లేకుండా కాంట్రాక్టర్ల చెప్పుచేతల్లో కేవలం జీవిక కోసం పనిచెయ్యాల్సిన అగత్యం యేర్పడింది. ఈ పరిస్థితుల్లో రాజశ్రీ వంటి రచయితలు కాంట్రాక్టర్లకు బదులుగా తామే చిత్రనిర్మాణాన్ని గుత్తకు తీసుకొని చాలమంది కళాకారులకు వుపాధిని కల్పించడం శుభపరిణామం.

రాజశ్రీ తర్వాత డబ్బింగ్ రంగంలో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు వెన్నెలకంటి. సంఖ్యాపరంగా కూడా రాజశ్రీ తర్వాత యెక్కువ డబ్బింగ్ చిత్రాలకు రాసిన ఖ్యాతి వెన్నెలకంటికే దక్కుతుంది. వెన్నెలకంటి కూడా రాజశ్రీ లాగే రెండు చేతులతో మాటలూ పాటలూ రాయడమే గాక ఒక కాలు చెన్నైలోను మరో కాలు హైదరాబాద్‌లోనూ పెట్టి చెన్నైకి పరిమితమైన డబ్బింగ్‌ప్రక్రియను కుటుంబసభ్యులను (కొడుకులిద్దరూ డబ్బింగ్ రచయితలే!) శిష్యబృందాన్ని కలుపుకొని హైదరాబాద్‌కి విస్తరిస్తున్న ఘనతను కూడా సొంతం చేసుకొన్నారు. అందువల్ల డబ్బింగ్ రంగంలో నడుస్తున్న తరం(గం) వెన్నెలకంటిదని పేర్కొనవచ్చు.

ఈతరంలో డబ్బింగ్ పట్ల పూర్తి అవగాహనతో 'హిట్‌సాంగ్స్' రాసిన మరోకవి భువనచంద్ర. ప్రేమదేశం, భారతీయుడు, ముత్తు, చెలి మొదలైన చిత్రాల్లో భువనచంద్ర రాసిన జనరంజకమైన పాటలు ఆయన పేరు డబ్బింగ్ రంగంలో మారుమ్రోగేలా చేశాయి. ఈ కాలంలో ప్రాచుర్యం పొందిన డబ్బింగ్ పాటలు రాసిన జంట శివగణేష్, ఎ.యం. రత్నం.మూలాన్ని మక్కికి మక్కిగా అనుసరిస్తూ ఈ జంట ఒకేఒక్కడు, జీన్స్, అరుణాచలం మొదలైన చిత్రాల్లో రాసిన పాటలు బహుళప్రాచుర్యాన్ని పొందాయి. ఇంకా ఈ దశలో జొన్నవిత్తుల, చంద్రబోస్, భారతీబాబు, పొందూరి, రామజోగయ్యశాస్త్రి, వనమాలి వంటివారు వైవిధ్యమైన డబ్బింగ్‌పాటలను అందించారు. డబ్బింగ్‌పాటలను కూడా కొత్తగానూ, కవితాత్మకంగానూ రాయాలని ఈ తరంలో కొందరైనా తపనపడ్డారు, హృద్యమైన అభివ్యక్తులకు ప్రయత్నించారు. అయితే ఈ దశలో వందమందికి పైగా

డబ్బింగ్ పాటలు రాసినా, గుర్తుండే పేర్లు తక్కువ. ఈ రంగంలో యెవరుబడితే వాళ్లు యెలాగైనా రాయొచ్చు అనే తేలికపాటి భావంతో యెగబడ్డం వల్ల రచనాప్రమాణాలు దిగజారాయి. అందువల్లనే చిత్రాలసంఖ్య పెరిగినంతగా గుర్తుండే సినిమాలు, పాటలు మిగలడం లేదు. ఈదశలో యేటా విడుదలయ్యే చిత్రాల సంఖ్య పెరిగి అప్పుడప్పుడూ డైరెక్ట్ టేక్ చిత్రాల సంఖ్యను కూడా అధిగమిస్తూ – 2010 నాటికి సుమారు 1200 చిత్రాలను పాతజాబితాకు జత చేశాయి. ఇంగ్లీషు నుంచి కూడా తెలుగులోకి సినిమాలు తర్జుమా కావడం ఈ దశలోని విశేషం.

మాతృకలోని భావానికి ఈతరం కవులు కొత్తసొగసులు అద్దడానికి చేసిన ప్రయత్నాలకు వుదాహరణంగా 'గుణ'లో వెన్నెలకంటి రాసిన పాటను పరిశీలిద్దాం –

**పల్లవి :** **పిచ్చిబ్రహ్మ ఆడుతున్న తోలుబొమ్మలాటలోన**
**ఎప్పుడింక ఆటవిడుపూ... ఓ తమ్ముడా**
**చెప్పుకుంటె జాలిగొలుపూ**
**ఈ పుట్టుటేమొ గిట్టుటేమొ చిత్రమేమొ చెప్పలేని**
**సంశయాల మేలుకొలుపు... ఓ తమ్ముడా**
**సంకటాల బ్రహ్మతలపూ**
**కన్ను తెరిస్తే జననం... కన్నుమూస్తే మరణం**
**రెప్పపాటు జన్మా, తప్పదంట కర్మా ॥పిచ్చి॥**

**చరణం–1**

**తల్లి–తండ్రి, ఆలుమగలూ అందమైన బంధమూ**
**నాటకాల లోకం వేసే మాయదారి వేషమూ**
**వెనక వుండి నడిపేవాడూ సూత్రధారి దేవుడూ**
**వెతలలోన నలిగేవాడూ పాత్రధారి జీవుడూ**
**వీడదంట దేహం సందేహం నీ దాహం నూరేళ్ల వరకూ**
**తీరిపోతే లోపం నీ పాపం ఆ దీపం వెయ్యేళ్లు వెలుగూ**
**ఈ వైరాగ్యం ఆరోగ్యం విస్సన్న వేమన్న తామన్న తత్త్వమిది॥పిచ్చి॥**

**చరణం –2**

**నీటి మీద రాతే కదా ప్రాణమున్న దేహమూ**
**ఓటికుండ మోతలేరా పెంచుకున్న పాశమూ**

**ఎవరికోస మేనాడైనా ఆగబోదు కాలమూ**
**ఎవరి కెవరు ఈలోకంలో అదే ఇంద్రజాలమూ**
**మూడునాళ్ల భోగం, వైభోగం... నీభాగం ఏమౌను తుదకూ**
**ఆలకించి వేదం వివాదం సంవాదం... నీదారి వెదుకూ**
**ఇది వేదాంతం సిద్ధాంతం సత్యాన ముత్యాలు పంచేటి బాధయిది ॥పిచ్చి॥**

**- గుణ (1992)**

ఇది వరకు వచ్చిన కవితల పంక్తులను, పాటల పంక్తులనూ, వైరాగ్యసూక్తులనూ అక్కడక్కడా వాడుకొంటూ అందమైన ప్రాసలతో మనసును హత్తుకునేలా వేదాంత సిద్ధాంతాన్ని సరళంగా చెప్పిన ఈపాట - మాతృకను యథాతథంగా అనుసరించిది కాదని తెలుస్తూనే వుంది.

మాతృకానుసారంగా అనువదించాలనే ప్రయత్నంలో డబ్బింగ్ పాటల్లో దొర్లే వైపరీత్యాలకు వుదాహరణంగా ఈ కాలం లోనే వచ్చిన శివగణేష్, ఎ.యం.రత్నం జంట రచనను చూద్దాం-

**బూమ్ బూమ్ షిక్కుకా షిక్కుకా కా బూమ్‌బూమ్... ఈహ్**

**ప్రేమ ఇదితే అదితే అని అడుగునా**
**ప్రేమ స్థితిని గతిని అనీ చూచునా (2)**

**ముళ్లమీద కాకిపిల్ల నిదురించదా**
**చెత్తకుప్ప మీద రోజా వికసించదా**
**పూరిల్లైనా ఫర్వాలేదు, ప్రేముంటే చాలు**
**పరమాన్నాలు అక్కర్లేదు, నీళ్లుంటే చాలు**

**ప్రేమ పుడితే ఇత్తడి కూడా పుత్తడిగని అవును**
**చిల్లుల డబ్బీలో ప్రేమదూరితే పిల్లన గ్రోవవును**
**చెట్టు చెక్కిన పొట్టుతోటి పూలపానుపు చేద్దాం**
**మెడ విరిగిన బాటిల్లో దీపములై వుందాం**
**పుట్టగొడుగును పట్టే నా చెయి హత్తుకొని వుందాం**
**సాలెగూట్లో సాలీడులమై ఉయ్యాల లూగుదాం**
**వాననీటి బురదల్లో వానపాముల మవుదాం**

**కుళ్లిపోయిన మామిడిలో జతపురుగుల మౌదాం -**

**- బాయ్స్ (2003)**

ప్రేమతత్త్వాన్ని వివరించడానికి ప్రయత్నించిన యీ పాటలో చివరి రెండు పంక్తులు జగుప్సాకరంగా వుండడంతో సినీమేధావుల విమర్శలకు గురయ్యాయి.

ఒక మాటలో చెపితే తెలుగు చలనచిత్ర సాహిత్యచరిత్రలో చివరి రెండు దశాబ్దాలలో వచ్చిన డైరెక్ట్ టేక్ చిత్రాలు, పాటలు యెదుర్కొంటున్న విమర్శలకు ఈ దశలో వచ్చిన డబ్బింగ్ చిత్రాల పరిస్థితి కూడా యేమాత్రం భిన్నం కాదు!

❖

ఈ ప్రకరణంలో
సమాచార సేకరణకు వుపయోగపడిన వ్యాసాలు :

1. 10-9-2002 'ఇండియా టుడే' లో 'మాటల మాంత్రికులు' వ్యాసం.
2. ఆంధ్రప్రభ 1999 విశేష ప్రచురణ 'మోహిని' రెండవ భాగంలో -
   అ) 'పెదవులకు మాటలు అతికించడం ఓ చిత్కళ' వసంత కుమార్ వ్యాసం.
   ఆ) 'గాత్ర దానకర్ణులూ పుట్టారు' - పి.జె. శర్మ వ్యాసం.
3. వెన్నెలకంటి నుంచి సమాచారం.

# గుర్తొచ్చే కెరటాలు కొందరు..!

డబ్బింగ్‌రచన స్ట్రెయిట్ చిత్రాలకు రాయడం కంటె కష్టమైనదనీ, అది కత్తి మీద సాము లాంటిదనీ చాలమంది అనుభవజ్ఞులు అభిప్రాయపడ్డారు. అందుకనో, డైరెక్ట్ టేక్ చిత్రాలకు రాసినంత ఖ్యాతి కాని, రాబడి కాని, రావనో – తెలుగులో నేరుగా తీసిన చిత్రాలకు రాసినంత మంది డబ్బింగ్‌చిత్రాలకు రాయలేదు.

ఈ డబ్బింగ్ బరిలో వున్న రచయితలు కూడా రకరకాలు. డైరెక్ట్ టేక్ చిత్రాల రచయితల మధ్య వున్న పోటీలో నిలబడలేని వాళ్లు, ఆ రంగంలో అంతగా గుర్తింపు రాక ఈ రంగాన్ని ఆశ్రయించిన వాళ్లు, ఈ రంగంలో తమ ప్రతిభను నిరూపించుకొని ఆ రంగంలో అవకాశాలను అందుకొందామనుకొనే వాళ్లు, ఆపద్ధర్మంగా అనుకోకుండా డబ్బింగ్‌రచన చేపట్టిన వాళ్లు, నిర్మాతలతో వుండే సాన్నిహిత్యంతో అంతగా వాటిల్లే నష్టం యేమీవుండదు గనుక ఒకటో అరో డబ్బింగ్‌పాట రాసే అవకాశాన్ని మొహమాటపెట్టి లాక్కొని సినిమారచయిత లనిపించుకొందామనే కొత్త బిచ్చగాళ్లు, ఇంకా డబ్బింగ్ పాటలు యెంతిచ్చినా క్షణాల మీద రాసిస్తామని నిర్మాతలను ప్రాధేయపడేవాళ్లు... ఇలా డబ్బింగ్‌రంగంలో యెందరో రచయితలు తారసపడుతుంటారు. ఈ రంగంలో ప్రసిద్ధులైన రచయితల్లో కూడా – కొంతకాలం డైరెక్ట్ టేక్ చిత్రాలకు రచనలందించి, ఆ తర్వాత మెరుగైన అవకాశాలు రావడం వల్ల యిక్కడ స్థిరపడిన వాళ్లు కొందరయితే – రెండు రంగాల్లోనూ రాణిస్తున్న సవ్యసాచులు, డబ్బింగ్ రచనను ఆనుషంగికంగా భావించే మేధావులు మరికొందరు. ఈ అరవైయేళ్లలో వచ్చిన యిన్ని తెగలకు చెందిన యింతమంది రచయితల నుంచి కొందరిని ప్రత్యేకంగా పేర్కొనడం కూడా అసిధారావ్రతమే!

నా 'తెలుగు సినీగేయకవుల చరిత్ర' పరిశోధన గ్రంధంలో – తెలుగులో నేరుగా తీసిన చిత్రాలకు పాటలు రాసిన యెనిమిది దశాబ్దాలకు చెందిన కవుల నుంచి పన్నెండుగురు మార్గనిర్దేశక కవులను యెంపిక చేశాను. అలాగే ఆరు దశాబ్దాలకు చెందిన

డబ్బింగ్ కవుల నుంచి వివిధదశలలో తెలుగు డబ్బింగ్‌పాట కొత్తపుంతలు తొక్కడానికి వారు చేసిన కృషిని గుర్తించి – ఈ రంగంలో అష్టదళాధిపతులను పేర్కొనే సాహసం చేస్తున్నాను. ఇది ఆయా కవుల గేయాలను, రాశి, వాసి, ప్రజారంజకత్వం, సాహిత్య ప్రమాణాలు, డబ్బింగ్ లక్షణాలు అనే కోణాల నుంచి నిశితంగా పరిశీలించి, పెక్కుమంది సినీ సాహిత్యవిమర్శకులతో చర్చించి సహేతుకంగా నిష్పాక్షికంగా చేస్తున్న యెంపిక. ఈ అష్టదిగ్గజాలలో కొందరు డబ్బింగ్‌కవులుగా ముద్ర పడిన వాళ్లయితే – మరికొందరు అటువంటి ముద్ర పడకుండా తెలుగులో నేరుగా తీసిన చిత్రాలకు విస్తృతంగా రాస్తూనే, డబ్బింగ్ చిత్రాలకు కూడా అమూల్యమైన రచనలందించిన వాళ్లు. ఈ యెనిమిదిమంది గురించి కాలానుపూర్విగా విశదంగా తెలుసుకొందాం–



## ఈ రంగంలో తొలితరంగం శ్రీరంగం

(30-4-1910-15-6-83)

అభ్యుదయ కవిగా, మహాప్రస్థానకర్తగా లబ్ధప్రతిష్ఠులైన తర్వాతే శ్రీశ్రీ సినీరంగ ప్రవేశం చేసినట్టు చాలామందికి తెలుసు. కాని శ్రీశ్రీ సినీగేయప్రస్థానం డబ్బింగ్‌చిత్రంతో ఆరంభమయిందని, డబ్బింగ్‌రచనకు శ్రీశ్రీయే ఆద్యులని తెలిసిన వాళ్లు తక్కువ. ఆమాటకొస్తే శ్రీశ్రీ పాటలున్న మొత్తం చిత్రాల్లో నేరుగా తెలుగులో తీసిన చిత్రాల్లోని (స్ట్రెయిట్ పిక్చర్స్) పాటలకంటే డబ్బింగ్‌చిత్రాల్లోని పాటల సంఖ్యే యెక్కువ!

తనకు సినిమా సరదా పదిపన్నెండేళ్ల వయస్సులోనే వున్నట్టు శ్రీశ్రీ 'అనంతం' ఆత్మకథలో రాసుకొన్నారు. 'కాలచక్రం' (1940) చిత్రంలో మహాప్రస్థానం కవితను మార్పులతో వినియోగించినా శ్రీశ్రీ దానిని తన మొదటి సినిమాపాటగా పరిగణించలేదు. సినీరచయితగా తన పేరు తెరకెక్కిన తొలిచిత్రం 'ఆహుతి' యేనని, అదే తన సినీజీవితానికి పునాది వేసిందనీ శ్రీశ్రీయే స్వయంగా రాశారు.

'ఆహుతి' లోని ప్రేమయే జనన మరణ లీలా;' అనే పాట గురించి ప్రస్తావిస్తూ శ్రీశ్రీ యిలా గుర్తుచేసుకొన్నారు.

'సినిమాకు నేను రాసిన పాటలన్నింటిలోనూ యిది మొట్టమొదటిది. ట్యూన్ కి మాత్రమే కాక పెదవుల కదలికకు కూడా సరిపోయే విధంగా 'నీరా ఔర్ నందా' అనే హిందీచిత్రానికి రాసిన డబ్బింగ్‌పాట యిది. తెలుగులో 'ఆహుతి' అనే పేరుతో ఆ చిత్రం విడుదల అయ్యింది. అంతకుముందు చాలాకాలం కిందటనే 'కాలచక్రం' అనే చిత్రంలో నా మహాప్రస్థానం పాట వచ్చింది. కాని అది సినిమాకోసం రాసినది కాదు.

'ఆహుతి' చిత్రం ఆర్థికంగా ఫెయిల్ అయింది. అయితేనేం అందులోని పాటలు చాలా బాగున్నాయని పేరు వచ్చింది. అది విని హెచ్. యం. రెడ్డి గారు అప్పటికి పూర్తికావస్తున్న తమ 'నిర్దోషి' చిత్రానికి రచయితగా నన్ను తీసుకొన్నారు. ఆ తరువాత తెలుగు 'నిర్దోషి', తమిళ 'నిరపరాధి' బ్రహ్మాండమైన విజయాలు సాధించడంతో రెడ్డిగారు రోహిణీ స్టూడియో నిర్మించి నన్ను నెలకు 300 రూ.లు. పారితోషికం (దానిని జీతం అనడానికి వీల్లేదు) మీద పెర్మనెంట్ గా తీసుకొన్నారు. ఆ విధంగా సినీ పరిశ్రమలో స్థిరపడడం జరిగింది.

'ఆహుతి' లోని పాటలన్నీ బాగున్నాయంటే అందుకు సాలూరి రాజేశ్వర రావు సంగీతం గొప్పగా తోడ్పడిందని చెప్పక తప్పదు. హిందీ ఒరిజినల్ లోని ట్యూన్లన్నిటినీ అతడు పూర్తిగా మార్చి తన సొంతముద్ర వేశాడు. కొన్ని సందర్భాలలో ఒకే పాట మూడు నాలుగు రకాలుగా ట్యూన్ చేసి, అందరికీ నచ్చిన దాన్ని ఖాయం చేయడం కూడా రాజేశ్వరరావు ప్రత్యేకత. అన్నిటిలోనూ 'ప్రేమయే జనన మరణలీల'...! అన్న పాట యిప్పటికీ ఘంటసాల వారి మధురకంఠంతో మన రేడియో కేంద్రాల నుండి తరచూ ప్రసారిత మవుతూనేవుంది.

సినిమాకు పాటలు రాయడం చాలామంది అజ్ఞానులనుకునేటంత సులభం కాదు. ఇక డబ్బింగ్‌కు రాయడమనేది మరీ కష్టంతో కూడుకున్న పని. ఉదాహరణకు ప్రేమయే...' అన్న పాటను తీసుకుందాం. హిందీలో దీని పల్లవి 'ప్రేమ్‌హై జనన్ మరణ్ కా ఖేల్'. ట్యూన్ ప్రకారం యిది 'ప్రేమ్ హై-జనన్ మరణ్-కా ఖేల్' అని విరుగుతుంది, ఇందులోని ఆఖరి 'కా ఖేల్' చాలా ఇబ్బంది పెట్టింది. 'ప్రేమయే జనన మరణ ఖేల' (గాథ,క్రీడ) అని రాశాను గాని 'లీల' అనే మాట మొదట్లో స్ఫురించలేదు. ఆ రాత్రి కలతనిద్రలో

రాజేశ్వరరావు ట్యూన్ మననం చేసుకుంటూ వుంటే 'ప్రేమయే జనన మరణలీల' అనే పల్లవి దొరికింది. మర్నాడు పాటంతా పూర్తి చేశాను.[1]

ఇలా డబ్బింగ్ రచనలోని సాధక బాధకాలను వివరించిన శ్రీశ్రీ 'ఆహుతి' నుంచి 'ప్రజారాముడు' (1984) వరకు 80 డబ్బింగ్ చిత్రాలకు రచయితగా పనిచేశారు. శ్రీశ్రీకి 'డబ్బింగ్'లో ఆయన భార్య శ్రీమతి సరోజ సహకరించేవారు. 1956 నుంచి 1968 వరకు వుధృతంగా డబ్బింగ్ చేసిన శ్రీశ్రీ చివరిలో ఆ వ్యాసంగాన్ని తగ్గించారు. శ్రీశ్రీ కలం నుంచి వెలువడిన డబ్బింగ్ చిత్రాల్లో 14 హిందీభాషకు, 4 కన్నడ భాషకు చెందినవి కాగా మిగిలినవన్నీ తమిళభాషకు చెందినవే! శ్రీరామభక్త హనుమాన్, గాంధారి గర్వభంగం, జింబో, జింబోనగర ప్రవేశం, సంపూర్ణ రామాయణం, అరబ్బీ వీరుడు జబక్ మొదలైనవి శ్రీశ్రీకి పేరుతెచ్చిన హిందీ డబ్బింగ్ చిత్రాలు కాగా– మహాదేవి, సెభాష్ పిల్లా, కథానాయకుడు కథ, వీరప్రతాప్, రత్నగిరి రహస్యం, అనగా అనగా ఒకరాజు మొదలైనవి అతని ప్రసిద్ధ తమిళ డబ్బింగ్‌చిత్రాలు. తొలి హిందీ డబ్బింగ్ చిత్రంతో పాటు తొలి కన్నడ డబ్బింగ్‌చిత్రాన్ని (జగన్మోహిని) కూడా తెలుగు చేసిన ఘనత శ్రీశ్రీ దేనని తెలుసు కొన్నాం. శ్రీశ్రీని 'రామభక్త హనుమాన్' ఫేమ్ గానూ, 'మహాదేవి' ఫేమ్ గానూ పాటల పుస్తకాలపై ప్రచురించడం అప్పట్లో డబ్బింగ్ కవిగా ఆయనకున్న ప్రాచుర్యానికి నిదర్శనం. తులనాత్మకంగా పరిశీలిస్తే ఆయన సంఖ్యాపరంగా యెక్కువ తమిళ డబ్బింగ్‌చిత్రాలకు రచయితగా పనిచేసినా, యెక్కువ పేరు తెచ్చినవి హిందీ డబ్బింగ్ చిత్రాలే! ఆ కాలంలో డబ్బింగ్‌చిత్రాల్లోని పాటలన్నీ ఒక కవి మాత్రమే రాసే సంప్రదాయాన్ని పాటించడం వల్ల శ్రీశ్రీ డబ్బింగ్ చిత్రాల సంఖ్య 80 మాత్రమే అయినా వాటిల్లోని పాటల సంఖ్య 500ను అధిగమించింది.

శ్రీశ్రీ అభిప్రాయపడినట్టు డబ్బింగ్ రచనలో అనేక అడ్డంకులు, సమస్యలు యెదురవుతాయి. ముఖ్యంగా 'క్లోజ్ షాట్స్'లో పెదవుల కదలికు అనుగుణంగా లక్ష్యభాషలోని పదాలను యెన్నుకొని సహజంగా వుండేలా రాయగలగడం రచయిత సమర్థతకు పరీక్షే! శ్రీశ్రీ తర్వాత తెలుగులో వందలమంది డబ్బింగ్ రచయితలున్నా, అనువాద కళను అర్థం చేసుకొని దానికి న్యాయం చేసిన కవులు తక్కువే! అలాంటి అసమర్థులైన కవులు డబ్బింగ్ గౌరవాన్ని పాడుచేస్తున్నారని శ్రీశ్రీ వారి మీద విరుచుకు

**1. 'పాడవోయి భారతీయుడా' శ్రీశ్రీ సినిమా పాటల సంకలనం –పుటలు 5,6,7,**

పడ్డారు. పద్మినీ పిక్చర్స్ వారి 'కథానాయకుడు కథ' (1956) చిత్రంలోని 'ఓహో మేఘసఖా ఒకచో ఆగేవో' అనే పాట గురించి వివరిస్తూ శ్రీశ్రీ 'ఇది బి.ఆర్.పంతులు దర్శకత్వం వహించిన, యం.జి.ఆర్. నటించిన ఒక తమిళ చిత్రానికి (ఆయరత్తిల్ ఒరువన్) తెలుగు డబ్బింగ్ వెర్షన్ లో రాసిన పాట. దీనిని ఘంటసాల పాడినప్పటికీ గ్రామఫోను రికార్డుగా వచ్చిందో లేదో సందేహమే! ఎందుకంటే అప్పటికే కొందరు సినీరచయితలు బయలుదేరి డబ్బింగ్ పాటంటే అసహ్యం పుట్టించేశారు. డబ్బింగ్ పాటలను గ్రామఫోను కంపెనీల వాళ్లు రికార్డులుగా విడుదల చెయ్యడానికి భయపడిపోయారు[2] అని వ్యాఖ్యానించారు. ఇది శ్రీశ్రీకి డబ్బింగ్ పాటల రచన పట్ల గల నిబద్ధతను, నిజాయితీని తెలియ జేస్తుంది. ఆమాటకొస్తే ఆయన డబ్బింగ్‌చిత్రాల పట్ల మక్కువతోనే 'చెవిలో రహస్యం' (1959) అనే డబ్బింగ్ చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా చేతులు కాల్చుకొన్నారు కూడా!

మాతృకలకు మక్కికి మక్కిగా డబ్బింగ్ పాటలను రాయడం శ్రీశ్రీ మతానికి విరుద్ధం. ఆయన పాటల్ని అనువాదాల నడం కంటె అనుసృజన లనడం సబబు. అవసరమైన మేరకు 'లిప్‌సింక్'ను పాటిస్తూ, సహజమైన తెలుగు నుడికారంతో పాటలు రాయడం ఆయన బడి. అందువల్ల శ్రీశ్రీ డబ్బింగ్‌పాటల్లో బాణీలు తప్ప భావాలు మూలాన్ని యథాతథంగా అనుసరించినవి కావు. ఇలా డబ్బింగ్‌పాటలకు ఒక ఒరవడిని పెట్టి శ్రీశ్రీ అర్వాచీనకవులకు మార్గదర్శకులయ్యారు. శ్రీశ్రీ డబ్బింగ్ రచనలను సోదాహరణంగా పరిశీలిద్దాం-

1. 'శ్రీరామభక్త హనుమాన్' (1958)లో జాంబవంతుడు, అంగదాది యితర వానరులు హనుమంతుని సముద్ర లంఘనానికి ప్రేరేపించే సందర్భంలో శ్రీశ్రీ ఒక బృందగానాన్ని రాశారు. దీనికి మాతృక 'పవనపుత్ర హనుమాన్' లో 'జాగేహో భజరంగ భళీ'. అనే పాట. మూలం లోని 'ట్యూన్'కి అనుగుణంగా శ్రీశ్రీ తన పాటతో ఈ సన్నివేశాన్ని యెలా పండించారో చూడండి-

**లెమ్మోయీ పవమాన సుతా**
**ప్రభుకార్యమే తీర్చగా తరుణమ్ము నేడే**
**లేవయ్య లేవయ్య లేరయ్య నీసాటి**
**వేవేగ రావయ్య వీరాంజనేయ** ॥లె॥

**జలరాశి నీకొక సెలయేరు కాదా**
**అవలీల దానిని తరియించ లేవా**

**నీశక్తి నీకే మరుపాయె నేలా**
**జాగేల చేయంగ జగదేకవీరా** ॥తె॥

**బాల్యకాలాన భానుని వింత**
**ఫలమని యెంచి కబళించు నంత**
**హాహా కారాలతో జగమంత**
**గాడాంధకారాన అల్లాడ లేదా?** ॥తె॥

**తీరాన నిలిచింది వానరుల మూక**
**చీకాకు చెందింది చేసేది లేక**
**ఆలోచనల్ మాని ఆవేశమే పూని**
**కార్యానుకూలమ్ము కావించలేవా** ॥తె॥

**నీవే కదా మాకు చూపాలి దారి**
**తామసమే లయ్యయ్యో మదిహారి**
**వారాశి లంఘించి చేరి లంకాపురి**
**రావణగర్వము వారించలేవా?** ॥తె॥

చక్కని తెలుగు నుడికారంతో నడిచిన ఈపాటను చెపితే తప్ప హిందీ పాట కనువాదమని యెవ్వరూ అనుకోరు.

2. 'గాంధారి గర్వభంగం' (1859) లో అర్జునుడు అమ్ములతో పేర్చిన నిచ్చెన మీదులా భీముడు స్వర్గలోకానికి కెక్కే సన్నివేశంలో ఈ చిత్రానికి మూలమైన 'గజగౌరి' లో వున్న –

**ధరతీకా షాన్ తూ హై**
**మనుష్య తేరా బడే మహాన్ హై**

అనే పాటలో పల్లవి కి మాత్రమే చిత్రీకరణలో పెదవుల కలయిక వుంది . ఈ అవకాశాన్ని వినియోగించుకొని శ్రీశ్రీ పల్లవి వరకు మూలాన్ని అనుసరించి మిగిలిన భాగాన్ని స్వతంత్రంగా మానవుని శక్తి సామర్థ్యాలను కొనిమాడాతూ అద్భుతంగా రాశారు.

**పదునాలుగు లోకముల ఎదురే లేదే**
**పదునాలుగు లోకముల ఎదురన్నది లేదుగా**

మానవుడే సర్వశక్తిధాముడు కాదా
మనుష్యుడిల మహానుభావుడే చూడగా
మనుష్యుడిల మహానుభావుడే

మానవుడే తలచినచో గిరుల నెగరవేయడా
మానవుడే తలచినచో నదుల గతులు మార్చడా
మానవుడే తలచినచో భూమ్యాకాశాలనే
ఏకము చేయగల సేతువు నిర్మించడా?
మానవుడేనోయ్
మానవుడేనోయ్ సురాసుర కిన్నెర గంధర్వుల
గర్వమణచ గలిగినట్టి శూరుడోయ్
నయనమ్ముల రాగముతో

హృదయమ్ము స్నేహముతో
మానవుడే సృష్టి కలకారం
స్వేచ్ఛా స్వాతంత్ర్య మహా
దీక్షాసాధన పరుడే
మానవుడే యుగభవన ద్వారము
మానవుడేనోయ్ ధరామండలమున స్వర్గము
స్థాపించగ జాలినట్టి వీరుడోయ్!

'ఒక్కపాట కోసమే మళ్లీమళ్లీ చిత్రాన్ని చూడాలనిపించే పాటలలో ఇదొకటి' అని శ్రీశ్రీ ఈ పాట గురించి ఆత్మవిశ్వాసంతో వ్యాఖ్యానించారు. ఆయన నమ్మకాన్ని నిజం చేస్తూ ఈపాట అంతగానూ హిట్టయింది!

3. 'సంపూర్ణ రామాయణం' (1961) లో సీతారామలక్ష్మణులు అరణ్యవాసానికి బయలుదేరే సందర్భానికి శ్రీశ్రీ రాసిన గీతం 'డబ్బింగ్ పాటలలో కూడా సాహిత్య పరిమళాలుండే అవకాశం వుంటుందా' అనుకొనే వారికి చక్కని సమాధానం. 'సంపూర్ణ రామాయణ్' మాతృకలో –

ధరతీ క్యోం విపరీత్ హుయీ
జౌర్ క్యోం విరుధ్ ఆకాశ్ హువా

అనే పాటను తెనిగిస్తూ శ్రీశ్రీ యిలా రాశారు–

ధరణీదేవత శోషించెనుగా
ఘోషించెనుగా అంబరమే!
అయోధ్య నేడు అరణ్యమాయె!
సమసి పోయెగా సంబరమే!

తండ్రి మాటనే పరిపాలించి
రాముడయోధ్యను వదలెనుగా
సింహాసనమును తిరస్కరించి
కానల చేరగ కదలెనుగా!

రామా, నీ కథ అమర కావ్యమై
కలకాలము భువి నిలచునుగా
మానవాళి నీ త్యాగదీక్షనే
వేయి నోళ్లతో పొగడునుగా!

రఘురామా, ఆగవా
దావానలమై దహించె బాధా
రఘురామా ఇటు రావేలా
దీనజనుల తిరిగి చూడవా
పేదకనులే ద్రవించెగా రఘు రామా

తీరెనుగా సింగారములన్నీ
వెలవెలపోయెను దీపములన్నీ
ఎవరి మహాప్రలోభమొ! మంగళ
తోరణములు తెగిపోయెను కాదా!

ఆశామయ రాగాలాపనలే
విషాదగీతిగ మారెనుగా రఘురామా
శుభమే లేదు నీవు లేనిదే
సుఖమే లేదు నీవు లేనిదే

**అయోధ్యాపురి నివాసులంతా**
**అనాథులే అయిపోయినారులే**
**ఆశారేఖలే హరించిపోయె!**
**అంధకారమే జీవితమూ!**
**రఘురామా! రఘురామా! ఇటు రావేలా!**

ఈ పాట పల్లవిలో వున్న 'అయోధ్యనేడు అరణ్యమాయె' అనే అభివ్యక్తి ఒక్కటీ పదిపాటలు పెట్టు. రాముడు విడిచిపెడుతున్న అయోధ్య రాముడు వెళ్లబోతున్న అరణ్యంగా మారిందని చెప్పడం యెంతగొప్ప చమత్కారం! ఎంత హృద్యమైన అలంకారం!

ఇంకా జింబో, జింబోనగర ప్రవేశం, అరబ్బీవీరుడు జబక్ మొదలైన హిందీ డబ్బింగ్‌చిత్రాల విజయానికి శ్రీశ్రీ పాటలు దోహదం చేశాయి.

4. 'నాడోడి మన్నన్' తమిళచిత్రంలోని –

**తూంగాదె తంబీ తూంగాదె**
**సోంబేరి యంద్రపేరు వాంగాదె!**

అనే పట్టుక్కోట్టై కల్యాణసుందరం రచనకు శ్రీశ్రీ 'లిప్ సింక్' ను యెంత అలవోకగా సాధించాడో చూద్దాం –

**కునుకేల అబ్బి కునుకేలా నీకు**
**సోమరిఅన్నపేరు మరియాదా?** (కును)

**నీ చక్కని దుస్తులు ఆయుధముల్ బహు**
**చిరతర కథలల్లు చరితలనూ**
**శక్తి నిండి తొణకని ధైర్యం**
**సకల జగములు గణుతించున్** (కును)

**నిద్రపోయి నీవు తూలి చెడుటవల్ల**
**ఖ్యాతి ఎన్నడును రాదు కదా ఇలా**
**రేయీ పగళ్లు నీవు కాలాన్ని కాల్చివేసి**
**అదృష్టమిదె యని తలచుకురా**
**విరసముతో సత్యం మరువకురా నువ్వు**
**లోకముదూషించు దోషివిరా** (కును)

**బోధపడదని చూడడమె వింతగాథరా**
**ఉత్తబద్ధక మొందితివా కల్మి యేదిరా**
**కదలక కున్కితివా మొదల్ చేటురా లోక**
**ధర్మాన్ని మరచితివా ఫలంలేదురా ఎన్నో**
**పొలుపగు పనులన్ని కునుకుటచే పాడై**
**పోవును బద్ధకించ కూడదబ్బా (కును)**

**– అనగా అనగా ఒకరాజు (1989)**

అందరికీ అర్థమయ్యే భాషలో అతినిద్ర తెచ్చే చేటు గురించి రాసిన ఈ పాట 'శ్రీకృష్ణ పాండవీయం'లో 'మత్తు వదలరా నిద్దుర మత్తువదలరా ..' అనే కొసరాజు పాటకు స్ఫూర్తిదాయకం కావచ్చు!

'అనగా అనగా ఒక రాజు' చిత్రంలోనే ఘంటసాల పాడిన–

**సుఖపడుటే సుఖమై పరుగిడ నీ జన్మం**
**శోకాలు తెచ్చెనోయి తెలుగోడ**
**సుఖపెట్టుటే గుణమై పరిగిన నీజన్మం**
**లోకాలు మెచ్చెనోయి తెలుగోడా..**

అనే గుర్రం మీది పాట అవకాశం వచ్చిన సందర్భాలలో శ్రీశ్రీ చూపిన ప్రాంతీయతా భాషాభిమానాలకు మచ్చుతునక. మూలంలో 'స్నేహితుడా' అని అర్థం వచ్చే పదం మాత్రమే వుంటే శ్రీశ్రీ దానిని 'తెలుగోడు' గా మార్చారు. ఈ ధోరణి 'బాషా' చిత్రంలో వెన్నెలకంటి రాసిన –

**'నే ఆటోవాణ్ని ఆటోవాణ్ని**
**అన్నగారి రూటు వాణ్ని..!**

పాటకు మార్గదర్శకం కావచ్చు!

5. 'ఉత్తమ పుత్తిరన్' తాతినేని ప్రకాశరావు దర్శకత్వంలో శివాజీ గణేశన్ ద్విపాత్రాభినయంతో వచ్చిన తమిళచిత్రం. దానిలో–

**ముల్లైమలర్ మేలే మెయిక్కుం వండుపోలే..**

అనే మాతృకకు శ్రీశ్రీ వీరప్రతాప్ (1958) చిత్రంలో రాసిన యుగళగీతం

అనువాదచ్ఛాయలు లేకుండా సంగీత ప్రియులను అలరించింది. సుశీల ఘంటసాల ఈ యుగళగీతాన్ని ఆలపించారు-

**మధువనమేలే భ్రమరముపోలె -**
**హాయిగ పాడుదమా గీతాలే**

**అతను : వెండి అలమీద తుళ్లిపడు మీనై**
**కనపడలేవా ఈవేళ**

**ఆమె : వెన్నెలలై భూతల మేలే పున్నమిచంద్రా**
**కనులకు కానుక నా ప్రేమధనాలె**

**అతను : మింటిపై మెరుపు నీవేనే చక్కని బాలా**
**కంటినె పరుగిడు నా ఆశలే తీరా**

**ఆమె : నాగస్వర మూదిన వేళ నాగినివోలె**
**అందముగా ఆడినది నామది నేడె**

**అతను : తెలియని బాధల చేత డెంద మల్లాడె**
**రేబవల్ నిను తలచి నా మది సోలె**

6. 'తంగమలై రగసియం'(1957) అనే తమిళచిత్రంలో కు.మా. బాల సుబ్రహ్మణ్యం రచించిన పాట సంచలన ప్రాచుర్యంపొంది ఆయన యెక్కువ పాటలు రాయక పోయినా - అఖండఖ్యాతిని తెచ్చింది. ఈచిత్రాన్ని తెలుగులో 'రత్నగిరి రహస్యం' పేరుతో డబ్ చేశారు. 'రత్నగిరి రహస్యం'లో బాలసుబ్రహ్మణ్యం రచనకు శ్రీశ్రీ చేసిన అనువాదం అంత రమ్యంగా రాలేదని విమర్శకులు అభిప్రాయపడ్డారు.

**మూలం : అముదై పొళియుం నిలవే - నీ**
**అరుగిల్ వరాదదేనో అరుగిల్ వరాదదేనో**
**ఇదయం మేవియర్ కాదలినాలే**
**ఏంగిడుం అల్లియైప్పారాయ్**
**పుదుమలర్ వీణే వాడి విడామల్**
**పున్నగై వీసి ఆఋదల్ కూఱ**
**అరుగిల్ వరాదదేనో....**

భావం : అమృతం కురిసే జాబిలీ నీవు దగ్గరగా రావెందుకో. ప్రేమతో నీకోసం తపించే కొత్త కలువ వృథాగా వాడిపోకుండా అనునయించడానికి రావెందుకో. ఆశను

రగిలించి జ్ఞాపకాన్ని యవ్వనాన్ని కలలుగా కథగా ముగిస్తూ చెంతకు రావెందుకో.

'రత్నగిరి రహస్యం' (1957) లో దీనిని అనుసరిస్తూ శ్రీశ్రీ రచించిన గీతం –

**యమునా ముఖమున్ కనవే నీ**

**కలుకా పరాకదేలో – అలుకా పరాకదేలో (యము)**

**హృదయం ప్రేమకే దాసిని చేసే**

**నీ చెలి పూవుల బాలా**

**పరిమళ మిందే మాయునో యేమో**

**వెన్నెల వేళ అడగరాదా**

**అలుకా పరాకదేలో – అలుకా పరాకదేలో**

**మది నా ఆశకె ప్రాణం పోసి – మరచేవో చందమామా**

**చెలిపై చలము ఇకపై విడుము**

**కనవా కథయే ముగియక ముందే**

**అలుకా పరాకదేలో –అలుకా పరాకదేలో**

చిత్రంలో నాయిక పేరు యమున. అందువల్ల శ్రీశ్రీ ఈ ప్రారంభాన్నెన్నుకున్నారు. ప్రారంభాన్ని మినహాయిస్తే శ్రీశ్రీ పాట కూడా మాతృకకు దగ్గరగానే వుండడం మనం గమనిస్తాం. అయినా శ్రీశ్రీ గీతం అంత జనరంజకం కాకపోవడానికి డబ్బింగ్‌కి సంబంధించిన అనేక అంశాలు కూడా కారణం కావచ్చు. తమిళం, తెలుగు – రెండింటి లోనూ ఈ పాటను శ్రీమతి పి.సుశీలయే గానం చేశారు.

శ్రీశ్రీ గురించి తెలియని తెలుగు వాడుండడు. తెలుగులో నేరుగా తీసిన చిత్రాలలో ఆయన రాసిన –

1. పాడవోయి భారతీయుడా (వెలుగు నీడలు)
2. కలకానిదీ విలువైనదీ (వెలుగు నీడలు)
3. ఆకాశ వీథిలో అందాల జాబిలి (మాంగల్యబలం)
4. నా హృదయంలో నిదురించే చెలీ (ఆరాధన)
5. ఓ సజీవ శిల్పసుందరీ (పునర్జన్మ)
6. ఉందిలే మంచికాలం ముందు ముందున (రాముడు – భీముడు)
7. మనసున మనసై బ్రతుకున బ్రతుకై (డా. చక్రవర్తి)

8. మహాత్ముడే కలలు గన్న మరో ప్రపంచం (మరో ప్రపంచం)

9. తెలుగువీర లేవరా, దీక్ష బూని సాగరా (అల్లూరి సీతారామరాజు)

10. కలసి పాడుదాం తెలుగుపాట (బలిపీఠం)

ఇత్యాది పాటలెన్నో అజరామరాలు. తెలుగు సినిమాలకు ఆయన ఎఱ్ఱపాటల వేగుచుక్క మాత్రమే కాదు – దేశభక్తి గీతాలు, వీణ పాటలు, పద్యాలు, జావళీలు మొదలైన వైవిధ్య రచనలు చేసిన ప్రజ్ఞా ధురీణుడు. అన్నిటికీ మించి తెలుగు సినిమాపాటకు మొదటిసారి జాతీయ పురస్కారాన్ని అందుకొన్న తెలుగువెలుగు బావుటా! అలాంటి మహాకవి తెలుగులో డబ్బింగ్ రచనకు శ్రీకారం చుట్టడం – ఆ ప్రక్రియకు గర్వకారణం. ద్వితీయ శ్రేణికి చెందినవిగా పరిగణిస్తూ – అటు పరిశ్రమ, ఇటు ప్రేక్షకులు చిన్న చూపు చూసే డబ్బింగ్ పాటలకు కూడా సాహిత్య గౌరవాన్ని, ఆదరణను కలిగించిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు ఈ రంగంలో ప్రాతః స్మరణీయులు!

❖

ఈ ప్రకరణంలో

సమాచార సేకరణకు తోడ్పడిన వ్యాసాలు, పుస్తకాలు –


1. శ్రీశ్రీ అనువాద సినీగీతాలు – పైడిపాల
   7.3.14 ఆంధ్రభూమి 'వెన్నెల'లో ప్రచురితమైన వ్యాసం
2. పాడవోయి భారతీయుడా – శ్రీశ్రీ సినిమాపాటల సంకలనం
3. కవితా ప్రస్థానం – శ్రీశ్రీ ప్రస్థాన త్రయంలో మొదటి భాగం,
   మనసు ఫౌండేషన్ ప్రచురణ
4. పద్మభూషణ్ పి.సుశీల అభినందన సంచిక – 2008,
   సంపాదకులు: భమిడిపాటి రామగోపాలం



## అనువాదంలో అభినవతిక్కన ఆరుద్ర

(31-8-1925 - 4-6-1998)

'శ్రీశ్రీ' లాగే ఆరుద్రపేరు తెలియని అక్షరాస్యులైన తెలుగువాళ్లుండరు. ఆయన అసలుపేరు భాగవతుల సదాశివ శంకరశాస్త్రి అని తెలిసినవాళ్లు తక్కువ. బహుముఖ ప్రతిభాశాలి అయిన ఆరుద్ర చేపట్టని సాహితీప్రక్రియ లేదనీ, ఆయన 'సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర'ను (13 సంపుటాలు) వాడుకభాషలో రాసిన పరిశోధక పట్టభద్రులనీ అందరికీ తెలియక పోవచ్చు. అలాగే ఆయన రచించిన 'త్వమేవాహమ్' 'సినీవాలి' మొదలైన ప్రసిద్ధ కావ్యాలను, ఆఖరికి వేమన పద్యాల్లాంటి 'ఇంటింటి పజ్యాల'నూ 'కూనలమ్మ పదాల'నూ కూడా చదవని వాళ్లుండొచ్చు. కాని ఆరుద్ర సినిమా పాటల్ని వినని తెలుగు వాళ్లుండరు.

1. నీలిమేఘాలలో, గాలికెరటాలలో (బావామరదళ్లు-1961)
2. ఏమండోయ్ శ్రీవారూ, ఒక చిన్నమాట.... (మంచి మనసులు-1962)
3. బంగారుబొమ్మ రావేమే, పందిట్లో పెళ్లి జరిగేనే... (రక్తసంబంధం-1962)
4. కొండగాలి తిరిగింది, గుండెవూసులాడింది... (ఉయ్యాల జంపాల-1965)
5. గాంధి పుట్టిన దేశమా యిది... (పవిత్ర బంధం-1971)
6. ముత్యమంతా పసుపు ముఖమెంతొ చాయా... (ముత్యాల ముగ్గు-1974)
7. రాయినైనా కాకపోతిని రామపాదము సోకగా... (గోరంత దీపం-1978)
8. శ్రీరస్తు శుభమస్తు శ్రీకారం చుట్టుకొంది పెళ్లిపుస్తకం (పెళ్లి పుస్తకం-1991)

ఇలాంటి ఆరుద్ర రాసిన ఆణిముత్యాల్లాంటి పాటలెన్నో నేటికీ యింటింటా వినిపిస్తున్నాయి. 'బీదలపాట్లు' (1950)లో మొదటి సినిమాపాట రాసిన ఆరుద్ర 'పెళ్లికొడుకు' (1994) వరకు నాలుగుకాలాల పాటు చిత్రసీమలో నిలిచి కొన్ని చిత్రాలకు

కథ–మాటలతో పాటు 500 చిత్రాలకు పాటల్ని రాశారు. వాటిలో వందలకొద్దీ డబ్బింగ్ చిత్రాలకు పని చేసినట్టు ఆయన అభిప్రాయపడినా, ఆయన పేర వచ్చిన డబ్బింగ్ చిత్రాలు 50కి మించవు.

ఆరుద్ర తన వుద్యోగ ప్రయత్నాలలో అనుకోకుండా 1948లో శ్రీరాజరాజేశ్వరీ ఫిలిం కంపెనీవారికి పరిచయమై యెన్నడూ ఆశించని సినీరంగ జీవితాన్ని ప్రారంభించినట్టే –డబ్బింగ్‌చిత్ర రచన చేయాలనే వుద్దేశం లేకపోయినా మోడరన్ థియేటర్స్ వారి 'ఆలీబాబా–40 దొంగలు' (తమిళమూలం– ఆలీబాబా–నాపత్తి తిరుడాన్) డబ్బింగ్ చిత్రానికి రచయిత అయిన తోలేటి వెంకటరెడ్డి ఆకస్మిక మృతి వల్ల ఆపద్ధర్మంగా ఆ చిత్రాన్ని పూర్తి చెయ్యవలసి రావడంతో ఆ రంగంలోనూ రచయితగా కొనసాగవలసి వచ్చింది. 'ఆలీబాబా–40 దొంగలు' (1956)కు ముందే రాజ్ కపూర్ నటించి నిర్మించిన తెలుగు చిత్రం 'ప్రేమలేఖలు' (1953) కు మాటలు, పాటలు రాశారు. ప్రేమలేఖలు (హిందీలో 'ఆహ్') ట్రాక్‌ఛేంజ్ చిత్రమే అయినా, సూపర్ హిట్ అయిన ఆ చిత్రాన్ని అందరూ డబ్బింగ్‌గా భావించడం వల్ల అప్పటికే ఆరుద్రకు డబ్బింగ్ రంగంలో పేరొచ్చింది.

1. ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లు గజ్జెల సంగీతం...
2. నీ పేరు విన్నా, నీరూపు కన్నా వుయ్యాలలూగు మది...
3. పందిట్లో పెళ్లవుతున్నాది – కనువిందవుతున్నాది...
4. పాడు జీవితము, యౌవనం – మూడునాళ్ల ముచ్చటలోయి...

మొదలైన 'ప్రేమలేఖలు' లోని పాటలు హిందీ వరసలయినా తెలుగు లోగిళ్లలో వీనులవిందు చేశాయి. తోలేటి రెండుమూడు పాటలు మాత్రమే రాసిన 'ఆలీబాబా – 40 దొంగలు' చిత్రంలో మిగతా పాటలు పూర్తి చేసేసరికి ఆరుద్ర డబ్బింగ్ రచన మీద గురి కుదిరిన మోడరన్ థియేటర్స్ వారు ఆ చిత్ర నిర్మాణం పూర్తి కాకుండానే సావిత్రి నటించిన 'మహేశ్వరి' అనే తమిళ చిత్రాన్ని డబ్ చేసే బాధ్యతను ఆయనకు అప్పగించారు. దీనిని 'రాణీరంగమ్మ'గా ఆరుద్ర అతి తక్కువ కాలంలో తెనిగించగా అది విజయవంతం కావడంతో ఆరుద్రపేరు డబ్బింగ్ రచయితగా మారుమ్రోగింది. ఆరుద్ర 'ఆలీబాబా–40 దొంగలు' చిత్రానికి పనిచేసినందుకు వచ్చిన పారితోషికాన్ని పెద్ద మనసుతో తోలేటి కుటుంబానికే పంపించేశారట!

ఆరుద్ర డబ్బింగ్ చిత్రాలలో నాలుగైదు హిందీచిత్రాలు, ఒక కన్నడ చిత్రం (భక్త

విజయం) పోను మిగిలినవన్నీ తమిళం నుంచి డబ్ చేసినవే! వాటిలో వీరఖడ్గము (1958), వీరపాండ్యకట్టబ్రహ్మన (59), సంపూర్ణ రామాయణం (60– తమిళం) మురిపించే మువ్వలు (62), సింగపూర్ సి.ఐ.డి. (65), సరస్వతీ శపథం (67), కొండవీటి సింహం (69–తమిళం), కోటీశ్వరుడు (70) సుప్రసిద్ధ చిత్రాలు. లభిస్తున్న ఆధారాలమేరకు ఆయన చివరి డబ్బింగ్ చిత్రం 'అఖండ నాగ ప్రతిష్ఠ' (1984). ఆరుద్ర అనారోగ్యం వల్ల, సాహిత్య పరిశోధన పట్ల వుండే మక్కువ వల్ల చివరి రోజుల్లో సినిమారచన మీద అంతగా ఆసక్తిని చూపించలేదు. ఆయన తెలుగు సినిమాచరిత్రను సమగ్రంగా సశాస్త్రీయంగా రాయాలనే సంకల్పంతో విస్తృతంగా సమాచారాన్ని సేకరించి కూడా ఆరోగ్యం సహకరించక ఆ ప్రయత్నాన్ని విరమించు కున్నారట!

తెలుగు సినీసాహిత్యంలో అనువాద రచనకు ఆద్యులైన శ్రీశ్రీని సినీనన్నయగా భావిస్తే –అనువాదంలో తెలుగు దనానికి యెక్కువ ప్రాధాన్యమిచ్చిన ఆరుద్రను ఆ రంగంలో అభినవతిక్కనగా అభివర్ణింపవచ్చు. శ్రీశ్రీ మాతృకను అనుసరిస్తూనే అవకాశాన్ని బట్టి స్వేచ్ఛానువాదం చేయగా – ఆరుద్ర 'లిప్‌సింక్' కంటె తెలుగు నుడికారం వైపే మొగ్గారు. అప్పట్లో బాణీలకు సినిమా పాటల్ని రాయడంలో ఆరుద్ర వేగాన్ని చూసి మిగతావారు అబ్బురపడే వారట! ఉదాహరణకు 'అన్నపూర్ణ' వారి 'ఇద్దరు మిత్రులు' చిత్రం కోసం–

**ఈ ముసిముసి నవ్వుల విరిసిన పువ్వులు**
**గుసగుస లాడినవి ఏమిటో...**

అనే పాటబాణీ శ్రీశ్రీ వంటి దిగ్గజాలకు కూడా కొరకరాని కొయ్య,కాగా – ఆరుద్ర ఆ పాటను అవలీలగా రాశారట! ఆరుద్ర డబ్బింగ్‌నూ అంత వేగంగానూ, అలవోకగానూ చేసేవారట! సహరచయితల కెవరికైనా వెంటనే మాటలు స్ఫురించకపోతే ఆరుద్రను సంప్రదిస్తే 'ఠకీ' మని సమాధానం వచ్చేదట! 'రాణీ రంగమ్మ' చిత్రాన్ని అనువదించేటప్పుడు మూలంలో వున్న కట్టబొమ్మనను కీర్తిస్తూ పాడే నృత్యగీతం స్థానంలో పెదవుల కదలికకు, నాట్య భంగిమలకు సరిపడేలా బొబ్బిలి కథను రాయడం – ఆరుద్ర డబ్బింగ్ శిల్పానికి, తెలుగుదనం పట్లవున్న మమకారానికీ నిదర్శనం!

ఆరుద్ర డబ్బింగ్ పాటలలోనే కాదు – తెలుగు డబ్బింగ్ పాటలలోనే మకుటాయ మానమైన గీతం 'దేవీ ఫిలిమ్స్' వారి యమ్.వి.రామన్ దర్శకత్వం వహించిన 'మురిపించే మువ్వలు' (1992) లోని –

**నీ లీల పాడెద దేవా - మనవి**
**ఆలించ వేడెద దేవా - నను**
**లాలించు మా ముద్దుదేవా** ॥నీ లీల॥
**సిందూర రాగంపు దేవా - దివ్య**
**శృంగార భావంపు దేవ - వల్లి**
**చెలువారు నినుకోరు నీవు రావా - ఎలమి** ॥నీ లీల॥
**అనుపమ వరదానశీల - వేగ**
**కనుపించు కరుణాలవాలా** ॥నీ లీల॥

అనే జానకి పాటడిన పాట హీరో నాదస్వర విద్వాంసుదు కావడం వల్ల గాయని ఈ పాటను నాదస్వరంతో సమమైన స్థాయిలో పాడి ఆంధ్రదేశాన్ని వుర్రూత లూగించారు.

దీని తమిళ మాతృక 'కొంజుం సలంగై' లోని -

**సింగార వేలనె దేవా**
**అరుళ్ సీరాడుం మార్భోడు వావా..**

అనేది. రచన కె.యమ్. బాలసుబ్రమణియం. సంగీతం యస్.యం. సుబ్బయ్య నాయుడు. నాదస్వరం కారైకురుచి అరుణాచలం. ఈ పాటను తమిళంలోనూ యస్. జానకియే ఆలపించారు.

'శూలపాణి అయిన మనోహరమైన స్వామీ రావా, అద్భుతమైన మనోజ్ఞమైన మహిమగల స్వామీ రావయ్యా' అనే భావం గల పైపాటను ఆరుద్ర 'సింగార వీథిని రావా' అని తెనిగిద్దామనుకొని పాట శృంగార పరంగా కాక భక్తి పరంగా వుండాలనే అభిప్రాయంలో 'నీ లీల పాడెద దేవా...' ప్రారంభాన్ని యెంచుకొన్నారట! 'కొంజుం సలంగై' లో సావిత్రి, కమల, జెమినీ గణేశన్, మనోహర్, యస్.వి.రామదాస్ మొదలైన ముఖ్య నటీనటులతో పాటు వేలాది మంది పాల్గొన్నారట!

అప్పట్లో బాగా ప్రాచుర్యం పొందిన మరికొన్ని ఆరుద్ర డబ్బింగ్ గీతాలను, వాటి మాతృకలను పరిశీలిద్దాం-

1. **పాత జ్ఞాపక మేదియో**
**పలుకరించెను గుండెలో**
**మనది ఏనాటి బంధమో**

**మరచుట నీ నైజమో!** **॥పాత॥**

**ఆ కలువే చంద్రుని కోసం**

**నీ తనువే ఈచెలికోసం**

**నిండు మనసే కానుక కోసం**

**నా పరువము వలచుట కోసం** **॥పాత॥**

**తొలి చేసిన మరుల చొరవ**

**నిను వలచెనె ముద్దు చెలువ**

**జన్మజన్మములో ఒక తడవ**

**మన స్నేహము పూలపడవ** **॥పాత॥**

**- సింగపూర్ సి.ఐ.డి. (1965)**

ఈ పాటకు -

'పుదియ పరవై' తమిళ చిత్రంలో కణ్ణదాసన్ రచించిన -

**పార్త జ్ఞాబగ మిల్లైయో**

**పరువ నాడగం తొల్లైయో -**

**వాళ్న కాలంగళ్ కొంజమో**

**మరందదే ఇన్ద నెంజమో...**

అనే పాట మూలం. 'ఎక్కడో చూసిన జ్ఞాపకం లేదా? ఈ యౌవన నాటకం వల్ల యిబ్బందా? మనం ఎన్నాళ్లు కలిసి జీవించామో నీ హృదయం మరిచిందా?' అనేది ఈ పాట భావం. సంగీతం విశ్వనాథన్-రామమూర్తి. రెండు భాషలలోనూ ఈ పాటను శ్రీమతి పి. సుశీలయే గానం చేశారు.

మూలంలోని భావాన్ని 'మరులచొరవ' 'ముద్దుచెలువ' 'ఒకతడవ' 'పూలపడవ' వంటి అందమైన తెలుగు పదాలతో, ఆరుద్రీయమైన ప్రాసలతో తమిళవాసన లేకుండా తెలుగుపాటలో అందించడం ఆరుద్ర ప్రత్యేకత!

2. 'సరస్వతీ శపథం' తమిళ చిత్రంలో కణ్ణదాసన్ రచన-

**కల్వియా సెల్వమా వీరయా**

**అన్నైయా తందైయా దైవమా**

**ఒన్రిల్లామల్ మట్రొండు ఉరువాగుమా**

**ఇదిల్ ఉయర్వ్రేనుం తాళ్వ్రేనుం ఇనైయాగుమా...?**

(భావం: విద్యయా, విత్తమా, వీరమా? తల్లా, తండ్రా, దైవమా? వీటిల్లో ఏ వొక్కటి లేకున్నా మరొకటి రూపొందడం సాధ్యమా? వీటిలో యిది గొప్పది, యిది సామాన్యం - అని పోల్చతగునా?)

విశేష ప్రాచుర్యాన్ని పొందింది. ఎ.పి. నాగరాజన్ స్క్రీన్ ప్లే దర్శకత్వ బాధ్యతలు వహించిన 'సరస్వతీ శపథం' చిత్రానికి కె.వి. మహదేవన్ సంగీత దర్శకులు. సావిత్రి, దేవిక, పద్మిని వరసగా సరస్వతి, లక్ష్మి, పార్వతీ పాత్రలను ధరించిన ఈ చిత్రంలో నారద, విద్యాపతుల పాత్రలను శివాజీ గణేశన్ పోషించారు. లోకంలో విద్యయే గొప్పదని, దానిని నిరూపిస్తానని సరస్వతీదేవి చేసిన శపథానికి కలహభోజనుడైన నారదుని కవ్వింపుతో దీటుగా స్పందించిన లక్ష్మి విద్యకంటె ఐశ్వర్యం గొప్పదని, పార్వతి వీరం గొప్పదని వాదించి పోటీలో దిగుతారు. ఆ సందర్భంగా గగన విహారం చేసే నారద పాత్ర మీద చిత్రీకరించిన ఈ పాటను 'సరస్వతీ శపథం' తెలుగు చిత్రంలో ఆరుద్ర కూడా జనరంజకంగా రాశారని పేరొచ్చింది. తమిళంలో సౌందరరాజన్ పాడిన ఈ పాటను తెలుగులో ఘంటసాల పాడారు-

**విద్యయా? విత్తమా? వీరమా?**
**తల్లియా? తండ్రియా? దైవమా?**
**ఒక్కొక్కరు వేరొకరి నోడింతురా - ఇందు**
**ఎక్కువలు తక్కువలు విభజింతురా?**

**1.** **కవిరాజు శ్లోకములు యిలు నింపవే**
**కలవార్ని లోకములు భూషింపవే**
**కవిరాజు, భువిరాజు బలవంతులా? - వీరం**
**కనలేని మనుగడలు వర్ధిల్లవా?** ॥విద్య॥

**2.** **పండితుల చదువేమి సభకెక్కునా - గొప్ప**
**మండితుల సిరికీర్తి ప్రభలీయవా?**
**పండితుడు, మండితుడు ఎవరైనను - బలం**
**ప్రకటింప వీరునికి సరితూగునా?** ॥విద్య॥

**3.** **ఒకచోట వుండేది చదువే కదా - ఇలా**

**ఒకచోట వుండనిది సొమ్మేకదా**
**ఒకనాడు వుడిగేది బలమే కదా - మూడు**
**ఒక యెడల వున్న ఘనమే కదా! ॥విద్య॥**

**4. భోగాల మురిపించు చిరభాగ్యమా - సర్వ**
**భువనాలు పూజించు విజ్ఞానమా**
**ఓటమి పొందనట్టి మహద్వీర్యమా - మూడు**
**ఒకచోట జోడింప విధి శక్యమా?**

కణ్ణదాసన్ హృదయాన్ని ఆరుద్ర తనదైన శైలిలో స్పష్టంగా ఆవిష్కరించడం - ఈ పాటలో గమనిస్తాం.

3. బి.యస్.సరోజ, యం.జి.రామచంద్రన్ నాయికానాయకులుగా నటించిన 'పుదుమై పిత్తన్' తమిళచిత్రంలో టి.యన్.రామయ్యదాస్ రచనకు జి.రామనాథన్ సంగీతం సమకూర్చగా - జిక్కి, చిదంబరం, యస్.జయరామన్ ఆలపించిన యుగళగీతం ఆనాడు తమిళుల్ని ఆపాతమధురంగా ఆలరించింది -

**ఉళ్లం రెండుం ఒన్రు**
**నం ఉరువందాన్ రెణ్డా**
**ఉయిరోవియమే కణ్ణే, నీయుం నానుం ఒన్రు**

(భావం: మనహృదయాలు రెండూ ఒకటి, మన రూపాలే రెండు. ఓ నా జీవన చిత్రమా, నీవు నేనూ ఒకటే!)

'వీర ఖడ్గము' (1958) పేరుతో డబ్ చెయ్యబడిన తెలుగుచిత్రంలో ఆరుద్ర రచించిన ఈ పాటను జిక్కి, ఘంటసాల ఆలపించారు-

**అతను : హృదయాలు రెండు ఒకటి - మన**
**రూపాలే రెండు**
**ఆమె : ప్రతి లోకమునా ప్రియా**
**నీవు నేను ఒకటి**
**ఆమె : రాగజ్యోతి వెలుగులో రంజిలి కలిసింవుందాం**
**ఇదియే అనురాగతటి, ఇచటే మనముందాం**
**అతను : చెలియా, అనురాగం కలిగించు స్వర్గయోగం!**

**కలువలాంటి పూబోడి - చలువరేడు నేనే**

**ఆమె : రేగె ప్రేమతావి, ఇక తీరు నాదు తనివి**

**అతను : హృదయమేలు విరి నీవు - ప్రాణప్రియవు నీవే!**

ప్రేయసీ ప్రియుల మధ్య అద్వైత సిద్ధాంతాన్ని మనసులకు హత్తుకొనేలా ఆరుద్ర రాసిన ఈ యుగళగీతాన్ని నేటికీ ఘంటసాల అభిమానులు గుర్తుచేసుకుంటుంటారు. ఇంకా కొండవీటి సింహం, కోయంబత్తూరు ఖైదీ, సంపూర్ణ రామాయణం మొదలైన తమిళచిత్రాల్లో ఆరుద్ర రాసిన డబ్బింగ్‌పాటలు తెలుగుదనంతో పరిమళించాయి.

ఆరుద్ర తెనుగు చేసిన ఒకేఒక కన్నడచిత్రం 'భక్త విజయం' (1960). ఆరూర్ దర్శకత్వంలో పండరీబాయి, రాజ కుమార్ మొదలైనవారు నటించిన ఈ చిత్రానికి ఎ.కృష్ణమూర్తి, శ్రీరాములు సంగీత దర్శకత్వం వహించారు. ఆరుద్ర ఏ భాష నుంచయినా తెలుగుదనం తొణికిసలాడే చెవికింపయిన పాటలు రాయగలరని 'భక్త విజయం' కూడా రుజువు చేసింది. ఈ చిత్రం నుంచి స్థాలీపులాకంగా ఒక గీతాన్ని చూద్దాం -

**సాకీ - ఓంకార సరసియందు అరుదౌ సుమమా**
**ఓంకార కుసుమములో చిరపరిమళా**
**ఓంకార రూపమున నీవే విఠలా**
**ఓంకార వాచ్య నిన్నెన్న గలనా మహిత**
**ఓంకార వార్నిధిని నీవే విఠలా..ఆరయ**
**ఓంకార వృక్షములో ఉత్తమఫలా విఠలా**

**పల్లవి : విఠల రఘుమాయీ**
**విఠోభ రఘుమాయీ**
**విఠల జై జై, విఠల జై జై..**

**మూలం: ఓంకార సరసియొళు హొళెవ కమల**
**ఓంకార కుసుమ దొళు ఇహ పరిమళా**
**ఓంకార రూపనహ, నీనే సకలా విఠలా**
**విఠల రఘుమాయీ, విఠోభ రఘుమాయీ**
**విఠల జై జై, విఠల జై జై.**

దీని భావాన్ని వివరించవలసిన అవసరం కనిపించదు. ఆరుద్ర మూలాన్ని

యథాతథంగా అనుసరిస్తూ,ఒకటి రెండు పంక్తులు అదనంగా రాసినట్టు అనిపిస్తోంది. 'రఘుమాయీ' అనే సంబోధన మరాఠీ నుంచి వచ్చివుండవచ్చు.

ఇలా డబ్బింగ్‌చిత్రాల్లోని పాటలతో పాటు ద్విభాషాచిత్రాలు, పునర్నిర్మాణ చిత్రాలలో కూడా – మాతృకలోని సంగీత సాహిత్యాలకు తెలుగులో పాటలను కూర్చేటప్పుడు ఆరుద్ర తనదైన ముద్రను ప్రదర్శించారు –

ఉదాహరణకు 'బాగప్పిరివినై' తమిళచిత్రం (1959) కోసం కణ్ణదాసన్ రచించిన–

**తంగత్తిలే ఒరు కుఱై ఇరుందాలుం**
**తరత్తినిల్ కుఱై వదుందో – ఉంగళ్**
**అంగత్తిలే ఒరు కుఱై ఇరుం దాలుం**
**అన్బు కుఱై వదుందో..**

అనే పాటను అనుసరిస్తూ ఆరుద్ర 'కలసివుంటే కలదు సుఖం' (1961) లో రాసిన –

**మేలిమి బంగరు మెలిక తిరిగినా – విలువ తరిగేనా?**
**మీ దేహములో చిరులోపములున్నా**
**ప్రేమ కరువగునా?**

ఎ.వి.యం. వారి 'కుళందైయుం దైవముం'లో కణ్ణదాసన్ రచన..

**కోళి ఒరు కూట్టిలే**
**శేవల్ ఒరు కూట్టిలే**
**కోళిక్కుంజు రెండుమిప్పో**
**అన్బిల్లాద కాట్టిలే..**

అదే సంస్థ తీసిన 'లేత మనసులు' (1966) లో ఆరుద్ర రాసిన –

**కోడి ఒక కోనలో పుంజు ఒక కోనలో**
**పిల్లలేమొ తల్లడిల్లె ప్రేమలేని కోనలో..**

(తమిళంలోని గూటిని తెలుగులో 'కాన', 'కోన' చేశారు)

'కాదలిక్క నేరమిల్లై' తమిళచిత్రంలో కణ్ణదాసన్ రచన –

**ఉంగ పొణ్ణాన కైగళ్ పుణ్ణాగలామా**

**ఉదలిక్ కు వరలామా సమ్మదమ్ వరుమా**
**సందేగమ్ తానా?**

'ప్రేమించుచూడు'(1965) పునర్నిర్మాణ చిత్రంలో ఆరుద్ర కలం నుంచి జాలువారిన

**మీ అందాల చేతులు కందేను పాపం**
**ఎందుకు ఈ బెడద? సాయము వలదా హోయ్**
**ఓ చెయి వేసేదా?..**

(ఈ పాటలో కడగంటి చూపు కబురంపగానే శుభలేఖ పంపేను అనేది మూలాన్ని మించిన చమత్కార ప్రయోగం)

వంటి పాటల్లో ఆరుద్రీయమైన ప్రత్యేకతల్ని గమనించగలం.

శబ్దశక్తి, సద్య:స్ఫూర్తి అక్షరంతోనే అలవడిన ఋషితుల్యుడు ఆరుద్ర. అందుకే ఆయన అసలు సిసలు తెలుగుచిత్రాలకు పాటలు రాసినా, ఇటు డబ్బింగ్‌చిత్రాలకు పాటలు రాసినా – తెలుగుదనం గుబాళింప చేస్తూ రెండు రంగాల్లోనూ సవ్యసాచిలా రాణించారు. వాస్తవానికి ఆరుద్ర రచన చేసిన డబ్బింగ్‌చిత్రాలు పదుల సంఖ్యలోనే వున్నా, ఆయనే భావించినట్టు అవి వందలపెట్టు!

❖

ఈ ప్రకరణానికి
వుపయోగపడిన వ్యాసాలు, పుస్తకాల సమాచారం –


1. అనువాదగీతాల్లోనూ ఆరుద్ర ముద్ర – పైడిపాల.
   31. 8. 14 'సాక్షి' దినపత్రికలో వ్యాసం.
2. ఆరుద్ర సినీగీతాలు – అయిదు భాగాలు
   సంకలనం : శ్రీమతి కె. రామలక్ష్మి.
3. తెలుగు సినీగేయకవుల చరిత్ర – పైడిపాల.
4. 'అర్థం చేసుకొందాం – ఆస్వాదిద్దాం' శీర్షిక
   'హాసం' హాస్య సంగీత పత్రికలో డా. పి. యస్.గోపాలకృష్ణ వ్యాసాలు.
5. యస్. పి. బాలసుబ్రహ్మణ్యం 'మెయిల్'లో పంపించిన సమాచారం.
6. కె. స్వర్ణకుమార్, భీమవరం ఫోన్‌లో చెప్పిన సమాచారం.



## అయ్యప్పస్వామిని తెలుగునేలకు తెచ్చిన అనిసెట్టి

(23-10-22 - 27-12-79)

**1.** నిదురపో నిదురపో నిదురపో
నిదురపోరా తమ్ముడా
నిదురలోన గతమునంతా
నిముసమైనా మరచిపోరా **-సంతానం (1955)**

**2.** కొమ్ములు తిరిగిన మగవారూ
కొంగు తగిలితే పోలేరు **-భట్టి విక్రమార్క (1960)**

**3.** చిగురాకుల ఊయలలో ఇల మరచిన ఓ చిలుకా
మధురాశలు పలికేవో, నా మనసును చిలికేవో
**- కానిస్టేబులు కూతురు (1963)**

**4.** సాగేను జీవితనావా, తెరచాపలేక ఈ త్రోవా
**- తోబుట్టువులు (1963)**

**5.** సాహసమే జీవితపు బాటరా
సత్యమనీ లక్ష్యమనీ చాటరా
**- కొండవీటి దొంగ (1958)**
**(డబ్బింగ్ చిత్రం)**

**6.** స్వామీ శరణం శరణమయ్యప్పా
హరిహరసుత ఓ పావనచరితా

భక్తమందారా భవపరిహారా
కరుణతో మమ్ము కావుము అయ్యప్పా

– స్వామి అయ్యప్ప (1977)
(డబ్బింగ్ చిత్రం)

ఆపాతమధురాలైన పై పాతపాటలు నేటికీ జనం నాలుకలపై నర్తిస్తున్నాయి. 'సంతానం' చిత్రంలోని పాటను భారతదేశం గర్వించదగ్గ సినీగాయని లతా మంగేష్కర్ పాడిన మొదటి తెలుగు సినిమాపాటగా గుర్తుండని, స్వామి అయ్యప్ప చిత్రంలోని పాటలను నిత్యం వినని – తెలుగు వాళ్లుండరు. అయితే ఈ పాటలను అనిసెట్టి రాసారనీ, ఇంకా ఆయన కలం నుంచి జాలువారిన పాటలు వందలకొద్ది వున్నాయనీ – అందరికీ తెలియక పోవచ్చు.

అనిసెట్టి పూర్తిపేరు అనిసెట్టి సుబ్బారావు. గుంటూరు జిల్లాలోని నరసరావుపేట తాలూకా పురుషోత్తమ పట్నంలో ఓ సంపన్న కుటుంబంలో జన్మించారు. హైస్కూలులో వుండగానే బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం (తర్వాత నయాగరా కవులుగా ప్రసిద్ధులు) సాహచర్యంతో కవిత్వాన్ని రాయడం ప్రారంభించారు. గుంటూరు ఏ.సి. కళాశాలలో బి.ఏ చదువుతుండగా అడవి బాపిరాజు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, మల్లాది రామకృష్ణశాస్త్రి, తల్లావఝల శివశంకరశాస్త్రి వంటి దిగ్గంతులతో పరిచయం యేర్పడింది. డిగ్రీ తర్వాత 'లా' చదువుతూ జాతీయనాయకుల పిలుపుకు స్పందించి స్వాతంత్రసమరంలో పాల్గొని జైలుకెళ్లారు. అనంతరం ఎమ్.ఏ లో చదువు కంతరాయం కలిగి పత్రికా రంగంలో కొంతకాలం పనిచేశారు. అభ్యుదయ రచయితల సంఘం యేర్పడక ముందే నవ్య కళాపరిషత్ కార్యదర్శిగా, ఆ తరువాత అ.ర.సం. కార్యవర్గ సభ్యుడిగా, 1973 లో అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శిగా పనిచేశారు. 'అగ్నివీణ', 'బిచ్చగాళ్ల పదాలు' కావ్యాలు, 'గాలిమేడలు', 'మావూరు' నాటకాలు, 'చెప్పుకింద పూలు', 'చరమాంకం', 'శాంతి' నాటికలు మొదలైనవి అనిసెట్టి ప్రసిద్ధ రచనలు. శ్రీశ్రీ, ఆరుద్ర, ఆత్రేయ, దాశరథి, నారాయణ రెడ్డి ప్రభృత సినీకవులలాగే అనిసెట్టి కూడా అభ్యుదయ కవిగా ప్రసిద్ధులైన తర్వాతే సినీరంగ ప్రవేశం చేశారు.

గిడుతూరి సూర్యం ప్రోత్సాహంతో 1949 లోనే చిత్రపరిశ్రమలో వేళ్లు పెట్టిన అనిసెట్టి 1952 నాటికి రాజేశ్వరి, ప్రియురాలు చిత్రాలకు రచన చేసే అవకాశం రావడంతో సినిమారంగంలో కాళ్లూనారు. మొదట్లో కొన్ని చిత్రాలకు పినిశెట్టి మాటలు

ప్రాయగా,అనిసెట్టి పాటలు రాసేవారు.ఆ తరువాత కుటుంబ గౌరవం, రాజా మలయసింహ,మా గోపి, పెళ్లితాంబూలం, తోబుట్టువులు, భట్టివిక్రమార్క మొదలైన అనేక చిత్రాలకు మాటలూ, పాటలూ కూడా రాశారు. 'శ్రీకృష్ణ లీలలు' (1956) తో అనువాదరచన కూడా ఆరంభించి 'కొండవీటి దొంగ' (1958) చిత్రంతో ఆ రంగంలో ప్రసిద్ధులయ్యారు. 'కొండవీటి దొంగ' కు మాతృక అంజలి, కన్నాంబ, ఇ.వి.సరోజ, రంజన్, యమ్.కె.రాధ, టి.యస్.బాలయ్య మొదలైన వారు నటించిన దేవర ఫిలిమ్స్ వారి 'నీలమలై త్తిరుడన్' తమిళచిత్రం. ఇక్బాల్ అనే పేరు గల గుఱ్ఱం, టైగర్ అనే పేరు గల కుక్క ఈ చిత్రంలో ప్రత్యేకాకర్షణలు. 'కొండవీటి దొంగ' తో వచ్చిన పేరుతో డైరక్ట్ టేక్ చిత్రాలకు మాటలు పాటలు రాస్తూనే, డబ్బింగ్‌రంగం వైపు దృష్టి సారించడంతో అనిసెట్టి ఆ ముద్ర పడిన మొదటి డబ్బింగ్‌రచయితగా ఆ రంగంలో కొనసాగారు. అనిసెట్టి సుమారు 150 చిత్రాలకు రచన చేస్తే – అందులో నూటికి పైగా డబ్బింగ్‌చిత్రాలే! ఆయన రచించిన సుమారు 750 సినిమా పాటలలో 500 కు పైగా డబ్బింగ్ పాటలే! అనిసెట్టికి అప్పటికే బెంగాలీ, ఒరియా, రష్యా, ఉర్దూ, ఇంగ్లీషు మొదలైన యితర భాషల నుండి కవితలను అనువదించి పత్రికలలో ప్రచురించే అలవాటు వుండటం వల్ల డబ్బింగ్‌పాటలను సునాయాసంగా రాయగలిగారు.

అప్పటికి డబ్బింగ్‌రచనలో పేరుపొందిన శ్రీశ్రీ, ఆరుద్రలకు భిన్నంగా 'లిప్ సింక్' కి అధిక ప్రాధాన్యమిచ్చే కవిగా అనిసెట్టి కి పేరొచ్చింది. ఆయన హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషలు – నాల్గింటి నుంచి తెలుగులోకి చిత్రాలను తర్జుమా చేశారు. అరవైలలో డబ్బింగ్‌రంగంలో అగ్రస్థానానికి దూసుకెళ్లిన అనిసెట్టి మధ్యలో కొంచెం వెనకబడినా తిరిగి 'సర్వర్ సుందరం' తో పుంజుకొన్నారు. ఇలా అటు నేరుగా తీసిన చిత్రాలు ఇటు డబ్బింగ్‌చిత్రాలు – రెండు రంగాల లోనే రాణించడమే గాక 'కన్నుల పండుగ' (1969) అనే చిత్రానికి దర్శకత్వ బాధ్యతను కూడా వహించారు. 'కన్నుల పండుగ' కు అనిసెట్టి తో పాటు శ్రీశ్రీ కూడా పాటలను రాశారు. ముఖ్యంగా 'స్వామి అయ్యప్ప' డబ్బింగ్‌చిత్రానికి రచయితగా – ఆ చిత్రంలోని ఆపాతమధురాలయిన పాటలతో అయ్యప్పస్వామికి తెలుగు నేలలో యెనలేని ప్రచారాన్ని కల్పించిన ఘనత అనిసెట్టిదే!

ముందుగా భాషల వారీగా ప్రసిద్ధి పొందిన అనిసెట్టి డబ్బింగ్‌చిత్రాలను తెలుసుకొందాం –

**హిందీ -**

శ్రీకృష్ణ పాండవ యుద్ధము (60)
మాయామశ్చీంద్ర (61)
భీమ ప్రతిజ్ఞ (65)
బలరాం శ్రీకృష్ణ కథ (70)

**కన్నడ -**

వీరసింహ (59)
సంచారి (60)

**మలయాళం -**

సీత (లవకుశ) (61)
అడవిపిల్ల (66)
స్వామి అయ్యప్ప (77)

**తమిళం -**

కొండవీటి దొంగ (58)
మావూరి అమ్మాయి (60)
పతివ్రత (60)
స్త్రీ శపథం (61)
పాప పరిహారం (61)
ప్రాయశ్చిత్తం (62)
దొంగనోట్లు (64)
సర్వర్ సుందరం (65)
నువ్వే (67)
లోకం చుట్టిన వీరుడు (73)

అనిసెట్టి డబ్బింగ్‌చిత్రాల్లో అధికశాతం తమిళం నుండి తర్జుమా చేసినవే. ఆయన ఆఖరి డబ్బింగ్‌చిత్రం 14.1.79 న విడుదలయిన 'ప్రత్యక్ష దైవం'. అనిసెట్టి కి పేరు తెచ్చిన కొన్ని డబ్బింగ్‌పాటలను పరిశీలించి ఆయన ప్రత్యేకతను గమనిద్దాం -

1. ముందుగా అనిసెట్టి పేరు చెప్పగానే గుర్తొచ్చే డబ్బింగ్‌చిత్రం 'కొండవీటి దొంగ' లోని సాహస ప్రాముఖ్యాన్ని వివరించే పాటను చూద్దాం –

**సాహసమే జీవితపు బాటరా**
**సత్యమనీ లక్ష్యమనీ బాటరా (2)**
**కష్టముల పెనుతుఫాను కాలమే**
**ఎన్నో అరిష్టముల పాలైపోయె దేశమే (2)**

**విడువక ధైర్యం నిత్యం కృషి సల్పరా**
**మన దేశాన ధర్మమునే నెలకొల్పరా**
**సాహసమే జీవితపు బాటరా, చాటరా**
**త్యాగశీలనే ఈ లోకం వరియించురా**
**ధర్మదీక్ష ఏ నాడైనా ఫలించురా (2)**

**నీతి కొరకు ప్రాణాలైనా బలి చేయరా**
**జగాన అభ్యుదయ స్థాపనమ్మె సాధించరా ॥సాహ॥**

'నీలమలై త్తిరుడన్' తమిళ మాతృక లోని 'సత్తియమ్ నిత్తియమాన్ సొల్లుడా సొల్లుడా సొల్లుడా...'అనే పాటకు పై సందేశాత్మక గీతం యథాతథమైన అనుసరణే. కఠిన పదాలకు, కవితాభివ్యక్తికి – దూరంగా తేలికైన పదాలతో మాట్లాడుకొనే ధోరణిలో రాయడం అనిసెట్టి శైలి.

ఈ చిత్రం లోని –

**1. తమలపాకు సున్నమూ**
**పడుచు వాళ్ల కందమూ...**
**2. ఒక్కరికీ ఇద్దరయా**
**ఇవి కలికాలపు బుద్ధులయా...**

మొదలైన పాటలు కూడా ఆ నాడు జనం నోళ్లలో నలిగినవే.

2. 'కళత్తూర్ కన్నమ్మ' లో అనాథాశ్రమం లోని పిల్లలు, వారిలో ఒకటవ బాలనటుడు కమలహాసన్‌ల ప్ర చిత్రీకరించిన –

**అమ్మావు నీయే అప్పావు నీయే**
**అన్బుడనే ఆదరిక్కుం దైవముం నీయే**

అనే పాటను అనుకరిస్తూ తెలుగులో 'మావూరి అమ్మాయి' లో అనిసెట్టి –

**కనిపెంచు తల్లీ కాపాడు తండ్రీ**
**ఆపదలో ఆదరించు దైవము నీవే (కని)**

**తండ్రెవరో తల్లెవరో తెలియగ లేమూ మేము**
**ఏడ్చిననూ జాలిగొను దాతల గనమూ**
**కన్నీరె ఈ బ్రతుకున ఉగ్గు పాలయే, ఈ**
**అసహాయుల పలుకులనూ ఆలకించవో**
**భగవాన్! భగవాన్! భగవాన్! (కని)**

**ముద్ద కలిపి ఎవరూ మాకు బువ్వపెట్టరు**
**మమ్ము ప్రీతిమీర ఒడినిచేర్చి నిదురపుచ్చరు**
**లోకమున పాపలపై ఈ పగేలనో! ఈ**
**అసహాయుల పలుకులనూ ఆలకించవో**
**భగవాన్! భగవాన్! భగవాన్! (కని)**

అనే పాటగా మలచగా దానిని యం.యస్.రాజేశ్వరి బృందం పాడారు. మూలానుగుణంగా, దయనీయమైన సన్నివేశానికి కరుణరస ప్రపూరితంగా రాసిన ఈ పాట ప్రేక్షకుల మనసులను కరిగించింది.

ఆ తర్వాత యిదే సందర్భానికి మూగనోము (1969) లో ఆరుద్ర రచించిన –

**తల్లివి నీవే తండ్రివి నీవే**
**చల్లగ కరుణించే దైవం నీవే**

అనే ప్రాచుర్యం పొందిన పాటకు అనిసెట్టి పాట దారి చూపింది.

3. 'పావమన్నిప్పు' (1961) తమిళచిత్రం లో కణ్ణదాసన్ రచించిన పాటలన్నీ జనాన్ని వుర్రూతలూపాయి. వాటిలో ఈ కింది పాట శ్రీమతి పి.సుశీలకు విశేష ఖ్యాతిని తెచ్చింది. నాయిక తొలివలపు తలపోతల మురిపాలను వర్ణించే ఈ పాటను కణ్ణదాసన్ మధురాతిమధురంగా రాశారు.

**అత్తాన్ ఎన్నత్తాన్ అవర్ ఎన్నైత్తాన్**
**ఎప్పడి సొల్వేనడి – అవర్**

**కై యైత్తాన్ కొండు మెల్లత్తాన్ – వందు**
**కణ్ణయ్‌త్తాన్ ఎప్పడి సొల్వేనడి..**

(భావం: ఏమని చెప్పనే! నా బావ నన్ను సున్నితంగా చేతితో తడిమి, దగ్గరగ తీసుకొన్నాడు, నేను ప్రేమ పిచ్చుకననీ, నా మేను పట్టులాంటిదనీ, పరవశింపజేసే మాటలతో నన్ను కౌగిలించుకొన్నాడు)

తమిళంలో సినీ కవికులగురువు కణ్ణదాసన్ పాటల్ని అనువదించడం మాటలు కాదు. అయినా 'పాప పరిహారం' లో అనిసెట్టి రాసిన డబ్బింగ్‌పాటలు అతనికి మంచిపేరే తెచ్చాయి. పైపాటను అనిసెట్టి యెలా తెనిగించారో చూద్దాం –

**చిలుకా, నా చిలుకా**
**ఎవరో చిలుకా, నా మది కవ్వించెలే**
**నవస్నేహాలే వింతమోహాలే మూసె నా కనులే**
**నా మది కవ్వించెలే ॥నా॥**

**కలయందే నన్ను పిలిచెలే**
**నా చెంతజేరి వలచెలే**
**కన్నెబుగ్గలె కందె, సిగ్గులే**
**కలగె,యెదయే కరగె ॥నా॥**

**ముద్దులే నన్ను సోకెలే**
**మోజులే హృదయ మూచెలే**
**తనువు తూలెలే, కలలు జారెలే**
**వ్యథలే కథలై మిగిలే ॥నా॥**

**(పాప పరిహారం)**

'చిలుకా' అనే సంబోధన తప్ప, మిగిలిన పాటలోని నాయిక వూహావిహారం మాతృక లోనిదే!

4. కణ్ణదాసన్ పాటలను మరోసారి తెలుగు చేసే అవకాశం అనిసెట్టికి తిరిగి 'ప్రాయశ్చిత్తం' చిత్రం ద్వారా లభించింది. ఏ. భీమ్‌సింగ్ దర్శకత్వంలో బి. సరోజాదేవి, శివాజీ గణేశన్ నాయికా నాయకులుగా నటించిన 'పాలుం పళముం', 'ప్రాయశ్చిత్తం' పేరుతో తెలుగులో డబ్‌చేయబడింది. ప్రాణానికి ప్రాణంగా ప్రేమించుకొని పెళ్లిచేసుకొన్న

డాక్టరు నర్సు దంపతుల మధ్య విధి ఆడిన వింతనాటకం వల్ల వారికి వియోగం సంభవించి చివరికి వారి కథ సుఖాంతం కావడం 'పాలుం పళముం' యితివృత్తం. ఇందులో కణ్ణదాసన్ పాటలకు కూడా 'పావమనిప్పు' పాటలలాగే జనం బ్రహ్మరథం పట్టారు. ఈ చిత్రానికి తెలుగుసేత అయిన 'ప్రాయశ్చిత్తాం'నికి అనిసెట్టి మాటలూ పాటలూ రాశారు. ప్రాయశ్చిత్తం తెలుగులో విజయవంతం కావడానికి అనిసెట్టి రచన కూడా దోహదం చేసిందనడానికి రెండు చిత్రాల నుంచి ఒక పాటను తులనాత్మకంగా పరిశీలిద్దాం –

**ఆలయ మణియిన్ ఓస్తైయై నాన్ కేట్టేన్**
**అరుళ్ మొళికూఱుం పఱవైగళ్ ఒలికేట్టేన్**
**ఉన్ ఇఱైవన్ అవనే అవనే**
**ఎనప్పాదుం మొళికేట్టేన్**
**ఉన్ తలైవన్ అవనే అవనే**
**ఎన్నుం తాయిన్ మొళికేట్టేన్ (పాలుం పళముం –1961)**

(భావం : గుడిగంట మోతలో, పక్షుల నాదాలలో అతడే నా దేవుడనే అనుగ్రహ ధోరణిని విన్నాను.. సాయంత్రం కనుమరుగవుతున్న కాలంలో ఆ దేవుడు తేరు మీద వచ్చి నన్ను అనుగ్రహించి ఒడి చేర్చుకున్నాడు..)

ఈ సందర్భానికి పైపాట ననుసరిస్తూ అనిసెట్టి రాసిన పాట –

**ఆకసమందున సూర్యుడు ఆడెనులే**
**ఆమని కోయిల మృదువుగ పాడెనులే**
**నీ దైవం ఎవరే ఎవరే అని పూలు పిలిచెనులే**
**నీ స్వరం రవియే రవియే అని గాలి పలికెనులే**

**1.** **చల్లని మేఘం పల్లకిలో – విరి**
**తావులు కురిసే దారులలో**
**నా సఖుడే నను చేరెనులే**
**నాలో ఆశలు పండెనులే ॥ఆక॥**

**2.** **చక్కని గుడియె నాహృదియే**
**సఖునికి నెలవుగ మారెనులే**
**కలలో కోరిన ప్రియుడేలే**

**కండ్లెదుటే కనిపించెనులే** **॥ఆక॥**

ఈ పాట కూడా 'పాప పరిహారం' లోలా నాయిక తొలివలపు వూహలకు సంబంధించిందే. ఈ పాటను అనిసెట్టి మక్కికి మక్కిగా కాకుండా కొంత మేరకు కవితా పరిమళాన్ని అద్దుతూ రాయడాన్ని గమనిస్తాం. కథలో నాయకుని పేరైన 'రవి' ని పాటలో వాడుకొన్నారు. రెండు భాషల్లోనూ ఈ పాటను శ్రీమతి సుశీలయే పాడారు. ఇంకా ప్రాయశ్చిత్తంలో – 'నీ పేరె నా ప్రాణం – నీ మాటే వేదం' అనే సుశీల – ఘంటసాల పాడిన యుగళగీతం, 'పోతే పోనీ పోరా..' అనే ఘంటసాల పాడిన 'సోలో', సుశీల పాడిన 'ఆగవేల మేఘమా నా వినతి నీవు వినలేవో..' మొదలైన అనిసెట్టి పాటలు ప్రజాదరణను చూరగొన్నాయి.

5. హిందీ నుంచి డబ్ చేసిన చిత్రాలకు కూడా అనిసెట్టి న్యాయం చేశారనడానికి ఒక వుదాహరణాన్ని చూద్దాం. చంద్రకాంత్ దర్శకత్వంలో 'భీమ ప్రతిజ్ఞ' కు (1965) అనిసెట్టి మాటలు పాటలు రాశారు. అందులో పాండవులు అడవులకు వెళ్తున్న సన్నివేశంలో మాధవపెద్ది సత్యం పాడిన నేపథ్యగీతాన్ని అనిసెట్టి అంత్యప్రాసలతో తెలుగుదనం తొణికిసలాడేలా రాశారు.

**వీచెను కాలపు సుడిగాలీ – అది**
**విసరెను బాధల పెనుధూళి**
**విధికి లేదులే ఏ జాలి – ఆ**
**విధాత కిదియే ఒక కేళి!**

**దిగ్దిగంతముల నేలే రాజులే**
**దిక్కులేని వారైతిరిలే**
**రాజసూయమున జయించు వీరులే**
**రాళ్లపాలై పోతిరిలే** **॥వీచెను॥**

**కన్నుల నీరే జారెనులే**
**వేదన హృదిలో పొంగెనులే**
**కష్టము నెరుగని పాంచాలీ**
**కంటకముల బడి సాగెనులే** **॥వీచెను॥**

6. వివిధ భాషలలో అనిసెట్టికి గల పరిచయం వల్ల ఆయన ఏ భాష నుంచి తెలుగులోకి డబ్ చేసిన చిత్రాని కయినా అవలీలగా రచన చేసి – రెండు భాషలూ తెలిసిన వారిని మెప్పించారనడానికి 'రణధీర కంఠీరవ' (సంచారి) కన్నడచిత్రం ప్రబల నిదర్శనం. మైసూరు సింహాసనాన్ని అధిష్ఠించిన కంఠీరవుడు తిరుచినాపల్లి దిగ్విజయ యాత్ర నుంచి తిరిగివస్తూ – దుర్గ అనే దేవదాసిని ప్రేమించి ఆమె దగ్గర తను మహారాజుననే సత్యాన్ని మరుగుపర్చి, తనొక దేశసంచారి నంటాడు. ఆ తర్వాత ఆమెను చిన్నరాణిని చేసిన మహారాజు ఆమె నపార్థం చేసుకొని, అనుమానంతో దూరం చేసుకొని చివరకు ఆమె నర్థంచేసుకోవడం సంచారి యితివృత్తం. యన్. సి. రాజన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాజ్‌కుమార్, ఉదయకుమార్, కాంతారావు, లీలావతి, సంధ్య మొదలైనవారు తారాగణం. ఈ చిత్రంలో మహారాజును కీర్తిస్తూ పాడే నృత్యగీతం రెండు భాషల్లోను యెలావుందో చేద్దాం –

**కర్ణాట వైరముడి కంఠీరవా**
**చిరకాల నినగిరలి ఈ వైభవా**
**బిరుదెంతెబరగండ్ర, మిత్రకమల మార్తాండ**
**వీరశూర మొనెగార, సుగుణ గంభీర**
**రాజకందర్పసంగీతలోల  సాహిత్యరత్నాకర**
**రాజాధిరాజ నరసింహరాజ ఒడెయ, విజయీభవ! –**

**(రణధీర కంఠీరవ)**

(భావం : కర్ణాటకకే వజ్రకిరీటమా, సింహమా, చిరకాలం ఈ వైభవం నిలిచి వుండుగాక! బిరుదాంకితులలో శ్రేష్ఠుడా, మిత్రకులానికి సూర్యుడా, వీరుడా, శూరుడా, మొనగాడా, రాజమదనా, ప్రభువా నీకు జయమగుగాక!)

తెలుగు సంచారిలో ఈపాటను దాదాపుగా అదే పదజాలంతో అనిసెట్టి రాయగా – రాధా జయలక్ష్మి, శూలమంగళం రాజ్యలక్ష్మి గానం చేశారు.

**కర్ణాటరాజ్య మణికంఠీరవా,**
**చిరకాలం నిలచు నిల నీ వైభవం!**
**మహిత శోభల వెలుగు**
**మిత్రకుల మార్తాండా!**

**వీరా, శూరా, మొనగాడా! సుగుణ గంభీరా!**
**రాజకందర్ప, సంగీతలోల, సాహిత్యరత్నాకరా!**
**రాజాధిరాజ! నరసింహరాజ!**
**దేవా, విజయీ భవ!**

**శిల్పుల కీ జగతి కల్పతరు వీవేను**
**కళల, కవిపుంగవుల కామధేనూ!**
**వీరా, నరపాలా, వర విజ్ఞానఖనీ**
**నీకు సములెవ్వరిలా**
**దివ్యధాత్రి తిలకమీవె, దైవపు దీవెనలు నీవె**
**ఈ భువి హాయిగా వర్ధిలు**
**కల్పతరూ! కల్పతరూ!** **(సంచారి - 1960)**

ఈ చిత్రంలో మిగిలిన పాటలు కూడా ప్రాచుర్యం పొందడం వల్లనే ఆ జ్ఞాపకాలు నేటికీ సినీప్రియుల మెదళ్లలో పదిలంగా వున్నాయి!

7. మలయాళచిత్రం 'స్వామి అయ్యప్ప' (1975) తెలుగులో డబ్ చేసేవరకు ఆంధ్రదేశానికి అయ్యప్పస్వామి గురించి అంతగా తెలియదు. నేడు ఆంధ్రదేశంలో వేలకొద్దీ అయ్యప్పస్వామి ఆలయాలు వెలిశాయి. అయ్యప్పస్వామి మాలలు ధరించి మండల దీక్షలు చేపడుతున్న భక్తులు తిరుపతి తర్వాత శబరిమలకే యెక్కువగా యెగబడుతున్నారు. 'స్వామి అయ్యప్ప' తెలుగుసేత తర్వాత తెలుగులో అయ్యప్ప స్వామి మహిమలకు సంబంధించిన అనేక చిత్రాలు వచ్చాయి. ఆంధ్రదేశంలో అయ్యప్ప స్వామికి యింతగా ఆదరణ పెరగడానికి 'స్వామి అయ్యప్ప' (1977) డబ్బింగ్‌చిత్రమూ, దానికి అనిసెట్టి రాసిన పాటలూ ప్రధాన హేతువులని చెప్పాలి.

తెలుగులో తర్జుమా చేసిన 'స్వామి అయ్యప్ప' చిత్రంలోని పాటలన్నీ అప్పుడు ఆంధ్రదేశాన్ని భక్తిరసంలో వోలలాడించడమే కాకుండా – నేటికీ గట్టిగానే వినిపిస్తున్నాయి. వాటిలో –

**హరివరాసనం విశ్వమోహనం**
**హరిదధీశ్వరం ఆరాధ్యపాదుకం**
**అరివిమర్దనం నిత్య నర్తనం**

హరిహరాత్మజం స్వామి దేవమాశ్రయం
శరణం అయ్యప్ప స్వామి శరణం అయ్యప్ప
శరణం అయ్యప్ప స్వామి శరణం అయ్యప్ప

అనే పాటను తెలుగు చెయ్యకుండా యథాతథంగా వినియోగించారు.

(1) మిగిలిన వాటిలో జేసుదాస్ పాడిన -

శబరిమలను స్వర్ణచంద్రోదయం
ధర్మ రక్షకుని సన్నిధిని అభిషేకం
లోకాల గారవించు అయ్యప్ప స్తోత్రం
భక్తితో పాడుకుంటాం హృదయముల

ప్రీతియె వుల్లమున పాలగును
అదే చల్లని యెదను పెరుగగును
వెన్నయె నీవిచ్చు అనురాగం
నీకు నెయ్యభిషేకమును జరిపిస్తాం
నీ జాడలలో నడిచే జీవుల మయ్యప్పా
ఈ సర్వస్వం నీ ఆశీర్వాద మయ్యప్పా ॥శబరి॥

పుణ్యమె చే పన్నీరభిషేకం
జనులు భక్తితో చేసెడి పాలాభిషేకం
దివ్య పంచామృతాన అభిషేకం
నీదు తనువంత జ్యోతివలె వెలిగేను ॥నీజాడలలో॥
జ్యోతిగ పుణ్యజలం అందుకొని
అది నీపేరు స్తుతియించి శిరసుంచి
తనువు విభూతితో అభిషేకం
హరిఓం అని చందనంతో అభిషేకం ॥నీజాడలలో॥

మలయాళ మూలం :

శబరి మలయిల్ తంగ సూర్యోదయం
సంగ్రమప్పు లరియల్ అభిషేకం
భక్తకోడి తేడియెత్తుం సన్నిధానత్తిల్

**వన్నెత్తు మెండె హృదయవుం ఉడుక్కుం కొట్టి...**

భావం : సంక్రమణ వుదయాన నీ అభిషేకానికి భక్తకోటి వచ్చి చేరే సన్నిధానంలో నా మనసూ చేరుతుంది. రక్తాలంకరణ చేసిన నీ గుండెపైన, దశపుష్పాలు తురిమిన నీ జడపైన, నీ తిరుపాద పద్మాలపైన నేతితో జరుపుతున్న అభిషేకం పుణ్యదర్శనం. అయ్యప్పా, నీ కరుణామృత వర్షం నాపై కురిపించు. భక్తుల మానసాల నుంచి వూరిన తేనెతోను, దివ్య పంచామృతాల తోను నీకు జరుగుతున్న అభిషేకం వల్ల నీ దేహం నిత్యశోభతో ప్రకాశిస్తుంది. గుండెలోని వెలుగు పంటతో నీ ప్రసాదాన్ని చేసి, తెల్లని విభూతితోను, చందనంతోనూ నిన్నభిషేకిస్తాం. ఈరేడు లోకాలకు అధిపతివైన అయ్యప్పా, నన్ను కరుణించు.

మూలంలో సూర్యోదయం కాస్తా తెలుగులో చంద్రోదయమైంది. తెలుగులో 'నెయ్యభిషేకం' 'పాలాభిషేకం' మొదలైన 'లిప్‌సింక్' కోసం రాసిన పదప్రయోగాలు భక్తిరసంలో కొట్టుకుపోయాయి.

ఇంకా –

శ్రీమతి పి.సుశీల ఆలపించిన

**చేతులిచ్చి చెంతనిలిచి వేడుకొందు స్వామీ**
**దేవుడని కొలుచుకొని మొక్కుకుందు స్వామీ**
**స్వర్గలోక దేవతలకు వరములిచ్చు స్వామీ**
**క్రూరమైన దానవులను కూల్చివేయు స్వామీ**
**అయ్యప్ప స్వామీ, అద్భుత స్వామీ...**

**చరణం-1**

**ఇలయందు రామకృష్ణ లీలలు నీవే**
**నన్ను కాపాడు పరమశివుడు విష్ణువు నీవే**
**సకలమును ఏలుతుండు శక్తివి నీవే**
**నిను నమ్మువారి ఆవేదన చూడవిదేల? ॥అయ్యప్ప॥**

**చరణం-2**

**అక్కవుంది చెల్లెలుంది ఆడిపాడగా**
**ఒక తమ్ముని మాకు ప్రసాదించు వంశమందున**

**నడవలేని నాన్న నిన్ను చూడవచ్చినా**
**అతడు తోడువచ్చి పొందు నీదు దీవెనా ॥అయ్యప్ప॥**

('అద్భుత స్వామీ' తెలుగు లో చేసిన పద ప్రయోగమే – మూలంలో లేదు!)

మొదలైన పాటలు భక్తకూటాల్లోనూ, మైకుల్లోనూ, నేటికీ మారుమ్రోగుతున్నాయి. ఈ పాటల్ని అనిసెట్టి గద్య ధోరణిలో సాదాసీదాగా రాసినా, మధురమైన బాణీలు, భక్తిభావనిర్భరత – వాటికి జీవం పోశాయి.

డబ్బింగ్‌చిత్రాలతో పాటు గుడిగంటలు, రక్తసంబంధం మొ॥ పునర్నిర్మాణ చిత్రాల్లో కూడా అనిసెట్టి కనబర్చిన ప్రతిభకు వుదాహరణంగా ఆయనకు గొప్పపేరు తెచ్చిన 'రక్తసంబంధం' లోని పాటలో తలదూర్చుదాం.

శివాజీ గణేశన్, సావిత్రి అన్నా చెల్లెళ్లుగా నటించిన 'పాశమలర్' (1960) తమిళంలో ఘన విజయాన్ని సాధించింది. తెలుగులో ఎన్.టి.రామారావు, సావిత్రి అన్నాచెల్లెళ్లుగా 'రక్తసంబంధం' పేరుతో ఈ చిత్రాన్ని తిరిగి నిర్మించారు. ఈ చిత్రంలో అన్నచెల్లెళ్ల అనుబంధాన్ని అత్యంత ఆర్ద్రంగా వారి వియోగ సందర్భంలో తమిళంలో కణ్ణదాసన్ రాసిన పాటను తెలుగులో రాసే అవకాశం అనిసెట్టికి లభించింది –

'మలర్న్దు మలరాద పాది మలర్ పోల మలరుమ్ విళివణ్ణమ్

వందు విడిందుమ్ విడియాద కాలై పొళుదాగ విడింద కళై అన్నమే'

(విరిసే విరియని పువ్వులాంటి నా కంటి వెలుగువి నీవు, వికసిస్తున్న వేకువలా కళలొలికే రాయంచవు నీవు)

అని పాపాయిని వర్ణిస్తూ సావిత్రి పాడే పల్లవితో ప్రారంభమయ్యే ఈ పాటను అనిసెట్టి యిలా తెలుగు చేశారు –

**పల్లవి : చందురుని మించు అందమొలికించు ముద్దు పాపాయివే**
**నిన్ను కన్నవారింట కష్టముల నీడ కరగిపోయేనులే**
**కరుణతో జూచి కనక దుర్గమ్మ కామితము లిచ్చులే**
**లోకముల నేలు వెంకటేశ్వరుడు నిన్ను దీవించులే**

**చరణం-1**

**చెల్లి : అన్నఒడి చేర్చి ఆటలాడించు నాటి కథ పాడనా..నాటికథ పాడనా**

కలతలకు లొంగి కష్టముల క్రుంగు నేటికథ పాడనా.. నేటికథ పాడనా

అన్న : కంటిలో పాప ఇంటికే జ్యోతి చెల్లి నాప్రాణమే..చెల్లి నాప్రాణమే
మము విధియె విడదీసె వెతలలో ద్రోసె మిగిలె నీ శోకమే

**చరణం-2**

చెల్లి : మనసులను కలుపు మధురబంధాలు మాసిపోరాదులే
పెరిగి నీవైన మామగారింట మనువునే కోరుమా బంధమే నిల్పుమా..
మా బంధమే నిల్పుమా

అన్న : కాల మెదురైన గతులు వేరైన మమతలే మాయునా
పెరిగి నీవైన అత్తగారింట కోడలిగ చేరుమా
బంధమే నిల్పుమా, మా బంధమే నిల్పుమా
దివిలో తారకలు భువిలో మానవులు ధూళిలో కలిసినా
అన్న - చెల్లెళ్ల జన్మబంధాలే నిత్యమై నిల్చులే

చెల్లి : లాలి పాపాయి, హాయి పాపాయి
లాలి పాపాయి జో..లాలి పాపాయి జో..జో..!

తెలుగులో పి.సుశీల, ఘంటసాల ఆలపించిన ఈ గీతం ప్రేక్షకుల కళ్లను చెమరింపజేసింది!

వీలైనంత వరకు దీర్ఘాలూ, ద్విత్వాలు, సంయుక్తాలు లేని మృదువైన శైలిలో పాటలు రాసిన అనిసెట్టి వ్యక్తిగతంగా కూడా మృదుస్వభావి, ఎటువంటి అట్టహాసాలూ లేని అంతర్ముఖులు. ఏభయ్యేడేళ్ల తక్కువ వయసులోనే చనిపోయినా అంకితభావం గల సమర్థుడైన డబ్బింగ్‌కవిగా ఆ రంగంలో ఆయన చిరకాలం గుర్తుంటారు.

❖

ఈ ప్రకరణంలో
సమాచార సేకరణకు సహకరించిన వ్యక్తులు, వ్యాసాలు..

1. 'సాక్షి' దినపత్రిక (24-5-14) లో
   'అతని అనువాదం కూడా సాహిత్యమే..!' పైడిపాల వ్యాసం
2. 'సూర్య' దినపత్రిక 'తననాలు - తర్జుమాలు' శీర్షికలో
   డా. మణిగోపాల్ (వనమాలి) వ్యాసం.
3. యస్.పి.బాలసుబ్రహ్మణ్యం కన్నడగీతాల గురించి
   మెయిల్ ద్వారా పంపిన సమాచారం.
4. యల్.ఆర్.స్వామి (విశాఖపట్నం)
   మలయాళగీతాల గురించి రాసి పంపిన వివరణ.
5. సినీరచయిత, నటులు తోటపల్లి మధు నుంచి సమాచారం.
6. పద్మభూషణ్ పి.సుశీల అభినందన సంచిక -
   సంపాదకులు : కీ.శే. భమిడిపాటి రామగోపాలం (భ.రా.గో)



## వెలలేని కవి వీటూరి

(3-1-1934 - 21-10-1985)

'వీటూరి' పేరు ఈ తరాని కంతగా తెలియదు. ఆయన రాసిన గొప్ప పాటల వల్ల అప్పుడప్పుడూ వీటూరి పేరు వినిపించినా, దానిని 'వేటూరి' గా భ్రమపడే అవకాశమే యెక్కువ. వేటూరి, వీటూరి – ఇద్దరూ పాటలు రాసిన 'యమగోల' చిత్రం (1977) పాటల పుస్తకంలో చివరి పాటకు 'రచన – వీటూరి సుందర రామమూర్తి' అని పొరపాటుగా ప్రచురించడం యిలాంటి భ్రాంతికి ఓ వుదాహరణం!

వీటూరి పూర్తిపేరు వీటూరి వేంకటసత్య సూర్యనారాయణమూర్తి. జన్మస్థలం అప్పటి విశాఖపట్టణం జిల్లా భోగాపురం తాలూకాలో (నేటి విజయనగరం జిల్లా, పూసపాటి రేగ మండలం) ఓ మారుమూల గ్రామం 'రెల్లి వలస'. వీటూరి తన పెద్దన్న రమణయ్య దగ్గర ప్రాథమిక విద్యనభ్యసించి, విజయనగరంలో ఇంటర్మీడియట్‌లో వుత్తీర్ణులయ్యారు. భీముని పట్నంలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి కొంతకాలం రెల్లివలసలోను, తర్వాత పెందుర్తిలోను ఉపాధ్యాయునిగా పనిచేసారు. కళాశాల విద్యార్థిగా వుండగానే సాహిత్యనాటక రంగాల పట్ల ఆకర్షితులై ఛందోబద్ధమైన కవిత్వం,పాటలు రాసేవారు. 'ఉషాపరిణయం' పౌరాణిక నాటకాన్ని, 'కల్పన', 'పగ', సాంఘిక నాటకాలను రచించడమే గాక తన దర్శకత్వంలో ప్రదర్శనలను కూడా యిచ్చారు. అలా రంగస్థల పరిచయంతో పి.జె.శర్మ ప్రధాన పాత్రధారిగా విజయనగరం రాఘవ కళాపరిషత్‌లో కల్పన నాటకాన్ని ప్రదర్శించి బహుమతులనూ, ప్రశంసలనూ పొందారు. అప్పటికే సినిమా అవకాశాల కోసం తరచుగా మద్రాసు వెళ్లి వస్తున్న వీటూరి కి ఆ నాటకం వెండితెర కెక్కడానికి దారి చూపింది.

1955 లో 'అక్కాచెల్లెలు' చిత్రానికి రచనాసహకారం అందించడానికి అవకాశం దొరికిన వీటూరి యేడాది తిరక్కుండా శ్రీ మురళీకృష్ణా ఫిలిమ్స్ వారి డబ్బింగ్ చిత్రం 'శ్రీకృష్ణ లీలలు' లో మొదటి పాటను రాయగలిగారు. ' మురళీధరా కృష్ణయ్యా, నిన్నే నమ్ముకొంటినయ్యా' అనే పాట ఆయనకు ఆత్మవిశ్వాసాన్ని కలిగించడమే కాకుండా, నిర్మాతల దృష్టిలో పడేలా కూడా చేసింది. ఆ తర్వాత 'మహారథి కర్ణ', 'జగదేక సుందరి' హిందీ డబ్బింగ్‌చిత్రాలకు ఆయన యితర కవులతో కలసి పాటలందించినా, అంతగా గుర్తింపు రాలేదు.

1962 లో కృష్ణకుమారి, కాంతారావు నాయికానాయకులుగా నటించిన శ్యాంప్రసాద్ మూవీస్ వారి 'స్వర్ణగౌరి' చిత్రానికి తొలిసారిగా మాటలూ పాటలూ రాసే అవకాశం దక్కింది. అదే యేడు యం.జి.రామచంద్రన్ నటించిన తమిళచిత్రం 'మన్నాది మన్నన్' ను 'ఏకైక వీరుడు' గా తెలుగు చేసే అవకాశం రావడంతో వీటూరి దశ తిరిగింది. 'కొండవీటి దొంగ' డబ్బింగ్‌చిత్రం అనిసెట్టి జీవితాన్ని యెలా మలుపు తిప్పిందో వీటూరికి 'ఏకైక వీరుడు' అలాంటి 'బ్రేక్' నిచ్చింది. వీటూరి ప్రతిభను గుర్తించి విఠలాచార్య, పద్మనాభం, హీరో కాంతారావు తమ చిత్రాలలో ఆయన నెక్కువగా ప్రోత్సహించారు. ముఖ్యంగా రేఖా & మురళీ ఆర్ట్స్ పతాకంపై పద్మనాభం నిర్మించిన 'దేవత' చిత్రంలోని వీటూరి పాటలు ఆయన పేరును ఫెళఫెళ లాడించాయి. దేవత విడుదలయిన 1965 నుంచి పుష్కరకాలం పాటు వీటూరి కి తెలుగులో నేరుగా తీసిన చిత్రాల్లో 'హిట్ సాంగ్స్' రాసే అవకాశాలు వచ్చాయి.

1. నాగమల్లి కోనలోన నక్కింది లేడికూన (బంగారు తిమ్మరాజు - 1964)
2. ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి
   ఇల్లాలే ఈ జగతికి జీవనజ్యోతి (దేవత -1965)
3. రాధాలోలా గోపాలా గానవిలోలా యదుబాలా.. (శారద -1973)
4. ఆడవె అందాల సురభామినీ
   పాడవె కళలన్ని ఒకటేననీ.. (యమగోల -1977)
5. మబ్బే మసకేసిందిలే
   పొగమంచే తెరగా నిలిచిందిలే (వయసు పిలిచింది - 1978)

6. నువు వస్తావని బృందావని
    ఆశగ చూసేనయ్యా కృష్ణయ్యా                    (మల్లెపువ్వు - 1978)

వంటి నేరుగా తెలుగులో తీసిన చిత్రాల్లోని పాటలు పరిశ్రమలో వీటూరి వునికిని నిరూపించాయి. ముఖ్యంగా యస్.పి.బాలసుబ్రహ్మణ్యం అనే గంధర్వగాయకుణ్ని తెలుగు చిత్రపరిశ్రమకు పరిచయం చేసిన -

**'ఓ ! ఏమీ ఈ వింతమోహం..'    (శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న - 1967)**

గీతం వీటూరి (సు) కృతమే!

వీటూరికి 'డైరెక్ట్ టేక్' చిత్రాల వల్ల యెంత పేరొచ్చిందో - డబ్బింగ్ చిత్రాలు వల్ల కూడా ఆయనకు అంతగానూ ప్రాచుర్యం వచ్చింది. ఆ మాటకొస్తే వీటూరి అనిసెట్టి మరణానంతరం యెక్కువ డబ్బింగ్ చిత్రాలకు రచన చెయ్యడంతో - ఆయనకు డబ్బింగ్ రచయితగానే ముద్రపడింది. ఆయన కూడా అనిసెట్టిలాగే నాలుగు భాషల (హిందీ, తమిళ, కన్నడ, మలయాళాలు) నుండి తెలుగు చేసిన యాభైకుపైగా డబ్బింగ్ చిత్రాలకు పనిచేశారు. ఆయన రచన చేసిన కొన్ని ముఖ్యమైన డబ్బింగ్ చిత్రాలు -

**హిందీ-**

శ్రీ కృష్ణ లీలలు - 1956
జగదేక సుందరి - 1961
జై మహాకాళి - 1982
జై సంతోషిమాతా - 1982

**కన్నడం -**

భక్త కనకదాసు - 1965
డా. మధు - 1981
శనీశ్వర మహిమ - 1981
నాగాభరణం - 1981
సిద్ధలింగేశ్వర స్వామి మహిమ - 1985

**మలయాళం -**

సింహంతో చెలగాటం - 1984

రాజస్థాన్ రౌడీలు - 1984

**తమిళం -**

ఏకైక వీరుడు - 1962

రాజద్రోహి - 1965

ధనమే ప్రపంచలీల - 1967

మన్మథ లీల - 1976

ఎర్ర గులాబీలు - 1979

పట్నం పిల్ల - 1980

అమరగీతం - 1982

యవ్వనం పిలిచింది - 1985

వీటూరి రచన చేసిన డబ్బింగ్ చిత్రాల్లో కూడా అధికశాతం తమిళం నుంచి తర్జుమా చేసినవే. వీటూరి డబ్బింగ్ పాటల నుంచి కొన్నిటిని యెంపిక చేసి, ఆయన ధోరణిని గమనిద్దాం -

1. తమిళ హీరో యం.జి. రామచంద్రన్ వెండితెరను రాజకీయాలకు అనుకూలంగా వినియోగించుకొనేవారు. తన ప్రతిచిత్రంలో ఒక పాటనైనా కథకూ, తన రాజకీయపక్ష సిద్ధాంతాలకూ ముడిపెట్టి రాయించుకునేవారు. అలా యం.జి.ఆర్. 'మన్నాది మన్నన్' (1960) లో కణ్ణదాసన్ చేత ద్రావిడులకు ధైర్యసాహసాలను నూరిపోసే దేశభక్తి గీతాన్నొక దానిని రాయించారు.

**అచ్చుమ్ ఎనబదు మడమై యడా**
**అంజామై ద్రావిడర్ ఉడమై యడా**
**ఆరిలుమ్ సావు నూరిలుకు సావు**
**తాయగల్ కాప్పదు కడమై యడా...**

(భావం : భయమనేది మూర్ఖత్వం. ధైర్యసాహసాలు ద్రావిడుల లక్షణాలు. ఆరులో నూరులో... యెప్పుడు చనిపోయినా మాతృభూమి పరిరక్షణ మన కర్తవ్యం. చేరులైనా పాండ్యులైనా తమ శౌర్యంతో జన్మభూమిని వీరమాతగా చేసేవారే ధన్యులు. కోటిమంది పుడతారు – పోతారు. వారితో ప్రజల మనసులలో నిలిచేవారే చరిత్ర సృష్టిస్తారు)

'ఏకైక వీరుడు' పేరుతో పి. సాంబశివరావు నిర్వహణలో తెలుగు చేసిన ఈ

చిత్రానికి మాటలు మహారథి, పాటలు వీటూరి రాశారు. సంగీతం విశ్వనాథన్ – రామ్మూర్తి, పై పాటకు వీటూరి తెలుగు సేతను చూద్దాం –

**న్యాయం ధర్మం మరువకురా**
**ఏనాడు ఎవరికి వెరువకురా**
**ఆంధ్రుల త్యాగం ఆంధ్రుల శౌర్యం**
**అవనిలో స్థిరముగ నిల్పుమురా** ॥న్యాయం॥

**రుద్రమదేవి, సతిమాంచాలా**
**జన్మించిన ఘనదేశమురా**
**తిక్కన బ్రహ్మన బాలచంద్రుడూ**
**ఏలిన చల్లని వంశమురా** ॥న్యాయం॥

**స్వార్థం వీడి మును మన పూర్వులు**
**మనకీ భాగ్యం నిలిపిరిరా**
**ఆ మహనీయుల పేరే నిల్పి**
**కీర్తి కాంతనే చేకొనరా** ॥న్యాయం॥

తెలుగులో ఘంటసాల పాడిన ఈ పాటలో ప్రాంతీయభావాన్ని ప్రబోధిస్తూ వీటూరి స్వేచ్ఛానువాదం చేశారు. చారిత్రక వ్యక్తుల ప్రసక్తితో తెలుగు పౌరుషాన్ని తట్టిలేపారు. అవకాశం వచ్చినపుడల్లా వీటూరి మాతృదేశాభిమానాన్ని ప్రదర్శించేవారని ఈ పాట రుజువు చేస్తోంది.

ఇదే చిత్రంలో –

**కనియ కనియ మళలై పేశుమ్ కణ్మణీ**
**కాదల్ పొంగుమ్ గీదమ్ పాడుమ్ పొన్మణీ**
**కనింద మళలై తందవర్ యార్ సొల్లవా – ఎందన్**
**కాదల్ పొంగుమ్ గీదమ్ నీంగళ్ అల్లవా**

అనే లయప్రధానమైన యుగళగీతాన్ని వీటూరి యిలా తెనిగించారు–

**కలిత లలిత మద మరాళ గామినీ**
**మదిలోన ప్రణయనాట్యమాడు భామినీ**

చరణం-1

ఆమె : అందమైనదీ సుమధుర యోగమే
హృదయాలు మేళవించెను అనురాగమే

అతను : రాగసుధారసము లొలుకు నీదు అందాలు
సురభోగములై మనసు దోచు వలపుబంధాలు

ఆమె : దాచేను అందము తమ పొందుకోసమే

అతను : మా మది వెలసే మధుమాసం మధుర హాసమే॥అంద॥

చరణం-2

ఆమె : వలపున కోరికనై వలపుచకోరికనై
కలలా మురిపింతును కన్నులందు తారకనై

అతను : కన్నులలో వెలిగే కలకీ వెన్నెలవే
నవరాగము లేలే ప్రణయ దేవివే

చరణం-3

అతను : కమ్మని సుధలు చిందే నీ కన్నులు ఏమనెనో

ఆమె : తమ తొలివలపు దోరవయసు దోచుకొమ్మనెనూ

అతను : మా హృదయములో దాచుకొనే వరము లిమ్మనెనూ

ఆమె : ఊ...!

అతను : ఊ...!

ఆమె : ఐక్యముగా ఈ ప్రేమలో పయన మోదమూ

అతను : లీనమైన జీవన మధుగీతమూ

ఇద్దరు : సంగీతమాయె మన సరాగచరితమూ

సుశీల - ఘంటసాల ఆలపించిన ఈ యుగళగీతాన్ని బాణీకి అనుగుణమైన వీటూరి శైలికి మచ్చు తునకగా పేర్కొనవచ్చు.

2. కె. బాలచందర్ కమలహాసన్‌ను హీరోగా పరిచయం చేసిన శృంగారరస ప్రధానమైన చిత్రం 'మన్మథలీలై'ను శ్యాంప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌వారు విజయబాపినీడు నిర్వహణలో 'మన్మథలీల' పేరుతో డబ్ చేశారు. వీటూరి మాటలు పాటలు రాసిన ఈ చిత్రంలోని హుషారయిన పాటలన్నీ కుర్రకారును వెర్రెక్కించాయి. ఆ రకమైన పాటలో కూడా వీటూరి యెలా వొదిగి పోయారో ఒక వుదాహరణాన్ని చూద్దాం-

హలో... హలో...

హలో మైడియర్ రాంగ్ నంబర్

కేట్కలే ఉందన్ కురల్ సొర్గమ్

నెరిలే పార్తాల్ ఎన్న వెట్కమ్...

అనే తమిళ మాతృక ఆధారంగా వీటూరి రాసిన –

అతను : హల్లో

ఆమె : హల్లో

అతను : హల్లో మైడియర్ రాంగ్‌నంబర్

గొంతుకే వింటే ఎంత మధురం

చెంతకే వస్తే వింత స్వర్గం

నీవింతశృంగారం ఒకమారు చూపగరాదా

ఆమె : చూపితే ఏముంటుంది అందం

ఎందుకో నీలో అంత తాపం

అనుభవం ఎంతోవుంది

ఆగితే బాగుంటుంది... హల్లో

అతను : హల్లో మైడియర్ రాంగ్‌నంబర్

ఆమె : చూపితే ఏముంటుంది అందం

ఎందుకో మీలో అంత తాపం?

అతను : కవుల కల్పనవో

ఆమె : నో

అతను : మరుమల్లె తేనెవో

ఆమె : నోనో

అతను : శిల్పసుందరివో... మరుమల్లె తేనెవో

తెల్పగ రావో

ఆమె : పూవునై వస్తే ఆగరే మీరు

అతను : రియల్లీ

ఆమె : పూవునై వస్తే ఆగరే మీరు

మధువులే కోరి గొడవ పెడతారు

**అతను :** **ఐ డోంట్ మైండ్, ఒకమారు చూపగరావో**

**ఆమె :** **హల్లో**

**అతను :** **హల్లో మైడియర్ రాంగ్ నంబర్ ॥హల్లో॥**

**చరణం-2**

**ఆమె :** **ఊ... ఊ...**

**అతను :** **చెంతకే వస్తే చాలు మధురం**

**ఆమె :** **హృదయరాణిగా ఎవరయినా...**

**అతను :** **రాణివైతే నువ్వే, ఇంకెవరూ లేరు**

**ఆమె :** **వేచివుంటే పోదా**

**అతను :** **మోజు తీర్చరాదా**

**ఆమె :** **మురిపాలు చాలండి**

**అతను :** **మురిపించ వద్దండి**

చక్రవర్తి సంగీత సారథ్యంలో (తమిళ మాతృకలో యం.యస్.విశ్వనాథన్) వచ్చిన ఈ కవ్వింపుపాట యువతకు గిలిగింతలు పెట్టింది. ఇంకా ఈ చిత్రంలోని -

1. మన్మథలీల మధురము కాదా
   మనస్సున రేపే తీయని బాధా..

2. నిన్నొక మేనక నేడొక ఊర్వశి
   ఏరా తమ్ముడు, ఎవరీ అమ్మడు?..

3. కుశలమేనా కుర్రదానా
   నీ హృదయమూ శాంతించెనా?..

హుషారైన పాటలన్నీ యువతరాన్ని వుర్రూతలూపాయి. ఇవి వీటూరి యెలాంటి పాటనైనా రాయగల రనడానికి నిదర్శనాలు.

ఇంకా -

1. కలలు గనే తరుణమిది - గారాలు మానవయ్య
   హృదయవీణ మేళవించనా - కన్నా..

**(ధనమే ప్రపంచలీల - 1967) మూలం : తాయిక్కు తలైమగన్**

2. ఎదలో తొలివలపే, విరహం జత కలిసే
మధురం ఆ తలపే, నీ పిలుపే...

**(ఎర్రగులాబీలు - 1979) మూలం : సిగప్పురోజాక్కళ్**

3. పయనించే చిరుగాలీ
నా చెలి సన్నిధిలో చేరి

**(పట్నంపిల్ల - 1980) మూలం : మనిదరిల్ ఎత్తనయో**

4. త్రిపుర సుందరీ, దర్శనలహరీ

**(జగద్గురు శంకరాచార్య - 1981)**

5. నెలరాజా పరుగిడకు, చెలివేచే నా కొరకు

**(అమరగీతం - 1982) మూలం : పయనంగళ్ ముడివదిల్లై**

మొదలైనవి వీటూరి రచనావైవిధ్యానికి వుదాహరణలు.

'డబ్బింగ్ రైటర్' గా వీటూరి సత్తా పట్ల ఆ రంగానికి చెందిన నిర్మాతలకు గల గురికి నిదర్శనమైన ఓ వుదంతాన్ని గుర్తు చేసుకోవాలి. 'శుభలేఖ' చిత్రానికి ముహూర్త గీతంగా రికార్డు చెయ్యబడిన వీటూరి పాట కారణాంతాల వల్ల ఆ చిత్రంలో చోటు చేసుకోక పోతే - ఆ పాట నచ్చిన 'బందిపోటు విప్లవ సింహం' (తమిళంలో 'రాణువ వీరన్') నిర్మాతలు దానిని తమ చిత్రంలో ఆదనపుపాటగా (మూలంలో లేనిది) వినియోగించుకొన్నారు. శ్రీదేవి, చిరంజీవి, రజనీకాంత్ మొదలైన అగ్ర నటీనటులు నటించిన ఈ భారీచిత్రంలో -

'లగిజిగి లగిగిజి లంబాడీ..!' అనే ఈ పాటను జయమాలిని నృత్య సన్నివేశంలో 'ఐటమ్ సాంగ్' గా వినియోగించారు.

రచయితగా స్ట్రెయిట్, డబ్బింగ్ - రెండు రంగాలలోనూ సవ్యసాచిలా రాణించిన వీటూరి దర్శకునిగాను, నిర్మాతగాను - విఫలమయ్యారు. 1975 లో 'భారతి' చిత్రానికి దర్శరత్వం వహించే అవకాశం వస్తే - ఆ చిత్రంలో ప్రధాన పాత్ర ధారి యస్.వి.రంగారావు హఠాన్మరణం చెందడం, తదితర కారణాల వల్ల ఆ చిత్రం అపజయం పాలయ్యింది. అలాగే స్నేహితుల భాగస్వామ్యంతో విజయలక్ష్మి బానర్స్ పతాకం పై వీటూరి నిర్మించిన 'అదృష్ట దేవత' (1972) ఆయన పాలిట దురదృష్ట దేవతయై ఆయనను ఆర్థికపరమైన బాధలకు గురి చేసింది!

వ్యక్తిగతంగా వీటూరి యెలాంటి భేషజాలు లేని నిరాడంబరులు, సహృదయులు. 'దేవత' చిత్రానికి 'సింగిల్ కార్ట్' రాయవలసిన వీటూరి నిర్మాత పద్మనాభం కోరిక మేరకు

1. బొమ్మను చేసి ప్రాణము పోసి
   ఆడేవు నీకిది వేడుక..

2. మావూరు మదరాసు, నా పేరు రాందాసు..

అనే తన పల్లవులను ప్రసిద్ధులైన సహకవుల కిచ్చి వారి చేత పాటలను రాయించారు. పై రెండింటిలో మొదటి పాటను రాసిన మహాకవి శ్రీశ్రీ 'పాడవోయి భారతీయుడా' సినిమాపాటల సంకలనంలో ఈ సత్యాన్ని ధ్రువపర్చి, కృతజ్ఞ తలను తెలియజేశారు కూడా!

వీటూరి చివరి (డబ్బింగ్) చిత్రం–1985 డిశంబరు 6 న విడుదలయిన 'యవ్వనం పిలిచింది!' ఆ చిత్రం విడుదలను చూడకుండానే వీటూరి 21–10–85 న అనారోగ్యంతో అకాలమరణం పాలయ్యారు. చనిపోయే నాటికి ఆయన పేరు తప్ప యేమీ మిగుల్చుకోలేదు! కారణాలేమైనా ప్రతిభకు తగ్గ ప్రసిద్ధి పొందని సినీకవి వీటూరి. ఆయనకు తెలుగు చిత్రపరిశ్రమ సరిగా వెలకట్టలేక పోయింది! – అందుకే ఆయనను వెలలేని (విలువైన) కవి అనడం!

❖

ఈ ప్రకరణంలో
సమాచార సేకరణ కు ఉపయోగపడిన వ్యక్తులు, వ్యాసాలు –

1. 'రాగాల తోట – వీటూరి పాట' – పైడిపాల
   3.1.15 ఆంధ్రజ్యోతి దినపత్రిక – 'నవ్య' లో వ్యాసం
2. వక్కలంక కిషోర్ (హైదరాబాద్) యిచ్చిన సమాచారం
3. కె. స్వర్ణ కుమార్ (భీమవరం) చెప్పిన విశేషాలు
4. యమ్. సారథి (పంతులు), రెల్లివలస – లిఖిత సమాచారం – జనవరి, 2015.



## మహారాజరాజశ్రీ రాజశ్రీ

(31-8-1934 - 14-8-1994)

తెలుగులో 'డబ్బింగ్' అనగానే స్ఫురించే మొదటి పేరు రాజశ్రీ. తెలుగు డబ్బింగ్ కవులలో యిప్పటి వరకు అగ్రతాంబూల మివ్వదగిన ఒకే ఒక పేరు చెప్పమంటే యెవరైనా తడుముకోకుండా చెపుతారు 'రాజశ్రీ' అని! సుమారు ఆరు వందల డబ్బింగ్ చిత్రాలకు రచన చేసి అగ్రభాగాన నిలవడమే గాక యెక్కువ 'డబ్బింగ్ హిట్‌సాంగ్స్' రాసిన ఘనత కూడా రాజశ్రీకే దక్కుతుంది. తెలుగులో డబ్బింగ్‌కు ఆద్యులైన శ్రీశ్రీ అడవిలాంటి ఆ రంగంలో దిశానిర్దేశం చేస్తూ ఒకబాటను వేస్తే - దానిని రాజమార్గంగా మలచిన అనువాదబ్రహ్మ రాజశ్రీ. రాజశ్రీ డబ్బింగ్‌ను అలవోకగా డైరక్ట్ టేక్ పిక్చర్స్‌కి రాసినంత తేలిగ్గా అతివేగంగా చేయగలగడానికి కారణం ఆయనకు గల సంగీత పరిజ్ఞానం. ఆ మాటకొస్తే ఆయన నాటకరంగం నుంచి సినీరంగానికి తరలివచ్చింది - సంగీత దర్శకునిగా స్థిరపడాలనే కోరికతోనే! సినీరంగంలో స్థిరపడిన తర్వాత ఆయన కొన్ని తమిళ తెలుగు చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు కూడా!

రాజశ్రీ అసలు పేరు ఇందుకూరి రామకృష్ణరాజు. జన్మస్థలం కళలకు కాణాచి అయిన విజయనగరం. మహారాజా కళాశాల విజయనగరంలో బి.యస్.సి (ఫిజిక్స్) చదివి పట్టభద్రులైన రాజు శ్రీకాకుళం జిల్లా బోర్డులో చిరుద్యోగం చేస్తూ సాహిత్య నాటకరంగాల పట్ల ఆకర్షితులయ్యారు. 'ఆంధ్రశ్రీ' నాటక రచయితగా వచ్చిన పేరుతో నటుడు, దర్శకుడు అయిన బి.వి. ప్రసాద్ ప్రోత్సాహంతో సాటి నాటకరచయిత పినిశెట్టి శ్రీరామమూర్తి ఆహ్వానం మీద వుద్యోగపర్వానికి స్వస్తి చెప్పి, 1957 లో మద్రాసు చేరారు.

రాజశ్రీ ముందుగా రచ్చ గెలిచి, ఆ తర్వాత యింట గెలిచారు. సినీరంగ ప్రవేశం చేసిన కొత్తలోనే ప్రముఖ తమిళ హీరో యం.జి.రామచంద్రన్‌ను కలిసి ఆయనకు కథ

చెప్పే సాహసం చేశారు. తొలి ప్రయత్నంలోనే ఆయన మెప్పును, కథకు ఆమోదాన్ని పొందారు. ఆ కథే యం.జి.ఆర్ ద్విపాత్రాభినయంతో నిర్మించగా విజయవంతమైన 'తేడి వంద మాప్పిళ్లై చిత్రం! ఆ తర్వాత అనేక తమిళచిత్రాలకు రాజశ్రీ కథలనూ చిత్రానువాదాలనూ సమకూర్చారు. తెలుగులో 'ఆడపెత్తనం' (1958) చిత్రంలో తొలి పాట రాసినా, సంగీత దర్శకుడు యం.యస్.శ్రీరామ్ నిర్మించిన 'మూఢనమ్మకాలు' (1963) డబ్బింగ్‌చిత్రానికి రచనతోనే రాజశ్రీ తన సత్తా నిరూపించుకొని పరిశ్రమలో స్థిరపడ్డారు. అంతకు ముందు రంగస్థలమిత్రుడు బి.వి. ప్రసాద్ తొలిసారిగా దర్శకత్వం వహించిన 'శ్రీ సింహాచలక్షేత్ర మహిమ' (విడుదల: 1965) డైరెక్ట్ పిక్చర్‌కి మాటలు పాటలు రాసే అవకాశం రాజశ్రీకి లభించింది. అయితే దానికంటె ఆలస్యంగా ప్రారంభమైన 'మూఢనమ్మకాలు' (మూలం : పణిత్తిరై) డబ్బింగ్‌చిత్రమే ముందుగా విడుదలయింది. 'మూఢనమ్మకాలు' సంగీత దర్శకుడు శ్రీరామ్ డబ్బింగ్‌చిత్రాలకు వరసలు మార్చడంలో తానే ప్రథమున్నని చెప్పుకొన్నారట! 'కాని అది ఆ సరికాదు ఆ ప్రక్రియ ఆహుతి తోనే ప్రారంభమైంది' అని వి.ఎ.కె. రంగారావు అభిప్రాయం.[1]

సింహాచలక్షేత్ర మహిమ, మూఢనమ్మకాలు – రెండింటి వల్ల వచ్చిన గుర్తింపుతో రాజశ్రీ రెండురంగాలలోనూ అంచెలంచెలుగా యెదిగారు. నటుడు, నిర్మాత చలం అభిమానానికి పాత్రుడై అతని ఆస్థాన రచయితగా స్థిరపడి నేరుగా తీసిన చిత్రాల్లో అనేక జనరంజకమైన పాటల్ని రాశారు. అలాగే డబ్బింగ్ రచనలో రాజశ్రీ నైపుణ్యాన్ని గమనించిన నిర్మాతలు వెంటపడ్డంతో డబ్బింగ్ రంగలోనూ ఆయనంటే మోజుపెరిగింది. అలా ఆయనకు తీరిక లేకుండా డబ్బింగ్ చిత్రాలకు రచన చేసే అవకాశాలు తోసుకుని రావడంతో 'డబ్బింగ్ రైటర్'గా ముద్రపడి – నేరుగా తీసిన చిత్రాలకు యెక్కువగా రాసే అవకాశం లేక పోయింది. రాజశ్రీ రచన చేసిన డైరెక్ట్ టేక్ చిత్రాల కంటె – అతని డబ్బింగు చిత్రాలు సుమారు పదిరెట్లు! రాజశ్రీ డబ్బింగ్ చిత్రాల నుంచి కొన్ని ముఖ్యమైనవి భాషలవారీగా తెలుసుకొందాం –

**హిందీ–**

ప్రేమపావురాలు (1990)

ప్రణయం – ప్రళయం (1990)

---

**1. వి.ఎ.కె. రంగారావుతో ముఖాముఖి.**

**కన్నడం -**

శ్రీకృష్ణదేవరాయలు (1971)
మహావీర మయూర (1976)
నే నిన్ను మరువలేను (1979)
భక్త సిరియాళ (1980)
ప్రేమలోకం (1988)

**మలయాళం -**

వైశాలి (1989)
కంకణం (1992)

**తమిళం -**

కోటీశ్వరుడు (1970)
మేరీమాత (1971)
బంగారు పతకం (1976)
ప్రేమసాగరం (1983)
మౌనరాగం (1987)
ఘర్షణ (1988)
విచిత్రసోదరులు (1989)
ఓ పాపాలాలి (1991)
దళపతి (1991)
రోజా (1992)
జెంటిల్‌మేన్ (1993)
ప్రేమికుడు (1994)

డబ్బింగ్ రచయితగా రాజశ్రీని విజయసోపానాల నధిరోహిప జేసిన చిత్రం టి. రాజేందర్ సంచలనచిత్రం ప్రేమసాగరం. తెలుగు లో డైరెక్ట్ టేక్ చిత్రాల్లో యెక్కువ అవకాశాలు రావడానికి చలం ప్రోత్సహించినట్టే డబ్బింగ్ చిత్ర రచనలో దర్శకుడు మణిరత్నం రాజశ్రీకి వరసగా అవకాశాలిచ్చి ఆయన విజయపరంపరకు కారణభూతులయ్యారు. రాజశ్రీ జైత్రయాత్రలో ప్రేమపావురాలు, సిందూరపువ్వు, మంత్రశక్తి

– దైవభక్తి, శ్రావణశుక్రవారం మొదలైనవి శతదినోత్సవాలు, రజతోత్సవాలు జరుపుకొని తెలుగులో నేరుగా తీసిన చిత్రాలకు దీటుగా నిలిచాయి. 'శిఖరం' చిత్రాన్ని రాజశ్రీ 500 వ డబ్బింగ్‌చిత్రంగా గుర్తించి 'నేషనల్ కల్చరల్ ఇంటి గ్రేషన్ సొసైటీ' వారు విశాఖపట్నంలో 23-12-90న రాజశ్రీ చలనచిత్రజీవిత రజతోత్సవాన్ని జరపడం – డబ్బింగ్‌చిత్రాలకు గర్వకారణం! ప్రముఖ దర్శకులు దాసరి నారాయణరావు రాజశ్రీ రచనావిధానాన్ని ప్రశంసిస్తూ – 'ప్రేమపావురాలు' డబ్బింగ్ ఘనవిజయం సాధించడం, అదే చిత్రం తమిళ డబ్బింగ్ అపజయాన్ని ఎదుర్కోవడం చూస్తే – దానికి కారణం నూటికి నూరుపాళ్లు రాజశ్రీ డబ్బింగ్ చేసిన విధానమే అని చెప్పాలి[2] అని వ్యాఖ్యానించారు. పెదవుల కదలికకు అనుగుణంగా మాటలు రాయడం మాత్రమే డబ్బింగ్ కాదనీ, సన్నివేశానికీ, భావానికీ తెలుగుదనాన్ని తేవాలని – రాజశ్రీ అభిప్రాయం. అందుకే తనకు పద్యవిద్య కూడా తెలిసినా పాండిత్యప్రకర్షను ప్రదర్శించకుండా సామాన్యుడికి అందుబాటులో వుండే భాషలో రాజశ్రీ డబ్బింగ్ రచన చేసేవారు. 1989-93 మధ్య వచ్చిన డబ్బింగ్‌చిత్రాల్లో 50 శాతం చిత్రాలు రాజశ్రీ కైవసం కావడం, ఆయన ఒకే యేడు 50 డబ్బింగ్‌చిత్రాలకు పైగా రచన చేయడం – ఆయన సాధించిన రికార్డులనే చెప్పాలి.

రాజశ్రీ ప్రతిభను అర్థంచేసుకోవడానికి ఆయన డబ్బింగ్ గీతాల నుంచి కొన్ని మచ్చుతునకలను చూద్దాం –

1. తమిళంలో టి. రాజేందర్ ఏ తారాబలమూ లేకుండా నూతన నటీనటులతో చిత్రాన్నితీసి, ఒంటిచేత్తో అనేక శాఖలను నిర్వహించి అఖండ విజయం సాధించిన సంచలన సంగీతచిత్రం 'ఉయిరుళ్లవరై ఉషా'. రాజేందరే పాటల్ని రాసి సంగీత దర్శకత్వాన్ని వహించిన ఈచిత్రం అద్భుతమైన మ్యూజికల్ హిట్. దీనిని 'ప్రేమ సాగరం' పేరుతో తెలుగు చెయ్యగా రాజశ్రీ ఆ చిత్రం తెలుగులో కూడా అదే స్థాయిలో విజయవంతమయ్యేలా రచనను అందించారు.

ఉదాహరణకు –

**వైగెక్కరే కాట్రే నిల్లు, వంజిదనై పార్తాల్ చొల్లు**
**మణ్ణన్ మనమ్ వాడు దెన్రు, మంగై దనై తేదు దెన్రు..**
**కాట్రే పూంగాట్రే...**

---

**2.** నాకు తెలిసిన రాజశ్రీ – డా. దాసరి నారాయణరావు వ్యాసం రాజశ్రీ సినీరజతోత్సవ సంచిక – **1990**

(వైగైనదీ తీరాన విహరించే చల్లగాలీ నా ప్రియురాలు కనిపిస్తే మర్చిపోకుండా ఆమె చెవిలో 'నీ ప్రియుడి ముఖం వాడిపోయిందనీ, నీ కోసమే వెతుకుతోందనీ' నా ప్రేమ సందేశాన్ని వినిపించు)

అంటూ కాళిదాసు మేఘసందేశాన్ని తలపించేలా చిరుగాలికి ప్రియుని విన్నపాన్ని మాతృకలో రాజేందర్ రాయగా –

**పల్లవి:** **చక్కనైన ఓ చిరుగాలి ఒక్కమాట వినిపోవాలి**
**ఉషాదూరమైన నేను ఊపిరైన తీయలేను**
**గాలీ.. చిరుగాలీ**
**చెలి చెంతకు వెళ్లి అందించాలి నా ప్రేమసందేశం**

**చరణం-1**

**మూశారు గుడిలోని తలుపులను**
**ఆపారు గుండెల్లో పూజలను**
**దారిలేదు చూడాలంటే దేవతను**
**వీలుకాదు చెప్పాలంటే వేదనను**
**కలతై పోయే నా హృదయం, కరువై పోయె ఆనందం**
**అనురాగ మీ వేళ అయిపోయె చెరసాల**

**చరణం-2**

**నా ప్రేమరాగాలు కలలాయె**
**కన్నీటి కథలన్నీ బరువాయె**
**మబ్బు వెనుక చందమామ దాగివున్నదో**
**మనసు వెనుక ఆశలన్నీ దాచుకొన్నదో**
**వేదనలేల ఈ సమయం**
**వెలుతురు నీదే రేపుదయం**
**శోధనలు ఆగేను శోకములు తీరేను..**

అంటూ రాజశ్రీ మూలానికి దగ్గరగా లలితమైన శైలిలో ఈ పాటను తెనుగు చేయగా, బాలు తన గాత్రమాధుర్యంతో దీనిని అమృతమయం చేశారు. రాజేందర్ సతీమణి పేరు ఉష కావడం వల్ల అది స్ఫురించేలా రాసిన రాజశ్రీని ఆమె మెచ్చుకొని తమిళంలో కూడా అలా రాసి వుండవలసిందని రాజేందర్‌తో అన్నారట! అసలు

‘ఉయిరుళ్ల వరై ఉషా’ అనే టైటిల్‌ను ఆ వుద్దేశం తోనే నిర్ణయించారట!

2. అర్జున్ హీరోగా నటించిన ‘జెంటిల్ మేన్’ తమిళ చిత్రాన్ని రాజశ్రీ తెలుగు చేయగా – అది వినిపించని చోటు లేదు. ఆ పాటల్లో ఒకటైన ‘ముదినేపల్లి మడిచేలో ముద్దుగుమ్మ..’ పాడుకోని సినీప్రియులు లేరు.

**ముదినేపల్లి మడిచేలో ముద్దుగుమ్మ**
**నీ కొంగూ పొంగూ నా గుండె కోసేనమ్మా**
**బుట్టమీద బుట్టపెట్టి బుగ్గమీద చుక్కపెట్టి.. వాగల్లే నడిచావే**
**నీ బుట్టలోని పువ్వులన్ని గుట్టులన్ని రట్టుచేసి నన్నీడ నిలిపెనే**
**పల్లీ పల్లీ.. ముదినేపల్లీ.. ॥ముది॥**

**చరణం-1**

**అత : కాటుకకళ్ల వాడల్లో కట్టుకుంటా గుడిగంట**
**ఆమె : పసుపుతాడు పడకుండా ఆగడాలే వద్దంట**
**అత : చింతపల్లి చిన్నోణ్ణి చూడనీకు వరసంట**
**ఆమె : వరస కాదు నాకంట, మనసువుంటే చాలంటా**
**అత : పగలు – రేయీ నీతోవుంటా**
**ఆమె : ఉన్నావంటే అది తప్పంటా**
**అత : కలిసివస్తే ఎన్నెలమాసం చెయ్యాలి జాగరం. ॥ముది॥**

**చరణం-2**

**అత : తమలపాకు తడిలోన పండేనే నీ నోరంట**
**ఆమె : నోటిపంట కాదంట పాడిపంట చూడంట**
**అత : నాకు నువ్వే తోడుంటే సంబరాలే నట్టింట**
**ఆమె : ఆశపడిన మావయ్యది అందమైన మనసంట**
**అత : అందం చందం నీకే సొంతం**
**ఆమె : ఎన్నెలలోనే ఏసా మంచం**
**ఇద్దరు : పైరగాలుల పందిరిలోన కరిగిపోదాం మనం.**

మనసులను మురిపించే భావుకత, యాసతో కూడిన ప్రాంతీయత – నిండిన ఈ పాట ‘ఎంకిపాట’ ను తలపిస్తూ తెలుగు వాళ్లను ఆకట్టుకొంది. వాగల్లె నడవడం, బుట్టలోని

పువ్వులు గుట్టురట్టుచెయ్యడం, కాటుకకళ్ల వాడలు వంటి మూలంలో లేని అభివ్యక్తులు భావుకుల్ని మురిపించాయి. ఇవి మూలానికి మెరుగులు అవునో కాదో మూలాన్ని చూస్తే తెలుస్తుంది –

**ఉసిలాంపట్టి పెన్కుట్టీ ముత్తు పేచ్చీ**
**ఉన్ ఒసరం పొత్తు ఎన్ కళుత్తు సుళిక్కి పోచ్చీ**
**కూడమేల కూడవెచ్చి కూచనూరు పోరవళే మేరువాగ సెల్లెండీ**
**ఉన్ కూడయితే వెచ్చ పూవు గూడలూరిల్ వీసుదడి కురి పోట్టు వందేండీ**
**ఉసిలా.. ఉసిలా.. ఉసిలాం పట్టి**

(ఉసిలాం పట్టి చినదానా, నీ యెత్తు చూసి నా మెడ బెణికింది. బుట్ట మీద బుట్టపెట్టి కూచనూరు వెళ్లేదానా, నీ బుట్టలోని పూలవాసన గూడలూరు వరకు వీస్తోంది. నీ కోసమే గాలం వేశాను)

పల్లవి వరకు చూస్తేనే రాజశ్రీ సృజనాత్మకత తెలుస్తోంది. చరణాల్లో కూడా నెమళ్లు, చిలుకలూ చోటు చేసుకుంటే – వాటిని పూర్తిగా నాయిక అందచందాలతో నింపారు రాజశ్రీ.

3. రాజశ్రీ తెనిగించిన చివరిచిత్రం ప్రభుదేవా తొలిసారిగా హీరోగా నటించిన తమిళచిత్రం 'కాదలన్' డబ్బింగ్ 'ప్రేమికుడు'. ఇందులో ప్రేమికుడు తన గాఢమైన ప్రేమను కవితాత్మకంగా తెలియజేస్తూ ప్రేయసినుద్దేశించి పాడే పాటను మూలంలో వైరముత్తు రాయగా – తెలుగులో రాజశ్రీ కూడా ఆ పరిమళాన్ని ఆస్వాదించేలా రాశారు.

**ఎన్నవళీ అఢి ఎన్నవళీ ఎందన్ ఇదయత్తై తొలైత్తు విట్టేన్**
**ఎంద ఇదమ్ అది తొలైంద ఇదమ్ అంద ఇదత్తైవుమ్ మరందు**
**విట్టేన్ ఉందాన్**
**కాల్గొలుసిల్ అదు తొలైంద దేన్రు వుందాన్ కాలది తేడి వందేన్**

(నా దానా, నా హృదయాన్ని చేజార్చుకొన్నాను. అది జారినచోటే మర్చిపోయాను. అది నీ అందెలలో చిక్కుకుందేమోనని నీ పాదాలను వెతుక్కొంటూ వచ్చాను. ప్రేమ యెంత కష్టమైందో నిన్నుచూశాక తెలుసుకొన్నాను. నాకు ప్రేమ గొంతు వరకు వచ్చి కళ్లు రెండూ చెమ్మగిల్లాయి) –కాదలన్

పల్లవి: ఓ చెలియా నాప్రియసఖియా చెయి జారెను నామనసే
ఏ చోట అది జారినదో ఆ జాడే మరిచితినే
నీ అందెలలో చిక్కుకుంది అని నీ పదములు చేరితినే
ప్రేమంటే ఎన్ని అగచాట్లో మన కలయిక తెలిపినదే
నా గుండెలలో ప్రేమ పరవశమై ఇరుకన్నులు సోలెనులే ॥ఓ॥

చరణం-1

ఈ పూట చెలి, నా మాట యిక కరువై పోయెనులే
అధరము ఉదరము నడుమను ఏదో అలజడి రేగెనులే
వీక్షణలో నిరీక్షణలో అరక్షణ మొక యుగమేలే
చూపులన్ని వెంటాడినట్టు మది కలవరమాయెనులే
ఇది స్వర్గమా నరకమా ఏవింటో తెలియదులే
ఈ జీవికి జీవన మరణము నీ చేతిలో వున్నదిలే ॥ఓ॥

చరణం-2

కోకిలమ్మ, నువ్వు సయ్యంటే నే పాడెను సరిగమలే
గోపురమా, నిను చేరుకొని సవరించేను నీ కురులే
వెన్నెలమ్మా నీకు జోలపాడి కాలి మెటికలు విరిచేనే
వీచేటి చలిగాలులకు తెరచాపై నిలిచేనే
నా ఆశల వూసులే చెవిలోన చెబుతానే
నీ అడుగుల చెరగని గురుతులే ప్రేమచరితలు అంటేనే ॥ఓ॥

చరణాల్లో కూడా మాతృకను అనుసరిస్తూనే - అలజడి రేగడం, అరక్షణ మొకయుగం కావడం, కురులను సవరించడం, ఆశలవూసులను చెవిలో చెప్పడం వంటి అమూలక ప్రయోగాలతో రాజశ్రీ ఈ గీతాన్ని రమణీయంగా తీర్చిదిద్దారు.

ఇంకా -

1. నేలపై చుక్కలు చూడు, పట్టపగలొచ్చెను నేడు
   ఎంతో వింత.. ఏదోవింత.. -

**కోటీశ్వరుడు - 1970**

**(దైవమగన్ -మాతృక)**

2. నిన్ను కోరీ వర్ణం.. వర్ణం.. సరిసరి కలిసేనే నయనం.. నయనం..

**– ఘర్షణ–1988**

**(అగ్నినక్షత్రం –మాతృక)**

3. నిన్ను తలచి మైమరచా.. చిత్రమే అది చిత్రమే
నన్ను తలచి నవ్వుకున్నా.. చిత్రమే అది చిత్రమే

**– విచిత్ర సోదరులు–1989 (అపూర్వ సగోదరగళ్ – మాతృక)**

4. సింగారాల పైరుల్లోన.. బంగారాలే పండేనంట.. పాడాలి
నవ్వుల్లోన పువ్వుల్లాగ.. జీవితాలే సాగాలంట.. ఆడాలి

**– దళపతి (1992)**

5. చిన్ని చిన్ని ఆశ.. చిన్నదాని ఆశ

**(రోజా –1992)**

మెదలైన ఆణిముల్లాంటి రాజశ్రీ తమిళ డబ్బింగ్ పాటలు కాలానికి చెక్కు చెదరకుండా నేటికీ యింటింటా మారుమ్రోగుతున్నాయి.

'కేలడి కన్మణి' తమిళచిత్రంలో యస్.పి. బాలసుబ్రహ్మణ్యం గుక్క తిప్పుకోకుండా పాడిన పాటకు దీటుగా దానికి తెలుగు డబ్బింగ్ అయిన 'ఓ పాపా లాలీ' (1991) చిత్రంలో –

**మాటే రాని చిన్నదాని కళ్లు పలికే ఊసులు**
**అందాలన్ని పల్లవించి ఆలపించే పాటలు**

అంటూ అదే ధోరణి లో రాజశ్రీ రాసిన పాటలోని పదాల పోహళింపు స్వరపదమైత్రి పట్ల ఆయనకున్న పరిజ్ఞానాన్ని తెలియజేస్తుంది. ఈ ప్రయోగాత్మకమైన పాటను బాలు అద్భుతంగా ఆలపించారు.

రాజశ్రీ డబ్ చేసిన హిందీచిత్రాల సంఖ్య తక్కువ. కాని వాటిలో 'మైనే ప్యార్ కియా' కు (1989) తెలుగుసేత 'ప్రేమ పావురాలు' (1990) అమోఘవిజయాన్ని సాధించి వందచిత్రాల పెట్టయింది. అది మ్యూజికల్‌గా హిట్టయి 'గోల్డ్ డిస్క్'ను అందుకొంది. యువహృదయాలను దోచుకొన్న 'ప్రేమపావురాలు' పాటల నుంచి ఒక పాటను పరిశీలిద్దాం–

భాగ్యశ్రీ, సల్మాన్‌ఖాన్ ప్రేమజంటగా నటించిన 'మైనే ప్యార్ కియా'తో అసాద్ భోపాలి రచించిన ఈ యుగళగీతాన్ని రామ్-లక్ష్మణ్ సంగీత సారథ్యంలో లతా మంగేష్కర్, యస్.పి.బాలసుబ్రహ్మణ్యం ఆలపించారు -

**దిల్ దీవానా బిన్ సజ్‌నాకే మానేనా**
**ఏ పగ్‌లా హై సమ్‌ఝానే సే సమ్‌ఝేనా... (మైనే ప్యార్ కియా)**

(ప్రియురాలిమీద విరహంతో నా హృదయం అదుపుతప్పుతోంది. ఎంత చెప్పినా వినక అది పిచ్చిదైపోతోంది. రేయింబవళ్లు నీ జ్ఞాపకాలతో నా హృదయ స్పందన ఆగిపోతోంది. ఓ ప్రేయసీ, ప్రపంచమంతా నన్ను అడుగుతుంటే నేను మాత్రం నిన్ను అడుగుతున్నాను. నీ క్షేమాన్ని, సుఖాన్ని తప్ప భగవంతుణ్ని నేను ఏమీ కోరను. జీవించాలంటే నీ కొంగు పట్టుకుని యెప్పుడూ తిరగాలని... నీతో ఆకాశంలో యెగరాలని వుంది. ఇంకా నా హృదయంలో ఎన్నెన్నో కోరికలు - వాటి గురించి ఏం చెప్పనూ)

'ప్రేమపావురాలు'లో రాజశ్రీ పై భావానికి కొంత దూరంగా, స్వతంత్రించి రాసినా - అది ప్రజాదరణను పొందింది.

**పల్లవి : నీజతలేక పిచ్చిది కాదా మనసంటా (2)**
**ఆ మనసేమో నామాటే వినదంటా (2)**
**కదిలించేను కరిగించేను నన్నంటా**
**నా మనసేమో నామాటే వినదంటా (నా మనసేమో)**

**చరణం: ఎడబాటంటే నీకు నాకే**
**ఇలలో తెలుసంటాను**
**ప్రేమ పిలుచుట లోకమాపుట**
**ఎవరికి తెలుసంటాను**
**నువు లేకుంటే ఏమీ తోచదు నాకంటా (నా మనసేమో)**

**చరణం: ఓహో... ఓహో...హో**
**ప్రవహించేటి నెత్తురు**
**ప్రేమై రోదించె నీపూట**
**ప్రేమలో సర్వం విడనాడేను**
**ఈ లోకానికి నువు తెలపాలి నామాటా (నా మనసేమో)**

ఇంకా -

1. మాడాడీ ఆశ అదే - నేను ఎదగాలి
   పేరే తేవాలి - జనం నన్ను మెచ్చాలి

**- ప్రణయం-ప్రళయం (కయామత్ సే కయామత్ తక్)**

2. మల్లికవా రంగవల్లికవా
   వరాలు చిందే అక్షర కన్నెవా
   నీవే పసిడి ప్రేమగనివా?

**(ప్రేమపావురాలు)**

మొదలైన హిందీ డబ్బింగు పాటలు రాజశ్రీ పేరును రెపరెపలాడించాయి.

రాజశ్రీ కన్నడం నుంచి తెలుగు చేసిన చిత్రాల్లో పాటలు కూడా జనంలోకి వెళ్లాయనడానికి నిదర్శనంగా కొన్ని పాటల్ని చూద్దాం -

**1. శివశివ అంటే భయమేది?**
**నామానికి సరి వేరేది?**
**శివ నామానికి సరి వేరేది?**
**శివభక్తునికి కొరతే లేదే**
**జన్మజన్మలకు నరకం లేదే... ॥భర్త శిరియాళ॥**

**కన్నడ మాతృక:**

**శివశివ ఎందరె భయవిల్లి**
**నామకె సాటి బేరిల్ల**
**శివనామకె సాటి బేరిల్ల**
**శివభక్తనిగె నరక ఇల్ల**
**జనుమ జనుమ గళ కాటవ దిల్ల**

మాతృకలోని పదాలతో సహా తెలుగుసేత యథాతథంగా సాగినట్టు స్పష్టంగా తెలుస్తోంది.

**2. ఎవరేవీడు? - ఈ మన్మథుడు**
**కోరుకున్నవాడే - చిన్నవాడే**
**వీరుడంటే వీడే వీడే వీడే సోగ్గాడు.. - ప్రేమలోకం**

కన్నడ మాతృక :

యారివనూ ఈ మన్మథనూ
వీరరల్లి వీర బందనమ్మశూర
హంవీర- - ప్రేమలోకం

ఇది కూడా అచ్చమైన అనువాదం లాగే నడిచింది.

3. నే నిన్ను మరువలేను
కలనైన నిన్ను విడలేను నేను
నాలో నీవు నిండేవులే... (నే నిన్ను మరవలేను)

కన్నడ మాతృక :

నా నిన్న మరెయలారె, నా నిన్న మరెయలారె
ఎందెందు నిన్న బిడలారె చెన్న, నీవే ప్రాణం నన్నాణెగూ
(నా నిన్న మరెయలారె)

(నిన్ను మరవలేను. నేను నిన్ను మరువలేను. ఎప్పటికీ నిన్ను విడువలేను. నా బంగారం, (కన్నడంలో చెన్న) నువ్వే నా ప్రాణం. ఒట్టు.)

మొత్తం మీద కన్నడ డబ్బింగ్‌లను కొన్ని మూలంలోని పదాలనే వినియోగిస్తూ, మరికొన్ని తేలికైన తెలుగు పదాలతో – భావవిధేయంగా చేసినట్టు అర్థమవుతోంది.

'వైశాలి' మలయాళచిత్రకథ వాల్మీకి రామాయణానికి భిన్నమైన ఋష్యశృంగ వృత్తాంతంతో నడిచిన కథ. ఇందులో రోమపాద మహారాజు అంగరాజ్యానికి క్షామనివారణ నిమిత్తం ఋష్యశృంగుని తీసుకొచ్చిన నాయిక వైశాలి ఒక వేశ్య కూతురు. చివరకు ఆమె త్యాగాన్ని గుర్తించని జనసందోహం ఆమెనూ, ఆమె తల్లినీ తొక్కుకొని పోవడంతో చిత్రం ముగుస్తుంది. దీని రచన ఓ.యన్.వి.కురుప్. దర్శకుడు భరతన్. 'స్వర్గసీమ'లో బాలాంతరపు రజనీకాంతరావు రాసిన ఋష్యశృంగ నృత్యనాటికను 'వైశాలి'లో అనుసరించారు కూడా.[3] 'వైశాలి'ని రాజశ్రీ తెలుగు చేశారు.

1. ప్రేమ జీవన నాదం పంచమం ఈ వేదం
సాగాలి ఈ దినం అనురాగబంధం...

---

3. వి.ఎ.కె. రంగారావుతో ముఖాముఖి.

2. దుందుందుం దుందుభినాదం నాదం...

మొదలైన వైశాలిలో రాజశ్రీ పాటలు నేటికీ సినీసంగీత ప్రియులకు గుర్తున్నాయి.

వివిధ భారతీయ భాషల నుండి పేరు తెచ్చిన యిన్ని డబ్బింగ్ పాటలతో పాటు, తెలుగులో నేరుగా తీసిన చిత్రాల్లో సంగీత సాహిత్యపరిమళాలతో గుబాళించిన రాజశ్రీ పాటలెన్నో! వాటి నుంచి కొన్ని-

1. సింహాచలము మహాపుణ్యక్షేత్రము (శ్రీ సింహాచల క్షేత్ర మహిమ-1965)
2. నన్ను ఎవరో తాకిరి కన్ను ఎవరో కలిపిరి (సత్తెకాలపు సత్తెయ్య-1969)
3. మామా, చందమామా, వినరావా నా కథ (సంబరాల రాంబాబు-1970)
4. మళ్లీ మళ్లీ పాడాలి ఈ పాట (మట్టిలో మాణిక్యం-1971)
5. కురిసింది వాన నా గుండెలోన (బుల్లెమ్మ-బుల్లోడు-1972)
6. ఎక్కడో దూరాన కూర్చున్నావు (దేవుడమ్మ-1973)
7. మధువొలక బోసే నీ చిలిపి కళ్లు... (కన్నవారి కలలు-1974)
8. రాధకు నీవేర ప్రాణం (తులాభారం-1974)
9. ఇది మేఘసందేశమా... (ఏడంతస్తుల మేడ-1980)
10. ఇదే నా మొదటి ప్రేమలేఖ (స్వప్న-1980)

... ఇలా యెన్ని రాసినా తనివితీరదు. 'బంగారు గాజులు' (1970), 'మట్టిలో మాణిక్యం' (1971) చిత్రాలకు వుత్తమ కథకునిగా ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి నందిపురస్కారాలను అందుకొన్నారు. రచయితగానే కాక 'చదువు-సంస్కారం' 'నిజం నిద్రపోదు' 'ఓ ప్రేమకథ' చిత్రాలకు దర్శకత్వం వహించారు కూడా. 'పెళ్లిచేసి చూపిస్తాం' 'ఎంకన్నబాబు' 'మామా కోడలు' తెలుగు చిత్రాలకే గాక 'పుదియ సంగమం' తమిళ చిత్రానికి కూడా సంగీత దర్శకత్వం వహించారు. శివాజీ గణేశన్ అంతటి మహా నటుడు 'బంగారు పతకం' డబ్బింగ్ చిత్రాన్ని చూసి రాజశ్రీ ప్రజ్ఞకు ముగ్ధుడై 'ఇది డబ్బింగ్‌లా లేదు; తెలుగుచిత్రాల్లో నటించడం లేదనే కొరత తీరిపోయింది' అని రాజశ్రీని కౌగలించుకొన్నారట![4] మణిరత్నం, రహమాన్ వంటి ప్రతిభావంతులు రచయితగా రాజశ్రీయే కావాలని పట్టుబట్టడం రాజశ్రీ నిబద్ధతకు యోగ్యతకు నిదర్శనం. తెలుగు సినీగేయచరిత్రలో వేటూరి యెలాంటి చరిత్రను సృష్టించారో అలా డబ్బింగ్ సామ్రాజ్యాన్ని

4. సుధాకర్ రాజశ్రీతో ముఖాముఖి.

పరిపాలించిన రాజశ్రీ భూసారపు వేంకటేశ్వరరావు, మాగాపు అమ్మిరాజు వంటి యెందరో సహాయకులకు నీడనిచ్చారు. తర్వాత వచ్చిన వెన్నెలకంటి, భువనచంద్ర వంటి కవులకు మార్గదర్శకులయ్యారు. ఒక మాటలో చెపితే డబ్బింగ్ రంగంలో దీపస్తంభంలా నిలిచారు.

1994 ఆగష్టు 14న 'ప్రేమికుడు' (కాదలన్ డబ్బింగ్) చిత్రం కోసం– 'వింత లోకంలో మనం విహరించే దెప్పుడో...' అనే పాటను రాసి. భోజనానంతరం మధ్యాహ్నం తిరిగి వస్తానన్న రాజశ్రీ మరి తిరిగి రాలేదు! నిద్రలో నుంచి శాశ్వతంగా తిరిగిరాని లోకానికి వెళ్లిపోయారు! జీవిత రంగం నుంచి ఆకస్మికంగా అనాయాసంగా నిష్క్రమించిన రాజశ్రీ తెలుగు డబ్బింగ్‌రంగంలో యెప్పటికీ ధ్రువతార!

❖

ఈ ప్రకరణంలో
సమాచారసేకరణకు తోడ్పడిన వ్యక్తులూ, వ్యాసాలూ, పుస్తకాలు –


1. అనువాద సినీసాహిత్య శిఖరం రాజశ్రీ
   –పైడిపాల, 14-8-2014 ఆంధ్రజ్యోతి దినపత్రికలో వ్యాసం
2. తెలుగు సినీగేయకవుల చరిత్ర–పైడిపాల పరిశోధన గ్రంథం
3. రాజశ్రీ రజతోత్సవ సంచిక – 1990
   నేషనల్ కల్చరల్ ఇంటిగ్రేషన్ సొసైటీవారి ప్రచురణ
4. 'తననాలు – తర్జుమాలు' లో వ్యాసం – డా॥ మణిగోపాల్,
   సూర్య దినపత్రిక. 2-8-2008
5. 'మహారాజ రాజశ్రీ' – భువనచంద్ర 'హాసం' హాస్యసంగీత
   పత్రికలో (15-8-2002), వ్యాసం
6. డబ్బింగ్ కింగ్ రాజశ్రీ – వినాయకరావు (15-4-2009 నవ్యలో వ్యాసం)
7. 'బాలు' గారు మెయిల్‌లో పంపిన కన్నడపాటల విశేషాలు
8. వక్కలంక కిషోర్ (హైదరాబాద్) యిచ్చిన కన్నడ మలయాళగీతాల సమాచారం
9. సుధాకర్ రాజశ్రీ యిచ్చిన సమాచారం
10. వి.ఎ.కె. రంగారావు జ్ఞాపకాలు



## సుందర సినీగేయలహరి వేటూరి

(29-1-36 - 22-5-2010)

ఆశువుగా పద్యాలు చెప్పగల అవధానకవుల్లా, చాటుపద్యకవుల్లా సంగీతదర్శకు లిచ్చిన బాణీలను అప్పటికప్పుడు పాటలల్ల గల సద్యః స్ఫూర్తికి పెట్టింది పేరు వేటూరి సుందరరామమూర్తి. 'అలలు కదిలినా పాటే-ఆకు మెదిలినా పాటే' అని ఆయనే రాసినట్టు వేటూరి రాయ(లే)ని పాట లేదు. అందుకే వేటూరి సంగీతపరంగా పాట రాయడాన్ని సులభతరం చేశారని బాలు అభిప్రాయపడ్డారు. ఎలాంటి పాటనయినా అవలీలగా రాయగలిగిన వేటూరి తెలుగులో యింత వరకు యెక్కువ సినిమాపాటలు రాసిన పాటసిరి. శ్రీశ్రీ తర్వాత తెలుగు సినిమాపాటకు జాతీయబహుమతి అందుకొన్న (అ) ద్వితీయ సినీకవి.

వెయ్యికి పైగా తెలుగులో నేరుగా తీసిన చిత్రాలకు సుమారు అయిదువేల పాటలను రాసిన వేటూరి ఒక గొప్పచిత్రాన్ని, ఒక గొప్ప పాటను చెప్పమంటే కష్టం. ఎందుకంటే ఆయన పాటల వల్ల యెన్నో చిత్రాలు గొప్పగా ఆడాయి; ఆయన పేరు తలచుకొంటే యెన్నో గొప్పపాటలు మదిలో మెదులుతాయి. అయితే శంకరాభరణం, సాగరసంగమం, భక్తకన్నప్ప, ఆనందభైరవి వంటి చిత్రాల్లో పాండిత్యస్ఫోరకమైన గీతరచన చేసినందుకే కాదు - 'అడవి రాముడు' మొదలుకొని అనేక వ్యాపారచిత్రాల్లో కూడా ఆశువుగా అద్భుతమైన పాటలు రాసిన ఆయన ధారకు ఆశ్చర్యపోతాం. స్వరపదమైత్రి మీద ఆయనకున్న అవగాహనకూ అధికారానికి - అప్రతిభులమవుతాం.

'ఇంద్ర'చిత్రానికి పాటలు రాసే సందర్భంలో హైదరాబాద్‌లో కారులో ప్రయాణిస్తూ -

**అమ్మడు అప్పచి, నువ్వంటేనే పిచ్చి**
**ఈడు యిట్టా వచ్చి పెట్టింది పేచి**

అని పల్లవిలోని మొదటి రెండుపంక్తులను రాసుకోమని సహాయకునికి 'డిక్టేట్' చేసి, దారిలో 'బావర్చి' హోటల్ కనబడితే-

**బావరో బావర్చి, తినిపించవా మిర్చి**
**వాయినాలు తెచ్చి, వడ్డించు వార్చి..**

అంటూ అనుహ్యమైన పదాలను పేర్చి కూర్చి-ఆ పల్లవిని కొనసాగించి రాసు కోమంటే సహాయకుడు ఆయన ధారను చూసి ఆనందాశ్చర్యాలతో పరవశుడయ్యాడట!

అలాగే 'రెండుజెళ్ల సీత'చిత్రంలో-

**'మాగాయే మహా పచ్చడి, పెరుగేస్తే మహాత్తరి..'**

అంటూ పేరడీని పేల్చి శ్రోతల్ని ముగ్ధుల్ని చెయ్యడం ఆయనకే చెల్లు. 'కాదేదీ కవిత కనర్హం' అన్నట్టు వేటూరి సినిమాపాటకు యెల్లలు లేవు. ఆయన 'డైరెక్ట్ టేక్' చిత్రాలతో పాటు-కాదనలేని వొత్తిళ్ల వల్ల దాదాపు యాభై డబ్బింగ్‌చిత్రాలకు కూడా పాటలు రాశారు. అలా పరిమితమైన చిత్రాలకు రాసిన పాటలు-వందల చిత్రాలకు రాసినంత ఖ్యాతినీ ప్రాచుర్యాన్నీ తెచ్చిపెట్టాయి! ఆయన అనువాదాల మీద కొన్ని అభియోగాలు కూడా లేకపోలేదు-అది వేరే సంగతి!

కృష్ణానది వుత్తర వాహినిగా ప్రవహించే పెదకళ్లేపల్లి వేటూరి జన్మస్థలం. తల్లిదండ్రులు కమలాంబ, చంద్రశేఖర శాస్త్రి. కదళీమాహాత్మ్య కావ్యకర్త వేటూరి సుందరశాస్త్రి ఆయన పితామహులు. ప్రఖ్యాత భాషాసాహిత్య పరిశోధకులు వేటూరి ప్రభాకర శాస్త్రి ఆయనకు పెదనాన్న. బాల్యంలో సంగీతంలో తల్లి, సాహిత్యంలో తండ్రి వేటూరికి తొలి గురువులు. కాగా, ప్రభాకర శాస్త్రి ఒడిలో ఆయన ప్రాచీన కావ్యాలను అభ్యసించారు. ఇంటర్ మద్రాసులోను, బి.ఏ. యస్.ఆర్.ఆర్. & సి.వి.ర్. ప్రభుత్వ కళాశాల, విజయవాడలోను చదివారు. బి.ఎ.లో కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వేటూరి గురువు. విశ్వనాథ వారి స్ఫూర్తితోనే వేటూరి పద్యరచన ఆరంభించారు. డిగ్రీ తర్వాత 'లా' చదవడానికి మద్రాసు వెళ్లి అనారోగ్య కారణంగా రెండో యేడు పరీక్షలు రాయకుండానే చదువుకి స్వస్తి చెప్పారు. అనంతరం ఆంధ్రప్రభలో కొంతకాలం, ఆంధ్ర పత్రికలో మరికొంతకాలం వుపసంపాదకులుగా పనిచేశారు. ఆంధ్రపత్రికలో వుండగా

సహోద్యోగులైన బాపు – రమణలతో పరిచయం యేర్పడింది. ఆ తర్వాత ఆంధ్రజనత సంపాదకులుగా కుడా మూడేళ్ల పాటు పనిచేశారు. ఆంధ్రజనత సంపాదకునిగా వుంటూ 1969 లో రాసిన 'సిరికాకొలను చిన్నది' శ్రవ్యరూపకం ఆయన సినీ రంగప్రవేశానికి దారి చూపింది.

ఆంధ్రప్రభ విలేకరిగా వుండగా వేటూరి ప్రజ్ఞను గుర్తించి ఎన్.టి.రామారావు 'పెండ్లి పిలుపు', 'దీక్ష'చిత్రాల ద్వారా ఆయనను సినీ రంగానికి పరిచయం చెయ్యడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆ తర్వాత 'సిరికా కొలను చిన్నది' శ్రవ్య రూపకాన్ని విని ముగ్ధులైన దర్శకులు కె.విశ్వనాథ్ 'ఓ సీత కథ'(1974)చిత్రం ద్వారా వేటూరిని సినీగేయ కవిగా పరిచయం చేశారు. 'ఓ సీత కథ'లో సంస్కృత పద భూయిష్ఠమైన హరికథారచనను చేసిన వేటూరి భవిష్యత్‌లో జనరంజకమైన గొప్ప పాటలు రాసి కవిగా సినీరంగాన్ని యేలతారని యెవరూ భావించలేదు. కాని తర్వాత వచ్చిన 'సిరిసిరి మువ్వ' 'భక్తకన్నప్ప' 'అడవి రాముడు' చిత్రాలలోని పాటలతో వేటూరి తన విశ్వరూపాన్ని ప్రదర్శించారు – సినీగేయరచనలో సరికొత్త చరిత్రను సృష్టించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సినీగేయరచనకు తొలిసారి ప్రకటించిన నందిపురస్కారంతో ప్రారంభించి, ఆరుసార్లు నంది పురస్కారాలను, రెండుసార్లు ఆత్రేయ మనస్విని పురస్కారాలను, ఫిల్మ్‌ఫేర్ లైఫ్ అచివ్‌మెంట్' అవార్డును అందుకొన్నారు. ఇంకా అటు హిందీ ఇటు తమిళ సంగీత దర్శకులను అబ్బుర పరచి 'ఆంధ్రబక్షి' 'తెలుంగు కణ్ణదాసన్' పేర్లతో ప్రసిద్ధులయ్యారు.

వరదలా వచ్చిపడుతున్న 'డైరెక్ట్ టేక్' చిత్రాలకు పాటలు రాసే అవకాశాలతో తలమునకలుగా వున్న వేటూరి దాదాపు దశాబ్దం పాటు డబ్బింగ్ రచనకు దూరంగా వున్నారు. ఆయన పాటల కోసం పడిగాపులు పడిన సహాయ దర్శకులు ఒకరి పాటను ఒకరు తీసుకొని వెళ్లడం, ఆ తర్వాత నిజం తెలిసి కూడా, మార్పు కోరకుండా తమ చిత్రసన్నివేశాలకు అవి సరిపోయాయని తృప్తిపడ్డం వంటి సంఘటనలు అప్పుడు వేటూరి యెంత 'బిజీ' గా వుండేవారో తెలియజేస్తాయి. అలా యే మాత్రం తీరిక లేని కాలంలో 'రాగమాలిక'(1982) తమిళచిత్రంతో డబ్బింగ్ రచన ప్రారంభించిన వేటూరి మణిరత్నం వంటి దర్శకులను, ఎ.ఆర్. రెహమాన్ వంటి సంగీతదర్శకులను, కాదనలేక ఆ తర్వాత అడపాతడపా కొన్ని డబ్బింగ్‌చిత్రాలకు గేయరచన చేశారు. ఆయన రచన చేసిన డబ్బింగ్‌చిత్రాలు యేడాదికి రెండు మూడు మించి వుండేవి కావు. ఆయనది ఒక డబ్బింగ్ చిత్రమైనా లేని సంవత్సరాలు కూడా వున్నాయి. రాజశ్రీ మరణానంతరం వేటూరిని

అమితంగా అభిమానించే మణిరత్నం చిత్రాలకు మాత్రం ఆయనకు పాటలు రాయక తప్పేదికాదు. మణిరత్నం ఒకేఒక్క 'డైరెక్ట్ టేక్' తెలుగుచిత్రం 'గీతాంజలి'కి కూడా వేటూరి రాసిన పాటలు విశేష ప్రజాదరణను పొందాయి. చివరి పదేళ్లలో (2000-2010) డబ్బింగ్‌చిత్రాలకు కూడా తలొగ్గిన వేటూరి యెక్కువ డబ్బింగ్‌పాటలు రాసిన సంవత్సరం 2007. ఆయన రచన చేసిన చివరి చిత్రం 'విలన్' (2010) కూడా మణిరత్నం డబ్బింగ్ చిత్రమే కావడం విశేషం!

వేటూరి పాటలతో విజయవంతమైన కొన్ని డబ్బింగ్‌చిత్రాలు -

1. రాగమాలిక (1982)
2. డాన్స్‌మాష్టర్ (1986)
3. బొంబాయి (1995)
4. దేవరాగం (1995-మలయాళం)
5. మెరుపుకలలు (1997)
6. సఖి (2000)
7. తెనాలి (2000)
8. అద్భుతం (2000)
9. అమృత (2002)
10. యువ (2005)
11. గజిని (2005)
12. నువ్వు - నేను - ప్రేమ (2007)
13. సూర్య సన్‌ఆఫ్ కృష్ణన్ (2008)

వేటూరి డబ్బింగ్‌రచన ఆయన పూర్వులకు భిన్నమైన సరళిలో సాగింది. డబ్బింగ్‌పాటలు పరభాషావాసనలు లేకుండా డైరక్ట్ టేక్ చిత్రాలకు రాసిన పాటల్లాగే అనిపించడం ఆయన ప్రత్యేకత. వేటూరి లిప్‌సింక్‌ను పాటిస్తూ, భావానువాదం విషయంలో మాత్రం స్వేచ్ఛ తీసుకొనేవారు. తన అనువాద విధానం గురించి ఒక సందర్భంలో వేటూరే స్వయంగా-'అనువాదగీతాన్ని వీలైనంత వరకు మాతృక లోని భావాలకు దగ్గరగా రాయడానికే నేను ప్రయత్నిస్తాను. వీలుకాని సందర్భంలో మాత్రమే ఒరిజనల్ కవి ఆత్మను కచ్చితంగా ఆవిష్కరించలేక పోతాను' అన్నారు. వేటూరి వ్యాఖ్యకు అనుగుణంగా ఆయన డబ్బింగ్‌పాటలు వున్నాయో లేవో - పరిశీలిద్దాం.

భారతీ రాజా దర్శకత్వంలో రాధ, కణ్ణన్ నాయికా నాయకులుగా నటించిన 'కాదల్ ఓ వియమ్' తమిళచిత్రాన్ని 'రాగమాలిక' పేరుతో తెలుగులో 'డబ్' చేశారు. ఇళయరాజా సంగీతదర్శకత్వంలో ఆ చిత్రంలోని పది పాటలనూ వేటూరే రాశారు. వాటిలో ఓ పాట తీరు చూసి 'డబ్బింగ్‌చిత్రాల్లోని పాటల్లో కూడా యింత కవితాపరిమళం వుంటుందా' అని చాలామంది ఆశ్చర్య పోయారు. ఆ పాట –

**పువ్వై పుట్టి పూజే చేసి పోనీ రాలి పోనీ (2)**
**పువ్వుగా ప్రాణాలు పోనీ తావిగా నన్నుండి పోనీ..** ॥పువ్వై॥

**నీవేనాకు రాగం – సాగనీవే హృదయతాళం**
**గీతం నీకు హారం – దేవిపాదం నాకు తీరం**
**దేవీ పూజ వేళ – రాగమేలే పూల హారం**
**నాదం నాకు ప్రాణం – చెరగరాదీ చైత్రమాసం**
**రేగే అగ్నిగుండం – నన్ను తాకి పొందు శాంతం**
**నేనే నాదం .. అ..అ..** ॥పువ్వై॥

**నాదే సూర్యనేత్రం – ఇంక నీదే చంద్రహాసం**
**నువ్వే చూడకుంటే – నాకు లేదే సుప్రభాతం**
**రాగం వింత దాహం – తీరకుందీ తీపిమోహం**
**వీచే గాలి లోనే – దాచుకున్నా నాదు గానం**
**లోకాలేదు నాలో – ఆడి పాడే నాట్యవేదం** ॥పువ్వై॥
**నీకే అంకితం .. అ.అ..**

నాయకుని గానాలాపనకు నాయిక నర్తనంతో పరవశించే సందర్భానికి – వైరముత్తు రాసిన దీని మాతృక –

**పూవిల్ వండు – కూడుమ్ కందు – పూవుమ్ కణ్ గళ్ మూడుమ్**
**పూవినమ్ మానాడు పోడుమ్ – వండుగళ్ సంగీతం పాడుమ్**
**రాగం జీవనాగుమ్.. నెంజన్ ఓశై తాళమాగుమ్**
**గీదమ్ వానమ్ పోగుమ్ .. అందమేగమ్ పాల మాగుమ్**
**దేవి ఎందన్ పాడల్ కందు మార్బిల్ నిన్రు ఆడుమ్**
**నాదం ఒన్రు పోడుమ్ ఎందన్ ఆయుళ్ కోడి మాదమ్**

**తీయిల్ నిన్ర పోదుమ్ అంద తీయే వెందు పోదుమ్...**

(పూవులోకి తుమ్మెద రావడాన్ని చూసి పువ్వు కూడా కళ్లు మూసుకొంటుంది. తుమ్మెద పాటలు పాడుతుంది. అప్పుడు రాగం జీవమవుతుంది. గుండె సవ్వడి తాళమవుతుంది. నాదం ఒకటి చాలు– నా ఆయువును పెంచుతుంది. ఆ నాదంతో అగ్నిగుండం కూడా శాంతిస్తుంది..)

'కాదల్ ఓవియమ్' లో హీరో అంధుడు. పైగా సంగీతనిధి. అందువల్ల పారవశ్యంలో కళ్లున్నవాళ్లు కూడా గుడ్డివాళ్లవుతున్నారని రాయడం అద్భుతంగా వుంది. కథాసందర్భాన్ని పట్టించుకోక పోతే తెలుగు పాట ప్రారంభం కూడా పరమాద్భుతమే!

2. ప్రేమకథల్లో 'సఖి' వైవిధ్యభరితం. పెళ్లితో ముగిసే ప్రేమకథకు భిన్నంగా పెళ్లితో ఆరంభమై నడిచే కుల పాలికా ప్రణయాన్ని, దాంపత్యంలోని సరిగమల్ని హృద్యంగా వెండితెరకెక్కించిన చిత్రం సఖి. దీనికి మూలం మణిరత్నం దర్శకత్వంలో నాయికా నాయకులుగా నటించిన 'అలై పాయుదే'. 'సఖి' కి మాటలు శ్రీ రామకృష్ణ, పాటలు వేటూరి సమకూర్చారు. తమిళం, తెలుగు – రెండు భాషల్లోను ఈ చిత్రంలో ఎ.ఆర్. రెహమాన్ సంగీత దర్శకత్వంలోని పాటలన్నీ ప్రజాదరణను పొందాయి. తెలుగు పాటల నుంచి ఒక వుదాహరణం–

**స్నేహితుడా స్నేహితుడా.. రహస్య స్నేహితుడా**
**చిన్నచిన్న నా కోరికలే అల్లుకున్న స్నేహితుడా**
**ఇదే సకలం సర్వం, ఇదే వలపు గెలుపు**
**శ్వాస తుది వరకు వెలిగే వేదం**
**వాంఛలన్నీ వరమైన ప్రాణబంధం**

**1. చిన్న చిన్న హద్దు మీర వచ్చునోయ్**
**ఈ జీవితాన పూలపుంత వెయ్యవోయ్ మనసే మధువోయ్**
**పువ్వుకోసే భక్తుడల్లే మెత్తగా**
**నేను నిద్రపోతే లేతగోళ్లు గిల్లవోయ్ సందెల్లో తోడువోయ్**
**ఐదువేళ్లు తెరచి ఆవువెన్న పూసి సేవలు సేయవలెరా**
**ఇద్దరమొకటై కన్నీరైతే – తుడిచే వేలందం..**

**2.** **శాంతించాలి పగ లింటిపనికే**
**నీ సొంతానికి తెచ్చేదింక పడకే వాలే పొద్దు వలపే**
**ఉల్లం చొక్కా ఆరబోసే వయసే**
**నీటి చెమ్మ చెక్కలైనా నాకు వరసే**
**ఉప్పుమూటే అమ్మైనా ఉన్నట్టుండిప్పేస్తా**
**ఎత్తేసి విసిరేస్తా కొంగుల్లో నిన్నే దాచేస్తా**
**వాలక పొద్దు విడుదల చేసి వరమొక టడిగేస్తా..**

దీనికి మాతృక వైరముత్తు రచన. సందర్భం – తన మనసులో దాగిన మధురోహల్ని రహస్యస్నేహితుని గా సంబోధించి ప్రేమికునికి విన్నవించుకోవడం –

**స్నేగిదనే స్నేగిదనే రగసియ స్నేగిదనే**
**చిన్న చిన్న దాయ్ కోరిక్కైగళ్ సెలిక్కొదు స్నేగిదనే**
**ఇదే అళుత్తమ్ అళుత్తమ్, ఇదే అణైప్పు అణైప్పు**
**వాళ్విన్ ఎల్లైవరై వేండుమ్.. వేండుమ్...(2)**

ప్రియుడు చొక్కా వేసుకొని తిరుగుతుంటే వుప్పుమూటను మోస్తున్నట్టుందనడం, అతణ్ని జేబురుమాల్లా మడచి చేతుల్లో పెట్టుకొంటాననడం వంటి మూలంలోని భావాలను తెలుగు చేసేటప్పుడు – అంత స్పష్టత లేకపోయినా, సాధనా సర్గమ్ గాన ప్రవాహంలోను, వేటూరి శబ్దమాధుర్యంలోను వోలలాడిన యువత ఆ లోటును పట్టించుకోలేదు!

3. వేటూరి పేరు చెప్పగానే యువతరానికి వెంటనే గుర్తొచ్చే డబ్బింగ్‌చిత్రం బొంబాయి. తమిళంలో కూడా 'బొంబాయి' పేరుతోనే వచ్చిన ఈ చిత్ర దర్శకుడు మణిరత్నం. సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్. మనీషా కోయిరాల, అరవింద స్వామి నాయికా నాయకులు. ఇక చెప్పాలా? ఇందులోని పాటలన్నిటినీ సినీసంగీత ప్రియులు ఆనందంగా ఆస్వాదించారు. వాటిలో వైరముత్తు రాయగా హరిహరన్, చిత్ర పాడిన గీతం యువతరాన్ని వూపేసింది. దానిని తెలుగులో వేటూరి రాయగా తెలుగు యువత నుంచి కూడా అంత విశేషమైన స్పందన వచ్చింది–

**అతను:**
**పల్లవి: ఉరికే చిలకా వేచి వుంటాను కడవరకూ**
**కురిసే చినుకా వెల్లువైనావె ఎదవరకూ**

చెలివై సఖివై రెండు హృదయాల కథలు విను
బ్రతుకే బరువై నిండు విరహాల కబురు విను
కాటుక కళ్లతో కాటువేశావు నన్నెపుడో
కాలం చెల్లితే ఇంత మన్నేసిపో ఇపుడు

చరణం:

నీ రాక కోసం తొలి ప్రాణమైనా దాచింది నా వలపే
మనసంటి మగువ ఏ జాముదాకా చితిమంటలే రేపే
నా కడ ప్రాణం పోనివ్వు కథ మాసిపోదు, అది కాదు నా వేదన
విధి విపరీతం నీమీద అపవాదు వేస్తే ఎద కుంగి పోయేనులే
మొదలో తుదలో వదిలేశాను నీకే ప్రియా

ఆమె:

ఉరికే చిలకే వచ్చివాలింది కలత విడి
చెలిగా సఖిలా తాను చేరింది చెలుని ఒడి
నెలవే తెలిపే నిన్ను చేరింది గతము విడి
కలకీ ఇలకీ ఊయలూపింది కంటపడి
తొలి ప్రాణమైన ఒక నాటి ప్రేమ మాసేది కాదు సుమా
ఒక కంటిగీతం జలపాతమైతే మరుకన్ను నవ్వదమ్మా
నా పరువాల పరదాలు తొలగించి వస్తే కన్నీటి ముడుపాయెనే
నే పురివిప్పి పరుగెత్తి గాలల్లే వచ్చా నీ వేణుగానానికే
అరరె.. అరరె.. నేడు కన్నీట తేనె కలిసే
మోహమో మైకమో రెండు మనసుల్లో విరిసినది
పాశమో బంధమో వున్న దూరాలు చెరిపినది..

ప్రియురాలు కోసం నిరీక్షించే ప్రియుని వేదననూ, ప్రియురాలి స్పందననూ ఆర్ద్రంగా చిత్రించిన ఈ సందర్భోచితమైన పాటలో 'కాటుక కళ్లతో కాటు వెయ్యడం' 'కన్నీట తేనె కలియడం' వంటి వేటూరి అభివ్యక్తులు సహృదయులు చేత 'ఆహా' అనిపించాయి. భావవ్యక్తీకరణలో వైరముత్తునే అనుసరించిన ఈ పాట మాతృక–

ఉయిరే ఉయిరే వందు ఎన్నోడు కలందు విడు
ఉయిరే ఉయిరే ఎన్నై ఉన్నోడు కలందు విడు

**నినైవే నినైవే ఎందన్ నెంజోడు కలందు విడు**
**నిలవే నిలవే ఇంద విన్నోడు కలందు విడు**
**కాదల్ ఇరుందా ఎందన్ కన్నోడు కలందు విడు**
**కాలం తడుంత్తాల్ ఎన్నై మన్నోడు కలందు విడు..**

'కాలం అడ్డుపడితే నన్ను మట్టిలో కలిపేసి పో..' వంటి వాక్యలతో సహా వేటూరి మూలం నుంచి దూరంగా వెళ్లలేదు. ఎటొచ్చీ – చిలక యెగరాలి గాని, వురకడ మేమిటని కొందరు వేటూరి యెత్తుగడను విమర్శించారు. అలా రంధ్రాన్వేషణకు పూనుకొంటే ఏ పాట నిలుస్తుతుంది?

4. వేటూరి గురు హిందీ డబ్బింగ్ చిత్రానికీ, దేవరాగం మలయాళ డబ్బింగ్‌చిత్రానికీ కూడా పాటలు రాశారు. భరతన్ దర్శకత్వంలో శ్రీదేవి, అరవింద స్వామి నాయికా నాయకులుగా నటించిన 'దేవరాగం' లోని పాటలు కూడా వేటూరి పేరునినుమడింపజేసాయి –

**గుండె నిండి పొంగుతుంది ప్రేమరాగము**
**అదే దేవరాగము**
**తుళ్లి తుళ్లి మౌనవీణ పలికె మోహము**
**అదే దేవరాగము**

**ప్రణయ దేవతా పరువమీయవా**
**మధుర దాహమే తీర్చి వెళ్లవా**
**ప్రేమకానుక అందుకో వయా**
**తీపివేడుక జ్వలించె చేసె మాయ**

**మధుర స్వప్నలోకము**
**మనకు సొంతమాయెలే**
**ఎదలోన మృదువీణ పలికె**
**వెన్నెలే వెల్లువై పారింది వరదలై**

**తాకెలే నా మోవిని**
**మన్మథుని స్వభావమే**
**మదిని దాటి దూకెలే**

**సోయగాలు దొంగలించు వేళే నేడు**

**పూవుమీద తుమ్మెద సొమ్మసిల్లిపోయెలే**
**తేనెల్లు మిగలకుండ దోచె**
**దాహమేదొ తీరగ సేదతీరె తీయగ**
**భ్రమరమ్ము పగ తీరిపోయె**
**స్వేద వేద గానమె స్వీయరాగ మాయెగా**
**తనువుల తొలితాంబూలం మదనుడి సొంతం**

**మలయాళ మాతృక :**

**శిశిర కాల మేఘ మిథున రతిపరాగమో**
**అదో దేవరాగమో**
**కుళిరిల్ మంగుమ్ ఆత్మదాహ మృదు విహారమో**
**అదో దేవరాగమో...**

(శిశిర కాల సంబంధమైన మేఘాల జంట వాంఛాజనితమో – లేక అది దైవ సంబంధమైన రాగమో! అది చలిలో తడిసి ముద్దయిన అంతరంగ భావనో! ఇంద్రియాలు చల్లదనంతో నీలంగా మారుతున్నాయి. పొగమంచు శయ్యను పరుస్తోంది. దేవదారువృక్షం కోర్కెతో వికసిస్తోంది...)

మూలంలోని సున్నితమైన ప్రాకృతికమైన ప్రణయరాగాన్ని తెలుగులో వ్యక్తం చెయ్యడం కత్తిమీద సాము. దానిని సమర్థంగా నిర్వహించడం వేటూరి వంటి ప్రతిభావంతులకు మాత్రమే సాధ్యం! మూలంలోని ప్రశ్నార్థకాలను తెలుగులో నిశ్చయార్థకాలుగా మార్చి వేటూరి ఈ పాటకు స్వేచ్ఛానువాదం చెయ్యడం గమనార్హం.

ఇంకా –

1. శశివదనే శశివదనే
   స్వర నీలాంబరి నీవా (ఇద్దరు)
2. కన్నానులే కలయికలు
   ఏనాడు ఆగవులే (బొంబాయి)
3. కడసారిది వీడ్కోలు
   కన్నీటితో మా చేవ్రాలు (అమృత)

4. కలలై పోయెను నా ప్రేమలు
అలలై పోయెను నా కన్నులు (సఖి)

5. నిదరే కల ఐనది, కలయే నిజమైనది
బతుకే జత ఐనది, జతయే అతనన్నది (సూర్య సన్ ఆఫ్ కృష్ణన్)

6. ప్రేమించే ప్రేమవా, ఊరించే పూహవా (నువ్వు-నేను-ప్రేమ)

7. సంకురాత్రి కోడి కత్తిలాంటి కోడి
కొంచెం చెలిమిచేస్తే అది సొంతమవునుగా (యువ)

8. ముకుందా ముకుందా కృష్ణా ముకుందా
స్వరంలో తరంగా బృందావనంలో వరంగా (దశావతారం)

9. వెన్నెలవే వెన్నెలవే .. మిన్నే దాటి వస్తావా?
విరహాన జోడి నీవే (మెరుపు కలలు)

మొదలైన కొన్ని పదుల డబ్బింగ్‌పాటలు నేటికి 'పాడుతా తీయగా' వంటి సంగీత కార్యక్రమాల్లో తరచుగా వినిపించడాన్ని బట్టి రాశి లో తక్కువైన వేటూరి డబ్బింగ్‌పాటల 'వాసి' ని యెవరు కాదనగలరు? వేటూరి డబ్బింగ్‌పాటల పట్ల శ్రద్ధ చూపలేదని, మాతృకలకు న్యాయం చెయ్యలేదని విమర్శించే వారికి యింతకంటే రుజువేం కావాలి?

వేటూరి శైలి సుందరం, సుమధురం. తెలుగులో నేరుగా తీసిన చిత్రాల్లోని పాటలయినా, డబ్బింగ్‌పాటలయినా-ఆయన తనదైన ముద్రను మార్చుకోలేదు. అందువల్ల ఆయన డబ్బింగ్‌రచనలో కొందరు లోపాలు వెదికినా-జనం మాత్రం వాటికి జేజేలు పలికారు. అటు డైరెక్ట్ టేక్ చిత్రాల్లోని పాటలతో పాటు అనివార్యమై రాసిన డబ్బింగ్ పాటలకు కూడా అసాధారణమైన ఆదరణ లభించినా-వేటూరికి 'డబ్బింగ్ రైటర్' ముద్ర మాత్రం పడలేదు! అయినా 'సాగరః సాగరోపమః' అన్నట్టు డబ్బింగ్ రంగంలో ఆయనకు ఆయనే సాటి!

❖

ఈ ప్రకరణంలో
సమాచార సేకరణకు వుపయోగపడిన వ్యాసాలు, పుస్తకాలు-

1. 'వేటూరి అనువాదాలు - అపవాదాలు' - పైడిపాల
28.1.15 సాక్షి దినపత్రికలో వ్యాసం
2. 'తననాలూ - తర్జుమాలు' - వనమాలి
సూర్య దినపత్రిక లో వ్యాసాలు
3. వక్కలంక కిషోర్ యిచ్చిన 'దేవరాగం' పాట సమాచారం
4. తెలుగు సినీగేయకవుల చరిత్ర పరిశోధనగ్రంథం - పైడిపాల



## నిన్నకూ రేపుకూ నేడంటి వెన్నెలకంటి

పూర్తి పేరు వెన్నెలకంటి రాజేశ్వర ప్రసాద్. పుట్టింది 30.11.57 న నెల్లూరులో. నెల్లూరులోనే బి.కాం. డిగ్రీ తీసుకొని అక్కడే పుష్కరకాలం పాటు 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' లో వుద్యోగం చేశారు. సాహిత్యనేపథ్యం లేని యింట పుట్టినా, డిగ్రీలో తెలుగును ఐచ్ఛిక విషయంగా తీసుకోక పోయినా, చిన్ననాడే పద్యవిద్య అలవడింది. 11యేళ్ల వయసులోనే 'భక్త దుఃఖనాశ పార్వతీశ' అనే మకుటంతో ఒక శతకాన్ని, విద్యార్థి దశలోనే రామచంద్ర, లలితా శతకాలను రచించారు. నాటకరంగంలో నటునిగా రాణించడం తో పాటు 'ఆత్మవత్ సర్వభూతాని' 'యత్ర నార్యస్తు పూజ్యన్తే' అనే నాటికలు రాసి అనేక పరిషత్‌లలో బహుమతులు అందుకొన్నారు.

వెన్నెలకంటి ఒక పక్క సాహిత్యనాటక రంగాలలో కృషి చేస్తూనే–మరోపక్క సినిమాలకు పాటలు రాయాలనే ఆసక్తితో తరచుగా నెల్లూరు నుంచి మద్రాసు వెళ్తుండేవారు. ఆ ప్రయత్నాల్లో నటుడు, నిర్మాత ప్రభాకరరెడ్డి పరిచయమై 'శ్రీరామచంద్రుడు' (1986) చిత్రంలో 'చిన్ని చిన్ని కన్నయ్యకు వెన్నెలజోల..' అనే మొదటి సినిమాపాట రాసే అవకాశాన్ని ఇచ్చారు. ఆ తరువాత ప్రముఖ సినీ నేపథ్యగాయకులు యస్.పి. బాలసుబ్రహ్మణ్యం అభిమానానికి పాత్రులై, ఆయన ప్రోత్సాహంతో 'అన్నాచెల్లెలు' (1987) చిత్రంలో 'అందాలు ఆవురావు రన్నాయి' అనే పాట రాసి పరిశ్రమ దృష్టినాకర్షించారు. ఆ క్రమంలో ఆత్మవిశ్వాసంతో సినీరంగంలో స్థిరపడి, వుద్యోగానికి రాజీనామా చేశారు. అప్పటికి డబ్బింగ్‌ప్రక్రియను యేలుతున్న రాజశ్రీ తో పాటు 'నాయకుడు' (1987) చిత్రంలో రెండు పాటల్ని రాసే అవకాశం రావడంతో ఆ రంగంలో అరంగేట్రం చేసి, 'ఇంతింతై వటుడింతయై' అన్నట్టుగా యెదిగి ప్రస్తుతం 'డబ్బింగ్ కింగ్' గా వర్ధిల్లుతున్నారు.

డబ్బింగ్‌కవిగా ముద్రపడినా, స్ట్రెయిట్ చిత్రాలకు కూడా ప్రాచుర్యం పొందుతున్న పాటల్ని రాస్తూ తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటున్నా రనడానికి - నేరుగా తీసిన తెలుగు సినిమాల్లోని ఈ కింది వుదాహరణలే నిదర్శనం.

**1. మధురమే సుధాగానం, మనకిదే మరో ప్రాణం**
**మదిలో మోహన గీతం, మెదిలే తొలి సంగీతం (బృందావనం)**

**2. రాసలీల వేళ రాయబార మేల**
**మాటే మౌనమై మాయజేయనేల (ఆదిత్య-369)**

**3. కొండాకోనల్లో లోయల్లో.. గోదారి గంగమ్మా సాయల్లో**
**కోరి కోరి కూసింది కోయిలమ్మ (స్వాతి కిరణం)**

**4. మాటరాని మౌనమిది, మౌనవీణ గానమిది**
**గానమిదీ, నీ ధ్యానమిదీ (మహర్షి)**

**5. రావయ్యా ముద్దుల మామ**
**నీకు రాసిస్తా రాయలసీమ (సమర సింహారెడ్డి)**

**6. బుద్ధభూమి రుద్రభూమి అయ్యింది**
**వేదభూమిలో వేదన మిగిలింది (రాఘవయ్య గారి అబ్బాయి)**

(2000 సంవత్సరానికి నంది పురస్కారం అందుకొన్న పాట)

ఇలా తెలుగులో నేరుగా తీసిన చిత్రాల్లో పాటలు రాయడానికి ఆత్రేయ శైలినీ, వేటూరి అభివ్యక్తినీ ఆదర్శంగా యెంచుకొన్న వెన్నెలకంటి డబ్బింగ్ రంగంలో రాజశ్రీని స్ఫూర్తిగా తీసుకొన్నారు. అయితే అంతవరకు ఆ రంగంలో వుద్దండులనిపించుకొన్న వారికి భిన్నంగా- వీలయిన మేరకు పడికట్టుపదాలను వాడకుండా, భావాన్ని సరికొత్తగా చెపుతూ తనదైన శైలిని స్థాపించుకొన్నారు. వెన్నెలకంటి డబ్బింగ్‌శైలిలో యిలాంటి ప్రత్యేకతకు నిదర్శనాలుగా రెండు మచ్చుతునకలు-

**1. అధరమే మధుర పానశాల**
**హృదయమే మనకు పర్ణశాల (సర్కిల్ ఇన్‌స్పెక్టర్)**

**2. ఊహలన్ని పాటలే కనులతోటలో**
**తొలి కలల కవితలే మాట మాటలో (గుణ)**

ఇలా అపురూపమైన, అమూలకాలైన వ్యక్తీకరణలతో డబ్బింగ్‌రంగంలో రాణించి, ఇంతవరకు ఆ రంగంలో రాజశ్రీ తర్వాత (అ) ద్వితీయుడనిపించుకొంటున్న వెన్నెలకంటి రచన చేసిన కొన్ని ప్రసిద్ధచిత్రాలు–

1. గుణ (1991)
2. అభిమన్యు (1992–మలయాళం)
3. క్షత్రియ పుత్రుడు (1993)
4. మహానది (1994)
5. డ్యూయెట్ (1994)
6. ప్రేమాలయం (1995–హిందీ)
7. బాషా (1995)
8. ప్రేమించి పెళ్లాడతా (1996–హిందీ)
9. ప్రేమబంధం (1997–హిందీ)
10. తెనాలి (2000)
11. పోతురాజు (2004)
12. గజిని (2005)
13. చంద్రముఖి (2005)
14. పందెంకోడి (2006)
15. దశావతారం (2008)

పాటలకు పరిమితం కాకుండా రాజశ్రీ తర్వాత అత్యధిక చిత్రాలకు మాటలూ పాటలూ రాసిన కవి వెన్నెలకంటి. అలాగే హిందీ, తమిళ, కన్నడ, మలయాళ చిత్రాలతో పాటు 'జురాసిక్ పార్క్' (1995) తో ప్రారంభించి అనేక ఆంగ్లచిత్రాలను డబ్ చేయడమేగాక – ఇటీవల 'నింగీ నేలా నాదే' పేరుతో ఒక చైనీయచిత్రాన్ని డబ్ చేసిన ఘనత కూడా వెన్నెలకంటిదే! 'జురాసిక్ పార్క్' లో 'రిచర్డ్ ఆటెన్‌బరో' పాత్రకు ప్రముఖనటులు, సాహితీవేత్త కొంగర జగ్గయ్య డబ్బింగ్ చెప్పడం (అది ఆయన డబ్బింగ్ చెప్పిన చివరి చిత్రం) వెన్నెలకంటి కలానికి గర్వకారణం! వెన్నెలకంటి డబ్బింగ్‌పాటల నుంచి కొన్నిముత్యాల నేరుకొని వాటి ప్రత్యేకతను పరిశీలిద్దాం–

1. కె. బాలచందర్ దర్శకత్వంలో ప్రభు, రమేష్ అరవింద్, మీనాక్షి శేషాద్రి నటించిన తమిళచిత్రం 'డ్యూయెట్' (1994) అదే పేరుతో తెనిగింపబడింది.

ఎ.ఆర్.రహమాన్ సంగీత దర్శకులు. తమిళంలో వైరముత్తు పాటలు రాయగా, తెలుగులో మాటలూ పాటలూ వెన్నెలకంటి రాశారు.

**అంజలి అంజలి పుష్పాంజలి (2)**
**పూవంటి పదములకు పుష్పాంజలి**
**ముద్దైన పెదవులకు మోహాంజలి**
**కలహంస నడకలకు గీతాంజలి**
**కనరాని నగవులకు కవితాంజలి**

**నిన్న దాక నువ్వు నేను**
**ఇరువురం ఎవరనీ**
**కమ్మనిబంధం ఇలా తెలిపెను ఒకటని**
**కడలిని పడు వానలా కలసిన మది యిది**
**కరిగిన సిరి మోజులా కథయిది నా చెలి**
**ఎదురుగా తొలిస్వప్నం తొణికినది**
**ఎదలో మధుకావ్యం పలికినది**

**అంజలి అంజలి వలపుల నా చెలి** **॥పూవంటి॥**
**కన్నుల సంకేతమే కలలకు తొలకరి**
**వెన్నెల జలపాతమే వలపుకు తదుపరి**
**గుండెలో సంగీతమే కురిసిన దెందుకో**
**కోయిల పాటే యిలా పలికిన విందుకో**
**చెలువుగ యెద మారే మధువనిగా**
**అమవస నిశి మారె వెన్నెలగా**
**అంజలి అంజలి యిది హృదయాంజలి**
**నీ ప్రేమలాహిరికి పుష్పాంజలి**
**నీ గానమాధురికి గీతాంజలి**
**ఎద దోచు నవ్వులకు నటనాంజలి**
**కవి అయిన నీ మదికి కవితాంజలి** **॥అంజలి॥**

(చివరి చరణం యివ్వడం లేదు) – డ్యూయెట్

**తమిళ మాతృక :**

**అంజలీ అంజలీ పుష్పాంజలీ**
**పూవే వున్ పాదత్తిల్ పుష్పాంజలి**
**పొన్నే వున్ పెయరుక్కు పొన్నంజలి**
**కన్నే వున్ కురళుక్కు గీతాంజలి**
**కన్ కానా అళగిర్కు కవితాంజలి... (డ్యూయెట్)**

భావం: అంజలీ, నీకు పుష్పాంజలి. నీ పేరుకు స్వర్ణాంజలి. నీ గొంతుకు గీతాంజలి. నీ అందానికి కవితాంజలి. ప్రేమనే వాన కురిశాక యేది తొలి చినుకో తెలియనట్టు నేను నీతో కలసిపోయాను. రోజుకో కొత్తపాట పాడుతున్నాను. గుండెలను సంగీతం సోకి ఆ మార్గం భాష అయింది. నీలాంటి అందగత్తె అంతటా అతిశయమే.

మూలంలో లేని అందమైన అభివ్యక్తులు తెలుగులో పొంగి పొర్లిన స్వేచ్ఛాను వాదం యిది. 'కన్నుల సంకేతమే కలలకు తొలకరి, వెన్నెల జలపాతమే వలపుకు తదుపరి' వంటి పంక్తులను దీనికి వుదాహరణలుగా పేర్కొనవచ్చు. మూలం ఒరవడిలోనే తెలుగులో కూడా అంత్యప్రాసలు వేసినా, వాటిని సార్థకంగా ప్రయోగించడం వెన్నెలకంటి విశిష్టత. సుదీర్ఘమైన గీతం కనుక పునరుక్తులు తప్పలేదు.

2. కె.యస్. రవికుమార్ దర్శకత్వంలో కమలహాసన్ హీరోగా వచ్చిన తమిళచిత్రం 'దశావతారం' (2008) అదే పేరుతో తెలుగులో డబ్ చేయబడింది. ఆచిత్రంలో 'వాలి' రాసిన ఓ పాటను వెన్నెలకంటి యిలా తెనిగించారు.

**రాయిని మాత్రం కంటే దేవుడు కనరాడు**
**దేవుని మాత్రం కంటే దేహం కనరాదు (2)**
**హరిని తలచు నా హృదయం నేడు హరుని తలచుట జరగదులే**
**అష్ట అక్షరం తెలిసిన నోరు పంచ అక్షరం పలకదులే**
**వంకర కన్నుల మీరు శంకర కింకరులు**
**వైష్ణవునేం చేస్తారు ఆ యమకింకరులు**

**నిలువు నామం దాల్చు తలను మీకు వంచనులే**
**నిలువునా నను చీల్చుతున్నా మాట మార్చనులే**
**వీర శైవుల బెదిరింపులకు**

పరమవైష్ణవం బెదరదులే
ప్రభువు ఆనతికి జడిసేవాడు
పదమట సూర్యుడు పొడవడులే
రాజ్యలక్ష్మీనాథుడు శ్రీనివాసుడే
శ్రీనివాసుడి వారసుడీ విష్ణుదాసుడే
దేశాన్నేలే వారంతా రాజరాజులే
రాజులకు రాజు ఈ రంగరాజనే..
(చివరి చరణం యివ్వడం లేదు)

తమిళ మాతృక :

కల్లై మట్టుం కండాల్ కోడవుళ్ తెరియాదు
కడవుళ్ మట్టుం కండాల్ కల్లడి తెరియాదు
ఎట్టిల్ ఐందువన్ కళియుం ఎంద్రుం
ఐంవిల్ ఎట్టు ఏన్ కళియాదు
అష్ట అక్షరం ఏర్కుం నెంజు పంజ అక్షరం పార్కాదు
ఊన కన్నిల్ పాత్తాల్ యావుం కుట్రందాన్
న్యాయ కోన్నిల్ పాత్తాల్ యారుం సూత్తం దాన్... (దశావతారం)

కథా సందర్భాన్ని బట్టి వైష్ణవాన్ని సమర్థిస్తూ, శైవమతాన్ని తక్కువ చేస్తూ రాసిన ఈ పాట మూలవిధేయంగా సాగినట్టు స్పష్ట మౌతుంది గనుక – దీని భావాన్ని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మూలంలో లేని, నిలువు నామం దాల్చుతలను మీకు వంచనులే, నిలువునా నను చీల్చుతున్నా మాట మార్చనులే' వంటి ప్రయోగాలు కవితా ప్రియులను అలరిస్తాయి. భావంతో నిమిత్తం లేకుండా ప్రాచుర్యాన్ని పొందిన తెలుగు డబ్బింగ్ పాటల్లో ఒకటిగా దీనికి గుర్తింపు వుంది.

3. తమిళంలో 'మురుగదాస్' దర్శకత్వంలో అసిన్, సూర్య నాయికానాయకులుగా రూపొందిన 'గజిని' తెలుగులో అదే పేరుతో డబ్ చేయబడి–రెండు భాషల్లోనూ విజయవంతమైంది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు హారిస్ జయరాజ్.

పల్లవి: హృదయం ఎక్కడున్నదీ హృదయం ఎక్కడున్నదీ
నీ చుట్టూనే తిరుగుతున్నదీ

అందమైన అబద్ధం ఆడుతున్న వయసే
నాలో విరహం పెంచుతున్నదీ
చూపులకై వెతికా, చూపుల్లోనే బ్రతికా
కళ్లు తెరిచి స్వప్నమే కన్నా తొలిసారి
కళ్లు తెరిచి స్వప్నమే కన్నా... ॥హృద॥

చరణం-1

అతను : కుందనం మెరుపుకన్నా వందనం వయసుకన్నా
చెలియందం నేడే అందుకున్నా
ఆమె : గుండెలో కొసరుతున్నా కోరికే తెలుపుకున్నా
చూపే వేసి బతికిస్తావనుకున్నా
అతను : కంటిపాపలా, పువ్వులనే నీ కనులలో కన్నా
నీ కళ్లే వాడిపోని పూలమ్మా...
ఆమె : హృదయం ఎక్కడున్నదీ హృదయం ఎక్కడున్నదీ...

చరణం-2

ఆమె : మనసులో నిన్ను కన్నా మనసుతో పోల్చుకున్నా
తలపుల పిలుపు విన్నా
అతను : సెగలలో కాలుతున్నా చలికి నే వణుకుతున్నా
నీడే లేని జాడే తెలుసుకున్నా
ఆమె : మంచు చల్లనా? ఎండచల్లనా?
తాపం లోన మంచు చల్లన
కన్నా, నీ కోపంలోనా ఎండ చల్లన (2)

(గజిని - వెన్నెలకంటి)

తమిళ మాతృక :

సుట్రుం విళిచుడరే సుట్రుం విళిచుడరే
ఎన్ ఉలగం ఉన్నై చుట్రుదే
సట్టై పయ్యిల్ ఉన్ పడం తొట్టు తొట్టు ఉరస
ఎన్ ఇదయం పట్రి కొళ్లుదే
ఉన్ విళియల్ విళిందేన్ వెన్ విళియల్ పరందేన్

**కన్ విళిత్తు సొప్పనం కండేన్ వున్నాలే**
**కన్ విళిత్తు సొప్పనం కండేన్...   (గజిని-నా. ముత్తుకుమార్)**

'కంటిచూపుతో నిప్పులా చురుక్కుమని పించేదానా, నా ప్రపంచం నీచుట్టూ తిరుగుతోంది. నా చొక్కా జేబులో దాచుకున్న నీ బొమ్మ నా హృదయానికి గిలిగింతలు పెడుతోంది. నీ కంట్లో పడ్డాక ఆకాశంలో తేలుతున్నాను. నేడు 'నీ వల్ల కళ్లు తెరిచి కలలు కంటున్నాను' అనే భావం గల పల్లవి ముగింపులో మాత్రమే తెలుగులో తమిళభావాన్ని అనుసరించారు. అలాగే చరణాల్లో కళ్లపూలు తుమ్మెదను పట్టి తినడం, వడ్రంగిపిట్ట మనసును దోచుకొని పోవడం వంటి మాతృకలోని భావాలను విడిచి పెట్టి మళ్లీ ముగింపులో మాత్రమే మూలభావాన్ని తీసుకొన్నారు. మనోనేత్రాలతో చూసి మనసుతో పోల్చుకొని తలపుల పిలుపులు మనసుతో వినడం సెగలలో కాలుతూ చలికి వణకడం (విరోధాభాసం) వంటి అమూలకమైన అభివ్యక్తులు వెన్నెలకంటి ప్రయోగశీలతకు నిదర్శనాలు. ఇలా తమిళంలో నా. ముత్తుకుమార్ రాసిన పాటకు వీలయిన మేరకు స్వేచ్ఛానువాదం చేసిన వెన్నెలకంటి పాట నేటికీ యువ హృద యాలను పరవశింపజేసి పదేపదే పాడుకునేలా చేసింది. తెలుగులో హారిస్ రాఘవేంద్ర, బాంబే జయశ్రీ ఈ యుగళ గీతాన్ని ఆలపించారు. 'సుట్రుమ్ విళిచుడరే' అనే పదప్రయోగాన్ని ముందుగా సుబ్రహ్మణ్య భారతి చేశారట!

4. నేరుగా తీసిన తెలుగు చిత్రాల్లో కొన్ని అలంకార సమన్వితమైన పాటల్ని రాసి తన అభిరుచిని తెలియజేసిన వెన్నెలకంటి డబ్బింగ్ చిత్రాలలో కొన్ని ప్రయోగాత్మకమైన పాటలు రాసి తన ప్రత్యేకతను నిరూపించుకొన్నారు. ఆ కోవకు చెందిన పాటల నుంచి కొన్ని వుదాహరణలు -

(అ) 'దేవర్ మగన్' తమిళచిత్రాన్ని తెలుగులో 'క్షత్రియపుత్రుడు' పేరుతో డబ్ చేశారు. దానిలో 'ఇంజి ఇడుప్పళగి'.. అనే పాటను తెలుగుచేస్తూ వెన్నెలకంటి పల్లవి నిలా రాశారు-

**సన్నజాజి పడక... మంచెకాడ పడక**
**చల్లగాలి పడక... మాట వినకుంది ఎందుకే**
**మనసులో ప్రేమ వుంది... మరువని మాటే వుంది**
**మాయని వూసే వుంది... పాటై రావే**

మూలంలోని పల్లవి భావంతో సంబంధం లేకుండా, లిప్ సింక్‌ను పాటిస్తూ, దృశ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 'పడక' అనే పదానికి సభంగ శ్లేషతో కలిపి నానార్థాలు వచ్చేలా–వెన్నెలకంటి రాసిన పై పల్లవి పలువురి ప్రశంసల నందుకుంది.

(ఆ) రజనీకాంత్ హీరోగా నటించిన 'బాషా' తమిళ చిత్రాన్ని అదే పేరుతో తెలుగులో డబ్ చేశారు. అందులో వెన్నెలకంటి రచన –

**నే నాటోవాణ్ణి ఆటోవాణ్ణి అన్నగారి రూటువాణ్ణి న్యాయమైన రేటువాణ్ణి**
**ఎదురులేని ఆటగాణ్ణి అందమైన పాటగాణ్ణి**
**మంచోళ్లకు మంచివాణ్ణి తప్పుడోళ్ల వేటగాణ్ణి**
**అచ్చమైన తెలుగువాణ్ణి మచ్చలేని మనసువాణ్ణిరా...**

అనే పల్లవికి మూలం – 'నాన్ ఆటోకారన్ ఆటోకారన్ నాలుంతెరింజ రూటు కారన్..." అనేది. 'దానికి నేను ఆటో వాడిని, ఆటోవాడిని–నాలుగు రూటులూ తెలిసిన వాణ్ని. న్యాయమైన రూటువాణ్ని, మంచివాళ్ల సావాసగాణ్ని, బాగా పాడేవాణ్ని, గాంధీపుట్టిన దేశం వాణ్ని అని అర్థం. దాన్ని తెలుగు చేసేటప్పుడు–కాకతాళీయంగా రజనీకాంత్ బృందం చేతుల్లో పసుపు రంగు జేబురుమాళ్లు వుండడమనే దృశ్యానికి అప్పటికి ఆంధ్రలో తెలుగుదేశం పాలన వుండడమనే రాజకీయ పరిస్థితి అన్వయించేలా 'అన్నగారి రూటువాణ్ని, అచ్చమైన తెలుగు వాణ్ని' అనే పంక్తుల్ని సందర్భానుసారంగా రాసి ప్రాంతీయతాభావాన్ని సాధించిన వెన్నెలకంటి సమయస్ఫూర్తికి ప్రేక్షకుల చప్పట్లు మారుమ్రోగాయి.

(ఇ) తెలుగునాట కలెక్షన్ల కనకవర్షం కురిపించిన 'చంద్రముఖి' డబ్బింగ్ చిత్రంలో 'లాంగ్ షాట్స్' యెక్కువగా వుండి 'లిప్‌సింక్' ప్రతిబంధకం అంతగా లేని యుగళగీతంలో వెన్నెలకంటి 'కాలం' అనే పదం మీద హృద్యమైన ప్రయోగం చేశారు –

**కొంత కాలం కొంత కాలం కాలమాగి పోవాలి**
**నిన్నకాలం మొన్నకాలం రేపు కూడ రావాలి (2)**
**ఎంతకాల మెంతకాలం హద్దు మీరకుండాలి**
**అంతకాలం అంతకాలం ఈడు నెట్టులాపాలి...**

అంటూ ఆ కాలాన్ని చరణాలకు కూడా కలిపారు. నిజానికి 'కొంజనేరం కొంజనేరం కొంజి పేసక్కూడాదా' అనే మూలంలో కాలం యింతగా సాగదు!

(ఈ) 'మహానది' (1994)లో –

**శ్రీరంగ రంగనాథనిన్ పాదం వందనం సెయ్యడి**
**శ్రీదేవి రంగనాయగి నామం సంతతం సొల్లడి...**

అనే పాటను వెన్నెలకంటి యిలా తెనిగించారు –

**శ్రీరంగ రంగనాథుని దివ్యరూపమే చూడవే**
**శ్రీదేవి రంగనాయకి నామం సంతతం పాడవే**
**నీలవేణిలో నీటి ముత్యాలు**
**కృష్ణవేణిలో అలల గీతాలు**
**నీలవేణిలో నీటిముత్యాలు నీరజాక్షునికి పూలుగా**
**కృష్ణవేణిలో అలల గీతాలు కృష్ణగీతలే పాడగా...**

ఈ పాటలోని రమణీయమైన రూపకాలంకారాన్ని గమనించిన కె. విశ్వనాథ్ వెన్నెలకంటిని ఆశీఃపూర్వకంగా అభినందించారట!

5. ఇలా యెక్కువగా తమిళ డబ్బింగ్‌గీతాలలో తన ముద్రను నిరూపించుకొన్న వెన్నెలకంటి యితర భాషాచిత్రాల్లో రాసిన పాటల్లో కూడా జనరంజకాలకు లోటులేదు. ముఖ్యంగా 'ప్రేమాలయం' ('హమ్ ఆప్‌కే హై కౌన్'), 'ప్రేమించి పెళ్లాడతా' (దిల్‌వాలే దుల్హనియే లే జాయేంగే) హిందీ డబ్బింగ్‌చిత్రాలు రెండూ వెన్నెలకంటి వృత్తి జీవితాన్ని మలుపు తిప్పిన మెరుపులని చెప్పాలి. మచ్చుకి 'ప్రేమించి పెళ్లాడతా' నుంచి ఓ పాటను చూద్దాం –

**నీ ఆశే నాకు ఆరాధనం**
**ప్రేమించే గుండె ఒక నందనం (2)**
**అప్పగించా నీకే జీవితం**
**నా ప్రాణమ్మె నీకు పునరంకితం**
**లల లాలా... ॥నీ ఆశే॥**

**చరణం-1**

**అతను : నీకే మది అర్పించి నా కమ్మని కలలే కనీ**
**నీ చూపులై నావూపిరై నన్నిలా బతికించనీ**

ఆమె : నువ్విలా వుండగా తోడుగా నీడగా
మొగ్గతొడిగింది ప్రేమాక్షరం ॥నీ ఆశే॥

చరణం -2

అతను : కల కానిదీ కథ కానిదీ తీయనీ వలపన్నది
నా రూపమే ఆలాపనై పలికిన పాటే యిదీ

ఆమె : గుండెలే వెచ్చనీ రాగమే తీయగా
మనస్సయింది బృందావనం ॥నీ ఆశే॥

మాతృక : షారుఖ్ ఖాన్, కాజోల్ ప్రేమజంటగా నటించిన 'దిల్‌వాలే దుల్హనియే లే జాయేంగే' బాలివుడ్ చరిత్రలో ఓ సంచలన చిత్రం! ఆనంద్ బక్షి రాసిన పైపాట మాతృకను 'జతిన్ - లలిత్' సంగీత సారథ్యంలో కుమార్ సాను - లతామంగేష్కర్ ఆలపించారు.

తుజే దేఖా తో యే జానా సనమ్
ప్యార్ హోతా హై దీవానా సనమ్
అబ్ యహా సే కహా జాయే హం
తేరీ బాహోంమే మర్ జాయే హం

ఆంఖేం మేరే సప్నే తేరే దిల్ మేరా యాదేం తేరే
ఓ మేరా క్యా హై సబ్ కుచ్ తేరా
జాన్ తేరీ సాంసే తేరీ
మేరీ ఆంఖోంమే ఆసూం తేరే ఆగయే
ముస్కురానే లగే సారే ఘం
ఏ దిల్ కహీ లగ్తా నహి, క్యా కహుం మై క్యా కరూం
హా తూ సామ్నే బైఠే రహె మై తుజే దేఖా కరూ
తూనే ఆవాజ్ దీ దేఖ్‌మై ఆగయా
ప్యార్‌సే హైబడీ క్యా కసమ్

భావం : నిన్ను చూసిన తర్వాత ప్రేమంటే పిచ్చి అని తెలిసింది. ఇప్పుడిక్కడి నుండి నన్నెక్కడికి వెళ్లమంటావు? నీ కౌగిలిలో చనిపోతాను నేను. కళ్లు నావి - కలలు నీవే, మనసు నాది - జ్ఞాపకాలు నీవే. నాదంటూ యేముంది. అంతా నీవే.

ప్రాణం నీదే. శ్వాస నీవే. నా కళ్లలో నీ కన్నీళ్లు వచ్చాయి. దాన్ని చూసి ఈలోకం నవ్వుకొంది.

నా మనసు స్థిరంగా లేనిదే నేనేం చెప్పను? ఏం చెయ్యను? నువ్వు నాముందు కూర్చుంటే నేను చూస్తాను. ప్రేమకంటె అసలు గొప్పది యేది?

భాషతో ప్రమేయం లేకుండా సినీగీతప్రియుల్ని, ముఖ్యంగా యువతను వుర్రూతలూగించిన ఈ యుగళగీతాన్ని తెనిగించడం ఓ సాహసం. ఆ సాహసాన్ని సమర్థంగా నిర్వహించి తెలుగులో కూడా ఈ పాట హిట్ కావడానికి వెన్నెల కంటి కారకులయ్యారు. ఇంకా –

**1.	అక్కా నీ మరిదెంతో వెర్రోడే, ఓ అక్కా నీ మరిదెంతో వెర్రోడే**
**అయ్యో రామా, పిట్టలకు వలవేస్తాడే...	(ప్రేమాలయం)**

మూలం : దీదీ తేరా దేవర్ దీవానా, హెూ దీదీ తేరా దేవర్ దీవానా హాయ్‌రాం కుడియోంకో డాలే దానా..	(హమ్ ఆప్‌కే హై కౌన్)

**2.	ఓ పయనించే చిలుకా నీబాట మారిందా**
**ఎద అర్పించిన గోరింక మాట నీకు గుర్తుందా	(ప్రేమ బంధం)**

మూలం : మై యహ్ నహి కహతాకి ప్యార్ మత్ కర్నా కిసీ

ముసాఫిర్ కా మగర్ ఐత్‌బార్ మత్ కర్నా...

**(రాజా హిందుస్థానీ)**

వంటి హిందీ డబ్బింగ్ పాటలు ఏ భాష నుండయినా అలవోకగా డబ్ చెయ్యగల సత్తా వెన్నెలకంటి కుందని రుజువు చేస్తాయి.

వెన్నెలకంటి ప్రాథమికంగా నాటకరంగం నుంచి రావడం వల్ల సంభాషణల రచయితగా కూడా రాణిస్తున్నారు. ఈ అంశంలో ఆయన నైపుణ్యానికి 'భామనే సత్యభామనే' లో మూగవాడైన వంటవాడికీ యజమానికీ మధ్య అవగాహనను సాధించడం, 'పందెంకోడి'లో మూడక్షరాలు పదాలతో మూలానికి దీటుగా దేశాభిమానాన్ని చాటడం –మచ్చుతునకలు. కె. విశ్వనాథ్, సింగీతం శ్రీనివాసరావు, వంశీ వంటి దర్శకులు, బాలు, మాధవపెద్ది సురేష్ వంటి సంగీతజ్ఞులు. అనేక సందర్భాలలో మెచ్చుకోవడం, ప్రముఖ హీరో కమలహాసన్ విడిచిపెట్టకుండా అవకాశాలివ్వడం వృత్తిపరంగానూ, వ్యక్తి గతంగానూ

– వెన్నెలకంటి శైలికి తిరుగులేని యోగ్యతాపత్రాలు. అటు సంప్రదాయాన్ని గౌరవిస్తూ – యిటు కొత్త పోకడలను ఆహ్వానిస్తూ – చిత్రరంగంలో సమన్వయాన్ని సాధిస్తున్న వారధిగా వెన్నెలకంటికి ఈ తరం కవుల్లో తనదైన స్థానం వుంది. ఇటీవల కొడుకులిద్దరూ (శశాంక్ వెన్నెలకంటి, రాకేందు మౌళి) యిదే రంగంలో ప్రవేశించి తమ ప్రతిభను ప్రదర్శిచడంతో – ఎప్పుడో వెన్నెలకంటి వంశీయులు చెప్పిన – 'కవిత పుట్టిల్లు వెన్నెలకంటి యిల్లు' అనే కవిత సార్థక మవుతోంది!

❖

ఈ ప్రకరణంలో

సమాచార సేకరణకు వుపయోగపడిన వ్యక్తులు, వ్యాసాలు –

1. తెలుగుసినీగేయ కవుల చరిత్ర – పరిశోధన గ్రంథం – పైడిపాల
2. వెన్నెలకంటి సహాయకులు అందజేసిన సమాచారం.
3. 'సూర్య' దిన పత్రిక 9-11-2007 సంచిక 'తననాలు – తర్జుమాలు' శీర్షికలో వనమాలి వ్యాసం.



## సినీ 'భువనవిజయ'చంద్ర

బహుభాషాపరిచయం, బాణీలకు వేగంగా సాహిత్యాన్ని సమకూర్చగల లయజ్ఞానం, డబ్బింగ్‌ప్రక్రియ పట్ల సంపూర్ణమైన అవగాహన గల సినీగేయకవి భువనచంద్ర. 'భువనచంద్ర' అనేది కన్నతల్లి, పెంచిన తల్లి – ఇద్దరి పేర్లను కలిపి పెట్టుకొన్న కలంపేరు. అసలు పేరు ఊరకరణం పూర్ణానంద ప్రభాకర గురురాజు. 17-8-1950న కృష్ణా జిల్లా, నూజివీడు సమీపంలోని 'గొల్లపూడి'లో జన్మించారు. ఏలూరు దగ్గర చింతలపూడిలో బాల్యం, పాఠశాల విద్యాభ్యాసం గడిచాయి. పి.యు.సి. తర్వాత 17వ యేటనే 'ఇండియన్ ఎయిర్‌ఫోర్స్'లో చేరిన భువనచంద్ర అక్కడ వుండగానే మెకానికల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్‌లలో డిప్లొమాలు తీసుకొన్నారు.

ఉద్యోగకారణంగా వివిధ ప్రాంతాలలో వుండడం, వివిధ వ్యక్తులతో పరిచయం – భువనచంద్రకు అనేక భారతీయ భాషలతో పరిచయం యేర్పడ్డానికి దోహదం చేశాయి. హిందీ, భోజ్‌పురి భాషలకు సంబంధించిన వేలాది గీతాలు ఆయన నోటికొచ్చు. పాటలు పాడే అలవాటు, గాత్రమాధుర్యం ఆయనకు సినిమారంగం పట్ల అభిరుచిని కలిగించడంతో పాటు సినిమాపాటలు రాసే సామర్థ్యానికీ వుపకరించాయి. భువనచంద్ర గీతాల్లో అన్యభాషాపదాలు, అన్యదేశ్యాలు (ఉ: టపోరీ) కూడా చోటుచేసుకొంటాయి. ఆయనకు గేయరచనతో పాటు కథలు రాసే అలవాటూ వుంది. ఇప్పటికీ 'స్వాతి' మొదలైన పత్రికల్లో ఆయన తరచుగా కథలు రాస్తున్నారు.

మిలిటరీ జీవితం తర్వాత అనేక వుద్యోగావకాశాలు వచ్చినా కాదని, తన అభిరుచి కనుగుణమైన సినీరంగంలో స్థిరపడ్డారు. విజయబాపినీడు ప్రోత్సాహంతో – చంద్రమోహన్,

రాజేంద్రప్రసాద్ ముఖ్యపాత్రధారులైన 'నాకూ పెళ్లాం కావాలి' (1987) అనే పునర్నిర్మాణ చిత్రంలో 'వినోదాల విందురా...' అనే మొదటి పాటను రాశారు. ఆయన పాటలు ప్రేక్షకులకు వినోదాల విందులు కావడంతో మరి వెనక్కి తిరిగి చూడవలసిన అవసరం లేకపోయింది. సినీరంగ ప్రవేశం చేసిన కొత్తలో వునికి కోసం వేటూరికి దీటుగా వ్యాపార సూత్రాల కనుకూలంగా తాళప్రధానమైన బాణీలకు జనరంజకమైన గీతాలను రాసి పరిశ్రమ దృష్టి నాకర్షించారు. ముఖ్యంగా వేటూరి తర్వాత చిరంజీవి కథానాయకుడుగా నటించిన అనేక చిత్రాలకు పాటలు రాసి మెప్పించారు. ఆయన రెండు దశాబ్దాల క్రితం రాసిన అనేకగీతాల్ని యిప్పుడు 'రీమిక్స్' చెయ్యడం ఆయన పాటల ప్రాచుర్యానికి నిదర్శనం.

**ఉ: 1. బంగారుకోడిపెట్ట... అహ. వచ్చెనండీ**

**(ఘరానా మొగుడు / మగధీర)**

**2. వాన వాన వెల్లువాయే... కొండకోన తుళ్లిపోయే...**

**(గ్యాంగ్ లీడర్ / రచ్చ)**

ప్రారంభంలో ప్రజారంజకమైన పాటల్ని యెక్కువగా రాసిన భువనచంద్ర పరిశ్రమలో నిలదొక్కుకున్న తర్వాత తన కిష్టమైన మాధుర్యభరితమైన పాటల్ని కూడా రాశారు – రాస్తున్నారు. ముందుగా ఆయన తెలుగులో 'స్ట్రెయిట్ పిక్చర్స్'కి రాసిన కొన్ని 'హిట్స్'ను గుర్తుచేసుకొందాం –

**1. జీవితం ఓ ప్రయాణం, తోడుగా సాగనీ**
**గుండెలో ప్రేమగీతం నిండుగా మోగనీ (సుమంగళి–1989)**

**2. బుల్లిపిట్ట బుజ్జిపిట్ట గూటిలోన గువ్వపిట్ట**
**వెంట వెంట వచ్చేవారి పేరు చెప్పవే (చినరాయుడు–1992)**

**3. ఇదేలే తరతరాల చరితం**
**జ్వలించే జీవితాల కథనం (పెద్దరికం–1992)**

**4. ఊహల పల్లకిలోన వూరేగుతున్నది వధువు**
**చిరు చిరు పెదవులపైన వూరుతున్నది మధువు (ఆమె–1994)**

**5. ప్రియరాగాలే గుండెలోన పొంగుతున్న ఈ వేళ**
**ప్రియగానాలే కన్నెప్రేమ దోచుకున్న శుభవేళ**
**(హలోబ్రదర్–1994)**

**6.** **స్నేహానికన్న మిన్న లోకాన లేదురా**
**కడదాక నీడలాగ నిను వీడిపోదురా** **(ఇద్దరు మిత్రులు-1999)**

**7.** **సందెపొద్దు ఓ మంచి మాట చెప్పిపోతే**
**సాగరాలె కౌగిట్లో వాలి సాక్షులైతే** **(చిన్నబ్బాయి-1997)**

**8.** **మరల తెలుపనా ప్రియా మరల తెలుపనా**
**ఎదలోయల దాచుకొన్న మధురోహల పరిమళాన్ని**
**కనుపాపలు నింపుకున్న చిరునవ్వుల పరిచయాన్ని**
**(స్వయంవరం- 2004)**

తెలుగులో నేరుగా తీసిన చిత్రాలకు పాటలు రాయడంలో తీరిక లేని భువనచంద్ర మొదటి ఏడేళ్లు డబ్బింగ్ చిత్రాల వైపు చూడలేదు. 1995లో రోజా, ప్రభుదేవా నాయికా నాయకులుగా నటించిన 'రాశయ్య' తమిళ చిత్రాన్ని తెలుగు చెయ్యడానికి సన్నాహాలు చేస్తూ – నిర్మాత చలసాని గోపి అప్పటికి డబ్బింగ్ కవులుగా ముద్రపడని వాళ్లచేత పాటలు రాయించే ప్రయత్నంలో – భువనచంద్ర ఆయన దృష్టిలో పడ్డారు. అలా 'కుర్రాడు బాబోయ్' (1995) అనే పేరుతో తెలుగులో వచ్చిన ఆ 'రాశయ్య' డబ్బింగ్ చిత్రానికి రెండు పాటలు రాయడంలో భువనచంద్ర డబ్బింగ్ రంగంలో అడుగుపెట్టారు. అవి –

**1.** **మస్తానా, మస్తానా... (మనో, ప్రీతి)**

**2.** **సిరివాడ చిన్నమ్మా... (మనో, చిత్ర)**

1995లో మొతం నాలుగు డబ్బింగ్ చిత్రాలకు పాటలందించిన భువనచంద్ర 1996లో పాటలు రాసిన అయిదు చిత్రాల్లో – ప్రేమదేశం, ప్రేమలేఖ, భారతీయుడు అనే మూడు చిత్రాల్లోని పాటలు 'సూపర్ హిట్' కావడంతో ఆయనకు డబ్బింగ్ రచన అనివార్యమైపోయింది. ఆ తర్వాత ఓ ఆంగ్ల చిత్రంలో సహా – హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల నుంచి డబ్ చేసిన అనేక చిత్రాలలో పాటలను రాశారు. వాటి నుండి కొన్ని ప్రసిద్ధ చిత్రాలు –

**తమిళం –**

ముత్తు – 1996 (ముత్తు)
రక్షకుడు – 1997 (రక్షగన్)
చెలి – 2001 (మిన్నలె)

రోజాపూలు - 2002 (రోజా కూట్టం)
చంద్రముఖి - 2005 (చంద్రముఖి)
అపరిచితుడు - 2005 (అన్నియన్)
శివాజీ - 2007 (శివాజీ)
దశావతారం - 2008 (దశావతారం)
రోబో - 2010 (రోబో)

**హిందీ -**

కిష్ణ, ఎ.బి.సి.డి., ద్రోణ, నేల మీద తారలు మొదలైనవి.

**మలయాళం -**

అభిమన్యు

**కన్నడం -**

చాముండి, నాగదేవత, మేజర్ (ప్రధానపాత్ర చిరంజీవి నటించారు)

ఇవి గాక - కొన్ని పరభాషా చిత్రాలలో తెలుగు పాటలు రాయడం భువనచంద్ర ప్రత్యేకత.

రజనీకాంత్ నటించిన 'చంద్రముఖి' కన్నడ, తమిళ, తెలుగు భాషల్లో అద్భుత విజయాలను సాధించినట్టు అందరికీ తెలుసు. ఈచిత్రంలో కథాపరంగా కీలకమైన సన్నివేశమైన నాయిక జ్యోతిక నృత్యానికి - తమిళచిత్రంలో తెలుగు పాటను భువనచంద్ర రాశారు. ఆ పాట పల్లవి -

**రారా.. సరసకు రారా**
**రారా.. చెంతకు చేర**
**ప్రాణమే నీదిరా, యేలుకోరా దొరా...**
**శ్వాసలో శ్వాసవై రారా...**

ఈ సన్నివేశానికి కన్నడమాతృకలో తెలుగుపాటను వేటూరి, తెలుగు డబ్బింగ్ చిత్రంలో తమిళపాటను వాలి రాయడం విశేషం. అన్ని భాషల్లోనూ ఈ పాటను భాషతో ప్రమేయం లేకుండా విశేషంగా ఆదరించినట్టే భువనచంద్ర పాటకు తమిళులు కూడా బ్రహ్మరథం పట్టారు.

ఇంకా –

ఎం.యఫ్. హుస్సేన్ తీసిన 'మీనాక్షి' హిందీ/ఇంగ్లీషు చిత్రంలో – చిట్టెమ్మ, చిలకమ్మా.. తెలుగు పాటను, 'సత్య యిన్ లవ్' కన్నడ చిత్రంలో – శ్రీరామనవమి సందర్భానికి తెలుగు పాటను, 'షికార్ ' మలయాళ చిత్రంలో – 'ప్రతిఘటించు ప్రతిఘటించు..' అనే తెలుగు పాటను, 'సాంద్ పొట్టు' తమిళచిత్రంలో – తెలుగుపాటను.. గోపీచంద్ హీరోగా నటించిన 'ఆంధ్రుడు' తెలుగుచిత్రంలో భోజపురి, హిందీ భాషలలో – 'పరియాయీ పరదేశ్ సె బబువా'.. అనే పాటను...

ఇలా భాషాతీతమైన పాటల్ని రాసే అవకాశాలూ, తత్సంబంధమైన విజయాలూ దక్కిన ఏకైక తెలుగు సినీగేయకవి భువనచంద్ర మాత్రమే! ఇప్పుడు భువనచంద్ర డబ్బింగ్ విధానం మీద అవగాహన కోసం ఆయన డబ్బింగ్ పాటల్ని కొన్నిటిని పరిశీలిద్దాం –

1. గత దశాబ్దంలో విద్యా సంస్థల్లో వివిధ సందర్భాల్లో మార్మోగిన స్నేహ బంధానికి సంబంధించిన సినిమాపాట – ముస్తఫా, ముస్తఫా..' 'కాదల్ దేశం' తమిళ చిత్రాన్ని 'ప్రేమదేశం' పేరుతో తెలుగు చేయగా – మూలంలో వాలి రాసిన పాటను 'ప్రేమదేశం'లో భువనచంద్ర రాశారు. రెండు భాషల్లోనూ ఈ పాటను ఈ చిత్రానికి సంగీత దర్శకులైన ఎ.ఆర్. రెహమాన్ ఆలపించారు. ముందుగా మన విద్యార్థిలోకాన్ని వెర్రెత్తించిన 'ప్రేమదేశం' లోని పాటను చూద్దాం–

**ముస్తఫా ముస్తఫా డోంట్ వర్రీ ముస్తఫా**
**కాలం నీ నేస్తం ముస్తఫా**
**డే బై డే.. డే బై డే... కాలం ఒడిలో డే బై డే**
**పయనించే షిప్పే ఫ్రెండ్‌షిప్పా**

**చరణం-1**

**జూన్‌పోయి జూలై పుడితే**
**సీనియర్‌కీ జూనియర్‌కీ**
**కాలేజీ కేంపస్‌లోనే రాగింగ్ ఆరంభం**
**స్టూడెంట్స్ మనసు ఓ నందనవనం**
**మల్లెలుంటాయ్ ముళ్లు వుంటాయ్**
**స్నేహానికి రాగింగ్ కూడా చేస్తుందోయ్ సాయం**

వాడిపోనిదీ స్నేహమొక్కటే
వీడిపోనిదీ నీడ ఒక్కటే
హద్దంటూ లేనే లేనిది ఫ్రెండ్‌షిప్ ఒకటే
కష్టమొచ్చినా నష్టమొచ్చినా
మారిపోనీదీ ఫ్రెండ్ ఒక్కడే
కాలేజీ స్నేహం ఎపుడూ అంతం కానిదే ॥ముస్తఫా॥

ఎక్కడెక్కడి చిట్టి గువ్వలు
యాడనుంచో గోరువంకలు
కాలేజీ కాంపస్‌లోన నాట్యం చేసేనే...
కన్నె పిల్లల కొంటె నవ్వులు
కుర్రమనసుల కౌగలింతలు
కాలేజ్ కాంపౌండ్ అంటే కొదైకెనాలే...!
కోర్సు ముగిసే రోజు వరకూ
తుళ్లిపడిన కుర్రయెదలో
కన్నీరే వుండదంట, దేవుడే సాక్షి
స్నేహితుల్ని వీడిపోయే
రోజు మాత్రం కన్నీటి తోడేనంట ఫేర్‌వెల్ పార్టీ!

దీనికి తమిళ మాతృక -

ముస్తఫా - ముస్తఫా.. డోంట్‌వర్రీ ముస్తఫా
కాలమ్ నమ్ తోళన్ ముస్తఫా
డే బై డే... డే బై డే.. వాళ్కై పయనం డే బై డే-
ముళుగాద షిప్పే ఫ్రెండషిప్పా...

పల్లవి వరకు మాత్రమే కాదు - దాదాపు పాటపొడవునా తెలుగుసేత మూలానికి దూరంగా లేదు. ముస్తఫా (మహమ్మద్ పేరు పెట్టిన మిత్రుడు) అనే సంబోధనతో సహా యథాతథంగా నడిచింది. తమిళకవి వాలి గొప్పగా రాసిన మాతృక వాసి తగ్గకుండా తెలుగు అనువాదం వుండడం వల్ల - ఈ పాట తెలుగులోనూ ప్రాచుర్యాన్ని పొందింది. విద్యార్థుల వీడ్కోలు వేడుకకు సంబంధించిన ఈ పాట 'స్టూడెంట్ నెం:1 లో చంద్రబోస్

యిలాంటి సన్నివేశానికే రాసిన 'ఎక్కడో పుట్టి యెక్కడో పెరిగి..' పాటకు స్ఫూర్తి కావచ్చు.

2. అన్యాయాన్ని ప్రశ్నించి ప్రతిఘటించే వృద్ధుదెవడైనా సమాజంలో తారసపడితే – 'అమ్మో! భారతీయుడు' అనుకోవడం నేటికీ కద్దు. అలా ముద్రవేసిన గెటప్‌లో కమలహాసన్ నటించిన తమిళచిత్రం 'ఇండియన్'. శంకర్ దర్శకత్వంలో కమల్ రెండుపాత్రలను, మనీషా కొయిరాలా, సుకన్య ప్రధాన స్త్రీపాత్రలను పోషించిన 'ఇండియన్' చిత్రంలో తెలుగులో 'భారతీయుడు' పేరుతో డబ్ చేయబడింది. జీవితానికి ఆనందాన్ని మించింది లేదనే భావాన్ని ప్రకృతిలో అనుసంధానం చేస్తూ వైరముత్తు రాసిన పాటను భువనచంద్ర తెలుగు చేశారు. వృద్ధపాత్రలో కమల్, అతని కుటుంబ సభ్యులమీద చిత్రీకరించిన సన్నివేశంలో ఈ పాటను కె.జె.ఏసుదాస్ పాడగా – అది రెండు భాషల్లోనూ నేటికీ సినీ సంగీతప్రియులను వెంటాడుతోంది. ముందుగా 'భారతీయుడు'లో పాటను గుర్తు చేసుకొందాం –

**పచ్చని చిలకలు తోడుంటే**
**పాడే కోయిల వెంటుంటే**
**భూలోకమే ఆనందానికి యిల్లు**
**ఈ లోకంలో కన్నీరింక చెల్లు...**
**చిన్న చిన్న గూటిలోనే స్వర్గముందిలే**
**అరె.. చిన్ని చిన్ని గుండెల్లోనే ప్రేమ యింకిపోదులే**
**సీతాకోక చిలుకకు చీరలెందుకు?**
**అరె.. ప్రేమవుంటే చాలునంట**
**డబ్బూ గిబ్బూ లెందుకంట...**

**చరణం-1**

**అందని మిన్నే ఆనందం**
**అందే మన్నే ఆనందం**
**అరె... భూమిని చీల్చుకు పుట్టే**
**పచ్చని పసిరిక ఆనందం**
**మంచుకు యెండే ఆనందం**
**వాగుకి వానే ఆనందం**
**అరె... ఎండకి వానకి రంగులుమారే ప్రకృతి ఆనందం**

బ్రతుకే నూరేళ్లందం బ్రతుకే బ్రహ్మానందం
చెలియా, వయసుడిగే స్వగతంలో
అనుబంధం ఆనందం... ఆనందం

చరణం-2

నీ శ్వాసను నేనైతే నా వయసే ఆనందం
మరుజన్మకు నన్నే కన్నావంటే ఇంకా ఆనందం
చలిపుట్టే మాసంలో చెలి ఒళ్లే ఆనందం
నా చెవులను మూస్తూ దుప్పటి కప్పే కరుణే ఆనందం
అందం ఓ ఆనందం బంధం పరమానందం
చెలియా, ఇతరులకై కనుజారే కన్నీరే ఆనందం... ఆనందం...

తమిళ మాతృక (ఇండియన్)-

పచ్చయ్ కిళిగళ్ తోళోదు
పాట్టు కుయిలో మడియోదు
బూలోగమే ఆనందత్తిన్ యెల్లయ్
ఇందు బూమిక్కు కన్నీర్ సొందమ్ ఇల్లయ్
సిన్నంజిరు కూట్టుక్కుళ్ల సొర్గమ్ ఇరుక్కు
అడ సిన్నసిన్న అన్బిల్దానే జీవన్ ఇన్నుమ్.. ఇనుక్కు
పట్టామ్ బూచ్చి కూట్టత్తుక్కు పట్టా ఎదర్కు
అడ పాసమ్ మట్టుమ్ పోదుమ్ కణ్ణే
కాసు పణమ్ ఎన్నత్తుక్కు..

ఇది 'లిప్ సింక్'తో పనిలేని దృశ్య ప్రధానమైన నేపథ్యగీతం గనుక మూలాన్ని వున్నదున్నట్టుగా అనువదించాల్సిన అవసరం లేదు. కాని అద్భుతమైన వైరముత్తు భావాల్ని విడిచిపెట్టడం యిష్టం లేని భువనచంద్ర చరణాల్లో ఒకటి రెండు చోట్ల తప్ప మూలానుగుణం గానే ఈ పాటను రాశారు. అంతే కాదు – మూలంలోని అభివ్యక్తులను అంత అందం గానూ తెలుగులోకి తెచ్చారనడానికి – 'ఇతరులకై కనుజారే కన్నీరే ఆనందం' వంటి పంక్తులు వుదాహరణలు. చెయి జారడానికి సమాంతరంగా 'కనుజారడం' యెంత అందమైన ప్రయోగం! ఈ పాట యెప్పుడో 'బ్రతుకు తెరువు'లో విన్న 'అందమె ఆనందం,

ఆనందమె జీవిత మకరందం' పాటను గుర్తుకు తేవడం లేదూ?

3. పై రెండు పాటల్లోనూ భువనచంద్ర మాతృకల్లోని అందచందాలను ఒడిసి పట్టుకొని యెలా తెలుగులోకి తెచ్చారో గమనించాం. ఇక అటు తమిళంలోనూ, ఇటు తెలుగులోనూ సుప్రసిద్ధులైన హీరోల శైలికి అనుగుణంగా కవులు పాటలు రాసే పద్ధతిలో – భువనచంద్ర యెలా వొదిగారో చూద్దాం –

'చంద్రముఖి'లో రజనీకాంత్ 'స్టైల్'ను ఆవిష్కరించడానికి భువనచంద్ర పరకాయ ప్రవేశం చేసి రాసిన పాట –

**పల్లవి:** **దేవుడా, దేవుడా... తిరుమల దేవుడా, చూడరా..**
**చూడరా కళ్లు విప్పి చూడరా**
**నావాళ్ల హృదయాలూ... నిజమైన వజ్రాలూ..**
**నువు కొంచెం సానబెట్టరా**
**శక్తులన్నీ వచ్చి చేరుకుంటే... ఓ...ఓ.. స్వర్గం**
**వెలిసేనయ్యా భూమిపై** **॥దేవుడా॥**

**చరణం-1**

**ఆలోచించు కొంచెం.. రైతుబిడ్డ కష్టం**
**అందరి ఆకలి తీర్చేటందుకు ఓడుస్తాడు స్వేదం**
**వాడలోని మలినం శుభ్రం చేసేవారూ..**
**నాలుగురోజులు రాకపోతే కుళ్లిపోదా వూరూ?**
**మాసిన జుట్టు పనీ పట్టేవాడంటూ లేకుంటే**
**తగ్గుతుందా తల బరువూ?**
**నీళ్లలోనే నిలచీ వుతికేవాడంటూ లేకుంటే**
**నిలచునా మన పరువూ?**
**ఏ పని ఎవరు చేస్తేనేమీ.. వృత్తే మనకు దైవం అంటూ**
**బ్రహ్మంగారూ నాడే అన్నారోయ్...** **॥శక్తు॥**

**చరణం-2**

**నీ గురించి ఎవరో.. అరె ఏమనుకుంటే ఏమీ**
**ఈ చెవితో విన్నదాన్ని ఆ చెవిలోంచి వదిలెయ్**
**మేఘం సాగుతున్నా.. కాకులు మూగుతున్నా**

**ఆకాశానికి మలినాలేవీ అంటుకోవని చెప్పేయ్**
**బంతిపట్టి ఏట్లో నడిమధ్యలో ముంచినా**
**తేలు తుందోయ్ పైకే సోదరా.. అరే**
**నిన్నే.. ఎవరో దూరం పెట్టినా నెట్టినా**
**తేలిరారా పూలబంతిరా**
**మిణుగురు పురుగులు ఎన్నెన్నున్నా...**
**పున్నమినాటి జాబిలి చల్లే పండువెన్నెల నాపగలవా? ॥శక్తు॥**

ఇది తమిళంలో రజనీకాంత్ శైలికి తగినట్టుగా రాసిన మాతృకకు దీటుగా వుందనడానికి ఆ పల్లవిని చూద్దాం-

**దేవుడా, దేవుడా ఏళుమల దేవుడా**
**చూడుడా, చూడుడా.. ఎంగపక్కం చూడుడా**
**ఎన్ గాళ్లు ఉల్లంగళ్ ఎల్లాయె వైరంగళ్**
**నీ కొంజుం పకందికడ**
**శక్తి ఎల్లాం ఒంద్రు సేందాల్.. ఓ..ఓ**
**స్వర్గం వరుం ఇందమన్ మేలే**

దీని భావాన్నే తెలుగు పాట పల్లవిలో రాసినట్టు స్పష్టంగా తెలుస్తోంది. తెలుగుపాట చరణాల్లో కూడా చెప్పుకోదగిన మార్పులూ చేర్పులూ లేవు. మొత్తంమీద పై డబ్బింగ్ పాటల్ని పరిశీలిస్తే సాధ్యమైనంత వరకు మూలాతిక్రమణం లేకుండా సామాన్యుడి నోటికి పట్టుబడే భాషలో మాతృకను అందంగా తెలుగులో అందించడం - భువనచంద్ర డబ్బింగ్ ధ్యేయమని అర్థమవుతోంది. ఈ విషయాన్ని రుజువుచేస్తూ -

**1. ప్రేమా,**
**నను నేను మరిచినా నీతోడు**
**విరహాన వేగుతూ ఈనాడు**
**వినిపించనా ప్రియా నాగోడు- ప్రేమా... (ప్రేమదేశం)**

**2. థిల్లానా థిల్లానా, నా కసికళ్లకూనా**
**చకచక చిందే మన్నానా (ముత్తు)**

3. **చిన్నదానా, ఓసి చిన్నదానా**
**ఆశపెట్టేసి పోమాకే కుర్రదానా** **(ప్రేమలేఖ)**

4. **యాపిల్ పిల్లా నీవెవరో**
**ఐస్ క్రీమ్ చెలియా నీవెవరో**
**కళ్లలో మెరిసే మాయమయ్యే ఇసుకనీటివో..** **(రోజాపూలు)**

5. **సోనియా, సోనియా స్వీటు స్వీటు సోనియా**
**రేగుతోంది లేతవయసు జోరు..** **(రక్షకుడు)**

6. **పచ్చని తరులారా, ఒక్క పల్లవి పాడరటే**
**చక్కని నదులారా, చల్లని జలముల నీయరటే** **(సమురాయ్)**

మొదలైన డబ్బింగ్ పాటలు తెలుగునాట విజయవిహారం చేస్తూ సినీ సంగీతాభిమానుల్ని అలరిస్తున్నాయి.

వ్యక్తిగతంగా భువనచంద్ర మాట యెంత మృదువో - అంత మృదువుగానూ ఆయన పాట పలకరిస్తుంది. అసంఖ్యాకంగా రాసిన చిత్రాలూ, పాటలూ ఆయనకు గుర్తు లేవు. కాని ఆయన మర్చిపోయినా జనం మాత్రం వాటిని గుర్తు పెట్టుకొని పదేపదే పాడుకొంటున్నారు. ఈ తరానికి చెందిన డబ్బింగ్ సినీ గేయకవులలో వెన్నెల లాంటి పాటలతో ఆహ్లాదపరుస్తున్న కవిచంద్రుడు భువనచంద్ర.

❖

ఈ ప్రకరణంలో
సమాచారసేకరణకు ఉపయోగపడిన రచనలూ, వ్యక్తులూ...


1. తెలుగు సినీగేయకవుల చరిత్ర-పరిశోధన గ్రంథం -పైడిపాల
2. సూర్య దినపత్రికలో 'తననాలు-తర్జుమాలు' శీర్షికలో వ్యాసాలు -వనమాలి
2. శ్రీమతి గుమ్మడి రామలక్ష్మి (పరిశోధక విద్యార్థిని, మద్రాసు విశ్వవిద్యాలయం) యిచ్చిన సమాచారం.

## అన్నట్టు, ఈ జంటనూ విస్మరించడానికి వీల్లేదు!



ఎ.యం.రత్నం



శివగణేష్

తెలుగు సినీగేయకవుల చరిత్రలో తొలినాళ్లలో శ్రీశ్రీ–ఆరుద్ర, పినిశెట్టి–అనిసెట్టి వంటి జంటలు కలిసి సినిమా రచన చేసినా –అది కొంతకాలమే! ఎక్కువ కాలం – అందునా డబ్బింగ్ చిత్రాలకు గేయరచన చేస్తున్న ముద్రపడిన తొలిజంట శివగణేష్ – ఎ.యం.రత్నాలే! వీరిద్దరూ విడివిడిగా కొన్ని చిత్రాలకు పాటలు రాసినా, సంయుక్త రచనలే యెక్కువ. అలాగే అడపా తడపా స్ట్రెయిట్ చిత్రాలకు కూడా రాసినా, గుర్తుంచుకో దగిన పాటలున్నవి యెక్కువగా డబ్బింగ్ చిత్రాలలోనే!

ఎం.శివగణేష్ జన్మస్థలం తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం. ఎం.యస్.సి. (కెమిస్ట్రీ), ఎం.ఏ (తెలుగు, సంస్కృతం) చదివి చాలకాలం బాంక్ ఆఫ్ ఇండియాలో వుద్యోగం చేశారు. సినిమారంగంలో అడుగుపెట్టక ముందే భక్తి ఆల్బమ్‌లకు పాటలు, సంస్కృతాంధ్రాలలో అష్టకాలు రాశారు. సినిమాపాటలు రాయడానికి ప్రోత్సహించింది సినీనేపథ్యగాయకులు జి.ఆనంద్ కాగా – 'పల్నాటి పౌరుషం' (1994) సినిమాలో తొలిఅడుగు వేయిచింది ఎడిటర్ మోహన్. ఆ చిత్రంలోని 'రాగాల చిలక, రంగేళి మొలక...' అనేది శివగణేష్ మొదటి సినిమాపాట. చాలకాలం చెన్నైలో వుద్యోగం చెయ్యడం వల్ల నిర్మాత ఎ.యం. రత్నానికి పరిచయమై ఆయనతో కలిసి పాటలు రాశారు. అలాగే చెన్నై వదలి హైదరాబాద్ వెళ్లకపోవడం వల్ల డబ్బింగ్ రంగానికి పరిమితమయ్యారు.

ఎ.యం.రత్నం పూర్తిపేరు అడిగోపుల మునిరత్నం. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం పుట్టినవూరు. చిత్ర పరిశ్రమలో 'మేకప్ మేన్' గా ప్రవేశించి, క్రమంగా నిర్మాతగా, గేయరచయితగా యెదిగారు.

ఈ జంట జనరంజకమైన డబ్బింగ్ పాట లెన్నో రాసినా - వాటిలో అత్యంత ప్రాచుర్యం పొందిన పాట 'ఒకే ఒక్కడు'లోని 'నెల్లూరి నెరజాణ..' అనేది. ఈ జంట పేర్లు చెప్పగానే గుర్తొచ్చే కొన్ని చిత్రాలు-

1. ఒకే ఒక్కడు (ముదల్‌వన్)
2. ప్రేమికుల రోజు (కాదలర్ దినం)
3. నరసింహ (పడయప్ప)
4. ప్రియురాలు పిలిచింది (కండుకొండేన్, కండుకొండేన్)
5. నీ మనసు నాకు తెలుసు (ఎనకు ఇరువదు, ఉనక్కుపదునెట్టు)
6. 7/జి బృందావన్ కాలనీ (7/జి రెయిన్‌బో కాలనీ)
7. పరవశం (పార్తాలె పరవసం)
8. జీన్స్
9. బాయ్స్
10. రన్

శివగణేష్ విడిగా రాసిన చిత్రాలు -

1. జి
2. కలిసుంటే
3. బాబా
4. కర్తవ్యం (కలా కండేన్)
5. ఉల్లాసం
6. అరుణాచలం

మొదలైనవి.

వీరిద్దరూ కలిసి రాసిన పాటలన్నీ తమిళ డబ్బింగులే. లిప్‌సింక్‌నూ యాక్షన్‌సింక్‌నూ పాటిస్తూ మూలాన్ని మక్కికి మక్కిగా అనుసరిస్తూ రాయడమే వీరి లక్ష్యం. వీరు రాసిన పాటల మాతృకల్లో యెక్కువగా వైరముత్తు రాసినవే గనుక - అద్భుతమైన పదగాంభీర్యంతో భావచిత్రాలతో రాసే ఆయన కంటె మేల్తరంగా తెలుగులో రాయడం కష్టమనీ, మాతృకల్లోని భావాలను అందంగా తెలుగులో అందించగలిగితే చాలనీ వీరి అభిప్రాయం.[1] పాటలకు

---

1. **శివగణేష్‌తో ముఖాముఖి 18-3-14**

పాండిత్యప్రకర్ష, సాహిత్య పరిమళం అవసరం లేదనీ, ప్రాచుర్యమే ముఖ్యమనీ వీరి దృక్పథం. ఈ జంట ఆలోచనావిధానానికి వీరు రాసిన పాటలు యెంత దగ్గరగా వున్నాయో పరిశీలించడానికి రెండు వుదాహరణలు చూద్దాం –

పల్లవి : నెల్లూరి నెరజాణ, నే కుంకుమల్లె మారిపోనా
నువ్వు స్నానమాడ పసుపులాగ నన్ను కొంచెం పూసుకోవె

ఆమె : ఒక కంట నీరొలక, పెదవెంట ఉసురొలక
నీవల్ల ఒకపరి జననం ఒకపరి మరణం అయినది
అరె, పారేటి సెలయేరు అల సంద్రాన కలిసినట్టు
గుండె నీ తోడుగా వెంటాడెనే
అరె, కాలం మరిచి అడవిచెట్టు పూచెనులే

చరణం–1

ఆమె : జొన్నకంకి దూరి పడినట్టు
కన్నులలో ధూళై తొలచితివే

అతను : తీగ వదిలొచ్చిన మల్లికవే
ఒకమారు నవ్వుతు బదులీవే...

ఆమె : పెదవిపై పెదవుంచి మాటలను జుర్రుకొని
వేళ్లతో ఒత్తిన మెడపై రగిలిన తాపమింక పోలేదు

అతను : అరె, మెరిసేటి అందం నీది, నీ అందాని కెదురేది?
నువ్వు తాకేచోట తీపెక్కులే
ఇక ఒళ్లు మొత్తం చెయ్యవలెను పుణ్యములే

చరణం–2

అతను : ఒక ఘడియ కౌగిలి బిగియించి
నావూపిరాపవే ఓ చెలియా

ఆమె : నీ గుండెలోగిలి నే చేర
నన్ను కొంచెం హత్తుకో చెలికాడా...

అతను : చినుకంటి చిరుమాట, వెలుగంటి ఆ చూపు
దేహమిక మట్టిలో కలిసిపోయే వరకు ఓర్చుకో...

**ఆమె : ప్రాణం నీ చెంత వుండంగ నువ్వు మరణించి పోవుటెలా?**
**అరె, నీజీవమే నేనే నయా**
**చంపదలచు మరణమైన మాయమయా...**

తెలుగు సినీప్రేక్షకులను, శ్రోతలను మంత్రముగ్ధులను చేసిన ఈ పాట 'ఒకే ఒక్కడు'లో శివగణేష్ – ఎ.యం. రత్నాల రచనే. అర్జున్ మనీషా కోయిరాలా జంటపై చిత్రీకరించిన ఈ యుగళగీతం తమిళమాతృకను రాసిన కవి వైరముత్తు. ఎ.ఆర్.రెహమాన్ సంగీతబాణీ, గాయనీ గాయకులు మహలక్ష్మి, హరిహరన్‌ల గళమాధుర్యం ఈ పాట కింత అసాధారణమైన ప్రాచుర్యాన్ని కలిగించాయి. 'నెల్లూరి నెరజాణ' అనే యెత్తుగడ తప్ప పాట పూర్తిగా అనువాద ధోరణిలో సాగినట్టు రచనను బట్టి తేటతెల్ల మవుతోంది. అవునో కాదో – తమిళ మాతృకను పల్లవి వరకు చూద్దాం–

**అతను : కురుక్కు సిరుత్తవళే ఎన్నై కుంగుమత్తిల్ కరచ్చవళే**
**నెంజిల్ మంజిల్ తేచ్చి కుళక్కయిల్ ఎన్నకొంజమ్ పూసుతాయే**
**ఉన్ కొలుసుక్కుళ్ మణియాగ ఎన్న కొంజమ్ మాత్తుతాయే**

**ఆమె : ఒరు కన్నిల్ నీర్ కసియ ఉదట్టు వళి ఉయిర్ కసియ**
**ఉన్నాలే సిలముఱై ఇరక్కమ్ సిలముఱై పిరక్కమ్ అనదే**
**అడ అత్తోడ పిళుంద ఎన్నయ్ అంద అత్తోడ పోవదు పోల్**
**నెంజి ఉన్నోడు దాన్ పిన్నోడుదే**
**అడ కాలమే మరందు కాట్టు మురముమ్ పూక్కిరదే**

ఈ పల్లవి ప్రారంభానికి మాత్రం 'సన్నని నడుముగల చిన్నదానా నీ కుంకుమలో నన్ను కరిగించిన దానా' అని అర్థం. ప్రేయసి స్పందనలో 'ఒక కన్ను నీట మునుగుతుంటే పెదవి గడపలో నిలిచి ప్రాణం వుసూరు మంటుంటే కొన్ని సార్లు పుడుతూ మరికొన్ని సార్లు గిడుతూ వున్నాను. వాగులో పడిన నన్ను ఆ వాగు లాక్కెళ్లినట్టు నా గుండె నీ వెనక చప్పుడు చేస్తోంది. నీ సన్నిధిలో నిత్యవసంతంలా అడవిచెట్లను పూలు పూయిస్తోంది' అనే హృద్యమైన భావన – తెలుగు పాటలో అంత స్పష్టమైన అన్వయంతో లేదు. అయినా గాన ప్రవాహంలో మైమరచిన శ్రోతలెవరూ దానిని పట్టించు కోలేదు.

2. '7/జి రెయిన్ బో కాలనీ' తమిళ చిత్రాన్ని తెలుగులో '7/జి బృందావన్ కాలనీ' గా డబ్ చేశారు. ఈ చిత్రంలో నాయికానాయకులు సోనియా అగర్వాల్, రవికృష్ణ.

సంగీత దర్శకత్వం యువన్ శంకర్ రాజా. రెండు భాషల్లోనూ విజయవంతమైన ఈ చిత్రంలో పాటలు కూడా ప్రజాదరణను పొందాయి. మూలంలో ప్రేమికుని విరహవేదనకు సంబంధించిన గీతాన్ని నా. ముత్తుకుమార్ రాయగా మన జంట యిలా తెలుగు చేశారు-

**తలచి తలచి చూస్తే తరలి దరికి వస్తా**
**నీకై నేను బ్రతికి వుంటినీ.. ఓ.. నీలో నన్ను చూసుకొంటినీ**
**తెరిచి చూసి చదువు వేళ కాలిపోయే లేఖ రాశా**
**నీకై నేను బ్రతికి వుంటినీ.. ఓ.. నీలో నన్ను చూసుకొంటినీ**

**కొలువు తీరు తరులనీడ చెప్పుకొనును**
**మన కథనిపుడు రాలిపోయిన పూలగంధమా**
**రాక తెలుపు మువ్వలసడిని తలచుకొనును దారులు**
**ఎపుడు పగిలిపోయిన గాజుల అందమా**
**అరచేతి వేడిని రేపే చెలియ చేయి నీ చేత**
**ఒడిలో కథలను చెప్పు రాసిపెట్టలేదు**
**తొలి స్వప్నం చాలులే ప్రియతమా కనులు తెరువుమా**

**మధురమైన మాటలు యెన్నో కలసిపోవు**
**ఈ పలుకులలో జగము కరుగు రూపే కరుగునా**
**చెరిగిపోని చూపులు అన్నీ రేయిపగలు నిలుచును నీలో**
**నీదు చూపు నన్ను మరచునా**
**వెంట వచ్చు నీడబింబం వచ్చి వచ్చి పోవూ**
**కళ్ల ముందు సాక్ష్యాలున్నా తిరిగి నేను వస్తా**
**ఒకసారి కాదురా ప్రియతమా ఎపుడు పిలిచినా...**

**(7/జి, బృందావన్ కాలనీ)**

తమిళ మాతృక-

నినైతు నినైతు పార్తాల్
నెరుంగి అరుంగిల్ వరువేన్
ఉన్నాల్ తానే నానే వాళ్ గిరేన్.. ఖా
ఉన్నిల్ ఇంద్రు లన్నై పార్కిరేన్

**ఇదుత్తు పడిత్తు ముడిక్కుమ్ మున్నే**
**ఎరియుమ్ కడిదమ్ ఉన్నకు కన్నే**
**ఉన్నిల్ తానే నానే వాళ్ గిరేన్... ఓ**
**ఉన్నిల్ ఇంద్రు ఎన్నై పార్కిరేన్**

'తలచి తలచి చూస్తే దగ్గరకు వస్తాను. నీవల్లే కదా బతికివున్నాను నీలో నేడు నన్ను చూసుకుంటున్నాను. తీసి చదివే లోపు కాలిపోయే లేఖనయి పోయాను. నీ వల్లనే కదా నేను బతికి వున్నాను..' అనే భావం గల పల్లవిని చూస్తే చాలు – ఈ పాట కూడా మూలాన్ని యథాతథంగా తెలుగు చేసిందేనని తెలుస్తుంది.

ఇలా ఈ జంట మాతృకలను గౌరవిస్తూ – వాటిని సాధ్యమైన మేరకు సామాన్యుడి భాషలో – తెలుగు వాళ్లకు అందించే ప్రయత్నం చేసినట్టు పైపాటలను బట్టి అర్థమవుతోంది. ఈ జంట రచయితల పేర్లు చెప్పగానే గుర్తొచ్చే మరికొన్ని మధురగీతాలు –

1. **అందాల రాక్షసివే గుండెల్లో గుచ్చావే**
   **మిఠాయి మాటలతో తూటాలు పేల్చావే.. (ఒకే ఒక్కడు)**
2. **పువ్వుల్లో దాగున్న పళ్లెంతో అతిశయం**
   **ఆ సీతాకోకచిలక ఒళ్లెంతో అతిశయం (జీన్స్)**
3. **నాపేరు నరసింహ ఇంటిపేరు రణసింహ**
   **యుద్ధ మంటు వచ్చిందంటే పంజావిప్పే నరసింహ (నరసింహ)**
4. **ప్రేమ అనే పరీక్షరాసి**
   **వేచివున్న విద్యార్థిని (ప్రేమికుల రోజు)**
5. **కనుల చూసేవి గురువా**
   **కనుల సొంతమగునా (జీన్స్)**

ఇన్ని 'హిట్స్' అందించిన శివగణేష్ – ఎ.యం.రత్నం జంట రచనల మీద కొన్ని విమర్శలు కూడా వున్నాయి.

1. 'ఒకే ఒక్కడు'లో 'ఉట్టిమీద కూడు ఉప్పుచేప తోడు...' అనే పాట చివరలో 'ఏటి గట్టుమీద తూనీగే పడదామా' అనే పంక్తి వినిపిస్తుంటే తెరమీద దృశ్యంలో తొండ కనిపిస్తుంది.

2. 'బాయ్స్'లో 'ప్రేమ ఇదితే అదితే అని అడుగునా?' అనేపాటలో 'కుళ్లిపోయిన మామిడిలో జతపురుగుల మౌదాం' అనే పంక్తి వెగటుగా వుందని విమర్శలకు గురయింది.

3. 'ఒకే ఒక్కడు'లో 'మగధీర ధీర ధీర..' పాటలో – 'మగధీర నన్నే చేకొనరా, నాపైట నెగరవేయ సమయమేదిరా?' అనే పంక్తిలో సరైన అన్వయం లేదు.

ఇలాంటి విమర్శలు వడ్లగింజల్లో బియ్యపు గింజలు. 'బాబా' తెలుగుపాటల్ని రికార్డింగ్ సమయంలో విన్న రజనీకాంత్ "తెలుగు యింత మధురంగా వుంటుందని మీ పాటలు వింటుంటే తెలుస్తోంది" అని శివగణేష్‌ను ప్రశంసించారట![2]

ఈ జంట పాటలకు వైరముత్తు మాతృకలు, ఎ.ఆర్.రెహమార్ సంగీతం – పెన్నిధులు. ఈ జంట రచనలను కొందరు విమర్శకులు చిన్నచూపు చూసినా – జనం గుండెలకు హత్తుకున్నారు. సినిమా పాటలకు ప్రజాదరణ కంటె కావలసిందేముంది?

❖

**2.** **'ఇండియా టుడే' 10-9-2002** సంచికలో 'మాటల మాంత్రికులు' వ్యాసం.

# మరి కొందరు

ఈ అధ్యాయంలో పేర్కొంటున్న మరికొందరు డబ్బింగ్‌కవులు కూడా తక్కువగా అంచనా వేయదగినవారు కాదు. ఎటొచ్చీ డబ్బింగ్ రంగంలో సంఖ్యాపరంగా తక్కువగా రాసినవారు, నేరుగా తీసిన చిత్రాల ప్రధాన స్రవంతిలో వుంటూ అనుషంగికంగా డబ్బింగ్ రచన చేసిన వారు, సంఖ్యాపరంగా చెప్పుకోదగిన చిత్రాలకే రాసినా అవి అపజయాల నెదుర్కోవడం వల్ల పేరుదక్కని గేయకవులు, మంచిపాటలు రాయగలిగిన ప్రతిభ వుండి కూడా అనారోగ్య, అకాల మృత్యువుల పాలయినవారు.. ఇలా వివిధ తరగతులకు చెందిన డబ్బింగ్ కవుల నీ విధంగా వర్గీకరించడం జరిగింది. ఈ వర్గంలో మరి కొంతమందిని చేర్చవలసివున్నా, వారి గురించి తగిన సమాచారం అందక, కొందరు సరిగా స్పందించక – ఆ పని చేయలేకపోయాను. ఇందులో యిస్తున్నవి రేఖామాత్ర పరిచయాలే గనుక, చదివించే గుణం కుంటువడుతుందనే భయంతో మూలాలను స్పృశించడం లేదు. ఈ కోవకు చెందిన డబ్బింగ్ కవుల గురించి సంక్షిప్తంగా తెలుసుకొందాం–

## బలిజేపల్లి లక్ష్మీకాంతం

(23-12-1881 - 30-6-1953)

గుంటూరు జిల్లా, బాపట్ల తాలూకా, ఇటికంపాడులో జన్మించారు. 'సత్య హరిశ్చంద్ర' నాటక కర్తగా సుప్రసిద్ధులు. 1930లో రంగూన్‌లో 'కవితా కళానిధి' బిరుదును, 1942లో చలనచిత్ర రంగం వారిచే సత్కారాన్ని, 'పుంభావ సరస్వతి' బిరుదును గ్రహించారు.

నేరుగా తీసిన తెలుగుచిత్రాల్లో తొలితరం కవి అయిన బలిజేపల్లి 'లవకుశ'తో చిత్రరంగ ప్రవేశం చేసి, 'వర విక్రయం' 'భూ కైలాస్', మళ్లీ పెళ్లి, బాలనాగమ్మ మొదలైన చిత్రాలకు రచన లందించారు. 'మళ్లీపెళ్లి' 'వరవిక్రయం' 'నాచెల్లెలు' మొదలైన చిత్రాల్లో నటించారు కూడా.

తమిళ మలయాళ భాషల నుంచి తెలుగులో 'డబ్' చేయబడిన మొదటి చిత్రాలకు బలిజేపల్లి మాటలూ పాటలూ రాయడం విశేషం. ఆ రెండు చిత్రాలు 'జీవితనౌక' (మలయాళం - 1951), సింగారి (తమిళం - 1952). ఆ తర్వాత ఆయన మరే యితర డబ్బింగ్‌చిత్రాలకు రచన చేయకపోవడానికి కారణం మృత్యువాత పడడమే. ఈ రెండు చిత్రాల్లోని పాటలను పరిశీలిస్తే - మలయాళ డబ్బింగ్ చిత్రం 'జీవితనౌక' లోని పాటలే ఆయనకు పేరు ప్రఖ్యాతులను తెచ్చిపెట్టాయి. ఆ చిత్రంలో పిల్లల మీద చిత్రీకరించిన మొదటి పాటను చూస్తే - బలిజేపల్లి శైలి అర్థమవుతుంది -

**నా నంద కిశోరా, వెన్న తిన రారా**
**ఆనంద శ్రీకృష్ణా, ఆగడమా?**
**మందల మేపవా - పాలిస్తా నా యన్న**
**మా కన్న పొన్నరీ, ఆగడమా?**
**కింకిణీమువ్వలు ఝుంకృతాల్ సేయగ**
**పంకజలోచనా, వేగరారా**
**పీలి తురాయెట్టి పూమాల చుట్టెదన్**
**నీలశ్యామాంగ, రా - వేగరార**
**అండ చరాచర కాండము దాల్చిన**
**కుండలిశయనా, నీవు వేగరార**

దీనికి భిన్నంగా 'సింగారి'లోని పాటలు డబ్బింగ్ వాసన నుంచి పూర్తిగా బయటపడకుండా సుదీర్ఘంగా వుండడం వల్ల అంతగా జనంలోకి వెళ్లలేదు.

## ఆచార్య ఆత్రేయ

(7-5-1921 - 13-9-1989)

ఆత్రేయ పరిచయం అవసరం లేని సినీకవుల్లో ఒకరు. అయినా, ఆయన అసలుపేరు కిళాంబి వేంకట నరసింహాచార్యులు అనీ, పేరులోని ఆచార్యను, గోత్రంలోని ఆత్రేయను కలిపి 'ఆచార్య ఆత్రేయ' అనే కలంపేరును పెట్టుకొన్నారనీ - చాలమందికి తెలియదు. ఆయన సినీరంగానికి రాకముందు ప్రసిద్ధ నాటకకర్త అనీ, విశ్వనాథ సత్యనారాయణ కూడా మెచ్చిన పద్యకవి అనీ - అందరికీ తెలియదు. ప్రపంచవ్యాప్తంగా ఏ కవీ రాయనన్ని మనసు పాటలు రాసి మన-సు-కవి గా ప్రసిద్ధులైనట్టు మాత్రం అన్ని వర్గాల సినీ ప్రేక్షకులకూ తెలుసు.

ఆత్రేయ 'దీక్ష' (1951) చిత్రంలోని – 'పోరా బాబూ పో, పోయి చూడు ఈ లోకం పోకడ' అనే గీతరచనతో సినీరంగంలో అడుగుపెట్టి నాలుగు దశాబ్దాల పాటు పరిశ్రమలో కొనసాగి – సుమారు 1400 పాటలు రాశారు. తేలికైన మాటల్లో బరువైన భావాలను పొదిగిన మాటలు – పాటలతో సామాన్యుడి గుండెతలుపును తట్టిన అక్షర యోగిగా– తెలుగు సినీగేయకవుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొన్నారు.

నేరుగా తీసిన తెలుగు చిత్రాలకే సకాలంలో రాయక నిర్మాతలను యేడిపించిన కవిగా పేరుపొందిన ఆత్రేయకు డబ్బింగ్ చిత్రాలకు రాసే సమయం లభించడం దుస్సాధ్యం. కాని పరిశ్రమకు వచ్చిన కొత్తలో జూపిటర్ పిక్చర్స్ వారి 'ఇన్‌స్పెక్టర్' (1952)తో ప్రారంభించి కన్నుమూసే వరకు సుమారు పదిహేను తమిళ డబ్బింగ్‌చిత్రాలకు మాత్రం పాటలు రాశారు. వాటిలో కొన్ని –

1. వీరప్రతిజ్ఞ –1967
2. ముళ్ల కిరీటం –1967
3. కోటీశ్వరుడు –1970
4. ఎర్ర గులాబీలు –1979
5. మౌన గీతం –1981
6. టిక్ టిక్ టిక్ –1982
7. ఈతరం ఇల్లాలు –1985
8. ఆత్మబంధువు –1986

ఏభైలలో రాసిన డబ్బింగ్ పాటలు ఆత్రేయకు అప్పటికి ఆ ప్రక్రియ మీద పట్టు లేనట్టుగా వున్నా, చివరి దశాబ్దంలో ఆయన అద్భుతమైన డబ్బింగ్‌పాటల్ని రాశారు. ముఖ్యంగా ఇళయరాజా సంగీత దర్శకత్వంలో ఆత్రేయ రాసిన పాటలు యిప్పటికీ యింటింటా వినిపిస్తున్నాయి. మచ్చుకి 'మౌనగీతం' (నెంజత్తై కిళ్లాదే – 1981) చిత్రంలో ఇళయరాజా సంగీత నిర్దేశకత్వంలో బాలు, జానకి ఆలపించిన మృదుమధురమైన గీతాన్ని చవిచూద్దాం –

**పల్లవి: అతను : పరువమా... చిలిపి పరుగు తీయకూ...**
**ఆమె : పరువమా... చిలిపి పరుగు తీయకూ**
**అతను : పరుగులో... పంతాలు పోవకూ**
**ఆమె : పరుగులో... పంతాలు పోవకూ**

అతను : పరువమా...

ఆమె : చిలిపి పరుగు తీయకూ

చరణం-1

అతను : ఏ ప్రేమకోసమో... చూసే చూపులూ
ఏ కౌగిలింతకో... చాచే చేతులూ

ఆమె : తీగలై... హ... చిరుపూవులై పూయా
గాలిలో... హ... రాగాలుగా మ్రోగ

బాలు : నీ గుండె వేగాలు తాళం వేయా... పరువమా...

ఆమె : చిలిపి పరుగు తీయకూ...

చరణం-2

ఆమె : ఏ గువ్వ గూటిలో స్వర్గం వున్నదో
ఏ చెట్టు నీడలో సౌఖ్యం వున్నదో

అతను : వెతికితే... హ... నీ మనసులో లేదా
దొరికితే... హ... జత కలుపుకో రాదా

ఆమె : అందాక... అందాన్ని ఆపే దెవరూ... పరువమా...

అతను : చిలిపి పరుగు తీయకూ...

పరువాన్ని పరుగులెత్తించి, యువతను పురకలెత్తించిన ఈ సమ్మోహనగీతం డబ్బింగ్‌లా వుందా? - ఉండక పోవడమే ఆత్రేయత్వం; ఆత్రేయ కలం సత్త్వం!

## బైరాగి

(5-9-1925 - 9-9-1978)

పూర్తిపేరు ఆలూరి బైరాగి చౌదరి. తెనాలిలోని ఐతానగర్‌లో రైతు కుటుంబంలో జన్మించారు. మార్మికత, ప్రతీక వాదం మేళవించిన భావకవిత్వాన్ని రాశారు. 'నూతిలో గొంతుకలు' బైరాగి ప్రసిద్ధకావ్యం. హిందీభాషలో వుండే ప్రావీణ్యంతో ప్రసిద్ధ చలనచిత్ర కథకులు అనువాదకులు చక్రపాణి దగ్గర కొంతకాలం సహాయకునిగానూ, హిందీ 'చందమామ' మాసపత్రికకు సంపాదకునిగాను పనిచేశారు. 'శ్రీకృష్ణలీలలు' (1956) డబ్బింగ్ చిత్రంతో ప్రారంభించి - అయిదారు డబ్బింగ్ చిత్రాలకు పాటలు రాశారు. ఆ చిత్రాలు -

1. టౌన్ బస్ (1957)
2. గొప్పింటి అమ్మాయి (1957)
3. అంతా పెద్దలే (1959)
4. కొత్తదారి (1960)

మొదలైనవి.

శివాజీ గణేశన్, పి.యస్. వీరప్ప, కె.ఏ. తంగవేలు, లలిత, ఎమ్. లక్ష్మీప్రభ మొదలైన తారాబలం గల 'అంతా పెద్దలే' చిత్రానికి బైరాగియే మాటలూ పాటలూ రాశారు. ఆ చిత్రంలోని గ్రామఫోన్ పాటను గమనిస్తే బైరాగి డబ్బింగ్ తీరు తెన్నులు తెలుస్తాయి.

**వినునారీ, మగవారీ దరిచేరేవూ**
**ఈ బ్రతుకంతా, ఒక సంతా, దగాపడి చెడేవూ**
**కొంతమందీ నిను చెంతజేరీ**
**పలుకూ తేనియలూ చిందునటులాడెదరే**
**నెయ్యమందీ - నిన్ను మోసగించీ**
**కడకూ చెప్పకనే చల్లగనూ జారెదరే**
**పసికూనా వలలోనా పడిపోయేవూ**
**ఈ బతుకంతా ఒకసంతా, దగాపడీ చెడేవూ**
**రాతి గుండె మగవారి దమ్మా**
**తమతో ముచ్చటగా మచ్చికలే చేయుదురే**
**పిట్టవచ్చి వల చిక్కినంతా**
**చక్కగ గొంతు తడిగుడ్డలతో కోయుదురే**
**వినవమ్మా, నెర నమ్మావలదే నీవూ**
**ఈ బ్రతుకంతా ఒకసంతా, దగాపడీ చెడేవూ** **(అంతా పెద్దలే-1959)**

ఇది ప్రబోధాత్మకమైన గ్రామఫోన్ రికార్డ్ గనుక 'లిప్‌సింక్' అవసరం లేక పోయినా, పాట పొడవునా వున్నదీర్ఘాలు బైరాగి మూలంలోని బాణీననుసరించిన తీరును తెలియజేస్తాయి.

# సముద్రాల ద్వయం

సముద్రాల సీనియర్, సముద్రాల జూనియర్ అనడం తప్ప – వారి పూర్తిపేర్లు చాలమందికి తెలియవు. సముద్రాల (సీ) పూర్తిపేరు సముద్రాల వేంకట రాఘవాచార్యులు. సముద్రాల (జూ) పూర్తిపేరు రామానుజాచార్య. 'జూ' అనే పదానికి వేరే అర్థం వస్తుంది గనుక ఆయనలా పిలిపించుకోడానికి యిష్టపడేవారు కాదు. రామానుజాచార్య రాఘవాచార్య జ్యేష్ఠపుత్రులు.

సముద్రాల వేంకట రాఘవాచార్యులు (19.7.1902 – 16.3.1968) గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పెదవులిపర్రు గ్రామంలో జన్మించారు. అవధాన విద్యతో ప్రారంభమైన సాహితీ వ్యాసంగంతో జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి, గూడవల్లి రామబ్రహ్మంలు పరిచయం కాగా ఆ క్రమంలో సినీరంగంలో అడుగుపెట్టిన సముద్రాల తెలుగు సినీసాహిత్యానికి కులపతిగా పరిగణింపబడ్డారు. నలభైలలో సినీ సాహిత్యసామ్రాజ్యాన్ని యేలిన సముద్రాల జీవితాంతం ఆ రంగంలో రాణించారు. చేతినిండా పనివుండి తీరికలేని సముద్రాలకు మల్లాది రామకృష్ణ శాస్త్రి నన్నయకు నారాయణభట్టులా సహకరించేవారని అనేవారు. అంతటి సినీ సాహిత్యసముద్రుడు పరాశక్తి (1957), స్త్రీ జీవితం (1962) చిత్రాలకు విడిగాను, 'విప్లవ స్త్రీ' (1961) చిత్రానికి కుమారునితో కలిసి డబ్బింగ్‌రచన చేయడం ఆశ్చర్యమే!

శివాజీ గణేశన్ హీరోగా నటించిన 'పరాశక్తి' చిత్రానికి తెలుగులో పాలగుమ్మి పద్మరాజు మాటలు, సముద్రాల పాటలు రాశారు. ఈ చిత్రంలో శంకరంబాడి సుందరాచారి రచన 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ'ను మొదటి పాటగా 'రీ షూట్' చేసి వినియోగించారు. ఇందులో ఆచార్యుల వారు రాసిన పాటలు 'డైరెక్ట్ టేక్' చిత్రానికి రాసినంత సహజమైన తెలుగు నుడికారంతో వున్నాయి. మచ్చుకి నాయిక మీద చిత్రీకరించిన జోలపాటను చూద్దాం –

**అందాలు చిందేటి చిలకా**<br>
**కెందామర పువ్వుల మొలకా**<br>
**చిరునవ్వుల వన్నెల తళుకా**<br>
**తొలినోముల పున్నెపు మొలకా**<br>
**కన్నా, కనువెలుగా! నిదుర పోవరా**

**మావలు మూవురున్నారు - నీ**
**గోములు చూడవస్తారు - నీ**
**బంగరు చెక్కిలి పైనా - కురి**
**పింతురు ముద్దుల వానా** ॥కన్నా॥

**కెంపుల ఉగ్గుగిన్నె - చిలుక**
**పచ్చల తూగుటుయ్యాల**
**తెల్లయేనుగ వాహనమూ - మామ**
**తెచ్చును కానుకగా, చిన్నమామ**
**యిచ్చును కానుక, నీకు** ॥కన్నా॥

**వెండి తాటాకులపైనా**
**వజ్రాల గంటముతోనూ**
**నును తెనుగుమాటలు వ్రాయ-నిను**
**కౌగిట చేర్చుకుంటారూ** ॥కన్నా॥

సముద్రాల రామానుజాచార్య (15.4.1923 – 1985) పేరు వినగానే 'బ్రతుకు తెరువు'లో ఆయన పాట 'అందమె ఆనందం, ఆనందమె జీవిత మకరందం' గుర్తొస్తుంది. ఘంటసాలకు ఆప్తమిత్రులు, ఎన్.టి.ఆర్.కు అభిమాన పాత్రులు అయిన సముద్రాల (జూనియర్) – సుమారు తొంభై చిత్రాలకు రచన చేశారు. మంచిమనసుకు మంచిరోజులు, కులదైవం, జయసింహ, పాండురంగ మహాత్మ్యం, బొబ్బిలి యుద్ధం మొదలైన చిత్రాల్లో కలకాలం గుర్తుండే పాటలను రాశారు. ఈయన కూడా నాలుగైదు డబ్బింగ్ చిత్రాలకు రచన చేశారు అవి –

వేగుచుక్క (1957)
భూలోక రంభ (1958)
మహిషాసుర మర్దని (1959)
వీరపాండ్య కట్టబ్రహ్మన (1959) మొదలైనవి.

వీటిలో రాజకుమార్, నాగయ్య, రాజనాల, ఉదయకుమార్, జానకి, సంధ్య ప్రభృతులు నటించిన 'మహిషాసుర మర్దని' కన్నడ డబ్బింగ్‌చిత్రం సముద్రాల (జూనియర్) ఖ్యాతి నినుమడింప జేసింది. చిత్రంలో గుణవతీమహిషుల యుగళ గీతం సముద్రాల

(జూనియర్) శైలినీ, ధారనూ – తెలియజేస్తుంది.

ఆమె : నందనవనమీ సుందరజగమే
అందము చిందే వలపు చందము నాదే, ఆ విందులు నావే
అతను : పున్నమి చందురు సోయగమూ
కన్నుల జూచీ కైరవమూ
విరిసేనది యేలా తెలుపవె బాలా
ఆమె : ఉదయించే రవిరాగ మొలికే తామర చెలికీ
కితకితలా వింతలూ చేయునదీ యేలనో ॥నందన॥
అతను : మలపై వెలసిన సెలయేరూ
గలగల నీరధి దరిజేరూ
పరుగుల తెరగేమో – ఆ పాటలవేమో
ఆమె : తుమ్మెదలూ పూలబాల చేరీ తేనెల గ్రోలీ
భ్రమియించే నెందుకో – సెలయేరు అందుకే
అతను : కనులను ప్రియులను కనగానే
పెనగొను మమతలు మదిలోనే
అదియే జీవనమూ, మానవ జీవనమూ
ఆమె : జగమెల్ల వలపుపూలతోట, తేనియపాట
అతి ప్రేమసుందరం – ఆనంద మందిరం
నందనవనమీ సుందర జగమే
అందము చిందే వలపు చందము – మాదే, ఈ విందులు మావె

తెలుగు సినీగేయసాహిత్యంలో రెండు సముద్రాల వంటి సముద్రాల ద్వయం కూడా డబ్బింగ్ రచన చెయ్యడం – ఆ రంగం అదృష్టం. అలాంటి ప్రతిభామూర్తులను యెక్కువగా వుపయోగించుకోక పోవడం ఆ రంగం దురదృష్టం!

## వడ్డాది

వడ్డాది పేరు చెప్పగానే 'చల్లని రాజా ఓ చందమామా, నీ కథలన్ని తెలిశాయి, ఓ చందమామ నా చందమామ' అనే 'ఇలవేలుపు'లో పాట గురొస్తుంది. సుసర్ల దక్షిణామూర్తి సంగీత దర్శకత్వంలో లీల, సుశీల, రఘునాథ పాణిగ్రాహి పాడిన ఈ పాట నాటికీ నేటికీ చందమామ పాటల్లో వాడని చామంతియే! దీనితోపాటు 'అన్నా అన్నా విన్నావా,

చిన్ని కృష్ణుడు వచ్చాడు..!' అనే ఇలవేలుపు లోని మరోపాట కూడా వడ్డాది రాసిందే. ఈ రెండు పాటలు తప్ప నేరుగా తీసిన తెలుగు చిత్రాల్లో వడ్డాది యింకా ఏయే పాటలు రాశారో యెవరికీ గుర్తు లేవు.

ఆ మాటకొస్తే యాభైలలో విజయనగరం నుంచి సినిమాల్లో రచన చేసే అవకాశాలు కోసం మద్రాసు వచ్చిన వడ్డాది పూర్తిపేరు బుచ్చి కూర్మనాథం అని తెలిసిన వాళ్లు తక్కువ. ఆయన అరవైలలో పదిపన్నెండు డబ్బింగ్ చిత్రాలకు పాటలు రాసినట్టు మాత్రం తెలిసిన వాళ్లెందరు? ఆ డబ్బింగ్ చిత్రాలు –

కాలాంతకుడు (1960)

బాగ్దాద్ గజదొంగ (1960)

పాపాల భైరవుడు (1961)

హంతకుడెవరు (1964)

మారని మనసులు (1965)

కత్తిపోటు (కన్నడం) (1966)

మా అన్నయ్య (1966)

అంతులేని హంతకుడు (1968)

దెబ్బకు దెబ్బ (1968)

మేమే మొనగాళ్లం (1971)

డబ్బింగ్ చిత్రాల్లోని వడ్డాది పాటలు అంతగా ప్రాచుర్యం పొందకపోయినా – వాటిలో కూడా ఆయన పద సౌకుమార్యం తగ్గ లేదనడానికి ఓ వుదాహరణం –

**పల్లవి:** **చిన్నారి నవ్వులు సన్నజాజి పువ్వులు**
**విరితేనె తేటలు మురిపించు మాటలు**

**చరణం-1**

**అందాల మేన చిందేను రాగం**
**మఱపించి మదిని అందించు సౌఖ్యం ॥చిన్నారి॥**

ఈ చిన్న దాని అనురాగం కోసం
చూపేరు శౌర్యం చేశారు త్యాగం ॥చిన్నారి॥

**చరణం-2**

**అందంగ ఆడుదాం మధురంగ పాడుదాం**
**ఆనందముగ ఈ జగమెల్ల ఏలుదాం**
**ఉయ్యాల లూగుదాం గగనంలో తేలుదాం**
**సొగసరి వీరుల హృదయాలే దోచుదాం ॥చిన్నారి॥**

ప్రసన్నమైన శైలిలో సాగిన ఈ పాట - వైజయంతి మాల, ఎం.ఎన్.రాజం, ఎం.జి.రామచంద్రన్, నంబియార్ మొదలైన వారు నటించిన 'బాగ్దాద్ గజదొంగ' చిత్రంలోనిది. పాలగుమ్మి పద్మరాజు మాటలు రాసిన ఈ చిత్రంలోని పాటలన్నీ వడ్డాదే రాశారు.

## డా. సి.నారాయణరెడ్డి

తెలుగు సినీగేయకవులలో సి.నారాయణరెడ్డిది విశిష్టస్థానం. ఒకపక్క విద్యా రంగంలో అనేక వున్నత పదవులను నిర్వహిస్తూ, మరోపక్క సినీగేయరచనను ఆనుషంగిక ప్రవృత్తిగా చేపట్టి, చిత్రరంగంలోని వుద్దండులైన వృత్తికవులకు దీటుగా సినిమా పాటలు రాసిన విద్యాసంపన్నులైన ఏకైకకవి జ్ఞానపీఠ పురస్కారగ్రహీత సి.నారాయణ రెడ్డి.

కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకాలోని హనుమాజిపేట సి.నా.రె. జన్మస్థలం. శ్రీమతి సింగిరెడ్డి బుచ్చమ్మ, మల్లారెడ్డి దంపతులకు 29.7.1931న జన్మించిన సి.నా.రె. అసలు పేరు సింగిరెడ్డి సత్యనారాయణరెడ్డి. ప్రాథమిక పాఠశాలలో గురువు పొరపాటున సత్యాన్ని మరవడం వల్ల నారాయణరెడ్డిగా మిగిలి అదే పేరుతో సుప్రసిద్ధులయ్యారు. 1954-55 ఆంధ్రోపన్యాసకునిగా హైదరాబాద్‌లో వుద్యోగపర్వాన్ని ప్రారంభించిన సి.నా.రె. కర్పూర వసంత రాయలు, నాగార్జున సాగరం, విశ్వనాథ నాయుడు గేయకథాకావ్యాల ద్వారా సినిమా వారి దృష్టి నాకర్షించి, ఎన్.టి.ఆర్. ఆహ్వానం మీద 'గులేబకావళి కథ' (1962) చిత్రానికి పాటలు (సింగిల్ కార్డ్) రాయడం ద్వారా సినిమా రంగంలో అడుగు పెట్టారు. 60, 70ల దశకాలలో పుంఖానుపుంఖాలుగా పాటలు రాసిన సి.నా.రె. స్ట్రెయిట్ చిత్రాలకు సుమారు 3 వేల పాటలను రాశారు.

యస్.వి.భుజంగరాయ శర్మ 'రంగులరాట్నం' చిత్రానికి, గుంటూరు శేషేంద్రశర్మ 'ముత్యాల ముగ్గు' చిత్రానికి ఒక్కొక్క పాట రాయడం ద్వారా ప్రసిద్ధులైనట్టు - సి.నా.రె. 'కర్ణ' (1964) డబ్బింగ్ చిత్రానికి రాసిన ఒక్క పాట (అన్ని పాటలూ ఆయనే రాశారు) ఆయనకు విశేషఖ్యాతిని తెచ్చింది. పి. సుశీల మనోహరంగా ఆలపించిన ఆపాట యిది-

**గాలికి కులమేది, గాలికి కులమేది?**
**ఏదీ నేలకు కులమేదీ? గాలికి కులమేది?**
**మింటికి మరుగేది ఏది? మింటికి మరుగేది ఏది?**
**కాంతికి నెలవేది? ॥గాలికి॥**

**పాలకు ఒకటే... పాలకు ఒకటే తెలివర్ణం**
**ఏది ప్రతిభకు కలదా స్థలభేదం**
**వీరుల కెందుకు కులభేదం**
**అది మనసుల చీల్చేడు మతభేదం ॥గాలికి॥**

**జగమున యశమే.. జగమున యశమే మిగులునులే**
**అది యుగములకైనా చెదరదులే**
**దైవం నీలో నిలుచునులే**
**ధర్మం నీతో నడుచునులే, ధర్మం నీతో నడుచునులే ॥గాలికి॥**

బి.ఆర్. పంతులు నిర్మించిన తమిళచిత్రం 'కర్ణన్' ను తెలుగులో 'కర్ణ'గా డబ్ చేశారు. దానిలో శివాజీ గణేశన్ కర్ణుడి పాత్రను, యన్.టి. రామారావు శ్రీకృష్ణుని పాత్రను ధరించారు. విశ్వనాధన్-రామమూర్తి ఆ చిత్ర సంగీత దర్శకులు. వీరులకు కులంతో సంబంధం లేదని అతణ్ని అతని భార్య ఓదార్చే సందర్భానికి కణ్ణదాసన్ రాసిన పాటను సి.నా.రె. పైవిధంగా తెనిగించారు. 'కణ్ణుక్కు కులమేదు'.. అంటూ కణ్ణదాసన్ పాటను ప్రారంభించారు. దానిని 'కంటికి కులమేది' అనడానికి బదులుగా 'గాలికి కులమేది?' అని ప్రారంభించడంతో సి.నా.రె.ను అందరూ ప్రశంసలతో ముంచెత్తారు. తెలుగు డబ్బింగ్ పాటల ప్రసక్తి వచ్చినపుడల్లా విమర్శకులు ఈ పాటను ఉత్తమోదాహరణంగా వుటంకిస్తుంటారు.

# గోపి

(15-8-1949 - 8-9-1996)

గోపి పూర్తిపేరు మైలవరపు లక్ష్మీగోపాల కృష్ణమూర్తి. కొంతమందికి మైలవరపు గోపిగా మాత్రం తెలుసు. కృష్ణా జిల్లా కూచిపూడి పక్కన యద్దనపూడిలో పుట్టిన గోపి మొదట్లో నటుడు. పినిశెట్టి రచించిన 'పల్లెపడుచు' నాటకాన్ని సుమారు వెయ్యిసార్లు ప్రదర్శించి, అందులో 'గోపి' పాత్రను ధరించడం వల్ల గోపిగా ప్రసిద్ధులయ్యారు. నటుడు కావాలనే ఆశతో సినీరంగంలో అడుగుపెట్టిన గోపి అనుకోకుండా గేయరచయితగా స్థిరపడ్డారు. సావిత్రి దర్శకత్వంలో వచ్చిన 'చిరంజీవి'లో మొదటి పాట రాసిన గోపి, నటుడు నిర్మాత ప్రభాకరరెడ్డి ప్రోత్సాహంతో చిత్రరంగంలో నిలదొక్కుకున్నారు. నేరుగా తీసిన చిత్రాలకు, డబ్బింగ్ చిత్రాలకు కలిపి సుమారు 400 పాటలు రాశారు.

మట్టిలో మాణిక్యం, పండంటి కాపురం, గాంధిపుట్టిన దేశం, అమెరికా అమ్మాయి, కార్తిక దీపం, గృహప్రవేశం మొదలైన చిత్రాల్లో గోపి రాసిన పాటలు వినని వాళ్లుండరు. నేరుగా తీసిన చిత్రాల్లో గోపి తాత్త్వికతకు, మానవీయ సంబంధాలకు చెందిన పాటల్ని యెక్కువగా రాశారు. ఎనభైలదశకం వరకు నేరుగా తీసిన చిత్రాలకు మాత్రమే మాటలూ పాటలూ రాసిన గోపి చివరి పదేళ్లలో సుమారు 40 డబ్బింగ్ చిత్రాలకు కూడా వందకు పైగా పాటల్ని రాశారు. ఆయన తర్జుమా చేసిన చిత్రాల్లో నాలుగుభాషలకు సంబంధించినవీ వున్నాయి. గోపి డబ్బింగ్ చిత్రాల్లో కొన్ని -

1. శ్రీమంత్రాలయ రాఘవేంద్రస్వామి మహత్యం - 1979 (కన్నడ)
2. వసంత కోకిల - 1982 (తమిళం)
3. అఖండ సౌభాగ్యవతి - 1983 (హిందీ)
4. దిగివచ్చిన దేవుడు - 1983 (మలయాళం)
5. ప్రేమ సంగమం - 1984 (తమిళం)
6. అమ్మా, నన్ను దీవించు - 1985 (తమిళం)
7. అనురాగ సంగమం - 1986 (తమిళం)
8. ప్రేమికులారా, వర్ధిల్లండి - 1986 (తమిళం)

బాలు మహేంద్ర దర్శకత్వంలో శ్రీదేవి కమలహాసన్ నాయికానాయకులుగా నటించిన 'వసంతకోకిల' చిత్రంలో గోపి రాసిన అయిదు పాటల నుంచి ఓ పాటను

గుర్తు చేసుకుందాం. దీనిని ఇళయరాజా సంగీత దర్శకత్వంలో బాలు పాడారు –

**పల్లవి: కథగా కల్పనగా కనిపించెను నా కొక దొరసానీ (2)**
**నా మదిలోని పాటగా ఆమని విరిసే తోటగా**
**లాలీలాలో జో... లాలీలో ॥కథగా॥**

**చరణం–1**
**మోసం తెలియని లోకం మనదీ**
**తీయగ సాగే రాగం మనదీ**
**ఎందుకు కలిపాడో.. బొమ్మలను నడిపే వాడెవడో**
**నీకూనాకూ సరిజోడనీ.. కలలోనైన విడరాదనీ ॥కథగా॥**

**చరణం–2**
**కారడవులలో కనిపించావూ**
**నా మనసేమో కదిలించావూ**
**గుడిలో పూజారై.. నా హృదయం నీకై పరిచాను**
**ఈ అనుబంధమేజన్మదీ?... ఉంటే చాలు నీ సన్నిధి ॥కథగా॥**

ఇలా వూరించే పాటలతో తన ప్రతిభను నిరూపించుకొన్న గోపి 1990లో అనారోగ్యం పాలయి, రచనా వ్యాసంగానికి స్వస్తిచెప్పి 1996లో తీయని జీవితం అతిస్వల్పమనే తన మొదటి పాటను గుర్తుచేస్తూ అకాలమరణం చెందారు.

## గోనె విజయరత్నం

**తనువా.. ఉహు.. హరిచందనమే**
**పలుకా.. ఉహు.. మకరందమే**

అనే 'కథానాయకురాలు' చిత్రంలోని పాటంటే చెవికోసుకోని తెలుగువాడుండడు. కాని అది గోనె విజయరత్నం రచన అంటే చాలమందికి నమ్మకం చాలదు. నెల్లూరుజిల్లా గూడూరు దగ్గర ఓ కుగ్రామం విజయరత్నం జన్మస్థలం. 1970 నుంచి 94 వరకు చిత్ర పరిశ్రమలో నిలబడి – పేదరాశి పెద్దమ్మ కథ, కథానాయకురాలు, పంజరంలో పసిపాప, పల్లెటూరి చిన్నోడు మొదలైన స్ట్రెయిట్ సినిమాలకు పాటలు రాసిన విజయరత్నం తన జీవితకాలం లోని చివరి పదేళ్లలో కొన్ని డబ్బింగ్ చిత్రాలకు కూడా రచన చేశారు. వాటిలో కొన్ని –

రాజా – యువరాజా (1986)

కాళీచరణ్ (1989)

నువ్వే నామొగుడు (1989)

పట్నం వచ్చిన మొనగాడు (1990)

ప్రజా ప్రతిఘటన (1990)

వేదాగ్ని (1991)

రేపటి వార్త (1993)

వేదాగ్ని (1991)

భైరవకోన (1994)

డబ్బింగ్ పాటల్లో విజయరత్నానికి గుర్తింపు తెచ్చినవి తక్కువయినా – అంతకు ముందు కొన్ని నేరుగా తెలుగులో తీసిన చిత్రాల్లో కణ్ణదాసన్ వంటి తమిళ కవుల స్ఫూర్తితో రాసిన పాటలు జనశ్రుతిలో వున్నాయి.

ఉదాహరణకు 'తీస్రీ మంజిల్' హిందీచిత్రం ఆధారంగా తెలుగులో 'నిండు మనసులు', తమిళంలో 'కుడి ఇరుంద కోవిల్' తీశారు. బి. సరోజ, యం.జి. రామచంద్రన్ నాయికానాయకులుగా నటించిన తమిళచిత్రంలో కణ్ణదాసన్ రచన –

**కుమరిప్పెణ్ణిన్ ఉళ్లత్తిలే**
**కుడి ఇరుక్కనాన్ వరవేణ్డుం**
**కుడి ఇరుక్కనాన్ వరవదెన్రాల్**
**వాడగై ఎన్న తరవేణ్డుం**

(నాకు కన్నెపిల్ల మనసులో కాపురముండాలని వుంది. అందుకు అద్దె యెంత చెల్లించాలి?)

స్ఫూర్తితో యస్.పి. కోదండపాణి సంగీత సారథ్యంలో 'జెగజ్జెంత్రీలు' చిత్రంలో విజయరత్నం యిలా రాశారు –

**నీ మనసులోకి రావాలి కాపురానికి**
**అద్దె యెంత యివ్వాలి మాసానికి?**

మా'సానికి' అనే పదంలో శ్లేష గమనార్హం. 1994లో విజయరత్నం పాము కాటుతో మృత్యువాత పడ్డట్టు సమాచారం!

## సిరివెన్నెల సీతారామశాస్త్రి

'సిరివెన్నెల' సీతారామశాస్త్రి పాటలు రాసిన మొదటి చిత్రం పేరనీ – ఆయన యింటిపేరు 'చేంబోలు' అనీ చాల మందికి తెలియదు. 20.5.55న మధ్యప్రదేశ్‌లోని 'శివని' లో జన్మించిన శాస్త్రి బాల్యం, విద్యాభ్యాసం అనకాపల్లిలో గడిచాయి. బహుభాషా పరిచయమున్న తండ్రి సి.వి.యోగి. సీతారామశాస్త్రి ప్రథమగురువు.

సినీరంగ ప్రవేశానికి ముందు శాస్త్రి కలంపేరు భరణి. కొలువు టెలిఫోన్స్. 1980లో 'శంకరాభరణం' చిత్ర విజయోత్సవం సందర్భంగా రాసిన 'గంగావతరణం' గేయం ఆలస్యంగా ఆ చిత్రదర్శకులు కె. విశ్వనాథ్ చెవినిపడి, ఆయన మెప్పు పొంది 'జననీ జన్మభూమి' (1983) చిత్రంలో చోటు చేసుకొంది. అలా విశ్వనాథ్‌కి పరిచయమైన శాస్త్రికి 'సిరివెన్నెల' చిత్రంలో 'సింగిల్ కార్డ్' రాసే అవకాశం లభించి, అవన్నీ 'హిట్' కావడంతో – సిరివెన్నెల సీతారామశాస్త్రిగా ఆయన ప్రసిద్ధులయ్యారు. ఈ మూడు దశాబ్దాలలో ఆయన సినీగేయప్రస్థానం గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. తెలుగు సినీగేయకవులలో అత్యధిక సంఖ్యలో 12 నందిపురస్కారాలను అందుకొన్న ఏకైకకవి సిరివెన్నెల సీతారామశాస్త్రి. మనిషిని పట్టాలు తప్పకుండా నడిపించడానికి సినిమా మాధ్యమాన్ని వుపయోగించాలనే నిరంతర తపనతో శుచిగా రుచిగా ఆయన గేయరచన చేస్తున్నారు.

డబ్బింగ్‌చిత్రాలకు పాటలు రాయడం ఆయనకు ఆనుషంగికమే. డబ్బింగ్‌లో మూలంలోని అభివ్యక్తుల వల్ల స్ఫూర్తి పొంది అంతకంటె భిన్నమైన ప్రయోగాలు చేస్తారు. భావస్వేచ్ఛకు అధిక ప్రాధాన్యం యిచ్చిన శాస్త్రి 'క్లోజ్' అయితే తప్ప 'లిప్ సింక్' కోసం వెంపర్లాడ లేదు. కథ, చిత్రీకరణ, పాత్రస్వభావం – ఈ మూడింటిని దృష్టిలో పెట్టుకొని మాత్రమే ఆయన డబ్బింగ్ పాటలు రాశారు.[1] ఆయన పాటలు రాసిన సుమారు పాతిక డబ్బింగ్ చిత్రాలలో కొన్ని –

---

**1. సీతారామశాస్త్రితో ముఖాముఖి – 5.6.13**

1. ఆశ.. ఆశ.. ఆశ
2. ఇందిర
3. కుర్రాడు బాబోయ్
4. మహారాణి
5. ప్రేమ కావ్యం
6. ప్రేమతో (హిందీలో 'దిల్‌సే')
7. రంగేళి (హిందీలో 'రంగీలా')
8. సత్య
9. స్నేహితుడు
10. తూర్పు సిందూరం

సీతారామశాస్త్రి 'స్ట్రెయిట్' సినిమాలకు రాసినంత అంకితభావంతో డబ్బింగ్‌చిత్రాలకూ రచన చేస్తారనడానికి డబ్బింగ్ పాటల నుంచి ఓ మచ్చు తునక -

**లాలి లాలి అనురాగం సాగుతుంటే ఎవరూ నిదరపోరే**
**చిన్నపోదా మరి చిన్నిప్రాణం**

**ఎటో పోయేటి నీలిమేఘం**
**వర్షం చిలికి వెళ్లదా**
**ఏదో అంటుంది కోయిల పాట**
**రాగం ఆలకించరా**

**అన్ని వైపుల మధువనం**
**పూలు పూయదా అనుక్షణం**
**అణువణువునా జీవితం**
**అందచెయ్యదా అమృతం**

**కాసే వెన్నెలకు వీచే గాలులకు హృదయం కుదుటపడదే**
**అంత చేదా మరి వేణుగానం**
**కళ్లు మేలుకొంటే కాల మాగుతుందా భారమైన మనసా**
**ఆ...ఆ... పగటి బాధలన్నీ మరిచిపోవుటకు వుంది కదా ఏకాంత వేళ!**

**(ఇందిర-1995)**

కక్షలూ కార్పణ్యాలూ రగిలే గ్రామంలో ప్రశాంతతను కోరే ఓ చిన్నారి మీద చిత్రీకరించిన ఈపాట మణిరత్నం నిర్మాతగా, సుహాసిని దర్శకురాలిగా తీసిన 'ఇందిర'లోనిది. అనుహాసన్ (చంద్రహాసన్ కుమార్తె), అరవింద స్వామి నటించిన ఈ చిత్రానికి సంగీతం ఎ.ఆర్.రెహమాన్. పై గీతం మాతృకరచన వాలి కాగా – గాయని హరిణి. ఇది యెంత లలితంగా, హాయిగా వుందో వేరే చెప్పాలా?

## భారతీబాబు

అసలుపేరు పి. ఆదిబాబు. మాతృవియోగం వల్ల కలిగిన దుఃఖంలో 'భారతీబాబు' గా మార్చుకొన్నారు 19.12.1965న విశాఖ జిల్లా, యలమంచిలి తాలూకా 'రాంబిల్లి'లో పుట్టిన భారతీబాబు తూ॥గో॥జిల్లా 'ద్రాక్షారామం'లో పెరిగారు. అక్కడ సినిమా వాతావరణం వున్న కుటుంబనేపథ్యం ఆ రంగం పట్ల ఆసక్తిని కలిగించింది.

1993లో రజనీకాంత్ హీరోగా నటించిన 'సీక్రెట్ పోలీస్' డబ్బింగ్‌చిత్రంలో హీరోని పరిచయం చేసే పాట రాయడంతో సినీ గేయరచయితగా తొలి అడుగువేశారు. ఆ తర్వాత 'బంగారుపాప' (1994) చిత్రానికి సింగిల్ కార్డ్ రాసే అవకాశం వచ్చింది. 'అధినేత' (1995) చిత్రానికి మాటలూ పాటలూ కూడా రాసే అవకాశం రావడంతో డబ్బింగ్ రంగంలో పూర్తిగా కాళ్లూనారు. 2003లో మద్రాసు నుంచి హైదరాబాద్‌కి మకాం మార్చారు. ఇప్పటికి సుమారు 1400 డబ్బింగ్ పాటలు రాశారు 100వ చిత్రం 'రక్తకన్నీరు' (2004) ఆడియో ఫంక్షన్‌లో 'సాహిత్య భారతి' బిరుదు ప్రదానంతో సత్కరింపబడ్డారు. 'బాబీ', 'శ్లోకం' 'గురి' మొదలైన తెలుగులో నేరుగా తీసిన చిత్రాలకు కూడా పాటలు రాశారు. డబ్బింగ్ అంటే పేపర్ మీద కాదు – పెదవుల మీద రాసేది అని నమ్మే భారతీబాబు రచన అందించిన కొన్ని డబ్బింగ్ చిత్రాలు –

లక్ష్యం – 1993
రౌడీ రాజ్యం – 1994
కాలేజ్ గేట్ – 1996
కెప్టెన్ భరత్ – 1997
కలసిపోదాం, రా – 2000
నరసింహుడు – 2001
ప్రేమ సంగమం – 2006

తేనె టీగలు - 2007
వీధి రౌడీ - 2008
స్నేహం - 2010

## పొందూరి

పూర్తిపేరు పొందూరి హనుమంతరావు. గుంటూరు జిల్లా వెల్లటూరులో జన్మించారు. తెనాలిలో 'భాషాప్రవీణ' చదివారు. అప్పుడు శ్రీమతి నందమూరి లక్ష్మీపార్వతి అతని సహాధ్యాయిని. తెలుగుతో పాటు సంస్కృత భాషలో కూడా ప్రావీణ్యం వుంది.

సినిమాల మీద ఆసక్తితో తొంభైలలో మద్రాసు చేరారు. కొంతకాలం సినీరచయిత తోటపల్లి మధు దగ్గర సహాయకునిగా పనిచేశారు. బుల్లితెరకు సాయిబాబాపై ఆయన రూపొందించిన ధారావాహికను చూసి నాగార్జున ప్రధాన పాత్రలో నటించిన 'శ్రీషిర్డిసాయిబాబా' చిత్రానికి దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు ఆయన కథాసహకారాన్ని తీసుకొన్నారు.

సంఖ్యాపరంగా తెలుగులో యెక్కువ డబ్బింగ్ చిత్రాలకు రచన చేసిన నలుగురైదుగురులో పొందూరి ఒకరు.

ఆయన కొన్ని డబ్బింగ్ చిత్రాలకు మాటలూ పాటలూ కూడా రాశారు రాజశేఖరరెడ్డి మాటలురాసిన చిత్రాల కెక్కువ పాటలు రాశారు. పొందూరి రాసిన 150 పైగా డబ్బింగ్ చిత్రాలలో కొన్ని -

సి.బి.ఐ. ఆఫీసర్ - 1995
లేడీ కమీషనర్ - 1995
రిపోర్టర్ - 1996
రాజ దర్బార్ - 1997
ప్రతిఘటన - 1999
మహాత్మ - 1999
ఇండియన్ పోలీస్ - 2000
పోలీసు కర్తవ్యం - 2003
పోలీస్ అంటే వీడేరా - 2007
మృగం - 2008

మదనుడు - 2010

పొందూరి 2014 సెప్టెంబరులో అకాలమృత్యువు పాలయ్యారు.

## గురుచరణ్

గురుచరణ్ పేరు చాలమందికి గుర్తుండక పోవచ్చు కాని -

**ముద్దబంతి నవ్వులో మూగబాసలూ**
**మూసిమున్న రెప్పలపై ప్రేమలేఖలూ... (అల్లుడుగారు-1990)**

అంటూ ఆత్రేయను తలపించే ఆయన పాట విననివాళ్లు, గుర్తుండనివాళ్లు వుండరు. గురుచరణ్ అసలు పేరు మానాపురం రాజేంద్ర ప్రసాద్. 21.4.48న 'హనుమాన్ జంక్షన్'లో జన్మించారు. తల్లిదండ్రులు శ్రీమతి ఎమ్.ఆర్. తిలకం, మానాపురం అప్పారావు. కుటుంబనేపథ్యం వల్ల చిన్ననాటి నుంచీ సినిమావాసన వుంది. ఎమ్.ఏ (తెలుగు) చదివిన గురుచరణ్ నటుడు, నిర్మాత మోహన్‌బాబు స్ట్రెయిట్ చిత్రాలకు యెక్కువ పాటలు రాశారు. ఆయన పాటలు రాసిన కొన్ని డబ్బింగ్ చిత్రాలు -

1. మామకు యముడు (అర్జున్ - గౌతమి)
2. రాజా - చిన్నిరోజా (రజనీకాంత్ - గౌతమి)
3. ఘరానా కూలీ (రజనీకాంత్ - రోజా)
4. సైన్యం (మమ్ముట్టి - నగ్మా)
5. కొండవీటి సింహం (అమితాబ్ బచన్ - శ్రీదేవి)
6. రాజముద్ర (అరుణ్‌పాండ్యన్ - రోజా)
7. పోలీస్ ఎఫ్.ఐ.ఆర్. (విజయకాంత్ - జీవిత)
8. మౌర్య (ధనుష్...)

20కు పైగా చిత్రాల్లో 50 వరకు డబ్బింగ్ పాటలు రాశారు. కొన్నిటికి మాటలు పాటలు కూడా రాశారు. 'మోహన్‌లాల్' నటించిన మలయాళ డబ్బింగ్ చిత్రం 'బ్రహ్మరుద్రుడు'లో బాలు పాడిన పాట గురుచరణ్ డబ్బింగ్ పాటలకు మచ్చుతునక -

**ఓ లాలీ పాపాయికి, ఈ యింటి దీపానికి**
**ఏ నాటికీ కనుపాపలా నిను చూసుకొంటాను**
**ఎద దాచుకొంటాను..**

ఈ పాటను తెలుగు సినీప్రియులు యెదల దాచుకొన్నారు.

## డి. నారాయణవర్మ

(1-5-47 - 5-10-2005)

తూ॥గో॥జిల్లా రామవరం స్వగ్రామం. దంతులూరి వర్మ అనే పేరుతో కూడా పాటలు రాశారు. కొంత కాలం 'జ్యోతిచిత్ర', 'విజయచిత్ర' పత్రికలలో పనిచేశారు. 'పోలీసు భార్య' (1990) చిత్రంలో రాసిన 'వయ్యారి దొరసాని..' అనేది మొదటి పాట. 'బావ-బావమరిది' చిత్రానికి రాసిన 'బావలు సయ్యా' అనేది యెక్కువ మందికి తెలిసిన పాట.

ఇద్దరు పెళ్లాల ముద్దుల పోలీసు, మామగారు, నా మొగుడు నా యిష్టం. మామ-అల్లుడు, పెళ్లికళ వచ్చేసిందే బాలా, విష్ణు, రేపటి కొడుకు మొదలైన తెలుగులో నేరుగా తీసిన చిత్రాలకు పాటలు రాశారు.

నారాయణవర్మ రచన చేసిన డబ్బింగ్ చిత్రాలు -

గుణ - (1991)
ఘరానా మరిది (1994)
సతీ లీలావతి (1995)
కాలాపాని (1996)
అమలాపురం అల్లుడు (1996)
కోనసీమ మొనగాడు (1996)
డాడీ (1996)
ఆంధ్రా అల్లుడు (1999)
సమరసింహం (1999)

'గుణ' తమిళ చిత్రంలో నారాయణవర్మ తెలుగు పాటను రాయడం విశేషం. బుల్లి తెరకు జెమిని, ఈ టివీ, జీ, దూరదర్శన్ ఛానెల్స్ ద్వారా సుమారు 20 ప్రజారంజకమైన ధారావాహికలను కూడా అందించారు.

## చంద్రబోస్

పూర్తిపేరు కె. సుభాష్ చంద్రబోస్. 10.5.72న వరంగల్ జిల్లా 'చల్లగరిగె' గ్రామంలో జన్మించారు. చిన్నప్పుడు యింటి పక్కనున్న దేవాలయం నుండి వినిపించే

ప్రాభాత కీర్తనలు, భక్తిగీతాలు, సినిమా పాటలు – పాట మీద అభిరుచినీ, ఆసక్తినీ కలిగించాయి. ఇంజనీరింగ్‌లో పట్టభద్రులైన చంద్రబోస్ దృష్టి వుద్యోగాల మీద కాకుండా వెండితెర మీద పడింది. సినిమారంగంలో గాయకునిగా స్థిరపడాలనుకొన్న బోస్ దర్శకుడు ముప్పలనేని శివ సూచనతో రచన వైపు దృష్టి సారించారు. ప్రముఖ నిర్మావత డి. రామానాయుడి ప్రోత్సాహంతో 'తాజ్‌మహల్' (1996) చిత్రంలో 'మంచుకొండల్లోన చంద్రమా – చందనాలు చల్లిపో' అనే పాటతో పరిశ్రమ దృష్టి నాకర్షించారు.

సాహిత్యనేపథ్యం లేని వాతావరణంలో పుట్టి పెరిగి, సాహిత్యానికి సంబంధించని చదువు చదివి, అనుకోకుండా సినీకవియై నిరంతరం కొత్తదనం కోసం అన్వేషిస్తూ చిత్ర పరిశ్రమలో అంచెలంచెలుగా యెదుగుతున్న సినీకవి చంద్రబోస్. స్వయంకృషి, ఆత్మ విశ్వాసం ఆయన విజయ రహస్యాలు.

ప్రస్తుతం తెలుగులో 'డైరెక్ట్ టేక్' చిత్రాలకు పాటలు రాస్తున్న ముందు వరసలో వున్న యిద్దరు ముగ్గురు కవుల్లో చంద్రబోస్ ఒకరు.

'ఆది', 'నేనున్నాను' చిత్రాల్లోని పాటలకు నంది పురస్కారాలను, 'స్టూడెంట్ నెం. 1'లోని పాటకు 'మనస్విని–ఆత్రేయ' పురస్కారాన్ని, అమెరికాలోని తెలుగు సాహిత్యసాంస్కృతిక సంస్థ (2008) పురస్కారాన్ని.. ఇంకా అనేక పురస్కారాల నందుకొన్న చంద్రబోస్ జాతీయ పురస్కారాన్నందుకోవడం లక్ష్యంగా అనేక వుత్తమగీతాలు రాస్తున్నారు.

ఒక పక్క స్ట్రెయిట్ చిత్రాలకు పాటలను రచిస్తూ, మరోపక్క బుల్లితెర కార్యక్రమాల్లో పాల్గొంటూ – డబ్బింగ్ పాటలు కూడా రాయడం చంద్రబోస్ బహుముఖప్రజ్ఞకూ, కృషికీ నిదర్శనం.

ప్రేమతో, గజిని, అపరిచితుడు, ఆవారా, షాపింగ్‌మాల్, కిలాడి, వీడింతే, 1947–ఎ లవ్ స్టోరీ మొదలైనవిచంద్రబోస్ పాటలున్న డబ్బింగ్ చిత్రాలు. చంద్రబోస్ డబ్బింగ్ పాటల నుంచి స్థాలీపులాకంగా ఒకదానిని రుచి చూద్దాం –

**పల్లవి : చూడొద్దే నను చూడొద్దే చురకత్తిలాగ నను చూడొద్దే**
**వెళ్లొద్దే వదిలెళ్లొద్దే మదిగూడు దాటి వదిలెళ్లొద్దే**
**అప్పుడు పంచిన నీ మనసే అప్పని అనవద్దే**
**ఇప్పుడు పెరిగిన వడ్డీతో యిమ్మని అడగొద్దే**

**చరణం–1**

వద్దు వద్దంటు నేనున్నా వయసే గిల్లింది నువ్వేగా
పోపో పొమ్మంటు నేనున్నా పొగలా అల్లింది నువ్వేగా
నిదరోతున్న హృదయాన్ని లాగింది నువ్వేగా
నలుపై వున్న రాతిరికి రంగులు నువ్వేగా
నాతో నడిచే నానీడ – నీతో నడిపావే
నాలో నిలిచే నా ప్రాణం – నువ్వే నిలిచావే.

**చరణం–2**

వద్దు వద్దంటూ నువ్వున్నా – వలపే పుట్టింది నీపైన
కాదు కాదంటూ నువ్వున్నా – కడలే పొంగింది నాలోన
తడికన్నీళ్ల తీరంలో పడవల్లే నిలుచున్నా
సుడిగుండాల శ్రుతిలయలో పిలుపే యిస్తున్నా
మంటలు తగిలిన పుత్తడిలో మెరుపే కలుగునులే
ఒంటిగ తిరిగిన యిద్దరిలో ప్రేమే పెరుగునులే (ఆరు–2005)

'నీ నవ్వుల తెల్లదనాన్ని నాగమల్లి అప్పడిగింది – ఇవ్వొద్దు, ఇవ్వొద్దు–ఇవ్వొద్దు' అనే 'ఆది'లోని తన పాటనే గుర్తు చేసే ఈ పాటలో మనం గమనించాల్సింది, అభినందించవలసింది – ఆత్రేయ 'మార్కు' సునాయాసమైన పదకేళిని.

డబ్బింగ్ అనేది ఒకచోట వున్న సాలెగూడును మరొకచోటికి పదిలంగా చేర్చడం లాంటిదనీ, ఒక భాషలోని శబ్దార్థాలతో పాటు అనుభూతిని కూడా రెండవభాషలోకి అందించగలగడమే సరైన డబ్బింగ్ అనీ చంద్రబోస్ అభిప్రాయం. తమిళకవి వైరముత్తును చంద్రబోస్ స్ఫూర్తి ప్రదాతగా భావిస్తారు.[2]

## వనమాలి

అసలుపేరు మణిగోపాల్. పుట్టింది చిత్తూరులో. మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగులో స్వర్ణపతక గ్రహీత. అక్కడే 'నూతలపాటి గంగాధరం జీవితం – రచనలు' అనే అంశం మీద పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టా పొందారు.

---

**2.** **25.12.13**న చంద్రబోస్‌తో ముఖాముఖి.

సినీరంగంలో ప్రవేశించకముందే ఆకాశవాణికి, పత్రికలకు కవితలు రాసి తన ప్రతిభను నిరూపించుకొన్నారు. 2004లో 'మెరీనా' అనే కవితా సంపుటిని వెలువరించారు. 'వలసపోయిన మనసులు' అనే కవితకు ప్రసారభారతి నుంచి జాతీయస్థాయిలో ఉత్తమకవిగా పురస్కారాన్ని అందుకొన్నారు.

1994 నుండి 2007 వరకు 'ఈనాడు' 'సితార'లలో పనిచేయడం వల్ల సినిమారంగంతో అనుబంధం ఏర్పడింది. 'టైమ్' చిత్రం అతనికి సినిమాల్లో రాసే 'టైమ్' వచ్చిందని సూచిస్తూ – అందులో అయిదు పాటలు రాసే అవకాశాన్ని కల్పించింది. 'శివపుత్రుడు' (2004) డబ్బింగ్ చిత్రానికి 'సింగిల్ కార్డ్' రాయడంతో చిత్రపరిశ్రమలో గుర్తింపు లభించింది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన 'హ్యాపీ డేస్'లో రాసిన పాటలు 'హిట్' కావడంతో వెంటాడిన అవకాశాలు తీరిక లేకుండా చేశాయి. 'హ్యాపీ డేస్'లోని 'అరరె.. అరరె..' పాటకు ఫిల్మ్‌ఫేర్ అవార్డ్ లభించింది.

నేరుగా తీసిన తెలుగుసినిమాల్లో 200కు పైగా పాటలు రాసిన వనమాలి యిప్పుడెక్కువగా డబ్బింగ్ పాటలు రాస్తున్నారు. వనమాలి డబ్బింగ్ చిత్రాలలో కొన్ని –

ఇండియన్ పోలీస్ – 2000

అఖండుడు – 2005

రక్షణ – 2005

ధీరుడు – 2006

శివపురం – 2006

గర్జన – 2007

పొగరుబోతు – 2007

కళాశాల – 2009

ప్రిన్స్– 2010

ప్రేమిస్తావా? – 2010

వ్యర్థపదాలు, పడికట్టు పదాలు పరిహరిస్తూ హృద్యమైన అభివ్యక్తులతో, భాషమీద అధికారంతో పాటలు రాస్తున్న వనమాలికి నవ్యకవులలో ప్రత్యేక స్థానం వుంది. ఈ వ్యాఖ్యను రుజువు చేసే 'శివపుత్రుడు'లో వనమాలి రాసిన ఒక పాటను చూద్దాం –

చిరుగాలి వీచెనే... చిగురాశ రేపెనే
వెదురంటి మనసులో రాగం వేణువూదెనే, మేఘం మురిసిపాడెనే...
కరుకైన గుండెలో చిరుజల్లు కురిసెనే
తనవారి పిలుపుతో ఆశలు వెల్లువాయెనే, ఊహలు వూయలూపెనే...
చినుకు రాక చూసి మది చిందులేసెనే
చిలిపి తాళమేసి చెలరేగి పోయెనే

చరణం 1

తుళ్లుతున్న చిన్న సెలయేరు గుండెలోన పొంగి పొలమారు
అల్లుకున్న ఈ బంధమంతా వెల్లువైనదీ లోగిలంతా...
పట్టెడన్నమిచ్చి పులకించే నేలతల్లి వంటి మనసల్లే
కొందరికే హృదయముంది నీకొరకే లోకముంది...
నీకు తోడు ఎవరంటూ లేరు గతములో
నేడు చెలిమిచెయ్యి చాపేవారే బ్రతుకులో
కలిపిన బంధం కరిగిపోదులే
మురళి మోవివిరిని తావి కలిసినవేళ...

చరణం 2

మనసున వింత ఆకాశం మెరుపులు చిందె మనకోసం
తారలకే తళుకా బెళుకా ప్రతిమలుపూ ఎవరి కెరుక?
విరిసిన ప్రతిపూదోట కోవెలఒడి చేరేనా?
రుణమేదో మిగిలివుంది ఆ తపనే తరుముతోంది
రోజూ వూయలే వూగే రాగం గొంతులో
ఏవో పదములే పాడే మోహం గుండెలో
ఏనాడూ తోడు లేకనే కడలి ఒడిని చేరుకొన్న గోదారల్లే
కరుకైన గుండెలో చిరుజల్లు కురిసెనే...

ఆశావాదంతో నడిచే ఈ పాటను 'శివపుత్రుడు' తమిళమాతృకలో 'పళని బారది' రాశారు. ఇళయరాజా సంగీత దర్శకత్వంలో మూలంలోని మార్దవం చెక్కుచెదరకుండా వనమాలి తెనిగించగా ఆర్.పి. పట్నాయక్ గానం చేశారు.

# రామజోగయ్య శాస్త్రి

పూర్తిపేరు దారివేముల రామజోగయ్య శాస్త్రి. స్వస్థలం గుంటూరు జిల్లా నరసరావుపేట సమీపంలోని 'ఆరేపల్లి ముప్పాళ్ల' గ్రామం. పుట్టిన తేదీ 24.8.1970. వరంగల్ ఆర్.ఇ.సి.లో బి.టెక్, ఖర్గపూర్ ఐ.ఐ.టి.లో ఎమ్.టెక్ (మెటలర్జికల్ ఇంజనీరింగ్) చదివి బెంగుళూరు, హైదరాబాద్‌లలో పుష్కరకాలం పైగా ఇంజనీర్‌గా పనిచేశారు.

చిన్నతనం నుంచి పాటలు పాడటం యిష్టం. అది క్రమంగా రాయాలనే అభిలాషకు దారి తీసింది. బెంగుళూరులో వుండగా ఆ ఆలోచన మొగ్గ తొడిగింది. ఒక కన్నడచిత్రాన్ని అనువదించే సందర్భంలో సిరివెన్నెల సీతారామశాస్త్రి పరిచయమయ్యారు. ఆయన ప్రోత్సాహంతో 'యువసేన' (2004)లో రెండు పాటలు రాసి సినీ గేయరచనకు శ్రీకారం చుట్టారు. 2008 వరకు వుద్యోగం కొనసాగిన రామజోగయ్యశాస్త్రికి ప్రస్తుతం సినిమాపాటలు రాయడమే వుద్యోగం. ఈ దశాబ్దంలో స్ట్రెయిట్ సినిమాల్లో సుమారు 500 పాటలు రాసి – లబ్ధప్రతిష్ఠులయ్యారు.

తెలుగులో నేరుగా తీసిన చిత్రాలకు పాటలు రాయడంలో ముందువరసలో వున్న శాస్త్రి 20కు పైగా చిత్రాల్లో డబ్బింగ్ పాటలు కూడా రాశారు. షాపింగ్ మాల్, మన్మథ బాణం, ధనం, కాంచన, దిల్ సే (మళయాళం), విశ్వరూపం, సింగం, నం.1 హీరో (కన్నడ), తుపాకీ, బ్యాడ్ బోయ్. మొదలైనవి ఆయన పాటలు రాసిన డబ్బింగ్ చిత్రాలు.

డబ్బింగ్ రంగంలోకి రాకముందు కొన్ని డబ్బింగ్‌పాటలు విని వాటిలో కొన్ని పదాలు, అభివ్యక్తులు పంటికింద రాళ్లలా అనిపిస్తే – డబ్బింగ్ పాట ఎలా రాయకూడదో తెలుసుకున్నానన్నారు[3]. డబ్బింగ్‌లో 'లిప్‌సింక్'తో పాటు దృశ్యాన్ని, నటులను దృష్టిలో పెట్టుకోవాలని ఆయన దృఢమైన అభిప్రాయం. ముఖ్యంగా డబ్బింగ్ అంటే మాటల ననువదించడం కాదు – ప్రాదేశికతకు, సృజనాత్మకతకు ప్రాధాన్యమివ్వాలని ఆయన వుద్దేశ్యం. రామజోగయ్యశాస్త్రి రాసిన డబ్బింగ్ పాటల్లో ఆయన అభిప్రాయాలు, లక్ష్యాలు యెంతవరకు ప్రతిబింబించాయో – గమనిద్దాం.

**సృష్టి నియమం ఎవ్వరికైనా ఖాయం మరణం ఖాయం మరణం...**
**గాలికి ఆరే దీపం లాగా మాయం ప్రాణం మాయం ప్రాణం...**

---

**3.** రామజోగయ్యశాస్త్రితో ఫోనులో సంభాషణం **1.10.15**

గగన గణితపు లెక్క ప్రకారం లోకమిది ఒక మట్టిబంతి మట్టిబంతి
ఓ.. మట్టిబంతి.. ఓ...
మట్టిబంతిని చుట్టి తిరిగే ప్రతొక్క బంతి అంతమైపోదా అంతమైపోదా
ఓ.. అంతమైపోదా...ఓ...
మహాసూర్యుని తేజము కూడా మరో యుగమున భస్మం కాదా
భస్మము కాదా...
కరిగి మరిగే విలయమందు ఉడుకుద్రవమున చిగురు మొలుచు
పెరిగి పుడమిని ఒరుగు వృక్షం తన మరణం తోనే నాటును అంతమే
ఆరంభం ఓ అంతమే ఆరంభం...
వీలుంటే నిన్ను పోలిన జీవికి ఉసురు నొసగుటె కర్తవ్యమనుకో కర్తవ్యమనుకో...
నీ వంతు విధిగా వంశధార వ్యాప్తి చెందెడి వరము కాగా
రాసి పెట్టిన కన్నియ కావలె కన్నియ కావలె రాసిపెట్టిన కన్నియ కావలె
కోరినన్నీ అందిన ఘనులు చావును కోరీ చచ్చిన కథలు
వేలకు వేలు ఓ వేలకు వేలు (ఉత్తమవిలన్)

తమిళ మాతృక రచనలో మహానటుడు కమలహాసన్ వ్యక్తం చేసిన తాత్త్విక సత్యాన్ని, వైరాగ్యభావాన్ని తెలుగులో అంత చక్కగానూ రామజోగయ్యశాస్త్రి ఆవిష్కరించారు. కాకపోతే వాడుకలో వున్నా, 'ప్రతొక్క' వంటి పదం పంటికింద రాయే మరి!

## కందికొండ

పూర్తిపేరు కందికొండ గిరి. స్వస్థలం వరంగల్ జిల్లా, నర్సింపేట మండలంలోని నాగుర్లపల్లి గ్రామం. తెలుగు, రాజకీయ శాస్త్రాలలో ఎమ్.ఏ. పట్టాలు తీసుకొన్నారు. ప్రస్తుతం 'తెలుగు చిత్రాల్లో సన్నివేశగీతాలు' అనే అంశం మీద పిహెచ్.డి. కోసం పరిశోధన చేస్తున్నారు.

'ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం' (2001) చిత్రంలో 'మల్లీ కూయవే గువ్వా' అనే పాట రాయడంతో సినీరంగ ప్రవేశం చేశారు. 'ఇడియట్' 'అమ్మానాన్న – ఓ తమిళ అమ్మాయి', 'పోకిరి' 'మున్నా' 'దేశముదురు' 'స్టాలిన్' 'శివమణి' 'టెంపర్' మొదలైన డైరెక్ట్‌టేక్ హిట్ చిత్రాలకు పాటలు రాశారు.

కందికొండ పాటలు రాసిన కొన్ని డబ్బింగ్ చిత్రాలు –

1. లింగా
2. తుపాకి
3. చారులత
4. పొగరు
5. సతీలీలావతి
6. జగన్
7. లక్ష్మీపుత్రుడు
8. బీభత్సం

కందికొండ శైలి పట్ల అవగాహన కోసం అతనికి పేరు తెచ్చిన 'లింగా' చిత్రం నుంచి ఓ పాట పల్లవిని పరిశీలిద్దాం –

**పల్లవి : ఆమె : మోనా మోనా మోనా మోనా హై**
**మోనా మోనా మోనా గ్యాసోలీనా**
**అతడు : అరె మోనా, మైడియర్ గ్యాసోలీనా**
**గుండె తానె కొట్టుకొనెనె ట్రాంపోలీనా**
**నీ కళ్లు కంపాస్... ఆ...**
**నేను నీ కొలంబస్... ఆ...**
**లంగరునె నే వేయ, నువ్వాడ**
**కడలి పేలెను పటాసై**

కె.ఎస్. రవికుమార్ దర్శకత్వంలో ఎ.ఆర్.రెహమాన్ సంగీత దర్శకత్వంలో వచ్చిన లింగా చిత్రంలోని ఈ పాటలోని పదాలను గమనిస్తే– అవి మూలాన్నుంచి యథాతథంగా గ్రహించినవనీ, సంగీత దర్శకుని సూచన మేరకు బాణీకనుగుణంగా రాయడమే కవి ధ్యేయమనీ అర్థమౌతోంది.

ఈ శీర్షికలో మరికొందరి గురించి రాయ(లే)క పోవడానికి నా ప్రయత్నలోపం లేదు. కీర్తిశేషులైన కొందరి కవుల వారసుల నిరాసక్తత, సజీవులైన కొందరు కవుల అకారణమైన సహాయనిరాకరణ, నిర్లిప్తతల వల్ల ఈ జాబితాను పొడిగించలేకపోయాను. దీనిని సమగ్రంగా రాయడానికి ద్వితీయముద్రణ నాటికి అందరి సహకారం అందుతుందని ఆశిస్తున్నాను.

# తెలుగుపాటకు పేరంటం

సాంకర్యం లేని జాతి, భాష లేనట్టే – ఆదాన ప్రదానాలు లేని సినీరంగం కూడా వుండదు. హాలివుడ్, బాలివుడ్, ఇతర దక్షిణ భారతదేశ భాషలనుంచి తెలుగు చిత్రపరిశ్రమ ఏ వేవి యెలా దిగుమతి చేసుకుందో ముందు అధ్యాయాల్లో చర్చించాం. అలాగని తెలుగు చేయి మాత్రమే కింద వుందని, మనమే మనల్ని తక్కువ చేసుకొంటున్నామని అనుకుంటే మాత్రం అది పొరపాటు. ఇచ్చిపుచ్చుకోవడం, దొరికినంత దోచుకోవడం – అన్ని భాషల సినిమాలకు సర్వసామాన్యం. ఈ 'స్పీడు' యుగంలో పదిసినిమాల నుంచి పదకొండవ సినిమా నూతనసృష్టిగా ఆవిర్భవించడం అన్ని భాషలలోనూ నడుస్తున్న తంతే. సినిమాలకు సంబంధించినంత వరకు స్ఫూర్తులను, చౌర్యాలను, అనుకరణలను, అనుసరణలను 'మామూలే' అని సరిపెట్టుకోవాలి తప్ప నేరంగా పరిగణించ నవసరం లేదు. ఈ సందర్భంగా 'కాపీరైట్'ను రెండో అర్థం లోనే తీసుకోవాలి. మృచ్ఛకటికం నాటకంలో చారుదత్తుడులా దొంగతనాన్ని నేర్పుగా కళాత్మకంగా చేస్తున్నందుకు మనం అభినందించాలి. ఎవరెన్ని రకాలుగా వండి వడ్డించినా ప్రపంచంలోని కథలు పది పన్నెండు మాత్రమే అని సినీపండితులు అభిప్రాయ పడినట్టు – గొప్ప కథాంశాలను, సంగీత బాణీలను (సం) గ్రహించి తమ దేశభాషలకు అనుగుణంగా మలుచుకొనే అనుసృజన, ప్రతిభల మీదే చిత్రవిజయాలు ఆధారపడి వుంటాయి.

తెలుగుచిత్రాలకు సంబంధించినంత వరకు పాశ్చాత్యచిత్రాలను పక్కన పెడితే – స్ట్రెయిట్ డబ్బింగ్ భేదం లేకుండా హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషలలోని చిత్రాలతోనే యెక్కువగా లావాదేవీలు జరిగాయి – జరుగు తున్నాయి. ఇరుగు పొరుగు భాషలు కావడం, నటీనటులు, సంగీత దర్శకులు, ఇతర సాంకేతిక నిపుణులు మాతృభాషతో పాటు పక్కనున్న భాషల్లో కూడా రాణించడం, భాషా నిర్మాణంలో సామ్యాన్ని కలిగివుండడం – మొదలైనవి దీనికి కారణాలు. తెలుగు మీద సంగీతబాణీల వరకు హిందీ ప్రభావం

యెక్కువగా వుంటే – కథాంశాలు, సంభాషణలు మొదలైన విషయాల్లో దక్షిణభారత భాషల ప్రమేయం వుంది. 'ముఖేముఖే సరస్వతి' అన్నట్టు యిలాంటి పరస్పర వినిమయం వల్ల సినిమామాధ్యమం లాభించడం నిర్వివాదాంశం. నేడు హిందీతో సహా అన్యభాషల్లోకి పరివర్తిత మౌతున్న తెలుగుచిత్రాల జోరు చూస్తుంటే మనం గర్వించే స్థాయిలోనే వున్నాం. చిత్రనిర్మాణంలో బాలివుడ్ కంటె టాలివుడ్డే ముందుందని లెక్కలు చూపిస్తున్నవాళ్లూ వున్నారు. 'ఆవు కాంపొజిషన్' సామెతగా అనుకోకపోతే – అన్య భాషాసంసర్గం వల్ల తెలుగు సినిమా, పాట – ఎలా సుసంపన్న మౌతున్నాయో గమనిద్దాం –

## హిందీ మెహందీ

'జనని సంస్కృతంబు సకల భాషలకును..' (క్రీడాభిరామం) అన్నట్టు హిందీప్రభావం పడని భారతీయ చలన చిత్రాలు లేవు. తొలి భారతీయ శబ్దచిత్రం 'ఆలం ఆరా' (14.331) హిందీ భాషాచిత్రమే. తెలుగులో తొలిటాకీ వచ్చిన మొదటి పదేళ్లలో విడుదలయిన 'లవకుశ', 'గృహలక్ష్మి' 'వందేమాతరం' 'మళ్లీపెళ్లి' మొదలైన చిత్రాల్లోని కొన్ని పాటలపై ఆనాటి హిందీచిత్రాల్లో సైగల్, పంకజ్ మల్లిక్ వంటి ప్రసిద్ధ గాయకులు పాడిన పాటలబాణీల ముద్రలు స్పష్టంగా వున్నాయి. 'గృహలక్ష్మి' చిత్రంలో మద్యపానవ్యసనాన్ని వీడవలసిందిగా ప్రబోధిస్తూ నాగయ్య పాడిన –

**లెండు భారత వీరులారా**
**నిదుర లేవండోయ్! మీరూ నిదుర...**

అనే గీతం కె.సి.డే అనే అంధ గాయకుడు పాడిన 'మన్‌కి ఆంఖే ఖోల్ బాబా...' అనే పాట వరసకు నకలని ఆనాటివాళ్లు చెపుతారు.

యస్. రాజేశ్వరరావు సంగీతానికి దేశమంతటా పేరు తెచ్చిన చిత్రం జెమినీ వారి 'చంద్రలేఖ' (హిందీ / తమిళం) కావడం, చిత్తూరు వి. నాగయ్య 'నా యిల్లు' (1953) తెలుగు చిత్రంలో రెండు హిందీ పాటల్ని మీనాకపూర్‌తో పాడించడం, సుసర్ల దక్షిణామూర్తి 'సంతానం' చిత్రంలో లతామంగేష్కర్ చేత తొలి తెలుగుపాటను పాడించడం, కళావాచస్పతి కొంగర జగ్గయ్య 'పదండి ముందుకు'లో మహమ్మద్ రఫీని గాయకునిగా పరిచయం చెయ్యడం, 'మనోరమ' చిత్రంలో రమేష్ నాయుడు తలత్ మహమూద్ విలక్షణగాత్రాన్ని వినిపించడం... ఇవన్నీ తెలుగు హిందీల మధ్య అవినాభావ సంబంధాన్ని తెలియజేస్తాయి. అలాగే 'సంసారం'లో సగం హిందీట్యూన్లతో పాటల్ని 'హిట్' చేసిన

సుసర్లను 'ఇమిటేషన్ చక్రవర్తి'గా పిలవడం, సంగీతదర్శకుడు సత్యాన్ని 'దక్షిణాది ఆర్.డి.బర్మన్' అనడం, ఆదినారాయణరావు 'అనార్కలి' పాటల ప్రాచుర్యానికి హిందీ అనార్కలిలో సి.రామచంద్ర వరసలే కారణలు కావడం... తెలుగు పాటలపై హిందీ ప్రభావానికి యిలా యెన్ని వుదాహరణలనైనా చూపించవచ్చు. ఇక్కడ అప్రస్తుతమే అయినా 'సువర్ణసుందరి' (హిందీ)లో తన బాణీలతో ముఖ్యంగా 'హాయి హాయిగా ఆమని సాగే...' వరసతో ఔత్తరాహుల్ని సమ్మోహితుల్ని చేసిన తెలుగు సంగీతదర్శకుడు ఆదినారాయణరావును కూడా స్మరించాలి.

తెలుగులో కేవలం డబ్బింగ్ చిత్రాల పాటల మీదే గాక – 'ప్రేమలేఖలు' వంటి 'ట్రాక్ ఛేంజ్' చిత్రాల్లోని పాటల మీద, ఆడబ్రతుకు (జిందగీ), కులదైవం (భాభీ) వంటి పునర్నిర్మిత చిత్రాలలోని పాటలమీద, ఇంకా ఏ మాత్రం సంబంధం లేని చిత్రాల్లోని అనుకరణగీతాల మీద హిందీ వరసల ప్రభావం గురించి యెంతైనా రాయొచ్చు. 'జీవితం' 'అభిమానం' మొదలైన చిత్రాల్లో అనేక హిందీ చిత్రాల నుంచి 'హిట్ ట్యూన్స్' ను తీసుకుని వాటి ననుసరించి పాటలను రాయించారు. హిందీ బాణీలను అనుసరించి తెలుగులో యెక్కువగా పాటలను రాయించిన సంస్థల్లో ఎ.వి.యం, విజయ, అన్నపూర్ణ సంస్థలు ముందు వరసలో వుంటాయి. సంగీతదర్శకుల పేర్లు చెపితే – ఇళయరాజా రంగప్రవేశం చేసే వరకు పెద్ద జాబితాయే అవుతుంది. తెలుగువాళ్ల నోళ్లలో మాతృభాషలోని సినిమాపాటల తర్వాత హిందీపాటలు అధికంగా నానడానికీ, వాటిపట్ల మనవాళ్లకు మక్కువ పెరగడానికీ దోహదం చేసిన కార్యక్రమాలు – రేడియో సిలన్ నుంచి 'బినాకా గీత్‌మాలా' పేరుతో పాతికేళ్లపాటు ప్రసారమైన బాలివుడ్ పాటలూ!

తెలుగులో మాట్లాడే భాషవేరు, కవిత్వభాష వేరు. హిందీలో ఆ భేదం లేదు. కాని సినిమాల్లో హిందీ భాష స్వచ్ఛమైంది కాదు. అది ఉర్దూతో సాంకర్యమైన హిందీ. హిందీలో భావం బావుండి శ్రవణ పేయంగా వుంటే చాలు, అది పాటగా చెలామణీ అవుతుంది. ముఖ్యంగా ప్రేమగీతాల్లో కొన్ని పడికట్టు పదాలను మళ్లీ మళ్లీ వినియోగిస్తుంటారు. తెలుగు అజంత భాష, అందువల్ల అది పాటకీ పద్యానికీ చక్కగా వొదుగుతుందని మనం భావిస్తాం. కాని హలంతపదాలతో కూడిన హిందీ నడకలో ఒక తూగు వుందనీ, అది సంగీతాని కనుకూలంగా వుంటుందనీ – అందుకే అది యితరభాషల వారి ఆదరణకు కూడా నోచుకుంటుందనీ చాల మంది అభిప్రాయం. దానికి రుజువు హిందీ సినిమాలు, పాటలు 'డబ్' చెయ్యాల్సిన అవసరం లేకుండా నేరుగా తెలుగు వారి

ఆదరాభిమానాలు పొందడమే! అందువల్లనే తెలుగు డబ్బింగ్ చిత్రాల్లో హిందీ చిత్రాల శాతం తక్కువ. శ్రీశ్రీ డబ్బింగ్ రచన చేసిన శ్రీరామభక్త హనుమాన్, గాంధారి గర్వభంగం, జింబో, జింబో నగరప్రవేశం, సంపూర్ణ రామాయణం, అరబ్బీ వీరుడు జబక్ వంటి చిత్రాల తర్వాత తొంభైల వరకు హిందీ డబ్బింగ్‌లు అంతగా ప్రాచుర్యాన్ని పొందలేదు. మధ్యలో షోలే, యాదోంకి బారాత్, జంజీర్, ఆరాధన, మొఘల్-ఏ-ఆజమ్ వంటి కళాఖండాలు, వాటి రీమేక్స్, ఫ్రీమేక్స్ తెలుగునాట విజయవిహారం చేయడం వేరు - డబ్బింగ్ విషయం వేరు. హిందీ నుంచి డబ్ చేసిన 'జింబో' (1959) నుంచి అప్పటి పాటల కుదాహరణంగా ఒకపాట తీరు తెన్నులను గమనిద్దాం -

**ఔను నిజం ప్రణయరథం సాగెను నేడే**
**కోరిన కోరిక పొరటలాడే! ॥ఔను॥**
**ఇంపారె పూల నిండారే సుధల్**
**సైదోడై చేరి దాగుండే జతల్**
**హాయి జనించె - ఆశ రహించే**
**'కో'యని కోయిల కమ్మగ పాడే! ॥ఔను॥**

**ప్రేమకళాధాముడే తారే నిజం**
**మన్మథుడే బాసటై ఎత్తే ధ్వజం**
**బాణమె తీసే! గారడి చేసే!**
**హా సఖా! నా సఖా! నెమ్మది లేదే ॥ఔను॥**

**కెరటాలె లీనమై సరసాలాడున్**
**తీయనిగానమె యెద నూగాడున్**
**మనమె హసించున్, వనమె సుమించున్**
**దేహమె డెందమె - తేలిక కాదే ॥ఔను॥**

మాతృక : **లే చలే హమ్ బఢ్‌కే కదమ్**
**ఆజ్ ఖుషీసే ఆగయా ఆగయా...**

చిత్రగుప్త సంగీతనిర్వహణలో వచ్చిన ఈపాటను తెలుగులో సుశీల పాడారు. శ్రీశ్రీ తెలుగు సేతలో పదాల చివరి పొల్లులు (హల్లులు) హిందీ బాణీ ననుసరించిన ధోరణికి గుర్తులు. ఏమైనా ఈ పాటను యిప్పటికీ కొందరు గుర్తు పెట్టుకోవడం శ్రీశ్రీ

ప్రతిభతోపాటు బాణీ మహిమ కూడా!

అనంతర కాలంలో తెలుగులో డబ్ చేయబడిన హిందీ ప్రేమకథాచిత్రాలు ప్రకంపనాల్ని సృష్టించాయి. 'మైనే ప్యార్ కియా' (ప్రేమపావురాలు - 1989) రాజశ్రీకి అసాధారణ ఖ్యాతిని తెస్తే, 'దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే (ప్రేమించి పెళ్లాడుతా - 1995), 'హమ్ ఆప్‌కే హై కౌన్ (ప్రేమాలయం - 1995) చిత్రాలు వెన్నెలకంటికి డబ్బింగ్ కవిగా సుస్థిరస్థానాన్ని చేకూర్చాయి. హిదీతెలుగు భాషల్లో ఈ చిత్రాల జైత్రయాత్రలకు ప్రేమకథా వస్తువులు, వెంటాడి వెర్రెత్తించే పాటల బాణీలు కారణాలనడంలో సందేహం లేదు. 'దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే' బొంబాయి 'మరాఠా మందిర్'లో ఇరవయ్యేళ్లుగా నిర్విరామంగా ప్రదర్శింపబడుతూ రికార్డు సృష్టించిందట!

**1.** **కబూతర్ జాజాజా కబూతర్ జా**
**పెహలీ ప్యార్‌కీ పెహలీ చిట్టీ -** **- మైనే ప్యార్ కియా**
**ఓ పావురమా, ఓ పావురమా**
**తొలిప్రేమల్లో తొలకరి లేఖ**
**చెలునికి అందించిరా** **- రాజశ్రీ,**
**ప్రేమపావురాలు**

**2.** **మెహందీ లాగాకే రఖ్నా! డోలీ సజాకే రఖ్నా**
**లేనే తుఝే ఓ గోరి ఆయేంగి తేరే సజ్నా**
**స్రహ్ సజాకే రఖ్నా! చెహ్రా చుపాకే రఖ్నా**
**- దిల్ వాలే దుల్హనియా లే జాయేంగే**

(గోరింటాకు పెట్టుకొని వుండు. పల్లకీ సిద్ధంచేసి వుంచుకో, నిన్ను తీసుకెళ్లడానికి నీ రాజు వస్తాడు పిల్లా)

**ఈ బొమ్మ భలే ముద్దుగుమ్మ, నీ పోజే మరింకా బూజే**
**ఓఓఓ పందిట్లో సందడుంది, పల్లకి రెడీగా వుంది**
**నిను తీసుకెళ్ల నేడే నీవాడు వచ్చినాడు** **-వెన్నెలకంటి,**
**ప్రేమించి పెళ్లాడుతా**

**3.** **యాయిరే యాయిరే జోర్ లగాకే నా చీరే**
**యాయిరే యాయిరే మిల్‌కే ధూమ్ మచాయిరే** **-రంగీలా**

(జోరుగా నాట్యం చెయ్యండి, కలిసి హడావిడి చెయ్యండి)

**యాయిరే యాయిరే వారెవా, ఇది ఏం జోరే**
**యాయిరే యాయిరే ఈ జోరుకు నా జోహారే**

**-సిరివెన్నెల సీతారామశాస్త్రి, రంగేళి**

మొదలైన యెన్నో హిందీ పాటలు హిందీ, తెలుగుభాషల్లో సినీ సంగీతప్రియుల హృదయాల్లో మధురిమల్ని నింపాయి. ఒక మాటలో చెపితే హిందీ – తెలుగు భాషల చిత్రసంగీతానుబంధం నిత్యం పరిమళించే సుమసుగంధం.

## తమిళ తళుకులు

తెలుగు తమిళులది అన్నదమ్ముల అనుబంధం. రాజకీయంగా చాలకాలం తెలుగువారు వుమ్మడి మద్రాసు రాష్ట్రంలో వుండడం వల్ల, సినిమాల పరంగా చిత్రపరిశ్రమ హైదరాబాద్ తరలివచ్చేంత వరకు రెండు భాషల చిత్రాల నిర్మాణానికి మద్రాస్ కేంద్రం కావడం వల్ల – ఇంత సాన్నిహిత్యం యేర్పడింది. ఇప్పటికీ డబ్బింగ్ చిత్రనిర్మాణం యెక్కువగా చెన్నైలోనే జరుగుతోంది. తెలుగు డబ్బింగ్ చిత్రాలలో అధికశాతం తమిళభాషకు చెందినవేనని ఈ పుస్తకానుబంధం లోని జాబితాను చూస్తే తెలుస్తుంది.

తెలుగు తమిళ చిత్రరంగాల పరస్పర వినిమయం గురించి యెంత చెప్పినా తరగదు. నటీనటుల్లో పాతతరానికి చెందిన లలిత, పద్మిని, రాగిణి, శివాజీ గణేశన్, యం.జి.రామచంద్రన్ మొదలైన వారిని తెలుగు ప్రేక్షకులు సొంతవారిగానే ఆదరించారు. అలాగే అంజలి, సావిత్రి, జానకి, కృష్ణ కుమారి, నాగయ్య, యస్.వి. రంగారావు, ఎన్.టి.రామారావు, ఎ. నాగేశ్వరరావు తదితరులను తమిళులు కూడా అంతగానూ అభిమానించారు. ఇప్పుడు కూడా కమలహాసన్, రజనీకాంత్ మొదలైన హీరోలకు యిక్కడ, తెలుగు హీరోలకు అక్కడ భాషాభేదం లేని అదరాభిమానాలు కొనసాగుతున్నాయి. ఇంకా సుబ్బయ్యనాయుడు. యం.యస్. విశ్వనాథన్, కె.వి. మహదేవన్, ఇళయరాజా, ఎ.ఆర్.రహమాన్ వంటి సంగీత దర్శకులను, సుశీల, జానకి, ఎల్.ఆర్.ఈశ్వరి, వాణీజయరాం, జిక్కి, జమునా రాణి, ఘంటసాల, కె.జె. ఏసుదాసు, సౌందరరాజన్, యస్.పి. బాలసుబ్రహ్మణ్యం వంటి గాయనీగాయకులను ప్రాంతీయ తతో నిమిత్తం లేకుండా రెండు భాషలవారు అక్కున చేర్చుకొని సంగీతానికి భాష లేదని నిరూపించారు. ఆ మాటకొస్తే యస్.పి.బి.కి తమిళుల కోటాలోనే పద్మభూషణ్ ప్రదానం చేశారు. బాలు,

సుశీల, జానకి ప్రభృతులు తమిళపాటలకు కూడా జాతీయ పురస్కారాలను అందుకొన్నారు. అప్పట్లో కొంజుం సలంగై, మురిపించే మువ్వలు గ్రామఫోను రికార్డులు రికార్డు స్థాయిలో అమ్ముడు పోయాయట! కవుల్లో కణ్ణదాసన్ ప్రభావం లేని ఆ తరం తెలుగుకవులు లేరు. ఆత్రేయ భావాలను కణ్ణదాసన్ తీసుకొన్న సందర్భాలు కూడా అనేకం. 'వైరముత్తు వ్యక్తిగా, కవిగా నాకు ఆదర్శం' అని చంద్రబోస్ ఆయనపట్ల ఆరాధనాభావాన్ని వ్యక్తం చేశారు.[1]

తమిళ చిత్రాల్లో తెలుగు పాటలు, తెలుగు చిత్రాల్లో తమిళ పాటలు వుపయోగించిన సందర్భాల గురించి యిదివరకే చెప్పుకొన్నాం 'భాగ్యలక్ష్మి' (1943) తెలుగు చిత్రంలో తమిళపాటను తమిళ హాస్యజంట పాడ్డం, తమిళ 'పరాశక్తి'లో మా తెలుగుతల్లికి మల్లెపూదండ..' పాటను రాగమాలికలో ఎ.పి.కోమల ఆలపించడం, 'చంద్రముఖి' తెలుగు చిత్రంలో వాలి రాసిన తమిళపాటను ఆంధ్రులు ఆస్వాదించడం – ఈ సమదృష్టికి మరికొన్ని వుదాహరణలు.

భాషానిర్మాణం విషయంలో తమిళులు సంస్కృతాధిపత్యాన్ని అంగీకరించరు. అయితే తమిళంలో సూపర్‌హిట్ చిత్రాలు 'అగ్ని నక్షత్రం' (తెలుగులో 'ఘర్షణ') 'దళపతి' మొదలైనవి సంస్కృత మకుటాలు కావా? తమిళులు పరభాషా పదాలను చాలవరకు పరిహరించినా – ఇలాంటి మినహాయింపులు ఏ భాషకైనా తప్పనిసరి. కాని తమిళులు వీలయిన మేరకు తమ భాషలో సొంత మాటలు సృష్టించుకోవాలనే తపన కలవారనడంలో సందేహం లేదు. కొందరు తమిళ భాషాభిమానులు 'సెల్‌ఫోన్'ని సైతం 'కైప్పేశి' (చేతిలో పట్టుకొని మాట్లాడే పరికరం) అంటున్నారు. అయితే తెలుగు వాళ్లు దానికి భిన్నంగా ప్రధాన స్రవంతిలో వున్న పదాలను తప్ప – అసహజంగా వుండే పదాలను వాడ్డానికి అంగీకరించరు. అలాంటి పదాల్ని సొంతంగా సృజించుకోరు. ద్రావిడభాషల్లో మాధుర్య లాలిత్యాలు తక్కువైన తమిళం నుంచే యెక్కువ  తెలుగు చిత్రాలు 'డబ్' కావడానికి ప్రాదేశికమైన సంబంధమే ప్రధానకారణమనుకోవాలి. తెలుగులో డబ్బింగ్ పాటలపై తమిళ కవుల, సంగీత దర్శకుల ప్రభావాన్ని పరిశీలిద్దాం –

1. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో వచ్చిన 'అపూర్వ సగోదరర్ గళ్' (1989) తెలుగులో 'విచిత్ర సోదరులు' పేరుతో పరివర్తితమైంది. కమల్‌హాసన్ ద్విపాత్రాభినయం చేసిన ఈ చిత్రానికి ఇళయరాజా సంగీత దర్శకులు. ఇందులో తమిళంలో కమల్ మరుగుజ్జు

---

**1. చంద్రబోస్‌తో ముఖాముఖి – 25.12.13**

పాత్రమీద వాలి రాసిన పాట

**ఉన్న నెనెచ్చేన్ పాట్టు పడిచ్చేన్**
**తంగమే జ్ఞాన తంగమే**
**ఎన్న నెనెచ్చేన్ నానుమ్ సిరిచ్చేన్**
**తంగమే జ్ఞాన తంగమే...**

(ఓ మనసా నిన్ను తలచుకొంటూ పాడుతున్నా. అదే సమయంలో నన్ను చూసి నవ్వుకొంటున్నా. ఆ నింగి కంట కన్నీరొలికితే కదా – ఈ నేల పచ్చని పంటతో నవ్వుతూ విరిసేది! కొందరి జీవితాలు కూడా అంతే!)

రాజశ్రీ ఈ పాటను తెలుగు చేశారు. రెండు భాషల్లోనూ బాలుయే పాడిన ఈ పాటను రెండుచోట్ల జనం మళ్లీ మళ్లీ విన్నారు –

**నిన్ను తలచి మైమరచా.. చిత్రమే.. అది చిత్రమే**
**నన్ను తలచి నవ్వుకున్నా.. చిత్రమే.. అది చిత్రమే**
**ఆ నింగి నెన్నటికీ ఈ భూమి చేరదనీ**
**నాడు తెలియదులే.. ఈనాడు తెలిసెను లే.. ఓ చెలీ**

**ఆడుకుంది నాతో జాలిలేని దైవం**
**పొందలేక నిన్ను ఓడిపోయే జీవితం**
**జోరువాన లోన ఉప్పునైతి నేనే**
**హోరు గాలిలోన ఊకనైతి నేనే**
**గాలిమేడలే కట్టుకున్నా... చిత్రమే అది చిత్రమే**
**సత్యమేదో తెలుసుకున్నా.. చిత్రమే అది చిత్రమే**
**కథ ముగిసెను కాదా... కలచెదిరెను కాదా... అంతే** ॥నిన్ను॥

**కళ్లలోన నేను కట్టుకొన్న కోట**
**నేడు కూలె తానే ఆశ తీరు పూట**
**కోరుకున్న యోగం జారుకుంది నేడు**
**చీకటేమొ నాలో చేరుకుంది చూడు**
**రాసివున్న తలరాత తప్పదు.. చిత్రమే అది చిత్రమే**
**గుండె కోతలే నాకు ఇప్పుడు.. చిత్రమే అది చిత్రమే**

**కథ ముగిసెను కాదా కల చెదిరెను కాదా... అంతే..      ॥నిన్ను॥**

తెలుగుసేతలో కొన్నిచోట్ల అన్వయం మారింది. 'నింగికంట నీరొలికితే కదా నేల పంట పండేది' అనే భావాన్ని రాజశ్రీ నింగినేలా కలవవనేట్టుగా మార్చారు. అలాగే జడివానలో ఉప్పును అమ్మడానికి, హోరుగాలిలో పిండిని అమ్మడానికి వెళ్లాను అనే మూలంలోని 'నిష్ఫలయత్నాన్ని' కూడా రాజశ్రీ మార్చి రాశారు. ఈ తేడాల్ని చెప్పడం – మాతృకలోని భావ చిత్రాలు ఒక్కొక్కసారి తర్జుమాలో యథాతథంగా రావని చెప్పడానికి.

2. 'విశ్వరూపం' తమిళ చిత్రంలో వైరముత్తు రచనను రామజోగయ్య శాస్త్రి యిలా తెలుగు చేశారు –

**అణు విదైత్త బూమియిలే**
**అరువడైక్కుమ్ అనుకదిర్తాన్**
**...   ...   ...**
**పోరుసెల్లుమ్ వీరన్**
**ఒరుతాయ్ మగన్ తాన్**
**నమ్మిల్ యార్ ఇరుం దాలుమ్**
**ఒరుతాయ్ అజువాల్ పారడా...**

**(వైరముత్తు)**

**అణు వినాశ వర్షమిది, చితుల చిగురు మొలిచింది**
**ఒక తల్లి కన్నకొడుకేగా సైనికుడు ఎవరైనా**
**కాలేది కన్నకడుపేగా ఎవరు బలి అయినా**
**ఈ పెనుదాహం కోరేదేమిటో**
**రణ మారణహోమం ఆగే దెపుడో ఏనాడో...**

**(రామజోగయ్య శాస్త్రి)**

'యుద్ధంలో ఎవరు నెగ్గినా ఓడినా కాలేది ఒక తల్లి కడుపే కదా' అనే ఒళ్లు జలదరించే సత్యాన్ని ఆవిష్కరించిన ఈ పాట నిక్కడ వుటంకించడం – ఇలాంటి భావగర్భితమైన సన్నివేశ గీతాలు తమిళ కలాల నుంచి యెన్నో జాలువారాయని చెప్పడానికే.

3. డబ్బింగ్ పాటలతో పాటు పునర్నిర్మిత చిత్రాల్లో పాటలకు కూడా తమిళ బాణీలు, భావాలు యెలా స్ఫూర్తి నిచ్చాయో చూద్దాం.

**(అ) నినైప్పదెల్లామ్ నడందు విట్టాల్ దైవమ్ యేదుమిల్లయ్**
**నడుందదైయే నినత్తిరున్దాల్ అమైది యెం(డ్రుమిల్లయ్...**
**(నెంజిల్ ఓర్ ఆలయమ్)**

అనే కణ్ణదాసన్ గీతాన్ని 'మనసే మందిరం'లో ఆత్రేయ –

**తలచినదే జరిగినదా దైవం ఎందులకు**
**జరిగినదే తలచితివా శాంతి లేదు నీకు**

అంటూ చేసిన తర్జుమాలో 'దైవం ఎందులకు?' అనే ముగింపు మూలానికి పుష్టి నిచ్చింది .

(ఆ) ఎ.వి.యం.వారి 'కుళందైయుం దైవముం' అనే తమిళచిత్రాన్ని తెలుగులో 'లేత మనసులు' పేరుతో పునర్ని ర్మించారు. ఇందులో కణ్ణదాసన్ రచించిన –

**కుళందైయుం దైవముం గుణత్తాల్ ఒం(డ్రు**
**కు(ట్రంగళై మఱందు విదుం మనత్తాల్ ఒం(డ్రు..**

అనే గీతాన్ని తెలుగులో ఆరుద్ర –

**పిల్లలూ దేవుడూ చల్లనివారే**
**కల్లకపట మెరుగని కరుణామయులే**
**తప్పులు మన్నించుటే దేవుని సుగుణం**
**ఇది గొప్పవాళ్లు చెప్పినట్టి చక్కని జ్ఞానం**

అని చేర్పులూ, మార్పులతో ఒక సూక్తంగా సాధారణీకరించారు.

రీ మేక్ చిత్రాల్లోని పాటల్లో, బాలచందర్, మహదేవన్, ఆత్రేయ కలయికతో తీసిన అంతులేని కథ, ఆకలి రాజ్యం, గుప్పెడు మనసు, మరోచరిత్ర మొదలైన కళాఖండాలలోని పాటలు అనర్ఘరత్నాలు.

ఇలా డబ్బింగ్, రీమేక్, ఫ్రీమేక్.. ఏవయినా తమిళ భాషనుండి దిగుమతి చేసుకున్న తెలుగు చిత్రాల్లోని పాటలకు తమిళ గీతాలు తళుకు లద్దాయనడంలో సందేహం లేదు. ఇలాగే తమిళకవుల మెదళ్లకు పని కల్పించిన తెలుగు పాటలకు – కణ్ణదాసన్ 'ఇరన్డు మనమ్ వేండుమ్' (రెండు మనసులు కావాలి) అని రాయడానికి కారణమైన 'ప్రేమనగర్' లోని ఆత్రేయ పాట – 'మనసుగతి యింతే మనిషి బ్రతుకింతే'ను వుదహరించవచ్చు.

సినిమాల పరంగా తెలుగుకు తమిళమంత చేదోడువాదోడుగా వున్న భాష మరోటి లేదు! కన్నడిగు లన్నట్టు అరవం అధ్వాన్నం కాదు తెలుగు సినిమా ప్రేమికులకు మృష్టాన్నమే!

## కన్నడ కస్తూరి

తెలుగును తలకెత్తుకున్నది కన్నడం. (కన్నడ, తెలుగు లిపులకు ముఖ్యమైన తేడా తలకట్టే!) 'పునర్జన్మ' చిత్రం బెంగుళూరులో ఆడుతున్నప్పుడు ఆ చిత్రంలోని – 'ఓ సజీవ శిల్పసుందరీ నా జీవన రాగమంజరీ' అనే పాటకోసమే వెళ్లి, అది అయిపోగానే తిరిగి వచ్చేసేవాణ్ణనీ, అలా సుమారు ఇరవై సార్లయినా జరిగివుంటుందనీ ఒక కన్నడవ్యక్తి తనతో అన్నట్టు శ్రీశ్రీ 'పాడవోయి భారతీయుడా' సినిమా పాటల సంకలనంతో సగర్వంగా రాసుకొన్నారు.[1] 'స్వర్గసీమ' (1945) తెలుగు చిత్రాన్ని ముందుగా బెంగుళూరులోనే విడుదల చేయగా అక్కడది రజతోత్సవం జరుపుకొందట! మైసూర్‌లో పుట్టిన తెలుగు సంగీత దర్శకులు రాజన్ – నాగేంద్ర సంగీత దర్శకత్వం వహించిన 'పంతులమ్మ' చిత్రంలో వేటూరి రాసిన 'మానసవీణా, మధుగీతం'.. పాటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సినిమాపాటకు నంది పురస్కారాలు ప్రకటించిన మొదటి సంవత్సరం (1976) నంది పురస్కారం లభించింది. రాజకుమార్ 'హీరో'గా నటించిన 'గిరికన్యె' చిత్రంలోని అన్ని పాటల బాణీలను ఆ చిత్ర సంగీత దర్శకులు రాజన్ నాగేంద్ర 'నాగమల్లి', 'ఇంటింటి రామాయణం' మొదలైన తెలుగుచిత్రాల్లో వినియోగించారు. ఇలా తెలుగు కన్నడ సంబంధ బాంధవ్యాల గురించి యెంతైనా చెప్పొచ్చు.

కన్నడం శ్రావ్యమైన అజంతభాష. కన్నడంలో పలుమార్లు ఆవృత్తమయ్యే 'హ'శబ్దం ఆ భాషాసౌకుమార్యాన్ని కొంత తగ్గిస్తుందేమో నని కన్నడేతరుల అభిప్రాయం. పరభాషాచిత్రాల విడుదలను పరిమితిని మించి అనుమతించక పోవడం కన్నడిగుల మాతృభాషాభిమానాన్ని తెలియజేస్తుంది. యోగరాజ్‌భట్ దర్శకత్వంలో వచ్చిన కన్నడచిత్రం 'ముంగారు మళె' (2005) ఒకే థియేటర్‌లో 500 రోజులు ప్రదర్శింపబడిన భారతీయ చిత్రంగా రికార్డు నెలకొల్పిందట! కన్నడం నుంచి తెలుగు చేసిన డబ్బింగ్ చిత్రాలూ తక్కువే – వాటిలో ప్రాచుర్యం పొందినవీ తక్కువే. 'స్కూల్ మాస్టర్' (బిడిపంతులు–1958), 'మహిషాసురమర్దని' (1959), 'రణధీరకంఠీరవ' (సంచారి–1960) 'శ్రీశైల మాహాత్మ్యె'

---

1. 'పాడవోయి భారతీయుడా' పుట : 23.

(శ్రీశైల మహాత్మ్యం-1962) మహావీర మయూర్ (మయూర-1975), 'నా నిన్న మరెయలారె' (నే నిన్ను మరువలేను - 1979), భక్త సిరియాళ (1980) 'ప్రేమలోక' (ప్రేమలోకం - 1988) మొదలైనవి ప్రసిద్ధి పొందిన కన్నడ డబ్బింగ్ చిత్రాలు. కన్నడ బాణీల్లో తెలుగు యెలా వొదిగిందో సోదాహరణంగా చూద్దాం -

**1.** **అతి మధుర అనురాగ జీవనసంధ్యారాగ**
**సమరసద వైభోగ సంగ సమాగమ రాగ...** **(స్కూల్ మాష్టర్)**

**అతి మధురం అనురాగం జీవన వంశీరాగం**
**విమలతర వైభోగం, స్నేహ సమాగమరాగం**

**నీడల మురిసే ప్రియబర్హి**
**ఆడిన ఆటకె యెద తూగె**
**వన్నెల చిన్నెల వెన్నెలరేలా**
**వలపే సొగసే వుయ్యాలా**

**యౌవన మూగిన జంపాలా**
**ప్రీతిగ పాడిన జంపాలా**
**నెమ్మది నూగే పుప్పొడి డోలా**
**వలపే సొగసే వుయ్యాలా** **(రావూరి-బడిపంతులు)**

రెండిటినీ గమనిస్తే తెలుగుపాట కన్నడానికి యథామాతృకానువాదమని అర్థమవుతోంది. చాల తెలుగు పదాల చివర్లో వుండే పూర్ణానుస్వారం కన్నడంలో వుండదు. కాని ఉచ్చారణను బట్టి డబ్బింగ్‌లో సాధారణంగా యిబ్బంది వుండదు. కన్నడిగులు తరచుగా ప్రేమ అనే అర్థంలో 'ప్రీతి' అనే పదాన్ని వాడుతుంటారు. రావూరి ఈ పాటలో ఆమాటను కూడా మార్చలేదు. కన్నడ గీతాన్ని ఒకటికి రెండు మార్లు చదివితే దాని భావం అచ్చంగా తెలుగుపాటే అని తెలుస్తుంది గనుక భావాన్ని ప్రత్యేకంగా రాయడం లేదు.

**2.** **ప్రీతి ప్రేమగళే బదుకిగె సిరితన**
**ఒందే బాళద బదుకే బడతన... (2)** **(భక్త సిరియాళ)**

**మనిషికి మమతలే బ్రతుకున సిరులుగా**
**ఒంటరి బ్రతుకే మాయని లేమిగా (2)...**

**దంపతు లుభయులూ కలిసి మసలితే**
**కమ్మని స్వర్గము ఇలలో వుంది (2)**
**పతి సంసేవయె సతికి సర్వస్వం**
**ఆ సతి సహకారమె పతికి సర్వస్వం**

**ఉపవాసం వనవాసం దేవుని లీల**
**అందుకని లోకాన వగచే మనిషేల**
**హరిహర అనవలెను, ఇచ్చింది తినవలెను ॥మనిషికి॥**

**(రాజశ్రీ-భక్తసిరియాళ - 1980)**

ఇందులో మూలంలోని ప్రీతి వంటి పదాలను వాడకపోయినా - ఇది కూడా మక్కికి మక్కిగా చేసిన అనువాదమే.. చివరి రెండు పంక్తులు మరీ వాచ్యంగా వున్నా, భక్తిభావం, జేసుదాసు గానమాధుర్యం ఆ లోటును కనిపించ నివ్వవు.

పాటల్ని నిశితంగా గమనిస్తే - తెలుగు కన్నడభాషలకు పదాలతో సహా దగ్గర పోలికలున్నట్టు విదితమౌతోంది. కాని కన్నడ సినిమాలు కథనంలో మనకంటే బాగా వెనకబడి వుండడం వల్ల కన్నడ చిత్రాలను ఎక్కువగా తెలుగు చేయలేదు.

## మలయా(ళ)నిలం

కన్నడచిత్రాలు శ్రీశైల మల్లికార్జున స్వామినీ, శ్రీమంత్రాలయ రాఘవేంద్రస్వామినీ తెలుగువారికి గుర్తు చేస్తే - మలయాళ చిత్రం 'స్వామి అయ్యప్ప' (1977) అయ్యప్పస్వామిని తెలుగు నేలకు పరిచయం చేసి, స్వల్ప వ్యవధిలో ఆ భక్తి ప్రవాహంలో ఓలలాడేలా చేసింది.

మలయాళం సంస్కృత తత్సమపదాల్ని వేరే అర్థాల్లో వాడుకొనే చిత్రమైన దక్షిణాది భాష. ఉదాహరణకు 'ఆగ్రహం' అనే పదాన్ని 'కోరిక' అనే అర్థంలోను, 'సౌజన్యం' అనే పదాన్ని 'ఉచితం' అనే అర్థంలోను మలయాళంలో వాడతారు. సంస్కృత పదాలను నిజజీవితంలో మామూలుగా వుపయోగిస్తారు! చిన్న విషయాలకు కూడా మలయాళంలో పెద్ద పదాలను వాడడం యెంత సాధారణమంటే - దర్శకుడు అనే పదానికి బదులుగా 'సంవిధాయకన్' అనీ, పోటీ అనే అర్థంలో 'మత్సరం' అనీ పదప్రయోగాలు చేస్తారు! అందువల్ల మలయాళం నుంచి తెలుగులోకి 'డబ్' చేసేటప్పుడు తెలుగులో వున్న పదాలే మలయాళంలో వున్నా, వాటి అర్థాలు వేరవుతాయి. అందువల్ల అనువాదం చేసే కవులకు

శబ్ద సామ్యంవల్ల వుపయోగం వుండదు. మలయాళ భాష మీద కూడా అవగాహన వుంటే తప్ప లక్ష్యభాషకు న్యాయం చెయ్యలేరు.

మలయాళం నుంచి తెలుగు చేసిన చిత్రాల్లో- జీవిత నౌక (1951), సీత (1961), స్వామి అయ్యప్ప (1977), వైశాలి (1989), కంకణం (1992), దేవరాగం (1995) సుప్రసిద్ధాలు, 'స్వామి అయ్యప్ప'లో అనిసెట్టి తెనిగించగా దేవరాజన్ బాలు బృందం పాడిన బృందగీతాన్ని ముందుగా ఆస్వాదిద్దాం-

**స్వామీ శరణం శరణమయ్యప్ప**
**హరిహరసుత ఓ పావన చరితా**
**భక్త మందార భవ పరిహార**
**కరుణతో మమ్ము కావుము అయ్యప్పా**

**చరణం 1**

**ముడుపులు కట్టి శిరమున దాల్చి**
**మ్రొక్కులు తీర్చెదమయ్య**
**నీవే దిక్కని వేడెదమయ్య**
**దర్శన మొంద, ధన్యతపొంద**
**తరలివచ్చెద మయ్యప్ప, అయ్యపస్వామీ... అయ్యప్ప**

**చరణం 2**

**అళుకానదిలో మునిగి**
**రెండురాళ్లను చేతితో తీసి**
**నిండుభక్తితో గుట్టపై వుంచి**
**కరిమల చేరి కరములు మోడ్చి**
**ఆనంద ముప్పొంగ పాడుతాం (2)**

**చరణం 3**

**పంపను చేరి, ఆశలు మీరి**
**భక్తితో నిన్నే తలచి**
**నదిపై జ్యోతులనే వెలిగించి**
**శబరిపీఠం చూచి శరములు గుచ్చి**

నీ కీర్తి యెలుగెత్తి చాటుతాం.

చరణం 4

ప్రతియేడాది మకరసంక్రాంతికి
పావనసన్నిధి చేరి
నీదు దర్శనభాగ్యము కోరి
పదునెనిమిది మెట్లెక్కి
పదముల మొక్కి పరవశ మౌదుము స్వామి ॥స్వామి॥

పై భక్తిగీతాన్ని ఆసాంతం శ్రద్ధగా చదివితే పూజావిధానాన్ని వాచ్యంగా చెపుతూ – మధ్యమధ్య మూలంలోని సంస్కృత పదాల్ని వుపయోగించడాన్ని గమనిస్తాం.

తెలుగు మలయాళాలు రెండింటికీ సంస్కృత పద వినియోగంలో కొంతవరకు సాదృశ్యమున్నా, కొన్నిచోట్ల మలయాళ శబ్దాలకు అర్థాలు వేరు గనుక – మలయాళ భాష తెలిస్తే తప్ప దాని నుండి తెనిగించడం తేలిక కాదు. మలయాళీల వస్త్రధారణ, ఆచారవ్యవహారాలు కూడా భిన్నంగా వుంటాయి గనుక – మలయాళచిత్రాల పట్ల తెలుగు వారి ఆదరణపై సందేహాలున్నాయి. అందుకే నేమో 'చెమ్మీన్' వంటి గొప్ప చిత్రాలు కూడా తెలుగులో డబ్బింగ్‌కు నోచుకోలేదు. అయినా 'మనుషులు మారాలి', 'మాతృదేవోభవ' వంటి మలయాళ రీమేక్‌లను, లీల, చిత్ర, సుజాత, స్వర్ణలత, కె.జె.ఏసుదాసు వంటి మలయాళ గాయనీగాయకులను తెలుగుజాతి ఆదరించింది. అలాగే శారద వంటి నటీమణుల్ని మొదట ఆదరించిన మలయాళీలు ప్రస్తుతం అల్లు అర్జున్ చిత్రాలకు కూడా బ్రహ్మరథం పడుతున్నారు.

నలభైల దశకం నుంచి నేటివరకు తెలుగుతో పాటు ఇతర భాషాచిత్రాల్లో కూడా – నాలుగైదు పరభాషలకు సంబంధించిన పాటలతో ప్రేక్షకులను ఒప్పించి మెప్పించే ప్రయోగాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ భాషా స్వరూపాలను తెలుసుకొని ఒక భాషపై మిగిలిన వాటి ప్రభావాన్ని అంచనా వెయ్యడానికి – డబ్బింగ్ తోడ్పడుతుంది.

ఏ భాషలోనైనా ప్రాదేశికమైన ఆచారవ్యవహారాలు, సంస్కృతి, వేషధారణ మొదలైనవాటికి లోబడి సినిమాలను నిర్మిస్తారు. అవి యితర భాషల్లోకి డబ్ చేసినప్పుడు ప్రకృతితో సహా ఆ మౌలికత కొత్తగా గమ్మత్తుగా వుండి ప్రేక్షకులను ఆకట్టుకొంటాయి. నటీనటులను వాతావరణాన్ని మారిస్తే మాతృచిత్రం వల్ల కలిగే అనుభూతి రాదు. అందువల్ల

డబ్బింగ్ తప్పని సరి కావడమే కాదు; ప్రేక్షకులకు కంటిసిరిగాను, తక్కువ పెట్టుబడితో లాభాలు ఆర్జించడానికి నిర్మాతకు పంటిసిరి గాను ఆనందదాయక మవుతోంది. ఇలా పరభాషల నుండి వినోదవిజ్ఞానాలను ఆస్వాదిస్తూ ప్రేక్షకులు తమ పరిధిని విస్తృతం చేసుకోడానికి డబ్బింగ్ ప్రక్రియ దోహదం చేస్తోంది.

❖

ఈ ప్రకరణంలో

సమాచార సేకరణకు వుపయోగపడిన వ్యక్తులు, వ్యాసాలు-

1. తెలుగు సినిమాపాటల్లో బాలివుడ్ పరిమళాలు - పైడిపాల
   31.3.2015 సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వ్యాసం
2. 'తననాలు - తర్జుమాలు' 'సూర్య' దినపత్రికలో
   డా॥ మణిగోపాల్ (వనమాలి) వ్యాసాలు.
3. 'మోహిని' ఆంధ్రప్రభ విశేష ప్రచురణ (1999)లో
   ఇ.యస్.మూర్తి, వి.ఎ.కె. రంగారావుల వ్యాసాలు.
4. వక్కలంక కిషోర్ (ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, హైదరాబాద్) నుండి సమాచారం.
5. డా॥ కంపెల్ల రవిచంద్రన్ (తిరుపతి) నుండి సమాచారం.
6. పారుపూడి విశ్వేశ్వరావు, ఆర్థిక శాస్త్రోపన్యాసకులు (రి) అమలాపురం జ్ఞాపకాలు.

# ఎందుకోయీ పాటమాలీ, ఇంతయాతన?

**'ఒనరన్ నన్నయతిక్కనాది కవులీయుర్విన్ బురాణావళుల్**
**తెనుగుల్ సేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో**
**తెనుగుం జేయరు మున్ను భాగవతమున్...'**

అని భాగవతాన్ని తెనిగిస్తూ మహాకవి బమ్మెర పోతనామాత్యు డన్నట్టు – ఇంతవరకు తెలుగు సినిమాల్లో డబ్బింగ్ పాటల గురించి రాయాలనే ఆలోచన యెవరికీ రాకపోవడం నా అదృష్టమేమో! నేను 'తెలుగు సినిమాపాట చరిత్ర' (తెలుగు సినీగేయ సాహిత్యంపై వచ్చిన ప్రథమ ముద్రిత పరిశోధన గ్రంథం, 1992), 'తెలుగు సినీ గేయకవులచరిత్ర' (తెలుగు సినిమా సాహిత్యంపై ఉత్తమ పుస్తకం – 2010, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారి నందిపురస్కారం పొందిన పరిశోధన గ్రంథం) రాయడానికి ముందూవెనకా వివిధ విశ్వవిద్యాలయాల్లో చాలమంది పరిశోధక విద్యార్థులు చలనచిత్ర సాహిత్యం మీద పరిశోధనలు చేసి ఎం.ఫిల్, పిహెచ్.డి పట్టాలు తీసుకొన్నారు. ఇటీవల సినీసాహిత్యం మీద పరిశోధన చెయ్యడానికి అధికసంఖ్యలో విద్యార్థులు యెగబడుతున్నారు. అలాగే విశ్వవిద్యాలయాల వెలుపల కూడా సినిమాసాహిత్యం మీద గణనీయమైన సంఖ్యలోనే పుస్తకాలు వెలువడుతున్నాయి. అయితే వీరెవరి దృష్టి యెక్కువగా సినిమాకవుల మీద తప్ప తెలుగులో డబ్బింగ్ సినిమాల మీద పడలేదు. పిహెచ్.డి., యు.జి.సి. మేజర్ ప్రాజెక్ట్‌ల కోసం – పై రెండు పుస్తకాలు రాసిన తర్వాత సినీసాహిత్య పరిధిలోనే మరో పరిశోధన చెయ్యాలనే ఆలోచనలు నన్ను చుట్టిముట్టినప్పుడు ఈ 'అనువాద గేయసాహిత్యం' అనే అంశం నాకు స్ఫురించింది. దీనికి యు.జి.సి.వారి ఆమోదం లభించి ముగ్గులోకి దిగిన తర్వాత డబ్బింగ్‌ను కేవలం అనువాదం అనడం సబబు కాదనిపించింది. దానిని సహేతుకంగా విశ్లేషిస్తూ మొదటి అధ్యాయం రాశాను.

1950లో మొదటి డబ్బింగ్ చిత్రం ‘ఆహుతి’ విడుదలయిన తర్వాత ఆరేడేళ్లపాటు పదిలోపుకే పరిమితమైన డబ్బింగ్ చిత్రాలు క్రమంగా యేడాదికి రెండు మూడంకెల స్థాయికి యెదిగి – ప్రస్తుతం తెలుగులో నేరుగా తీసిన చిత్రాలతో సంఖ్యలో పోటీపడుతున్నాయి. రాశిపరంగా యింత అభివృద్ధిని సాధించిన డబ్బింగ్ చిత్రాలు ‘వాసి’లో మాత్రం వెనక బడి ‘ద్వితీయశ్రేణి’ గానే పరిగణింపడుతున్నాయి. వీటి మీద వున్న చిన్నచూపు కారణంగానే పేరుపడిన నిర్మాణ సంస్థలు యెక్కువగా వీటి జోలికి పోలేదు. అలాగే లబ్ధప్రతిష్ఠులైన సినీకవులు కూడా డబ్బింగ్ రచన కుత్సహించలేదు. అందువల్ల క్రమంగా వ్యాపార ధోరణి ప్రబలి, ఆ క్రీనీడల్లో డబ్బింగ్ చిత్రాలకు గుర్తింపు తగ్గింది. నేడు చిన్న నిర్మాతలు తక్కువ పెట్టుబడితో స్వల్పకాలంలో నిర్మించి లాభాలను ఆర్జించే సాధనాలుగానే డబ్బింగ్ చిత్రాలను వినియోగించు కొంటున్నారు. డబ్బింగ్ కవులకు సి.డి.లు యిచ్చి పాటలు రాయమనడం తప్ప, కొందరికి మాతృచిత్రాలను అసలు చూపించడమే లేదట! అలాగే డబ్బింగ్ చిత్రాలు విడుదలయిన తర్వాత వాటిని చూడ్డానికి ఆయా కవులను ఆహ్వానించడం లేదట! ఈ దుస్థితిలో తాము పాటలు రాసిన చిత్రాలను ‘డబ్’ చేసిన తర్వాత తెలుగులో నిర్మాతలు వాటికేం పేర్లు పెట్టారో కూడా కవులకు తెలియడం లేదట!

ఇలాంటి దురవస్థలో డబ్బింగ్ గేయకవులకు వారే చిత్రాలకు పాటలకు రాశారో, ఎన్ని చిత్రాలకు రాశారో – అసలు తాము పాటలు రాసిన చిత్రాలన్నీ విడుదలవుతున్నాయో లేదో కూడా అవగాహన లేని పరిస్థితి నెలకొంది. పాత తరంలోని ప్రసిద్ధకవుల వారసులకు, అనుయాయులకు ఆ కవులు రాసిన పాటల సమాచారం తెలియదు. అంతెందుకు వందల కొద్దీ డబ్బింగ్ చిత్రాలకు పాటలు రాస్తున్న వర్తమాన కవుల దగ్గర కూడా వారు రాసిన చిత్రాల, పాటల లెక్కలూ పద్దులూ లేవు. ఇలా మరుగునపడిపోయిన, మాసిపోతున్న డబ్బింగ్ చిత్రాల వివరాలను యిప్పుడైనా గ్రంథస్థం చెయ్యకపోతే – భవిష్యత్తులో తవ్వుదామనుకున్నా వాటి ఆనవాళ్లు దొరకవు. ‘నెట్’ మీద ఆధారపడితే తప్పులూ ఒప్పులూ తెలియని తిప్పలు తప్పవు. ఈ దయనీయమైన స్థితిని గమనించి, ప్రధానంగా డబ్బింగ్‌చిత్రాల, గేయాల చారిత్రకవికాసం, విలువలు మీద పరిశోధించి వాటిని గ్రంథస్థం చెయ్యాలనే సంకల్పం కలిగింది. ఆ సంకల్పబలంతో అటు ప్రభుత్వ చలనచిత్ర సంబంధిత సంస్థల దగ్గరగాని, చిత్రవిశేషాలను భద్రపరుస్తున్న ఔత్సాహికుల దగ్గర గాని – ఎక్కడా సమగ్రంగా లభించని చెదురు మదురుగా వున్న సమాచారాన్ని సేకరించి అరవయ్యేళ్ల డబ్బింగ్ చిత్రాల, డబ్బింగ్ కవుల జాబితాలను రూపొందించడం జరిగింది. నిజానికి ఈ

జాబితాల రూపకల్పనే ఒక పరిశోధన యెత్తు!

ఇలా నిర్లక్ష్యానికి గురవుతున్న డబ్బింగ్‌రంగం యెంత విలువైనదో, ప్రయోజన కరమైనదో - ఈ పుస్తకంలో వివిధసందర్భాలలో వివరించాను. ప్రపంచీకరణకు ప్రధాన సాధనమైన డబ్బింగ్‌సినిమా భిన్నదేశాల, జాతుల ఆలోచనలనూ, ఆచార వ్యవహారాలనూ మనకు అందిస్తోంది. వివిధ భారతీయభాషలలోని అమూల్యమైన సంగీత సాహిత్యాలను మనకర్థమయ్యే మాతృభాషలో తెలియపర్చి మనల నలరిస్తోంది. తెలుగులో నేరుగా తీసిన చిత్రాల్లోని గొప్ప పాటలకు దీటుగాను, కొండొకచో మెరుగ్గానూ వుండే ఆణిముత్యాలనెన్నిటినో ఈ డబ్బింగ్ రంగం మన కందిస్తోంది. అలాగే మన చిత్రాల్లోని ఘనతను పరభాషలకు పంచుతోంది. ముఖ్యంగా అటూ యిటూ నడుస్తున్న ఈ డబ్బింగ్ వల్ల ఏ యితివృత్తం, ఏభావచిత్రం, ఏ సంగీతబాణీ యెవరిదో యెక్కడిదో బయటపడి పొల్లులూ, కల్లలూ తేలిపోతున్నాయి. ప్రతిభకు సహజసృజనాత్మకతకు తగిన గౌరవాదరాలు లభిస్తున్నాయి. ఇలా నిజానిజాల నిర్ధారణ కుపకరించే డబ్బింగ్ చలనచిత్ర చరిత్ర మీద, ఆ చిత్రగేయాల మీద పొద్దువాలిపోతున్న ఈ సమయంలో నైనా పరిశోధన జరగవలసిన ఆవశ్యకత లేదా?

మహాకవి శ్రీశ్రీ మాటల్ని మరోసారి వుటంకిస్తున్నాను - 'డబ్బింగ్ పాట రాయడమంటే యిరుకైన గదిలో 200 మైళ్ల వేగంతో పరుగెత్తడం లాంటిది. నేరు చిత్రానికి రాసే పాట పట్టాల మీద పరుగుతీసే సూపర్ ఎక్స్‌ప్రెస్ లాంటిది!'

ఇంత కష్టమైన క్లిష్టమైన సర్కస్ ఫీట్ లాంటి డబ్బింగ్‌ప్రక్రియ నిరాదరణకు గురవుతున్నందుకు గుండెనిండా ఆవేదన, గుప్పెడు సానుభూతి - ఈ రచనకూ, ఇంత యాతనకూ ప్రేరణ!

❖

అనుబంధం-1

## తెలుగులో డబ్బింగ్ చిత్రాలు

| | |
|---|---|
| **1950 (2)** | |
| ఆహుతి (22-3) (హిం) | శ్రీశ్రీ |
| రాజా విక్రం (త) | |
| **1951 (1)** | |
| జీవిత నౌక (మ) | బలిజేపల్లి |
| **1952 (1)** | |
| సింగారి (త) | బలిజేపల్లి, గిడుతూరి సూర్యం |
| **1953 (3)** | |
| అమరకవి (త) | కోపల్లె వెంకట రమణారావు |
| ఇనస్పెక్టర్ (త) | ఆత్రేయ |
| జగన్మోహిని (క) | శ్రీశ్రీ |
| **1955 (3)** | |
| అంతా యింతే (త) | ఆత్రేయ |
| అతను యెవరు? (మ) | ముద్దుకృష్ణ |
| శ్రీజగన్నాథ మాహాత్మ్యము (ఒ) | శ్రీవాత్సవ |
| **1956 (7)** | |
| అమరజీవి (త) | శ్రీశ్రీ |
| ఆలీబాబా, 40దొంగలు (త) | తోలేటి, ఆరుద్ర |
| నాగపంచమి (త) | రావూరు వేంకట సత్యనారాయణ |
| రక్తకన్నీరు (త) | కృష్ణశాస్త్రి |
| శ్రీకృష్ణలీలలు (హిం) | అనిసెట్టి, బైరాగి, వీటూరి |
| సాహసవీరుడు (త) | శ్రీశ్రీ |

| | |
|---|---|
| సి.ఐ.డి. (త) | శ్రీశ్రీ |

**1957 (9)**

| | |
|---|---|
| ఎవరి అబ్బాయి (త) | శ్రీశ్రీ |
| గంధర్వ కన్య (క) | శ్రీశ్రీ |
| టౌన్ బస్ (త) | బైరాగి |
| తలవంచని వీరుడు (త) | శ్రీశ్రీ |
| పరాశక్తి (త) | సముద్రాల (సీనియర్) |
| రత్నగిరి రహస్యం (త) | శ్రీశ్రీ |
| రాజపుత్రి రహస్యం (త) | శ్రీశ్రీ |
| రాణి రంగమ్మ (త) | ఆరుద్ర |
| వేగుచుక్క (త) | సముద్రాల (జూనియర్) |

**1958 (11)**

| | |
|---|---|
| ఉత్తమ ఇల్లాలు (త) | శ్రీశ్రీ |
| కొండవీటి దొంగ (త) | అనిసెట్టి |
| పతిభక్తి (త) | శ్రీశ్రీ |
| పులిచేన పెళ్లి (మ) | రావూరు |
| బడి పంతులు (క) | రావూరు |
| భూలోక రంభ (త) | సముద్రాల (జూనియర్) |
| మహాదేవి (త) | శ్రీశ్రీ |
| విజయకోట వీరుడు (త) | శ్రీశ్రీ |
| వీర ఖడ్గము (త) | ఆరుద్ర |
| వీర ప్రతాప్ (త) | శ్రీశ్రీ |
| శ్రీరామ భక్తహనుమాన్ (హిం) | శ్రీశ్రీ |

**1959 (19)**

| | |
|---|---|
| అంతా పెద్దలే (త) | బైరాగి |
| అనగనగా ఒకరాజు (త) | శ్రీశ్రీ |

| | |
|---|---|
| ఇల్లాలి అదృష్టమే ఇంటికి భాగ్యం (త) | గబ్బిట వెంకట్రావు, కె.వి.ఆర్.ఆచార్య |
| గాంధారి గర్వభంగం (హిం) | శ్రీశ్రీ |
| గొప్పింటి అమ్మాయి (త) | బైరాగి |
| చెవిలో రహస్యం (త) | శ్రీశ్రీ |
| జింబో (హిం) | శ్రీశ్రీ |
| పెద్ద కోడలు (త) | నారపురెడ్డి |
| మంత్రవాది (మ) | అనిసెట్టి |
| మహాలక్ష్మి మహిమ (హిం) | శ్రీశ్రీ |
| మహిషాసుర మర్దని (క) | సముద్రాల (జూనియర్) |
| వీర ఘటోత్కచ (హిం) | శ్రీశ్రీ |
| వీరపాండ్య కట్టబ్రహ్మన (త) | కొసరాజు, ఆరుద్ర, సముద్రాల (జూనియర్) |
| వీరసింహ (క) | అనిసెట్టి |
| సంపూర్ణ రామాయణం (త) | ఆరుద్ర |
| సెభాష్ పిల్లా (త) | శ్రీశ్రీ |
| సౌభాగ్యవతి (త) | శ్రీశ్రీ |
| స్త్రీ శపథం (త) | అనిసెట్టి |
| హనుమాన్ పాతాళ విజయం (హిం) | శ్రీశ్రీ |

**1960 (18)**

| | |
|---|---|
| కన్నకూతురు (త) | నారపురెడ్డి |
| కల్యాణి (త) | శ్రీశ్రీ |
| కార్మిక విజయం (త) | అనిసెట్టి |
| కాలాంతకుడు (త) | వడ్డాది, కొసరాజు |
| క్రొత్తదారి (త) | బైరాగి |
| జంగిల్ రాణి (మ) | అనిసెట్టి |
| జింబో నగర ప్రవేశం (హిం) | శ్రీశ్రీ |
| దేసింగురాజు కథ (త) | శ్రీశ్రీ |
| నాగమోహిని (హిం) | శ్రీశ్రీ |
| పతివ్రత (త) | అనిసెట్టి, వేణుగోపాల్ |

| | |
|---|---|
| బాగ్దాద్ గజదొంగ (త) | వడ్డాది |
| భక్త విజయం (క) | ఆరుద్ర |
| మనసిచ్చిన మగువ (త) | శ్రీశ్రీ |
| మహారథి కర్ణ (హిం) | జాషువా, కరుణశ్రీ, వీటూరి, బి.యస్.చారి |
| మావూరి అమ్మాయి (త) | అనిసెట్టి |
| వీరజగ్గడు (హిం) | ఆరుద్ర |
| శ్రీకృష్ణ పాండవ యుద్ధము (హిం) | అనిసెట్టి |
| సంచారి (క) | అనిసెట్టి |

**1961 (28)**

| | |
|---|---|
| అనుమానం (త) | అనిసెట్టి |
| అమూల్య కానుక (త) | వేణుగోపాల్, గన్నిసెట్టి |
| అరబ్బీ వీరుడు జబక్ (హిం) | శ్రీశ్రీ |
| ఎవరు దొంగ (త) | శ్రీశ్రీ |
| కత్తిపట్టిన రైతు (త) | శ్రీశ్రీ |
| కన్యకాపరమేశ్వరి మహత్యం (త) | అనిసెట్టి |
| కష్టసుఖాలు (త) | వేణుగోపాల్ |
| కొరడా వీరుడు (త) | వేణుగోపాల్, ములుకుట్ల |
| చిన్నన్న శపథం (త) | అనిసెట్టి |
| జగదేక సుందరి (హిం) | వీటూరి, వరప్రసాద్ |
| జేబుదొంగ (త) | అనిసెట్టి |
| తల్లి యిచ్చిన ఆజ్ఞ (త) | శ్రీశ్రీ |
| పచ్చని సంసారం (హిం) | కొసరాజు, వేణుగోపాల్, శ్రీరామ్‌చంద్ |
| పాపపరిహారం (త) | అనిసెట్టి |
| పాపాల భైరవుడు (త) | వడ్డాది, వరప్రసాదరావు |
| మదన మంజరి (హిం) | శ్రీశ్రీ |
| మాయా మశ్చీంద్ర (హిం) | అనిసెట్టి |
| ముసుగు వీరుడు (త) | ఆరుద్ర, వేణుగోపాల్ |

| | |
|---|---|
| యోధాను యోధులు (త) | శ్రీరామచంద్, నారపరెడ్డి, సుంకర, వరప్రసాదరావు |
| రాణి చెన్నమ్మ (క) | శ్రీరామ్‌చంద్ |
| విప్లవ స్త్రీ (త) | సముద్రాల ద్వయం |
| విప్లవవీరుడు (త) | అనిసెట్టి |
| విరిసిన వెన్నెల (త) | అనిసెట్టి |
| వీరసామ్రాజ్యం (త) | మల్లాది |
| వీరాధి వీరుడు (త) | వేణుగోపాల్ |
| సంపూర్ణ రామాయాణం (హిం) | శ్రీశ్రీ |
| సీత (లవ-కుశ) (మ) | అనిసెట్టి |
| స్త్రీ హృదయం (త) | అనిసెట్టి |

**1962 (20)**

| | |
|---|---|
| ఆదర్శ వీరులు (త) | అనిసెట్టి |
| ఇద్దరు కొడుకులు (త) | గబ్బిట వెంకటరావు |
| ఏకైక వీరుడు (త) | వీటూరి |
| ఖడ్గ వీరుడు (త) | ఆరుద్ర |
| దశావతారములు (క) | సముద్రాల (జూనియర్) |
| పతి గౌరవమే సతి కానందం (త) | అనిసెట్టి |
| పవిత్ర ప్రేమ (త) | అనిసెట్టి |
| పార్వతీ విజయం (హిం) | వీటూరి, తాండ్ర సుబ్రహ్మణ్యం |
| ప్రజాశక్తి (త) | అనిసెట్టి |
| ప్రాయశ్చిత్తం (త) | అనిసెట్టి |
| భాగ్యవంతులు (త) | ఉషశ్రీ |
| మాయామోహిని (క) | అనిసెట్టి |
| మురిపించే మువ్వలు (త) | ఆరుద్ర |
| విచిత్ర వీరుడు (త) | వేణుగోపాల్ |
| వీరపుత్రుడు (త) | అనిసెట్టి |
| శ్రీవల్లీ కల్యాణం (త) | శ్రీశ్రీ |

| | |
|---|---|
| శ్రీశైల మాహాత్మ్యం (క) | మల్లాది |
| సత్యభామా పరిణయం (శ్రీగణేష్ మహిమ) (హిం) | శ్రీశ్రీ |
| సామ్రాట్ పృథ్వీరాజ్ (హిం) | అనిసెట్టి |
| స్త్రీ జీవితం (త) | సముద్రాల (సీనియర్) |

**1963 (17)**

| | |
|---|---|
| అదృష్టవతి (త) | శ్రీశ్రీ |
| కొడుకులు-కోడళ్లు (త) | శ్రీశ్రీ |
| చిత్తూరురాణి పద్మిని (త) | శ్రీశ్రీ |
| జ్ఞానేశ్వర్ (సంత్) (హిం) | మల్లాది |
| తల్లి కొడుకు (త) | |
| త్యాగమూర్తులు (త) | అనిసెట్టి |
| నరాంతకుడు (త) | శ్రీశ్రీ |
| నాగదేవత (త) | వీటూరి |
| నిరపరాధి (త) | శ్రీశ్రీ |
| మమకారం (త) | ఎ. వేణుగోపాల్ |
| మహాభారతము (హిం) | శ్రీశ్రీ |
| మహావీర భీమసేన (త) | అనిసెట్టి |
| మాయాజాలం (త) | శ్రీశ్రీ |
| మూఢ నమ్మకాలు (త) | రాజశ్రీ |
| రాజాధిరాజు కథ (త) | రాజశ్రీ, ములుకుట్ల |
| రాణీ సంయుక్త (త) | ఆరుద్ర |
| విజయనగర వీరపుత్రుని కథ (క) | శ్రీశ్రీ |

**1964 (16)**

| | |
|---|---|
| అద్దాల మేడ (త) | శ్రీశ్రీ |
| ఆదర్శ సోదరులు (త) | అనిసెట్టి |
| ఇంటి దొంగ (త) | శ్రీశ్రీ |

| | |
|---|---|
| కర్ణ (త) | సి.నారాయణరెడ్డి |
| కలియుగ భీముడు (హిం) | అనిసెట్టి |
| కవల పిల్లలు (త) | శ్రీశ్రీ |
| దొంగ బంగారం (త) | అనిసెట్టి |
| దొంగను పట్టిన దొర (త) | అనిసెట్టి |
| దొంగ నోట్లు (త) | అనిసెట్టి |
| దొంగలు, దొరలు (త) | రాజశ్రీ, ఆదిశేషారెడ్డి |
| నవరత్న ఖడ్గరహస్యం (త) | శ్రీశ్రీ |
| మాస్టారమ్మాయి (త) | అనిసెట్టి |
| రక్తతిలకం (త) | శ్రీశ్రీ |
| వనసుందరి (త) | ఆరుద్ర |
| వీర సేనాధిపతి (త) | శ్రీశ్రీ |
| హంతకుడెవరు? (త) | వడ్డాది |

**1965 (19)**

| | |
|---|---|
| అందీ అందని ప్రేమ (త) | అనిసెట్టి |
| అదృశ్యహంతకుడు (త) | రాజశ్రీ |
| ఉక్కుమనిషి (త) | అనిసెట్టి |
| కథానాయకుడు కథ (త) | శ్రీశ్రీ |
| ఘరానా హంతకుడు (త) | |
| చలాకీ పిల్ల | అనిసెట్టి |
| తుపాకీ పిల్ల (త) | |
| ప్రేమించి పెళ్లి చేసుకో (త) | అనిసెట్టి |
| భక్త కనకదాసు (క) | వీటూరి |
| భీమప్రతిజ్ఞ (హిం) | అనిసెట్టి |
| మాంగల్య మహిమ (త) | అనిసెట్టి |
| మారని మనసులు (త) | వడ్డాది |
| ముగ్గురమ్మాయిలు-మూడు హత్యలు (త) | ఆరుద్ర |
| రాజద్రోహి (త) | వీటూరి |

| | |
|---|---|
| వీరమార్తాండ (త) | శ్రీశ్రీ |
| శివరాత్రి మాహాత్మ్యం (క) | |
| సంజీవిని రహస్యం | పొట్లూరి |
| సింగపూర్ సి.ఐ.డి (త) | ఆరుద్ర |
| సింద్‌బాద్ ఆలీబాబా అల్లావుద్దీన్ (హిం) | శ్రీశ్రీ |

**1966 (13)**

| | |
|---|---|
| అడవి పిల్ల (మ) | అనిసెట్టి |
| అడవియోధుడు (మ) | అనిసెట్టి |
| అమ్మ-నాన్న (త) | రాజశ్రీ |
| కత్తిపోటు (క) | వడ్డాది |
| కన్నెపిల్ల (త) | అనిసెట్టి |
| కాలం మారింది | |
| దైవశాసనం (త) | శ్రీశ్రీ |
| దొంగలకు దొంగ | శ్రీశ్రీ |
| నాగజ్యోతి | శ్రీశ్రీ |
| పెళ్లి పందిరి (త) | రాజశ్రీ |
| మా అన్నయ్య (త) | వడ్డాది |
| యెవరా స్త్రీ (త) | వడ్డాది |
| సర్వర్ సుందరం (త) | అనిసెట్టి |

**1967 (15)**

| | |
|---|---|
| అనుమానం పెనుభూతం (త) | ఆదిశేషారెడ్డి, అనిసెట్టి |
| కాలచక్రం (త) | అనిసెట్టి |
| కొంటె పిల్ల (త) | అనిసెట్టి |
| ధనమే ప్రపంచ లీల (త) | వీటూరి |
| ధనమే ధాన్యలక్ష్మి (త) | అనిసెట్టి |
| నువ్వే (త) | అనిసెట్టి |
| పెళ్లంటే భయం (త) | శ్రీశ్రీ |

| | |
|---|---|
| ముగ్గురు మిత్రులు | |
| ముళ్లకిరీటం (త) | రాజశ్రీ, ఆత్రేయ |
| వీరప్రతిజ్ఞ (త) | అనిసెట్టి |
| శభాష్ రంగా (త) | ఆరుద్ర |
| శివలీలలు (త) | శ్రీశ్రీ |
| శ్రీకృష్ణ మహిమ (త) | అనిసెట్టి |
| సరస్వతీ శపథం (త) | ఆరుద్ర |
| హంతకుని హత్య (త) | అనిసెట్టి |

**1968 (21)**

| | |
|---|---|
| అంతులేని హంతకుడు (త) | వడ్డాది |
| అగ్గిరవ్వ | |
| అనుభవించు రాజా అనుభవించు (త) | అనిసెట్టి |
| కోయంబత్తూరు ఖైదీ (త) | ఆరుద్ర |
| గలాటా పెళ్లిళ్లు (త) | అనిసెట్టి |
| డబ్బారాయుడు-సుబ్బారాయుడు | |
| దెబ్బకు దెబ్బ (త) | వడ్డాది |
| దోపిడీ దొంగలు (త) | ఆరుద్ర |
| పూలపిల్ల (త) | రాజశ్రీ |
| పోస్ట్‌మాన్ రాజు (త) | రాజశ్రీ |
| ప్రేమకథ (త) | అనిసెట్టి |
| బస్తీలో భూతం (త) | అనిసెట్టి |
| భయంకర బడాచోర్ (త) | అనిసెట్టి |
| మాంగల్య విజయం (త) | రాజాశివానంద్, తాండ్ర |
| మాయామందిరం (త) | ఆరుద్ర |
| ముద్దు పాప (త) | అనిసెట్టి |
| విచిత్ర సోదరులు (త) | అనిసెట్టి |
| విధి (హిం) | శ్రీశ్రీ |
| వెయ్యి రూపాయల నోటు (త) | |

శ్రీమంతులు
సి.ఐ.డి. 999

**1969 (12)**

| | |
|---|---|
| ఆదర్శ పెళ్లిళ్లు (త) | అనిసెట్టి |
| కొండవీటి సింహం (త) | ఆరుద్ర |
| గజదొంగ గంగన్న (త) | వీటూరి |
| గోవా సి.ఐ.డి. 909 (క) | ఆరుద్ర |
| డ్రైవర్ మోహన్ (త) | అనిసెట్టి |
| దొరలా దొంగలా (త) | రాజశ్రీ |
| నామాటంటే హడల్ | |
| ప్రేమ మనసులు (త) | అనిసెట్టి |
| బలవంతపు పెళ్లి (త) | జి. కృష్ణమూర్తి |
| మద్రాసు టు హైదరాబాద్ | |
| రహస్య పోలీస్ 333 (త) | అనిసెట్టి |
| రాజ్యకాంక్ష (త) | అనిసెట్టి |

**1970 (15)**

| | |
|---|---|
| అడవి రాజా | |
| ఎవరి పాపాయి? (త) | రాజశ్రీ, గోపి |
| కిలాడీ సి.ఐ.డి. - 999 (క) | |
| కోటీశ్వరుడు (త) | ఆత్రేయ, రాజశ్రీ |
| జాక్‌పాట్‌లో గూఢచారి (త) | అనిసెట్టి |
| తుపాకీ రంగడు (క) | శ్రీశ్రీ |
| బలరాం శ్రీకృష్ణ కథ (హిం) | అనిసెట్టి |
| బొమ్మలాట (త) | శ్రీశ్రీ |
| భయంకర గూఢచారి (త) | |
| రంగమహల్ రహస్యం (త) | అనిసెట్టి |
| రైతువీరుడు (త) | |

| | |
|---|---|
| విచిత్ర వివాహం (త) | |
| విప్లవం వర్ధిల్లాలి (త) | ఆరుద్ర |
| శ్రీ సుబ్రహ్మణ్య స్వామి (త) | అనిసెట్టి |
| సింగపూర్ హంతకులు (త) | |

**1971 (20)**

| | |
|---|---|
| ఆదిపరాశక్తి | |
| కిలాడి శంకర్ (క) | అనిసెట్టి |
| గూఢచారి 003 (త) | |
| గూఢచారి 115 (త) | శ్రీశ్రీ |
| ఘరానా దొంగలు (క) | అనిసెట్టి |
| జగత్ కంత్రీలు (త) | ఆరుద్ర |
| జగత్ మోసగాళ్లు (త) | |
| తల్లిని మించిన తల్లి | |
| తిండిపోతు రాముడు (త) | |
| దొంగలను మించిన దొంగ (త) | |
| పగ | |
| మనసిచ్చి చూడు (త) | రాజశ్రీ |
| మేమే మొనగాళ్లం (త) | వడ్డాది |
| మేరీ మాత (త) | రాజశ్రీ |
| విచిత్ర ప్రేమ | |
| శ్రీకృష్ణ దేవరాయలు (క) | రాజశ్రీ |
| శ్రీకృష్ణ లీల (హిం) | ఆరుద్ర |
| శ్రీమహావిష్ణు మహిమలు (త) | |
| సికింద్రాబాద్ సి.ఐ.డి. (త) | కోమల కృష్ణారావు |
| స్వర్గం (త) | అనిసెట్టి |

**1972 (15)**

| | |
|---|---|
| అక్కా – తమ్ముడు (త) | అనిసెట్టి |

| | |
|---|---|
| అల్లరి అమ్మాయిలు (త) | శ్రీశ్రీ |
| తిరుపతి కన్యాకుమారి యాత్ర (త) | |
| ప్రాణ స్నేహితుడు | |
| బందిపోటు భయంకర్ | |
| బస్తీమే సవాల్ | |
| బావ దిద్దిన కాపురం | |
| బుల్లెట్ బుల్లోడు | ఆరుద్ర |
| మాయింటి జ్యోతి (త) | |
| రంగన్న శపథం (త) | |
| రాజా (త) | |
| రిక్షా రాముడు (త) | రాజశ్రీ |
| శ్రీకన్యకాపరమేశ్వరి కథ (క) | గబ్బిట వెంకట్రావు |
| సంపూర్ణ తీర్థయాత్ర (హిం) | శ్రీశ్రీ |
| సవాల్‌కు సవాల్ (త) | |

**1973 (9)**

| | |
|---|---|
| ఏసు ప్రభువు (త) | రాజశ్రీ |
| కిలాడి దొంగలు (త) | శ్రీశ్రీ |
| గురు దక్షిణ | శ్రీశ్రీ |
| దసరా పిచ్చోడు | అనిసెట్టి |
| పరోపకారి | |
| బుల్లబ్బాయిపెళ్లి | రాజశ్రీ |
| మహాశక్తి మహిమలు | అనిసెట్టి |
| లోకం చుట్టిన రాముడు | అనిసెట్టి |
| లోకం మారాలి | |

**1974 (11)**

| | |
|---|---|
| అడవి దొంగలు | అనిసెట్టి |
| ఆడపిల్లలు-అర్ధరాత్రి హత్యలు | శ్రీశ్రీ |

| | |
|---|---|
| గుప్తజ్ఞానం | ఆరుద్ర |
| గౌరవం (త) | రాజశ్రీ |
| జల్సా బుల్లోడు | |
| తిరుగుబాటు వీరుడు | రాజశ్రీ |
| బస్తీపిల్ల-భలేదొంగ | శ్రీశ్రీ |
| మొనగాళ్లకు మోసగాళ్లు | |
| వాణి-దొంగల రాణి | |
| శ్రీ వేంకటేశ్వర కల్యాణం | అనిసెట్టి |
| హనుమాన్ విజయం | ఆరుద్ర |

**1975 (13)**

| | |
|---|---|
| కొండవీటి వీరుడు | |
| ఖైదీ పెళ్లి | శ్రీశ్రీ |
| దున్నేవాడిదే భూమి | |
| దొంగల్లో మొనగాడు | రాజశ్రీ |
| నాగపూజా మహిమ | ఆరుద్ర |
| పగబట్టిన మనిషి | |
| పడుచుపిల్ల - పగటి దొంగలు | |
| పెద్ద మనిషి | రాజశ్రీ |
| బాగ్దాద్ వీరుడు | రాజశ్రీ |
| మిస్ జూలీ ప్రేమ కథ (హిం) | ఆరుద్ర, దాశరథి |
| రంగేలీ రాణి | అనిసెట్టి |
| శ్రీచాముండేశ్వరి మహిమ | గబ్బిట వెంకట్రావు |
| హలో పార్ట్‌నర్ | అనిసెట్టి |

**1976 (26)**

కక్ష-శిక్ష

కాశ్మీరు బుల్లోడు

కేడి-రౌడి

| | |
|---|---|
| కోటి విద్యలు కూటి కొరకే | |
| తల్లి మనసు | |
| దశావతారములు | ఆరుద్ర |
| ధర్మ పరీక్ష | |
| నారద వినోదం | |
| నిప్పులాంటి ఆడది | |
| పాములు పెంచిన పసివాడు | శ్రీశ్రీ |
| ప్రచండ వీరుడు | |
| ప్రేమ లీలలు | |
| ప్రేమా?-ధర్మమా? | |
| బంగారు పతకం (త) | రాజశ్రీ |
| బ్రహ్మముడి (త) | రాజశ్రీ |
| మంచికోసం | |
| మన్మథ లీల (త) | వీటూరి |
| మహావీర మయూర (క) | రాజశ్రీ |
| మహేశ్వరి మహత్యం | అనిసెట్టి |
| మా మంచితల్లి | |
| మోసగాళ్లకు సవాల్ | |
| రాజరాజ చోళుడు (త) | రాజశ్రీ |
| వజ్రాలదొంగ | |
| శృంగార లీల | వీటూరి |
| సంపూర్ణ శివపురాణము (హిం) | ఆరుద్ర |
| హీరో-76 | |

**1977 (24)**

| | |
|---|---|
| అందాల రాజా | |
| అత్తపోరు | |
| అదృష్టవంతురాలు | రాజశ్రీ |
| ఎదురులేని రాముడు | రాజశ్రీ |

| | |
|---|---|
| ఎదురు లేని నాయకుడు | |
| గృహప్రవేశం | రాజశ్రీ |
| చేతిలో చెయ్యేసిచెప్పు | |
| తల్లిలేని పిల్ల | రాజశ్రీ |
| దేవుడిచ్చిన భార్య | |
| దొంగలు చేసిన దేవుడు | |
| ధర్మాత్ముడు | |
| ధృవవిజయం | |
| నన్ను ప్రేమించు | |
| పాపం పసిపాప | దాసరధి, కొసరాజు |
| భలేరాజా | |
| భారత నివాస్ (త) | రాజశ్రీ |
| మనసున్న మనిషి | |
| మోహినీ విజయం | రాజశ్రీ |
| యవ్వనం మురిపించింది | |
| రాగద్వేషాలు | అనిసెట్టి |
| రాగాలు అనురాగాలు | రాజశ్రీ |
| రాజా కోరిన రోజా | |
| శివ జలంధర యుద్ధం (హిం) | |
| సింగన్న శపథం | రాజశ్రీ |

**1978 (15)**

| | |
|---|---|
| అమరప్రేమ | |
| ఇంటిని దిద్దిన ఇల్లాలు | |
| ఎత్తుకు పై యెత్తు | |
| ఎదురులేని కథానాయకుడు | |
| జనరల్ చౌదరి | |
| నాగకన్య | |
| పరశురామప్రతిజ్ఞ | గబ్బిట వెంకట్రావు |

| | |
|---|---|
| ప్రజల కోసం | |
| ప్రేమ పూజారి అండ్ మరో అహల్య (క) | |
| శంకర్ సలీమ్ సైమన్ | |
| శ్రీకృష్ణ మహత్యం (గురవాయూరప్ప లీలలు) | |
| శ్రీ తిరుపతి క్షేత్ర మహత్యం | |
| సెభాష్ ఇనస్పెక్టర్ | |
| సర్కస్ కిలాడీలు | |
| స్వామి అయ్యప్ప (మ) | అనిసెట్టి |

**1979 (29)**

| | |
|---|---|
| అజేయుడు | |
| అపరిచితులు (త) | రాజశ్రీ |
| అర్జున గర్వభంగం | రాజశ్రీ |
| అల్లావుద్దీన్ అద్భుత దీపం | రాజశ్రీ |
| ఇదో చరిత్ర (త) | ఆరుద్ర |
| ఎర్ర గులాబీలు (త) | ఆత్రేయ, వీటూరి |
| ఎవరో చూస్తున్నారు | ఆత్రేయ |
| కరాటే కమల | |
| గాయత్రి | |
| గోల్కొండ గజదొంగ | శ్రీశ్రీ, గోపి, వడ్డాది |
| టైగర్ రాణి | |
| డ్రైవర్ రాజు | |
| తిరుగులేని మొనగాడు(త) | రాజశ్రీ |
| దొంగ దొర | |
| ధర్మ యుద్ధం | |
| నాగమోహిని | |
| నే నిన్ను మరువలేను (క) | రాజశ్రీ |
| పిడుగులాంటి పిల్ల | |
| ప్రత్యక్ష దైవం | అనిసెట్టి |

| | |
|---|---|
| బంగారు గుడి | |
| భలే సోగ్గాడు | |
| భైరవి | |
| మరో ధర్మరాజు | |
| ముల్లు-పువ్వు (త) | |
| రామూ గెలుపు నీదే | |
| వజ్రాల వేట | |
| వెండి రథం | |
| శ్రీరాఘవేంద్ర మహిమ (క) | గోపి |
| సాహస వంతురాలు | |

**1980 (21)**

| | |
|---|---|
| అన్నదమ్ముల శపథం (త) | అనిసెట్టి |
| ఆకాశంలో భూకంపం | |
| కల్యాణ రాముడు (త) | రాజశ్రీ |
| కొండరాజు, కోయపిల్ల (త) | గబ్బిట వెంకట్రావు |
| జన్మ హక్కు | |
| డా. మధు (క) | వీటూరి |
| దగాకోరులు | |
| పట్నం పిల్ల (త) | వీటూరి |
| పాటగాడు (త) | రాజశ్రీ |
| పాతాళ మోహిని (త) | వీటూరి |
| పైలట్ ప్రేమనాథ్ (త) | |
| భక్త శిరియాళ (క) | రాజశ్రీ |
| బందిపోటు ముఠా | |
| మరో ప్రేమ కథ | |
| మిష్టర్ రజనీకాంత్ (త) | రాజశ్రీ |
| ముత్యాల పందిరి (త) | రాజశ్రీ |
| సత్యవంతుడు | |

| | |
|---|---|
| సింగపూర్ కిలాడీలు (క) | రాజశ్రీ |
| సెభాష్ మారుతి | శ్రీశ్రీ |
| శ్రీ అంకాళ పరమేశ్వరి (త) | శ్రీశ్రీ |
| శ్రీ కంచి కామాక్షి (త) | |

**1981 (28)**

| | |
|---|---|
| కాంక్ష | |
| కొంటె కుర్రాళ్లు | |
| కోరిక | |
| గణేష్ మహిమ (త) | రాజశ్రీ |
| చిలిపి మొగుడు (త) | ఆరుద్ర, రాజశ్రీ |
| జగద్గురు ఆది శంకరాచార్య (త) | శ్రీశ్రీ, వేటూరి |
| దేవతల కల్యాణం (త) | రాజశ్రీ |
| దేవుడు ఏం చేస్తున్నాడు? (త) | వేటూరి |
| దేవీ దర్శనం (త) | రాజశ్రీ |
| దేవీ రాజరాజేశ్వరి (క) | రాజశ్రీ |
| నాగపూజా మహిమ (త) | ఆరుద్ర |
| నేపాల్ గూఢచారి (క) | రాజశ్రీ |
| ప్రేమ పిచ్చి | ఆత్రేయ |
| భక్తుడు – భగవంతుడు | |
| భలే బుల్లోడు | |
| మంత్రశక్తి – దైవభక్తి (త) | రాజశ్రీ |
| మరియా, మై డార్లింగ్ (త) | వేటూరి |
| మౌన గీతం (త) | ఆత్రేయ |
| శనీశ్వర మహిమ (క) | వేటూరి |
| శివభక్త విజయము (త) | వేటూరి |
| శ్రీ ఆంజనేయ చరిత్ర (త) | వేటూరి |
| శ్రీ శివకుమార సంభవమ్ (త) | ఆరుద్ర |
| శ్రీ లక్ష్మీనారాయణ వైభవం | |

| | |
|---|---|
| షిర్డీ సాయిబాబా (త) | శ్రీశ్రీ |
| సవాల్ | |
| సిసింద్రీలు - చిచ్చుబుడ్డి (క) | వేటూరి |
| స్వామియే శరణం అయ్యప్ప (త) | ఆరుద్ర |
| హృదయమున్న మనిషి | |

**1982 (49)**

| | |
|---|---|
| అత్తకు తగ్గ అల్లుళ్లు (త) | ఆత్రేయ |
| అమర గీతం (త) | వేటూరి |
| ఇల్లాలు -చూలాలు (త) | ఆరుద్ర |
| ఈశ్వర కటాక్షం (త) | వేటూరి |
| ఊరి కొక్కడు (త) | రాజశ్రీ |
| కన్నె బలి (మ) | |
| కలియుగ జాంబవంతుడు (త) | వేటూరి |
| కేన్సరు-సుఖవ్యాధులు (మ) | వేటూరి |
| గరుడ రేఖ (క) | రాజశ్రీ |
| గ్రామ కక్షలు (త) | రాజశ్రీ |
| చట్టంతో చెలగాటం (త) | రాజశ్రీ |
| చిలిపి చిన్నోడు (త) | రాజశ్రీ |
| చిలిపి వయసు | |
| జయమాలిని (త) | వేటూరి |
| జై మహాకాళి (హిం) | వేటూరి |
| జై సంతోషిమాతా (హిం) | వేటూరి |
| జ్వాల (త) | వేటూరి |
| టిక్ టిక్ టిక్ (త) | ఆత్రేయ |
| దాహం దాహం (త) | శ్రీశ్రీ |
| దైవలీలలు (త) | |
| దొంగలొస్తున్నారు జాగ్రత్త (త) | వేటూరి |
| నా పేరే జానీ (త) | రాజశ్రీ |

| | |
|---|---|
| పగబట్టిన బెబ్బులి (హిం) | గోపి |
| పట్నం మొగుడు –పల్లెటూరి పెళ్లాం | గోపి |
| పన్నీరు పుష్పాలు (త) | |
| పల్లెటూరి సింహం (త) | రాజశ్రీ |
| పార్వతి మళ్లీ పుట్టింది (మ) | గోపి |
| పురందర దాసు (త) | వీటూరి |
| ప్రేమకు పాదాభిషేకం (త) | ఆరుద్ర, రాజశ్రీ |
| బందిపోటు విప్లవసింహం (త) | రాజశ్రీ |
| బాలనాగమ్మ (త) | రాజశ్రీ |
| భక్త జ్ఞానదేవ (క) | రాజశ్రీ |
| మంచు కొండలు (మ) | రాజశ్రీ |
| మట్టెల సవ్వడి (త) | వీటూరి |
| మధురగీతం (త) | రాజశ్రీ |
| మరో ధర్మరాజు | |
| మహానటి (క) | ఆరుద్ర |
| ముసలోడికి దసరాపండగ (త) | వీటూరి |
| రంగూన్ రాజా (త) | వీటూరి |
| రాగమాలిక (త) | వేటూరి |
| వసంతకోకిల (త) | గోపి |
| విజయభేరి (త) | గోపి |
| విప్లవ జ్యోతి | |
| శివరాత్రి | |
| సర్కస్ ప్రపంచం | |
| సావిత్రి | |
| సీత –లవకుశ (ఒ) | |
| హంతకులకు సవాల్ (త) | |
| హిమబిందు (త) | రాజశ్రీ |

**1983 (34)**

| | |
|---|---|
| అంతం చూసిన ఆడది (త) | రాజశ్రీ |
| అఖండ సౌభాగ్యవతి (హిం) | గోపి |
| అల్లుడుగారి అగచాట్లు (త) | గణేష్‌పాత్రో |
| ఈశ్వరుడు-శనీశ్వరుడు (త) | వీటూరి |
| ఉరుములు-మెరుపులు (క) | రాజశ్రీ |
| కక్షసాధిస్తా | |
| కన్నె దొంగ | |
| కలియుగ దైవం | |
| కిరాయి రంగడు (త) | గోపి, వీటూరి |
| గానం (మ) | |
| చట్టం (త) | రాజశ్రీ |
| చట్టానికి సవాల్ | |
| ఛాలెంజ్ వేటగాళ్లు (క) | గోపి |
| డాక్టర్ గారి కోడలు (త) | రాజశ్రీ |
| డార్లింగ్ డార్లింగ్ (త) | రాజశ్రీ |
| తండ్రి కొడుకులు సవాల్ | |
| దిగివచ్చిన దేవుడు (మ) | గోపి |
| దెబ్బకు దెబ్బ (త) | రాజశ్రీ |
| దేవీ కన్యాకుమారి (త) | వీటూరి |
| దేవీ మూగాంబిక (త) | రాజశ్రీ |
| దేశాని కొక్కడు | |
| పట్నం వచ్చిన పసిపాప (త) | గోపి |
| పిడుగు లాంటి మనిషి (త) | ఆరుద్ర |
| పెంకి ఘటం (త) | గోపి |
| పోలీస్ పోలీస్ (త) | రాజశ్రీ |
| ప్రేమసాగరం (త) | రాజశ్రీ |
| భామారుక్మిణి (త) | వీటూరి |
| మహారాణి (త) | ఆరుద్ర |

| | |
|---|---|
| మాంగల్యమహిమ | |
| వేటగాడి విజయం (త) | శ్రీశ్రీ |
| శ్రీకృష్ణ చరిత్ర (త) | వీటూరి |
| సింహంతో చెలగాటం (మ) | వీటూరి |
| సి.ఐ.డి. సింహం | వీటూరి |
| స్నేహాభిషేకం (త) | రాజశ్రీ |

**1984 (46)**

| | |
|---|---|
| ఆమెరికా అమెరికా (త) | రాజశ్రీ |
| అమ్మాయిలు కాదు-అగ్గి బరాటాలు | |
| అమ్మాయిలూ, ప్రేమించండి | ఆత్రేయ |
| అమ్మాయిల సవాల్ (త) | రాజశ్రీ |
| ఆడవాళ్లు, జాగ్రత్త | |
| ఉమానిలయం | గోపి |
| కోడలు దిద్దిన కాపురం (త) | వీటూరి |
| ఖబడ్దార్ రాజు (త) | వేటూరి |
| ఖైదీ రంగా (క) | గోపి |
| గడుసుపిండం (త) | గోపి |
| గూండాలకు గూండా (త) | రాజశ్రీ |
| గౌరీదేవి మహిమలు (త) | వీటూరి |
| ఛాలెంజ్ దొంగలు (త) | గోపి |
| జల్సా రాయుడు (త) | రాజశ్రీ |
| టక్కరి దొంగ (త) | ఆరుద్ర, రాజశ్రీ |
| టైగర్ రజని (త) | రాజశ్రీ |
| డిస్కోరామ డిస్కో కృష్ణ (త) | |
| నరహంతకులు (క) | |
| నాగాభరణం (క) | వీటూరి |
| నువ్వా-నేనా? | |
| నూరవరోజు (త) | గోపి |

| | |
|---|---|
| పగబట్టిన పులి | ఆరుద్ర, వీటూరి |
| ప్రజారాముడు (త) | శ్రీశ్రీ |
| ప్రియమైన రజనీకాంత్ (త) | రాజశ్రీ |
| ప్రేమకిరీటాలు | |
| ప్రేమ పరీక్ష (త) | రాజశ్రీ |
| ప్రేమ సామ్రాజ్యం (త) | రాజశ్రీ |
| ప్రేమ సంగమం (త) | వేటూరి, వీటూరి, గోపి |
| బాలయేసు (త) | మాగాపు అమ్మిరాజు |
| భార్యాభర్తల అనుబంధం (క) | గోపి |
| మాంత్రికుడు–శివభక్తుడు (క) | రాజశ్రీ |
| రాకాసి నాగు (క) | |
| రాగబంధం (త) | మాగాపు అమ్మిరాజు |
| రాజస్థాన్ రౌడీలు (మ) | వీటూరి |
| రౌడీలకు సవాల్ (త) | రాజశ్రీ |
| లవ్ లవ్ లవ్ (త) | |
| వద్దంటే పెళ్లి (త) | రాజశ్రీ |
| విష్ణుపూజా మహిమ (హిం) | |
| శ్రీవారి పెళ్లి (త) | రాజశ్రీ |
| సకల కళాప్రియుడు (త) | వీటూరి |
| సాహస సింహం (త) | గోపి |
| సిద్ధ లింగేశ్వర మహిమ (క) | వీటూరి |
| సిల్క్ సిల్క్ సిల్క్ (త) | రాజశ్రీ |
| సుబ్రహ్మణ్యస్వామి వ్రతమహిమ (త) | గోపి |
| సెభాష్ మోతి (క) | గోపి |
| సైకిల్ షాప్ చుక్కమ్మ (త) | గోపి |

**1985 (55)**

| | |
|---|---|
| అందగత్తెల సవాల్ (త) | రాజశ్రీ |
| అఖండ నాగప్రతిష్ఠ (త) | ఆరుద్ర |

| | |
|---|---|
| అనుభవం (క) | రాజశ్రీ |
| అమ్మకావాలి (త) | వేటూరి |
| అమ్మా నన్ను దీవించు (త) | ఆత్రేయ, గోపి |
| అర్ధరాత్రి (త) | రాజశ్రీ |
| ఇదేనా చట్టం (త) | |
| ఇనెస్పెక్టర్ లక్ష్మి (త) | |
| 24 గంటలు (త) | |
| ఇల్లాలి శపథం (త) | రాజశ్రీ |
| ఈతరం ఇల్లాలు (త) | ఆత్రేయ |
| ఉదయగీతం (త) | రాజశ్రీ |
| ఎదురుదాడి (త) | |
| ఏ యెండ కా గొడుగు (త) | |
| ఓయింటి శ్వేత గులాబి (త) | రాజశ్రీ |
| కరాటే మొనగాడు (త) | |
| కిలాడీ (త) | రాజశ్రీ |
| కేటుగాళ్లకు సవాల్ (త) | |
| ఖైదీ వేట (త) | రాజశ్రీ |
| ఘరానా గజ దొంగలు (త) | |
| ఘరానా హంతకుడు (త) | |
| చట్టానికి ఛాలెంజ్ (త) | |
| చిచ్చరపిడుగు (త) | రాజశ్రీ |
| చిన్నారి చేతన్-3డి (మ) | |
| చిలిపి యౌవనం (త) | రాజశ్రీ |
| ఛాలెంజ్ కిలాడీ (త) | గోపి |
| జనవరి - 1 | |
| జల్సా బుల్లోడు | |
| టాప్ టక్కర్ (క) | గోపి |
| దేవీ మహత్యం (త) | రాజశ్రీ |
| దేవుడే సాక్షి (త) | వీటూరి |

| | |
|---|---|
| దొంగల వేటగాడు (త) | రాజశ్రీ |
| నరసింహ అవతారం (క) | వీటూరి |
| పగపట్టిన మొనగాళ్లు (క) | వీటూరి |
| ప్రేమకు సవాల్ | |
| ప్రేమా, నీకో నమస్కారం (త) | రాజశ్రీ |
| ప్రేమ బృందావనం | |
| ప్రేమ వసంతం (త) | రాజశ్రీ |
| ప్రేమశాస్త్రం (త) | వీటూరి |
| బదరీనాథ్ దర్శనం (హిం) | |
| బ్లాక్ మెయిల్ | |
| మహానగరంలో మాయాజాలం | |
| మావూరి మొనగాళ్లు | |
| మొండి జగమొండి (త) | |
| మొండి మొగుడు (త) | గబ్బిట వెంకట్రావు |
| యవ్వనం పిలిచింది (త) | వీటూరి |
| రహస్య హంతకుడు (త) | గోపి |
| రాజనర్తకి | |
| రాధామాధవి (త) | రాజశ్రీ |
| లవర్స్ (త) | కొడకండ్ల అప్పలాచార్య |
| లవ్‌స్టోరీ (త) | రాజశ్రీ |
| లేడీ డాక్టర్ (క) | |
| వాడే వీడు (త) | రాజశ్రీ |
| శ్రీశక్తి మహిమలు (మ) | వీటూరి |
| సస్పెన్స్ (క) | |

**1986 - (27)**

| | |
|---|---|
| అనురాగ సంగమం (త) | గోపి |
| ఆత్మబంధువు (త) | ఆత్రేయ |
| ఇద్దరు మొనగాళ్ళు | రాజశ్రీ |

| | |
|---|---|
| ఈతరం అమ్మాయి | |
| ఏజెంట్ విక్రమ్-007 | రాజశ్రీ |
| కథానాయకి | |
| కిలాడి గజదొంగ | గోపి |
| కొదమసింహం | జాలాది, గోపి |
| క్షణం క్షణం భయం భయం | |
| చిన్న ఇల్లు (త) | రాజశ్రీ, దుర్గా శ్రీనివాస్ |
| డాన్స్‌మాస్టర్ | వేటూరి |
| డిస్కో ఆనంద్ | |
| డిస్కో సామ్రాట్ | గోపి |
| దేవీ నవగ్రహ నాయకి | రాజశ్రీ |
| పెళ్లిపిచ్చోళ్లు | గోపి |
| ప్రజా పోరాటం | గోపి |
| ప్రేమికులారా వర్ధిల్లండి (త) | గోపి |
| మిస్ అనుపమ | |
| మైథిలీ, నాప్రేయసీ | రాజశ్రీ |
| మోసగాడికి ఛాలెంజ్ | గోపి |
| రణధీరుడు | |
| రాజా-యువరాజా | గోన విజయరత్నం |
| రాక్షస ప్రేమ | |
| విజయవేట | |
| శ్రీపాండురంగలీల | రాజశ్రీ |
| సంపూర్ణ పుణ్యక్షేత్రములు | |
| సింధుభైరవి (త) | ఆత్రేయ, దీక్షితార్ |

**1987 (28)**

| | |
|---|---|
| అందరికంటె ఘనుడు | |
| అర్ధరాత్రి అనూరాధ | సాహితి |
| ఆదిశక్తి మహిమలు | రాజశ్రీ |

| | |
|---|---|
| ఇద్దరు ఖైదీలు | |
| ఎదురింటి అమ్మాయి | వేటూరి |
| కేడీ | రాజశ్రీ |
| ఖైదీ విశ్వరూపం | ఆత్రేయ, వేటూరి |
| చిన్న రాజా | రాజశ్రీ |
| జంగిల్ రాణి | |
| జపాన్ రాముడు | |
| జానీ | |
| దేవీ వ్రతం | గోపి |
| నాగదేవీ మహాత్యం | గోపి |
| నాగపూజా ఫలం | ఎ.ఎస్.ప్రకాష్ |
| నాయకుడు (త) | రాజశ్రీ, వెన్నెలకంటి |
| పొగరుబోతు | రాజశ్రీ |
| ప్రేమదేవత | నాగాపు అమ్మిరాజు |
| బొబ్బిలి సింహం | |
| మరణ మందిరం | |
| ముగ్గురు కథానాయకులు | రాజశ్రీ |
| ముద్దుల పాప | |
| మౌనరాగం (త) | రాజశ్రీ |
| రాజర్షి విశ్వామిత్రుడు | రాజశ్రీ |
| రెండు తోకల పిట్ట (త) | రాజశ్రీ |
| యవ్వన లీలలు | |
| విలాస పురుషుడు | |
| శ్రీమంత్రాలయ రాఘవేంద్రస్వామి మహత్యం (క) | గోపి |
| శ్రీవారి పెళ్లిపిలుపు | |

**1988 (40)**

| | |
|---|---|
| అనామిక | రాజశ్రీ |
| అగ్నిపోరాటం | రాజశ్రీ |

| | |
|---|---|
| ఆత్మదీపం | రాజశ్రీ |
| ఇలవేల్పు | |
| ఇల్లు | |
| కంచుకోట మొనగాడు | ఎ.సూర్యప్రకాష్ |
| కన్నెపిల్లల వేట | |
| కాళరాత్రి | |
| ఘర్షణ | రాజశ్రీ |
| చట్టాలు మారాలి | |
| చల్ చల్ గుర్రం | |
| జై భద్రకాళి | మాగాపు అమ్మిరాజు |
| డాన్స్ రాజా డాన్స్ | రాజశ్రీ |
| దేవీ విజయం | రాజశ్రీ |
| దైవశక్తి | |
| నాగనిధి | |
| నా చెల్లెలు కళ్యాణి | రాజశ్రీ |
| నా మొగుడికి పెళ్లంట | రాజశ్రీ |
| నామొగుడే నాకెదురైతే | |
| నువ్వే నాశ్రీమతి | రాజశ్రీ |
| నేనూ మీవాడినే | రాజశ్రీ |
| పోలీస్ డైరీ | రాజశ్రీ |
| ప్రణయ సాగరం | గోపి |
| ప్రియమిత్రులు | |
| ప్రియురాలు | గోపి |
| ప్రేమపోరాటం | సూర్యశ్రీ |
| ప్రేమరాగం | గోపి |
| ప్రేమ లోకం | రాజశ్రీ |
| ప్రేమ సందేశం | రాజశ్రీ |
| బందిపోట్లకు సవాల్ | |
| మరోపోరాటం | |

| | |
|---|---|
| మాయింటి రామాయణం | |
| రౌడీలకు యముడు | |
| సంఘంలో చదరంగం | సూర్యశ్రీ |
| సంఘటన | రాజశ్రీ |
| సత్య | రాజశ్రీ |
| సత్యం శివం సుందరం | |
| సి.బి.ఐ. డైరీ | |
| సిస్టర్ నందిని | రాజశ్రీ |
| స్మగ్లర్ | రాజశ్రీ |

**1989 (69)**

| | |
|---|---|
| అగాధం | |
| అగ్నికామం | |
| అగ్నిపుత్రి | గోపి |
| అడివిలో అందగత్తెలు | |
| అడవి బెబ్బులి | |
| అభిషేకం | రాజశ్రీ |
| ఆకర్షణ | రాజశ్రీ |
| ఆఖరి తీర్పు | గోపి |
| ఇంటినెం. 13 | రాజశ్రీ |
| ఇద్దరూ దొంగలే | రాజశ్రీ |
| ఈతీర్పు ఎలా చెప్పాలి? | |
| ఓం శక్తి మహిమలు | రాజశ్రీ |
| ఓ వర్షం కురిసిన రాత్రి | రాజశ్రీ |
| కర్కోటకుడు | రాజశ్రీ |
| కసాయి మనిషి | పోసా |
| కాళీ చరణ్ | సూర్యశ్రీ, గోన విజయరత్నం |
| కుంకుమ రేఖ | ఎ.ఎస్.ప్రకాష్ |
| కొండవీటి దాదా | రాజశ్రీ |

| | |
|---|---|
| కొండ పిడుగు | |
| ఖైదీ నెం. 79 | రాజశ్రీ |
| గూండా యిజం | సూర్యశ్రీ |
| చట్టానికి కళ్లుంటే | గోపి |
| చాణక్య | |
| చిలిపిదొంగ | రాజశ్రీ |
| డుం డుం డింగా డింగా | రాజశ్రీ |
| తల్లీ కొడుకుల సవాల్ | |
| దేవీ అనుగ్రహం | రాజశ్రీ |
| దేవుడు చేసిన పెళ్లి | |
| నరరూప రాక్షసుడు | గోపి |
| నాకూ మొగుడు కావాలి | రాజశ్రీ |
| నువ్వే నా మొగుడు | గోన విజయరత్నం |
| 1921 | రాజశ్రీ |
| పగలే వెన్నెల | రాజశ్రీ |
| పరివర్తన | సూర్యశ్రీ |
| పల్లవి - అనుపల్లవి | రాజశ్రీ |
| పిక్‌పోకెట్ | |
| పిట్టల దొర | |
| పెర్‌ఫెక్ట్ మర్డర్ | |
| పెళ్లి నాటకం | మాగాపు అమ్మిరాజు |
| పోలీస్ టైగర్ | |
| పోలీస్ దాదా | గోపి |
| ప్రభంజనం | రాజశ్రీ |
| ప్రేమాంజలి | రాజశ్రీ |
| ప్రేమగీతం | రాజశ్రీ |
| భయంకర రాత్రి | |
| బ్రహ్మచారి | ఆత్రేయ |
| మరో మౌనగీతం | రాజశ్రీ |

| | |
|---|---|
| మామకు యముడు | రాజశ్రీ |
| మావూరి సింహం | |
| మిస్ పమేలా | |
| యముడే నా మొగుడు | రాజశ్రీ |
| యముడికి యముడు | రాజశ్రీ, సాయికిషోర్ |
| రక్తదానం | గోన విజయరత్నం |
| రౌడీ దెబ్బ | గోపి |
| రౌడీలకు మొగుడు | గోన విజయరత్నం |
| లేడీ టార్జాన్ | |
| వింత ఘర్షణ | సూర్యశ్రీ |
| వింత శోభనం | రాజశ్రీ |
| విచిత్ర సోదరులు | రాజశ్రీ |
| వైదేహి | రాజశ్రీ |
| వైశాలి | రాజశ్రీ |
| సమరం | రాజశ్రీ |
| సర్వం శక్తిమయం | అప్పలాచార్య |
| సిందూరపువ్వు | రాజశ్రీ |
| సిటీ రౌడీ | రాజశ్రీ |
| సుందరాంగుడు | రాజశ్రీ, వెన్నెలకంటి |
| సూర్యోదయం | రాజశ్రీ |
| శభాష్ శంకర్ | రాజశ్రీ |
| హత్య | |

**1990 (107)**

| | |
|---|---|
| అంజలి | రాజశ్రీ, వెన్నెలకంటి |
| అంతర్యుద్ధం | రాజశ్రీ |
| అంతిమ విజయం | |
| అడవి సుందరి | |
| అత్తా అల్లుళ్ల సవాల్ | |

| | |
|---|---|
| అప్సరస | |
| అయ్యప్పస్వామి జన్మరహస్యం | పి.బి.శ్రీనివాస్ |
| ఇనస్పెక్టర్ ప్రకాష్ | రాజశ్రీ |
| ఇనస్పెక్టర్ రాజశేఖర్ | |
| ఎవరుకట్టిన తాళి | రాజశ్రీ |
| ఓ ఆడపిల్ల కథ | |
| కలియుగ దుర్గ | రాజశ్రీ |
| కాలనాగు | |
| కాలాంతకుడు | రాజశ్రీ |
| కాళరాత్రి 12 గంటలు | |
| కాశీ | |
| కొండవీటి పులి | వెలిదండ్ల |
| కొండవీటి శివ | గోన విజయరత్నం |
| క్రోధం | రాజశ్రీ |
| గరగాట గోపయ్య | రాజశ్రీ |
| గూండా నెం.1 | సూర్యదేవర |
| గూండాల వేట | |
| గూండా పోలీస్ | రాజశ్రీ |
| చిలిపి పెళ్లాం | రాజశ్రీ |
| చిలిపి రాధ - కొంటె కృష్ణుడు | భరత్ కుమార్ |
| జంగిల్ లవ్ | |
| జైలర్ కార్తీక్ | |
| టైగర్ శివ | రాజశ్రీ |
| డాన్సర్ డాలీ | |
| తీరని కోరిక | |
| తూర్పు సిందూరం | సిరివెన్నెల |
| తొలకరి వయస్సు | అమ్మిరాజు |
| దయ్యాల దర్బార్ | రాజశ్రీ |
| ధర్మపోరాటం | |

| | |
|---|---|
| నవ వసంతం | రాజశ్రీ |
| నాగపౌర్ణమి | రాజశ్రీ |
| నాగలి పట్టిన నాయకుడు | రాజశ్రీ |
| నిశిరాత్రి | |
| నేటి రాక్షసులు | అమ్మిరాజు |
| నేనే యముణ్ణి | రాజశ్రీ |
| నేరం నాదికాదు చట్టానిది | వెలిదండ్ల |
| పట్నం వచ్చిన చిన్నోడు | |
| పట్నం వచ్చిన మొనగాడు | గోన విజయరత్నం |
| పాంచాలి | రాజశ్రీ |
| పాంచాలి ప్రతీకారం | |
| పురుషోత్తముడు | రాజశ్రీ |
| పెద్దలకు మాత్రమే | |
| పోలీస్ అధికారి | రాజశ్రీ |
| పోలీస్ ఇనస్పెక్టర్ | రాజశ్రీ |
| పోలీస్ దౌర్జన్యం | రాజశ్రీ |
| పోలీస్ విచారణ | |
| ప్రజా ప్రతిఘటన | గోన విజయరత్నం |
| ప్రణయం-ప్రళయం | రాజశ్రీ |
| ప్రేమకోసం | రాజశ్రీ |
| ప్రేమలు - పెళ్లిళ్లు | గోపి |
| ప్రేమపావురాలు | రాజశ్రీ |
| ప్రేమశాసనం | రాజశ్రీ |
| భార్యలూ జాగ్రత్త | రాజశ్రీ |
| మంజు, ఐలవ్‌యూ | |
| మధుర మీనాక్షి | గబ్బిట, రాజశ్రీ |
| మన్మథరాజా | రాజశ్రీ |
| మలుపు | రాజశ్రీ |
| మాయింటి కృష్ణుడు | రాజశ్రీ |

| | |
|---|---|
| మావూరి గంగ | రాజశ్రీ |
| మేజర్ నాయుడు | |
| మై డియర్ మార్తాండ్ | రాజశ్రీ |
| మొగుడికి తగ్గ పెళ్లాం | అమ్మిరాజు |
| మోడల్ గాళ్ | రాజశ్రీ |
| మౌన హృదయం | రాజశ్రీ, వేటూరి |
| యముడికి మించిన మొగుడు | |
| యవ్వన పోరాటం | |
| రక్తం చిందిన రాత్రి | రాజశ్రీ |
| రక్త నేత్రాలు | రాజశ్రీ |
| రక్త పౌర్ణమి | రాజశ్రీ |
| రాకాసి కోన | |
| రాజా–చిన్నరోజా | గురు చరణ్ |
| రాజాధి రాజా | రాజశ్రీ |
| రాధమ్మ కాపురం | |
| రుస్తుం రుద్రయ్య | రాజశ్రీ |
| రౌడీ నెం.1 | |
| రౌడీ మొగుడు | |
| లక్ష్మి దుర్గ | రాజశ్రీ |
| వింత అనుభవం | |
| విజేతలు | రాజశ్రీ |
| శ్రావణ పౌర్ణమి | డి.నారాయణవర్మ, యం. జగదీష్ బాబు |
| శ్రావణ శుక్రవారం | |
| శ్రీదేవి | రాజశ్రీ |
| ష్... రామచిలుకలు వస్తున్నాయి | తుంగల |
| సంగమం | నాయుని కృష్ణమూర్తి |
| సంగ్రామం | వెన్నెలకంటి |
| సండే 7 పి.యం. | |
| సమర సింహాలు | |

| | |
|---|---|
| సాగర గీతం | సిరివెన్నెల |
| సాగర తీరం | |
| సామ్రాజ్యం | |
| సాహసఘట్టం | రాజశ్రీ |
| సి.ఐ.డి. అధికారి | వెలిదండ్ల |
| సిరిమల్లె పువ్వు | రాజశ్రీ |
| సీత | |
| సీతాకోక చిలుకలు | |
| సూర్య ది గ్రేట్ | |
| స్వప్న సుందరి | |
| స్ట్రీట్ డాన్సర్ | రాజశ్రీ |
| హంతకుడు | |
| హంతకుల రాజ్యం | గోపి, సాహితి |
| హంతకుడే నా మొగుడు | రాజశ్రీ |
| హల్లో పక్కీరామ్ | రాజశ్రీ |

**1991 (59)**

| | |
|---|---|
| అధిపతి | |
| అనుబంధాలు | |
| అమాయకుడు కాదు అజేయుడు | రాజశ్రీ |
| అర్చన-ఐ.ఎ.ఎస్. | రాజశ్రీ, సిరివెన్నెల |
| ఆటగాడు-వేటగాడు | రాజశ్రీ |
| ఆడదే ఆదిశక్తి | రాజశ్రీ |
| ఇనస్పెక్టర్ బలరామ్ | |
| ఉత్కర్ష | |
| ఓ పాపా లాలీ | రాజశ్రీ |
| కార్తీక మాసం | |
| కెప్టెన్ ప్రభాకర్ | |
| కొండవీటి ఖైదీ | |

| | |
|---|---|
| క్షత్రియుడు | రాజశ్రీ |
| క్షుద్రశక్తి | |
| గంధర్వుడు | రాజశ్రీ |
| గెస్ట్ హౌస్ | |
| గుణ | వెన్నెలకంటి, నారాయణవర్మ |
| గూండా గ్యాంగ్ | రాజశ్రీ |
| గూండా నాయకుడు | |
| గ్యాంగ్ రౌడీ | |
| చేతబడి | |
| జగదేక సుందరి | |
| దర్యాప్తు | |
| దళపతి | రాజశ్రీ |
| దొంగోడు | రాజశ్రీ |
| నరహరి-మురహరి | రాజశ్రీ |
| నాగశక్తి | |
| నిరంకుశం | రాజశ్రీ |
| నెం.20 మద్రాస్ మెయిల్ | రాజశ్రీ |
| పాపం పసిపాప | |
| పోలీస్ ఖైదీ | |
| పోలీస్ బావ | రాజశ్రీ |
| పోలీస్ బెల్ట్ | జయంత్ |
| పోలీస్ ఫైల్ | |
| ప్రియతమా | |
| ప్రేతాత్మ | |
| ప్రేమాగ్ని | |
| ప్రేమ ఘర్షణ | వెలిదండ్ల |
| ప్రేమ పాఠం | రాజశ్రీ |
| ప్రేమ బందీ | రాజశ్రీ |
| ప్రేమ విజయం | రాజశ్రీ |

| | |
|---|---|
| ప్రేయసి | రాజశ్రీ |
| ఫారెస్ట్ ఆఫీసర్ | |
| మావూరి దేవత | రాజశ్రీ |
| ముద్దుల మరదలు | |
| ముద్దుల మొగుడు | సూర్యదేవర |
| మైకేల్ మదన కామరాజు | రాజశ్రీ |
| మొగుడు కాదు యముడు | రాజశ్రీ |
| మోసగాళ్లకు మొనగాడు | నిరంజన్ బొబ్బా |
| యవ్వనం | |
| లవ్-91 | సిరివెన్నెల |
| లాయర్ ది గ్రేట్ | గోన విజయరత్నం |
| వేదాగ్ని | గోన విజయరత్నం |
| శాసనం | రాజశ్రీ |
| శ్రావణమాసం | |
| శ్రీలక్ష్మి నారాయణ వ్రత మహత్యం | అమ్మిరాజు |
| సిందూర దేవి | రాజశ్రీ |
| సిటీ పోలీస్ | రాజశ్రీ |
| సొగసరి చిలకలు | |

**1992 (27)**

| | |
|---|---|
| అక్టోబర్-2 | రాజశ్రీ |
| అభిమన్యు | వెన్నెలకంటి |
| ఆఖరి నిర్ణయం | |
| కంకణం | రాజశ్రీ |
| కస్టమ్స్ ఆఫీసర్ | రాజశ్రీ |
| క్షుద్రపూజ | |
| ఘరానా ఇనస్పెక్టర్ | రాజశ్రీ |
| ఘరానా రాజా | వెలిదండ్ల |
| చిలిపి సిపాయి | రాజశ్రీ |

| | |
|---|---|
| జానీవాకర్ | |
| నాగ బంధం | రాజశ్రీ, వెన్నెలకంటి |
| పోలీస్ రౌడీ | వెన్నెలకంటి |
| పౌర్ణమి రాత్రి | |
| ప్రేమపూజారి | రాజశ్రీ |
| మండే సూర్యుడు | రాజశ్రీ |
| మన్మథుడే నా మొగుడు | రాజశ్రీ |
| మరో యుద్ధ కాండ | రాజశ్రీ |
| మాస్టర్ ప్లాన్ | |
| యోధ | వెన్నెలకంటి |
| రాణి – మహారాణి | |
| రామచంద్ర | |
| రుద్రుడు | రాజశ్రీ |
| రోజా | రాజశ్రీ |
| వరపుత్రుడు | రాజశ్రీ |
| వయసు – వలపు | |
| శివనాగు | |
| హృదయం | రాజశ్రీ |

**1993 (50)**

| | |
|---|---|
| అడవి సింహం | |
| అల్లరి ఖైదీలు | గురుచరణ్, భారతీబాబు |
| అల్లరి దొంగ | రాజశ్రీ |
| అల్లరి ప్రేమ | వెన్నెలకంటి |
| అశోక చక్రం | |
| అసెంబ్లీ గూండా | జొన్నవిత్తుల |
| ఐ లవ్‌యు ఇండియా | రాజశ్రీ |
| కాలేజీ రోజులు | |
